సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 14

గురువారం 28-9-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'




బుల్లెట్ దిగింది

ఆసియా క్రీడల్లో ఒకేరోజు 7 పతకాలతో అదరగొట్టిన భారత షూటర్లు - 12లో



ఓటమితో ముగింపు..

చివరి వన్డేలో భారత్ పరాజయం.. 2-1తో సిరీస్ సొంతం - 12లో



ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా భారత్

భారత్‌ను గ్రోత్ ఇంజన్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని.. త్వరలోనే ఆర్థిక శక్తి కేంద్రంగా అవతరిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో సాయుధ చట్టం

మణిపూర్‌లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని మరో 6 నెలలు పొడిగిస్తూ ఆ రాష్ట్ర గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు.

వివరాలు 6లో ▸



ఇరాక్‌లో అగ్ని ప్రమాదం

ఇరాక్‌లోని ఒక పెళ్లి వేడుకల్లో అగ్ని ప్రమాదం సంభవించడంతో 114 మంది మరణించగా.. 150 మందికిపైగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



అర్ధనగ్నంగా రక్తమోడుతూ..

మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురైన బాలిక అర్ధనగ్నంగా, రక్తమోడుతూ సాయం కోరుతూ తిరిగిన వీడియో కంటతడి పెట్టిస్తోంది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

విశాఖ పోలీస్ కమిషనరేట్ అప్‌గ్రేడ్



విశాఖ పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పోలీస్ కమిషనరేట్‌ను ఏడీజీ స్థాయికి పెంచడంతో పాటు అదనపు పోస్టుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

వివరాలు 2లో ▸

డెంగీపై అప్రమత్తంగా ఉండండి



దేశవ్యాప్తంగా డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. డెంగీ వ్యాప్తికి అడ్డుకట్టవేయడం, నివారణ, నియంత్రణపై దృష్టి సారించాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆదేశించారు.

వివరాలు 6లో ▸

ఆర్థిక భరోసా 'గ్యారెంటీ'

గ్యారెంటీడ్ పెన్షన్ సిస్టమ్‌పై అసెంబ్లీలో మంత్రి బుగ్గన

- సీపీఎస్ కంటే జీపీఎస్ ఎంతో మేలు
- రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగులకు పెన్షన్ భద్రత.. చివరి బేసిక్‌లో 50% పెన్షన్, ఆ తర్వాత డీఆర్‌లతో భరోసా
- ఓపీఎస్‌లో మాదిరిగానే జీవిత భాగస్వామికి పెన్షన్ సదుపాయం
- ఉన్నత స్థాయి అధ్యయనాల తర్వాతే సీపీఎస్ ఉద్యోగులకు మేలు చేస్తూ జీపీఎస్‌కు రూపకల్పన
- ఓపీఎస్‌ను అమలు చేస్తే రాష్ట్రం ఆర్థిక మనుగడకే ముప్పు.. ఐదేళ్లకో పదేళ్లకో కుప్పకూలుతుంది
- కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలలను సీఎం వైఎస్ జగన్ నెరవేరుస్తున్నారు.. 10 వేల మందికి పైగా రెగ్యులరైజ్ చేసేలా చర్యలు
- ఇప్పటికే దాదాపు 2 లక్షల రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం
- ఒక్క వైద్య ఆరోగ్య రంగంలోనే 53 వేలకుపైగా పోస్టుల భర్తీ
- జీపీఎస్, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ బిల్లులకు సభ ఆమోదం

14 లో





"మనుషుల జీవిత కాలం పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్లకుపైగా జీవించే వారు 2022లో 10 శాతం ఉండగా 2025 నాటికి 16 శాతానికి పెరుగుతారు. ఓపీఎస్ అనేది ఎన్ని సంవత్సరాలు జీవిస్తే అన్నేళ్లూ ఇవ్వాలి. అమెరికా లాంటి దేశం కూడా పెన్షన్లపై పరిశోధన చేసి చివరకు సాధ్యం కాక ఓపీఎస్‌ను తగ్గించేసింది. సమయం, వయసు నిబంధనలను సవరించింది. రాష్ట్ర ప్రభుత్వం ఓపీఎస్, సీపీఎస్‌లపై చిత్తశుద్ధితో ఆలోచించింది. ఓపీఎస్‌తో సుదీర్ఘ భవిష్యత్తులో జీతాల చెల్లింపులకు సైతం ఇబ్బందులొస్తాయి. ఇక సీపీఎస్‌ను అమలు చేస్తే వడ్డీ రేట్లు తగ్గిపోయి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు సరైన రాబడి ఇవ్వనప్పుడు ఉద్యోగులకు నష్టం వస్తుంది. అందుకే దీనిపై బాగా ఆలోచించి మధ్యేమార్గంగా జీపీఎస్‌ను తెచ్చాం.

- అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

యూఎస్ స్టేట్ అధికారులకు ఏపీ విద్యా పథకాలను వివరిస్తున్న విద్యార్థిని రిషిత



ఏపీ విద్యా సంస్కరణలు
పేద పిల్లలకు వరం

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని సీఎం జగన్ బలంగా నమ్మారు

- బాలికా విద్య, సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందిస్తున్నారు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు
- అమెరికా అధికారులకు వివరించిన రాష్ట్ర విద్యార్థులు
- రాష్ట్రంలో ఆధునిక విద్య, విద్యా సంస్కరణలపై యూఎస్ అధికారుల ప్రశంసలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక విద్యా సంస్కరణలు తమలాంటి పేద పిల్లలకు వరంగా మారాయని అమెరికాలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్యార్థులు ఆ దేశ అధికారులకు వివరించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడంతోపాటు డిజిటల్ బోధనను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు తమలాంటి పేద విద్యార్థుల జీవితాలను

మిగతా 2వ పేజీలో ▶

ఐఎంఎఫ్‌లో రాష్ట్ర విద్యార్థినికి
అరుదైన గౌరవం

- ప్రభుత్వ స్కూల్ విద్యార్థిని రాజేశ్వరికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చైర్ ఆఫర్
- మన రాష్ట్ర విద్యార్థులను చూసి గర్వపడుతున్నాను: సీఎం జగన్
- ఐఎంఎఫ్ ఈడీకి, డిప్యూటీ ఎండీకి ధన్యవాదాలు చెప్పిన ముఖ్యమంత్రి

2 లో



'రింగ్' అంతా లోకేశ్‌దే


- అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో లోకేశ్ కుట్ర సుస్పష్టం.. కోర్టులో దాఖలు చేసిన మెమోలో సిట్ వెల్లడి
- లోకేశ్ పాత్రను స్పష్టం చేస్తున్న 129 ఆధారాలు.. ఈ ఆధారాలను జప్తు చేసిన సిట్ అధికారులు
- అప్పటి అధికారులు, అలైన్‌మెంట్‌లో పాల్గొన్న సంస్థల వాంగ్మూలాలూ నమోదు
- పక్కా పన్నాగంతోనే ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పులు
- హెరిటేజ్‌కు, లింగమనేని రమేశ్ కుటుంబానికి అడ్డగోలుగా లబ్ధి
- వారి భూములను ఆనుకొని వెళ్లేలా ఐఆర్ఆర్‌లో మార్పులు
- క్విడ్ ప్రోకో ద్వారా చంద్రబాబుకు కరకట్ట బంగ్లా

3 లో

చంద్రబాబుకు
నో రిలీఫ్..!

తక్షణ ఉపశమనానికి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తిరస్కరణ

- కస్టడీ పిటిషన్‌పై వాదనలు వినకుండా ట్రయల్ జడ్జిని నియంత్రించలేం.. అక్టోబరు 3నే విచారణ జాబితాలోకి ఎస్ఎల్‌పీ..
- తగిన ధర్మాసనం విచారిస్తుందని స్పష్టీకరణ
- అంతకుముందు విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ ఎస్వీఎన్ భట్టి
- పాస్ ఓవర్‌తో ఉపయోగం లేదు.. సోమవారం జాబితా చేయాలన్న బాబు న్యాయవాది హరీశ్ సాల్వే
- అది సాధ్యం కాదు.. వచ్చే వారమే జాబితా చేస్తామన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన పోలీసు కస్టడీ పిటిషన్‌పై వాదనలు వినకుండా ట్రయల్ జడ్జిని తాము నియంత్రించలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. చంద్రబాబుకు తక్షణ ఉపశమనం కల్పించేందుకు నిరాకరిస్తూ కేసును తగిన ధర్మాసనం ముందు జాబితా చేస్తామని, అక్టోబరు 3న దీన్ని విచారిస్తుందని సీజేఐ పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి తనపై దాఖలైన కేసును కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన ఎస్ఎల్‌పీ బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం ముందుకొచ్చింది. అయితే ఈ పిటిషన్ విచారణపై జస్టిస్ ఎస్వీఎన్ భట్టికి కొన్ని రిజర్వేషన్లు (అభ్యంతరాలు) ఉన్నాయని

మిగతా 3వ పేజీలో ▶



జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు
క్రెడిట్ కార్డులు

- కేంద్ర ప్రభుత్వ పశు కిసాన్ క్రెడిట్ కార్డులివ్వాలని సీఎం జగన్ నిర్ణయం
- 18 జిల్లాల్లో 2.28 లక్షల మందికి కార్డులు
- ఈ కార్డులపై లబ్ధిదారులకు వర్కింగ్ కేపిటల్ కోసం రూ.3 లక్షల వరకు రుణం
- సకాలంలో చెల్లిస్తే వడ్డీలో మూడు శాతం రాయితీ
- వచ్చే ఏడాది మార్చి వరకు ప్రత్యేక శిబిరాలు
- శిబిరాల్లోనే అర్హులకు కార్డులు, రుణాలు మంజూరు

2 లో

రాజధాని పేరుతో ఇన్ని ఘోరాలా?

ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్‌పై అసెంబ్లీలో మంత్రి ధర్మాన, ఆదిమూలపు సురేశ్

- అసైన్డ్ రైతులను బెదిరించి బలవంతంగా భూములు లాక్కున్నారు
- ఆ భూములకు వచ్చే ప్లాట్లను చంద్రబాబు మనుషులు కాజేశారు
- అసైన్డ్ కౌలు, వన్‌టైమ్ సెటిల్మెంట్ డబ్బులు నారాయణ ఖాతాలో..
- అసైన్డ్ రైతులను బెదిరించి 3 మండలాల్లో రికార్డుల్ని మాయం చేశారు
- రెవెన్యూశాఖ ఇవ్వాల్సిన జీవోను చట్ట వ్యతిరేకంగా మున్సిపల్‌శాఖ ఇచ్చేసింది
- పేదలను నిలువునా ముంచేశారు.. మోసగాళ్లకు మోసగాడు చంద్రబాబు

13 లో

బోధనలో డిజిటల్ విప్లవం

- ప్రభుత్వ స్కూళ్లలో ఆధునిక పద్ధతులు
- రెండో ఏడాదీ ట్యాబుల పంపిణీకి చర్యలు
- మరమ్మతులు బాధ్యతా ప్రభుత్వానిదే
- వినియోగంపై విస్తృత అవగాహన



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జగన్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు ప్రవేశపెడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతోంది. ఎప్పటికప్పుడు ఆధునిక విధానాలను అనుసరించి ఈ స్కూళ్ల పోటీలో నిలిచేలా నిరంతర కసరత్తు చేస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, షూలు ఇలా అన్నీ సమకూర్చుతూ మరోపక్క బోధనా పద్ధతుల్లో కూడా వినూత్న పద్ధతులు పాటించేలా సంస్కరిస్తోంది. గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే ఈ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. మునుపటి ప్రభుత్వ స్కూళ్లు కావని తల్లిదండ్రులూ గుర్తిస్తున్నారు.

తరగతిలోనే బోధనకు సన్నాహాలు

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 380 పాఠశాలల్లో దాదాపు రూ.64 కోట్ల ఖర్చుతో 19,982 మందికి ట్యాబుల పంపిణీకి సన్నాహాలు జరుగుతున్నాయి. ట్యాబు ద్వారా బైజూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు పాఠశాలలోని ప్రతి తరగతి గదిలో ఐఎఫ్ ప్యానెల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు సులభంగా బోధించేందుకు మార్గం ఏర్పడుతోంది. ప్రతి ట్యాబ్ కూడా మూడేళ్ల వారంటీతో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించే క్రమంలో ఏదైనా పొరపాటున స్క్రీన్ డ్యామేజీ జరిగితే ప్రభుత్వమే బాగు చేయించాలని సంకల్పించింది.

ప్రతినెలా పాఠశాలల సందర్శన

విద్యార్థులకు అందజేసిన ట్యాబులు దుర్వినియోగం కాకుండా డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. డిజిటల్ అసిస్టెంట్లు ప్రతి నెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలనూ సందర్శిస్తారు. ట్యాబ్‌ల పనితీరు చెక్ చేస్తారు. ట్యాబ్ రిపేరు బాధ్యతలు కూడా చూస్తారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కూడా ప్రతివారం పాఠశాలను సందర్శిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబులకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ట్యాబ్ దుర్వినియోగం చేయకుండా ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా టెక్బోరో అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ సహాయంతో చర్యలు చేపట్టింది. మూడు యాప్ వైఫై, బైజూస్, (డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడానికి ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల హెచ్‌ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తోంది. వీరంతా పాఠశాల స్థాయిలోనే అప్‌డేట్ ప్రక్రియ చేపడుతున్నారు. ఈ క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్ లైన్లు కూడా సిద్ధం చేశారు.

చురుగ్గా ఏర్పాట్లు

సర్కారు బడుల్లో చదుకునే విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనేది రాష్ట్ర ప్రభుత్వ బలమైన సంకల్పం. ఒక్క తెలుగు మాధ్యమంతో వీరు కార్పొరేట్ స్కూలు పిల్లలతో పోటీ పడలేరని గ్రహించి ఆంగ్ల మాధ్యమాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా బై-లింగ్విల్ పద్ధతిలో పుస్తకాలను ముద్రించింది. అంతేకాదు ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబులను అందజేస్తోంది. ఒక్క సంవత్సరం మొక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకోలేదు. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబుల పంపిణీకి విద్యాశాఖ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది జిల్లాలోని విద్యార్థులు, టీచర్లకు కలిపి 23,099 ట్యాబులను పంపిణీ చేసింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.67.23 కోట్లు ఖర్చు చేసింది.

ఇండియాటూన్



మధ్యలోనే నిమజ్జనం అవుతారేమోనని భయంగా ఉంది స్వామి!

విశాఖ వైపు 'మెట్రో' పరుగులు

జనవరి 15వ తేదీన మెట్రో ప్రాజెక్టుకు శంకుస్థాపన

- తొలి విడతలో 76.90 కి.మీ. లైట్ మెట్రో నిర్మాణానికి ప్రణాళికలు
- తొలుత 42 స్టేషన్లతో కూడిన 3 కారిడార్ల నిర్మాణం
- రూ.9,699 కోట్ల అంచనా వ్యయం
- నిధుల సమీకరణపై చర్యలు వేగవంతం చేయాలని సర్కారు ఆదేశాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర కార్యనిర్వాహక రాజధానిగా మారబోతున్న విశాఖ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజారవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. నగరంలో మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా మెట్రో పిల్లర్లు నిర్మాణం చేపట్టే దిశగా ఆలోచన చేస్తోంది. మరోవైపు తొలి విడతలో 76.90 కి.మీ. మేర లైట్ మెట్రో నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈలోగా నిధుల సమీకరణను వేగవంతం చేయాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మహ్మద్ ప్రవక్త బోధనలు స్ఫూర్తిదాయకం

- గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: ప్రేమ, ధర్మం, సౌభ్రాతృత్వంతో కూడిన మహ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి స్ఫూర్తిదాయకమని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఈద్ మిలాద్– ఉన్–నబీ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సాటివారికి విశ్వాసం,శ్రద్ధ, కరుణతో సేవ చేసినప్పుడు మహ్మద్ ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ప్రవక్త ప్రబోధించిన దయ, కరుణ బోధనలను స్మరించుకుని అనుసరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈద్ అందరికీ శాంతి, సద్భావనను కలిగించాలని గవర్నర్ ఆకాంక్షించినట్టుగా రాజ్‌భవన్ వర్గాలు బుధవారం పేర్కొన్నాయి.

రేపు సీఎం వైఎస్ జగన్ విజయవాడ పర్యటన

సాక్షి,అమరావతి: సీఎం జగన్ ఈ నెల 29న విజయవాడలో పర్యటించనున్నారు. విద్యాధరపురం స్టేడియం గ్రౌండ్‌లో వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఉదయం 10.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి వెళ్తారు. బహిరంగ సభలో ప్రసంగించి తాడేపల్లికి చేరుకుంటారు.

సాగర్ కుడి కాలువకు 15 టీఎంసీలు విడుదల చేయండి

- కృష్ణా బోర్డు చైర్మన్‌కు ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి లేఖ

సాక్షి, అమరావతి: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా బోర్డును కోరింది. జూన్–సెప్టెంబర్ మధ్య పెద్దగా వర్షాలు కురవకపోవడంతో 4 జిల్లాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని.. తాగునీటి అవసరాల కోసం అక్టోబర్ 4 నుంచి జనవరి 7 మధ్య రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 5 టీఎంసీలు, జనవరి 8 నుంచి ఏప్రిల్ 7 మధ్య 5 టీఎంసీలు, ఏప్రిల్ 8 నుంచి జూలై 7 మధ్య 5 టీఎంసీలు విడుదల చేసి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివనందన్‌కుమార్‌కు బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.నారాయణరెడ్డి లేఖ రాశారు. నాగార్జునసాగర్‌లో బుధవారం నాటికి 524.7 అడుగుల్లో 157.986 టీఎంసీల నీరు నిల్వ ఉందని లేఖలో పేర్కొన్నారు. కనీస నీటి మట్టం 519 అడుగుల కంటే ఎగువన 26.316 టీఎంసీల లభ్యత ఉందని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోటాలో ఇద్దరు వక్ఫ్‌బోర్డు సభ్యులు ఏకగ్రీవం

సాక్షి, అమరావతి: శాసన సభ్యులు, శాసన మండలి ముస్లిం సభ్యుల కోటాలో రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు ఇద్దరు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. ఎమ్మెల్యే మహ్మద్ అబ్దుల్ హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ రుహుల్లా ఇద్దరే నామినేషన్లు వేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన పూర్తి కావడంతో బుధవారం వారి ఇద్దరి ఎన్నికను అధికారులు ధ్రువీకరిస్తూ ప్రభుత్వానికి నివేదించారు.

రేపు సదరన్ రాష్ట్రాల వినియోగదారుల హక్కుల సదస్సు

సాక్షి, విశాఖపట్నం: వినియోగదారుల హక్కులకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 29న దక్షిణాది రాష్ట్రాల సదస్సు నగరంలోని నోవాటెల్ హోటల్‌లో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్ నికోబార్ దీవులకు సంబంధించిన అధికారులు హాజరుకానున్నారు. కన్జ్యూమర్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవికుమార్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభిస్తారు. ఆయా రాష్ట్రాల్లో వినియోగదారుల హక్కుల చట్టం అమలు తీరుకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు. ఒక్క రోజు సదస్సుకు ఏడు రాష్ట్రాలకు సంబంధించిన పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, 173 జిల్లాల వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్‌లు, ఇతర అధికారులు హాజరుకానున్నారు.

పులివెందులలోని స్టేట్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని స్టేట్ స్పోర్ట్స్ అకాడమీలో ఐదు క్రీడా విభాగాల్లో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఎండీ ధ్యాన్‌చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, హాకీ, వాలీబాల్‌లో 12–18 ఏళ్లలోపు విభాగంలో 30 మంది చొప్పున 150 మంది బాలురకు అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 30 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు ఆయా డీఎస్‌ఏల్లో పూర్తి చేసి రాష్ట్ర స్థాయి ఎంపికలను అక్టోబర్ 10 నుంచి 13వ తేదీ వరకు పులివెందులలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు క్రెడిట్ కార్డులు

కేంద్ర ప్రభుత్వ పశు కిసాన్ క్రెడిట్ కార్డులివ్వాలని సీఎం జగన్ నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాడి రైతుల అభ్యున్నతికి అనేక చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు వారికి మరింత మేలు చేకూర్చనున్నారు. జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేయించి, వారి వ్యాపారానికి అవసరమైన రుణాలను మంజూరు చేయించేందుకు చర్యలు చేపట్టారు. వైఎస్సార్ ఆసరా, చేయూత మహిళా లబ్ధిదారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు పాడి పశువుల కొనుగోళ్లకు బ్యాంకుల ద్వారా ఇప్పటికే రుణాలు మంజూరు చేయిస్తున్నారు. వీరి నుంచి అమూల్ ద్వారా పాల సేకరణ చేస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులు వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులకు అవసరమైన వర్కింగ్ కేపిటల్ కోసం రుణాలు మంజూరు చేయించనుంది. ఇందుకోసం జిల్లాలవారీగా బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించింది. ఇటీవల జరిగిన బ్యాంకర్ల సబ్ కమిటీ సమావేశంలో 18 జిల్లాల్లోని 2.28 లక్షల మంది జగనన్న పాల వెల్లువ లబ్ధిదారుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. వీరందరికి పశు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇచ్చి, రుణాలు మంజూరు చేయాలని ఆ



సమావేశంలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ క్రెడిట్ కార్డుల ద్వారా పశు, మత్స్యకార రైతులకు ప్రత్యేకంగా కార్డులు ఇచ్చి, వారికి అవసరమైన రుణాలు మంజూరు చేస్తారు. అర్హులైన వారందరికి ఈ కార్డులు ఇవ్వడానికి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అర్హులైన పశు, మత్స్యకార రైతులకు ఈ కార్డులు ఇవ్వాలని, ఇందుకోసం జిల్లాలవారీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నోడల్ అధికారులతో శిబిరాలు నిర్వహించాలని బ్యాంకర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ కార్డులపై వర్కింగ్ క్యాపిటల్‌గా లబ్ధిదారులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు బ్యాంకులు రుణాలిస్తాయి. ఈ రుణాలకు 1.5 శాతం వడ్డీ రాయితీ ఇస్తారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారు వార్షిక వడ్డీలో 3 శాతం సత్వర రీపేమెంట్ ప్రోత్సాహకానికి అర్హులవుతారు.

ప్రతి శుక్రవారం శిబిరాలు

ఈ కార్డులతో పాటు రుణాల మంజూరుకు ప్రతి శుక్రవారం బ్యాంకులు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తాయి. అక్కడికక్కడే అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వెంటనే ప్రాసెస్ చేస్తాయి. సూత్రప్రాయ మంజూరు కూడా ఈ శిబిరాల్లోనే చేస్తారు. వైఎస్సార్ చేయూత, ఆసరా లబ్ధిదారులు ఇప్పటికే బ్యాంకుల్లో ఖాతాదారులుగా ఉన్నారని, అలాగే ఇప్పటికే జగనన్న పాల వెల్లువ కింద పాడి పశువులను కొనుగోలు చేశారని రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వీరికి క్రెడిట్ కార్డులు, రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టం చేసింది.

జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, రుణాల మంజూరుకు బ్యాంకులకు జిల్లాలవారీగా లక్ష్యం ఇలా..

జిల్లా	లబ్ధిదారులు						
		చిత్తూరు	6,843	కృష్ణా	9,193	శ్రీ సత్యసాయి	13,068
అనకాపల్లి	18,307	తూర్పుగోదావరి	6,076	ఎన్టీఆర్	18,629	తిరుపతి	6,391
అనంతపురం	6,433	ఏలూరు	20,758	పల్నాడు	22,115	పశ్చిమ గోదావరి	6,522
అన్నమయ్య	16,846	గుంటూరు	8,851	ప్రకాశం	19,881	వైఎస్సార్	8,218
బాపట్ల	10,393	కాకినాడ	19,467	నెల్లూరు	10,150	మొత్తం	2,28,141

రూ.50 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌తో

రహదారి భద్రతా నిధి

- వివిధ రహదారి ప్రాజెక్టుల అంచనాలో 2 శాతం ఈ నిధికి జమ చేయాలి
- సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారి భద్రతకు సంబంధించి రూ.50 కోట్లతో రివాల్వింగ్ ఫండ్ నిధులతో ప్రత్యేకంగా రహదారి భద్రతా నిధిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రహదారి భద్రత, రహదారి భద్రత డ్రాఫ్ట్ ఆడిట్ నివేదిక అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారి ప్రమాదాల వల్ల ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోడం లేదా తీవ్రంగా గాయపడడం వల్ల ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. రహదారి భద్రతకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనుందని తెలిపారు. కొత్తగా చేపట్టే వివిధ రహదారుల ప్రాజెక్టు అంచనాల్లో 2 శాతం నిధులు రహదారి భద్రతా నిధికి జమ అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు. వివిధ జాతీయ, రాష్ట్ర, ఇతర ముఖ్యమైన రహదారులపై గల జంక్షన్లను మెరుగుపర్చడంతో పాటు బ్లాక్ స్పాట్లను తక్షణం సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు వినియోగంపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం లేదా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై నూతన మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నగరాలు, పట్టణాల్లో ప్రమాదాల నివారణకు సిగ్నల్ వ్యవస్థతో పాటు సీసీ కెమెరాలను సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలు, ప్రార్థనా మందిరాల పరిసరాల్లోని రహదారులపై ప్రత్యేకంగా సైనేజి బోర్డుల ఏర్పాటుతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర రహదారులు–భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న సమావేశపు అజెండా, రోడ్డు సేఫ్టీ ఆడిట్‌కు సంబంధించిన సిఫార్సులను వివరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'వార్షిక' పనితీరు నివేదికలు సమర్పించాలి

రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, విభాగాల్లో పనిచేసే గ్రూప్–1 ఉద్యోగులు, సమాన ఉద్యోగులు ఇక నుంచి ఎలక్ట్రానిక్ వార్షిక పనితీరు నివేదికలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి వార్షిక కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ నమూనా పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆ నమూనా పత్రాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఏప్రిల్ 30వ తేదీలోగా సంబంధిత అధికారికి ఆన్‌లైన్‌లో వార్షిక పనితీరు నివేదికను సమర్పించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక పనితీరు నివేదికను నిర్ధారించిన నమూనా పత్రంలో ఆన్‌లైన్‌లో అక్టోబర్ 31వ తేదీలోగా సమర్పించాల్సిందిగా స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖలు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటుకు ఆమోదించినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

ఐఎంఎఫ్‌లో రాష్ట్ర విద్యార్థినికి గౌరవం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రాజేశ్వరికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చైర్ ఆఫర్
- మన రాష్ట్ర విద్యార్థులను చూసి గర్వపడుతున్నాను: సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా ఐక్యరాజ్యసమితి (యూఎన్) సదస్సుకు వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంగళవారం వాషింగ్టన్‌లోని ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ (ఐఎంఎఫ్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి వి.సుబ్రమణ్యన్ విద్యార్థుల బృందంతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన నంద్యాలకు చెందిన లారీ డ్రైవర్ కుమార్తె చాకలి రాజేశ్వరికి తన చైర్ ఆఫర్ చేసి అందులో కూర్చోబెట్టారు. సుమారు 1.20 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో రాజేశ్వరి అదే చైర్‌లో కూర్చుంది. ఈ సందర్భంగా సుబ్రమణ్యన్ విద్యార్థులతో మాట్లాడుతూ.. కలలను నిజం చేసుకోవడానికి నిరంతరం కృషి చేయాలని, సమాజంలో మనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడంతో పాటు దేశానికి చేతనైన సాయం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సుబ్రమణ్యన్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. 'నేను నా కార్యాలయంలో ఏపీ నుంచి వచ్చిన తెలివైన విద్యార్థులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. వారంతా అత్యంత నిరాడంబరమైన నేపథ్యాల నుంచి వచ్చినవారు కావడం వల్ల భారతీయుడిగా గర్వపడుతున్నాను. విద్య ప్రాముఖ్యత



రాజేశ్వరి

ప్రతి భారతీయ కుటుంబం మనసులోకి ప్రవేశించింది' అంటూ సుబ్రమణ్యన్ ట్వీట్ చేశారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ 'వారిని ప్రోత్సహిస్తున్నందుకు ధన్యవాదాలు సుబ్రమణ్యన్‌గారూ! మిమ్మల్ని కలవడం, మీతో సంభాషించడం మన పిల్లలకు, ఏపీ పిల్లలందరికీ అపురూపమైన గౌరవం. మన పిల్లలు మన రాష్ట్రాన్ని, మన విద్యా విధానం సారాంశాన్ని ప్రపంచం మొత్తం చాటిచెప్పడాన్ని చూసి నేను గర్వపడుతున్నాను' అంటూ రీట్వీట్ చేశారు.

గీతాగోపీనాథ్‌కు సీఎం జగన్ ధన్యవాదాలు

ఐఎంఎఫ్ ఫస్ట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతాగోపీనాథ్‌కు కూడా సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఐఎంఎఫ్ కార్యాలయంలో విద్యార్థులు గీతాగోపీనాథ్‌తో సమావేశమైన సందర్భంగా ఆమె 'ఐఎంఎఫ్‌కి ఏపీ విద్యార్థులను స్వాగతించడం నిజంగా ఆనందంగా ఉంది. వారి యూఎన్, యూఎస్ పర్యటనలో భాగంగా ఐఎంఎఫ్ ప్రధాన కార్యాలయానికి రావడం సంతోషిస్తున్నాను' అంటూ ఏపీ సీఎంను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన సీఎం జగన్.. 'మా పిల్లలను కలిసినందుకు, వారిని ఇంత ఆప్యాయంగా చూస్తున్నందుకు ధన్యవాదాలు గీతా గోపీనాథ్ గారూ, వారి చిరునవ్వులు అన్నీ చెబుతున్నాయి! విద్య అనేది వ్యక్తిగత జీవితాలను మార్చడమే కాకుండా మొత్తం సమాజాన్ని మార్చడంలో అతిపెద్ద ఉత్ప్రేరకం అని నేను నిజంగా నమ్ముతున్నాను. మన పిల్లలే ఇందుకు నిదర్శనం. అంతర్జాతీయ వేదికపై ఆత్మవిశ్వాసంతో ప్రాతినిధ్యం వహిస్తున్న మన పిల్లలను చూసినప్పుడు నేను గర్వంతో ఉప్పొంగిపోయాను' అంటూ రీట్వీట్ చేశారు.

ఏపీ విద్యా సంస్కరణలు పేద పిల్లలకు వరం

▶ మొదటి పేజీ తరువాయి

సమూలంగా మార్చాయన్నారు. బాలికా విద్య, వారి సంరక్షణకు ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు, పథకాల గురించి వివరించారు. రాష్ట్రం తరఫున ఐక్యరాజ్యసమితి సదస్సుకు వెళ్లిన 10 మంది ప్రభుత్వ విద్యార్థుల బృందం తమ పర్యటనలో భాగంగా మంగళవారం యూఎస్ డిపార్ట్‌మెంట్ స్టేట్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతపై ప్రతినిధులు మాట్లాడారు. ముఖ్యంగా బాలికా విద్య ఎంత ముఖ్యమో చర్చించారు.

ఇంగ్లిష్ మీడియం వల్లే మీతో మాట్లాడగలుగుతున్నాం..

అమెరికాలో అమలవుతున్న విద్యావిధానం గురించి అమెరికా ప్రతినిధి రోసీ ఎడ్మండ్ మన విద్యార్థులకు వివరించారు. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాలు, ఫలితంగా సాధించిన ప్రయోజనాలను రాష్ట్ర విద్యార్థులు అమెరికా అధికారులకు ప్రదర్శన రూపంలో తెలియజేశారు. జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి, బాలికా విద్య కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను యూఎస్ అధికారులు ప్రశంసించారు. ఏపీ ప్రభుత్వ స్కూళ్లలో గతంలో ఇంగ్లిష్ మీడియం లేదని.. సీఎం వైఎస్ జగన్ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని విద్యార్థులు తెలిపారు. దాని ఫలితంగానే ఇప్పుడు తాము మీతో ఇంగ్లిష్‌లో మాట్లాడగలుగుతున్నామని అమెరికా ప్రభుత్వ అధికారులకు వివరించారు. నాడు–నేడు కింద కొత్తరూపు సంతరించుకున్న ప్రభుత్వ పాఠశాలల ఫొటోలను విద్యార్థులు.. అధికారులకు చూపించారు. అలాగే కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, అత్యాధునిక ఫర్నీచర్, ప్లేగ్రౌండ్స్, డిజిటల్ లైబ్రరీ, బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్, ప్రత్యేక టాయిలెట్స్ సౌకర్యాల గురించి కూడా వివరించారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాల్లోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు జగనన్న విదేశీ విద్యా కానుక పథకం కూడా ఉందని విద్యార్థులు యూఎస్ అధికారులకు తెలిపారు.

పేద విద్యార్థులకు టోఫెల్ శిక్షణ సహాయపడుతుంది..

యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అధికారి రోజీ ఎడ్మండ్ మాట్లాడుతూ.. కొలంబియా, ప్రిన్స్‌టన్, హార్వర్డ్, న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో టోఫెల్ శిక్షణ ఇవ్వడం ఎంతో మంచి నిర్ణయమని కొనియాడారు. పేద మెరిట్ విద్యార్థులకు ఈ శిక్షణ సహాయపడుతుందన్నారు. అమెరికాలో చదువుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఆర్థిక సహాయం కూడా అందుతుందని తెలిపారు. 400 యూనివర్సిటీలు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ గుర్తింపు పొందాయని.. విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. యూఎస్ డిపార్ట్‌మెంట్ పబ్లిక్ డిప్లమసీ ఎఫైర్స్ ఆఫీసర్ ఎరిక్ క్రిస్టెన్‌సన్ మాట్లాడుతూ.. విద్య, సమాచార మార్పిడి.. రెండు ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు అమెరికాలో ఉన్నత విద్యా అవకాశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలుగు విద్యార్థులు చక్కటి ఇంగ్లిష్‌లో మాట్లాడడాన్ని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ సీనియర్ ఎక్స్‌టర్నల్ ఆఫీసర్ మోలీ స్టీఫెన్‌సన్ ప్రశంసించారు. చిన్న వయసులోనే చాలా తక్కువ సమయంలో భాష నేర్చుకుని ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం తనకు ఆశ్చర్యంగా ఉందన్నారు. యూఎస్ విద్యార్థుల ప్రతినిధి బృందంలో 8 మంది బాలికలకు అవకాశం కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూఎన్‌వో స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ మాట్లాడుతూ.. యూఎస్ డిపార్ట్‌మెంట్ స్టేట్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఎస్పీడీ, కేజీబీవీ కార్యదర్శి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ కృషికి అమెరికా అధికారుల ప్రశంసలు

ఈ సందర్భంగా యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్‌లో ఇండియా డెస్క్ ఆఫీసర్‌గా ఉన్న రజనీ ఘోష్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివి డిప్లొమాట్ కావడానికి చాలా కష్టపడ్డానని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లిష్ చాలా అవసరమని, కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధిస్తే భవిష్యత్‌లో దౌత్యవేత్తలు కూడా అవుతారన్నారు. యూఎస్‌లో ఉన్నత చదువుల కోసం ఏపీ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు తమ విభాగం సిద్ధంగా ఉందని వెల్లడించారు. విద్యార్థు ఇంగ్లిష్ భాషా సామర్థ్యాలను పరిశీలించి ఆమె వారిని అభినందించారు. పేద పిల్లలను రాష్ట్రం తరఫున ప్రతినిధులుగా అమెరికా పంపిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నిర్ణయం ఏపీలోని లక్షలాది మంది విద్యార్థులు విద్యను తమ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవడానికి ఉపయోగపడుతుందని ప్రశంసించారు.

విశాఖ వైపు మెట్రో రైలు పరుగులు

▶ మొదటి పేజీ తరువాయి

మెట్రో రైల్ కార్పొరేషన్‌కు మార్గదర్శకాలు జారీ చేశారు.

ప్రజారవాణా వ్యవస్థ మెరుగుదలపై దృష్టి

2021 అంచనాల ప్రకారం విశాఖ మహా నగరంలో 25 లక్షలకు పైగా జనాభా ఉంది. మెట్రో నిర్మాణ ప్రతిపాదనలు ఉన్న శివారు ప్రాంతాలతో కలిపితే మొత్తం జనాభా 41 లక్షలు. అందుకే తప్పనిసరిగా మెట్రో రైలు అవసరం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు మెట్రోపై దృష్టి సారించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా తర్వాత విశాఖ కేంద్రంగా పరిపాలన సాగించేందుకు అడుగులు పడుతున్న తరుణంలో నగరంలో ప్రజారవాణా వ్యవస్థ మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుంది.

జనవరి 15న పునాది రాయి

వచ్చే ఏడాది జనవరి 15న మెట్రో రైలు పనులకు పునాది రాయి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల విశాఖలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన అభివృద్ధి పనుల సమీక్షలో మెట్రో రైలు నిర్మాణ అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. పునాది రాయి వేసేలోగా నిధులు సమీకరించేందుకు ఉన్న మార్గాల్ని అన్వేషించాలని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ యూజేఎం రావుకు సూచించారు. 42 మెట్రో స్టేషన్లతో కూడిన మూడు కారిడార్లను మొదటి దశలో నిర్మించాలని భావిస్తున్నారు. కారిడార్–1లో స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కి.మీ., కారిడార్–2లో గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5.07 కి.మీ., కారిడార్–3లో భాగంగా తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కి.మీ. మేర లైట్ మెట్రో కారిడార్ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఆ తరువాత రెండో విడత కింద కారిడార్–4లో కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు 30.67 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఈ నాలుగు కారిడార్లలో మొత్తం 54 స్టేషన్లు, రెండు డిపోలు ఏర్పాటు చేయనున్నారు.

విశాఖ మెట్రో స్వరూపమిదీ



మొత్తం అంచనా వ్యయం: రూ.14,309 కోట్లు

ఫేజ్–1లో కారిడార్–1, 2, 3 నిర్మాణ అంచనా వ్యయం: రూ.9,699 కోట్లు

ఫేజ్–2లో కారిడార్–4 నిర్మాణ అంచనా వ్యయం: రూ.4,610 కోట్లు

ప్రాజెక్టు విస్తీర్ణం: 76.90 కి.మీ.

ఫేజ్–1, ఫేజ్–2లో నిర్మించే మొత్తం స్టేషన్లు: 54

మోడ్రన్ ట్రామ్ ప్రాజెక్టు

అంచనా వ్యయం: రూ.5,323 కోట్లు

కారిడార్–1 అంచనా వ్యయం: రూ.1,102 కోట్లు

కారిడార్–2 అంచనా వ్యయం: రూ.1,879 కోట్లు

కారిడార్–3 అంచనా వ్యయం: రూ.1,321 కోట్లు

కారిడార్–4 అంచనా వ్యయం: రూ.1,021 కోట్లు

ప్రాజెక్టు విస్తీర్ణం: 60.05 కి.మీ.

బీచ్ రోడ్డులో ట్రామ్ కారిడార్

బీచ్ రోడ్డులో ట్రామ్ కారిడార్ ఒక మణిహారంగా రాబోతోంది. ప్రధాన జంక్షన్ల నుంచి అభివృద్ధి చెందే ప్రాంతాలకు కూడా ట్రామ్ నడిపే యోచనలో ప్రభుత్వం ఉంది. మొత్తం 60.05 కి.మీ. మేర మోడ్రన్ ట్రామ్‌ని నడిపేందుకు 4 కారిడార్లు గుర్తించారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకూ ట్రామ్ కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా స్టీల్‌ప్లాంట్ నుంచి అనకాపల్లి, ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి పెందుర్తి వరకు కూడా ట్రామ్ కారిడార్ రాబోతోంది.

శివారుకు మెట్రో.. సీఎం ఆకాంక్ష

ఏపీ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాలు కూడా కోర్ సిటీకి సమానంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు అవసరం. అందుకే ఆయా ప్రాంతాలకు మెట్రో సౌకర్యం కూడా కల్పించాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. అందుకు అనుగుణంగా డీపీఆర్‌లో మార్పులు, చేర్పులు జరిగాయి.

విశాఖ పోలీస్ కమిషనరేట్ అప్‌గ్రేడ్

పరిపాలన రాజధాని రాకతో పెరగనున్న హోదా

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ పోలీస్ కొత్త రూపుసంతరించుకోనుంది. నగర కమిషనరేట్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో విశాఖకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా పరిపాలన రాజధానిగా విశాఖ మారనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా నగరంలో పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్ హోదాను ఐజీ స్థాయి నుంచి అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్థాయికి పెంచడంతోపాటు అదనపు పోస్టుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

కొత్త సీపీ నియామకంతోనే సంకేతాలు

విశాఖపట్నంలో 1861 జనవరి 28న పోలీస్ వ్యవస్థ ప్రారంభమైంది. 1983 వరకు ఎస్పీ స్థాయి అధికారి మాత్రమే ఉండేవారు. ఆ తర్వాత కమిషనరేట్‌ను ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఐజీ స్థాయి అధికారే విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతూ వచ్చారు. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని భావించిన నేపథ్యంలో కొంతకాలంగా నగరంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాజధాని అవసరాలకు తగ్గట్టుగా నగర పోలీస్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇందుకు అనుగుణంగానే విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఐజీ స్థాయి అధికారి త్రివిక్రమ్ వర్మ స్థానంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) స్థాయి అధికారి ఎ.రవిశంకర్‌ను నియమించింది. ఈ నియామకం ద్వారా కమిషనరేట్ హోదాను ఏడీజీ స్థాయికి పెంచుతున్నట్టు ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరలో కొత్త పోస్టుల మంజూరు

విశాఖ రాజధాని కానున్న నేపథ్యంలో నగర పోలీస్ శాఖలో కొత్త పోస్టుల మంజూరుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా జాయింట్ కమిషనర్‌తోపాటు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్‌కు అదనపు పోస్టులు మంజూరు చేసే అవకాశం ఉందని సమాచారం. కొద్దినెలల క్రితమే టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌లకు స్టేషన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌లో కేసులు నమోదు చేసే అవకాశం కలిగింది. అయితే ఇప్పటివరకు విశాఖలో ఆ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో ఈ రెండు స్టేషన్లకు కొత్త పోస్టుల ద్వారా అధికారులు, సిబ్బందిని కేటాయించే అవకాశముందని తెలుస్తోంది. పూర్తి స్థాయిలో అధికారుల నియామకం తర్వాత టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌లలో కేసులు నమోదు చేయాలని ఇక్కడి పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వీటితోపాటు విశాఖలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విశాఖ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఒకవైపు రహదారుల విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణంపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆ విభాగంలో అదనపు పోస్టుల మంజూరుపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. త్వరలోనే వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా...

రిటర్న్ గిఫ్ట్ తర్వాత.. ముందు కుప్పంలో గెలవండి

- లోకేశ్‌కు మంత్రి పెద్దిరెడ్డి సవాల్



మంగళగిరి: రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం అన్న టీడీపీ నేత నారా లోకేశ్ వ్యాఖ్యలపై రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందిస్తూ.. రిటర్న్ గిఫ్ట్ దేవుడెరుగు ముందు కుప్పం నుంచి గెలవండి అని సవాల్ చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన టెంపుల్ హిల్ ఎకో పార్కును బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. ఎవరి మీద కక్ష సాధింపు ఉండదన్నారు. తప్పు చేస్తే శిక్ష అనుభవించక తప్పదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర అటవీ శాఖ దళాల అధిపతి వై.మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

బాబుపై కక్ష సాధింపు చర్య

చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భువనేశ్వరి

సాక్షి, రాజమహేంద్రవరం/రాజానగరం: చంద్రబాబును అరెస్ట్ చేసి, జైలులో పెట్టడం ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యేనని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబుకు మద్దతుగా తూర్పు గోదావరి జిల్లా సీతానగరంలో నిర్వహిస్తోన్న 'బాబుతో నేను' కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారనే నమ్మకాన్ని వ్యక్తపరిచారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. అంతకు ముందు ఆమె చంద్రబాబు త్వరగా విడుదల కావాలని కోరుతూ జాంపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేశారు. కాగా, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ అనుభవిస్తోన్న చంద్రబాబు జైలు జీవితం 18వ రోజుకు చేరింది. ఎప్పటిలాగే బాబు ఉదయం యోగా, వాకింగ్ చేశారు.

అన్ని కోట్లుంటే ఎందుకమ్మా పేదల సొమ్ము?

భువనేశ్వరి వ్యాఖ్యలపై ఎంపీ భరత్




రాజమహేంద్రవరం సిటీ: హెరిటేజ్‌లో 2% వాటా విక్రయిస్తే రూ.400 కోట్లు వస్తాయని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలపై రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ స్పందించారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడారు. ఇన్ని కోట్ల రూపాయలు ఉంటే ప్రభుత్వ ఖజానా నుంచి అడ్డదార్లలో మీ శ్రీవారు మళ్లించిన రూ.370 కోట్లు కట్టేయవచ్చు కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఖజానా అంటే ప్రజల సొమ్ము. ఆ సొమ్ము తిరిగి కట్టేద్దాం.ఆలోచించండి..అని భువనేశ్వరిని ఉద్దేశించి అన్నారు. ప్లకార్డులతో క్రైస్తవ మందిరాల్లోకి భువనేశ్వరి, టీడీపీ నాయకులు వెళ్లి, ప్రార్థనలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

హైకోర్టులో ఉండవల్లి పిల్ మరో ధర్మాసనానికి బదిలీ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ హైకోర్టులో దాఖలు చేసిన పిల్ బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా సీజే స్పందిస్తూ.. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపే విషయంలో తమ ఇద్దరిలో ఒకరికి ఇబ్బంది ఉందన్నారు. అందువల్ల తమలో ఒకరు సభ్యుడిగా లేని ధర్మాసనం ముందు ఈ వ్యాజ్యాన్ని ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఏ ధర్మాసనం ముందు వ్యాజ్యం తిరిగి విచారణకు వస్తుందన్న విషయంపై రెండు మూడు రోజుల్లో స్పష్టత రావచ్చు.

కాపులను బాబుకు తాకట్టు పెట్టిన పవన్ : కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): దేశంలోనే అత్యంత అవినీతిపరుడు చంద్రబాబు అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. బుధవారం విశాఖ ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులు ఇచ్చి టీడీపీ నేతలు పెయిడ్ ఉద్యమాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కూడా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థపై గౌరవం ఉంటే విచారణకు బాబు సహకరించాలని సూచించారు. పవన్ కళ్యాణ్ 25 సీట్లకు కుక్కలాగా అమ్ముడుపోయాడని, ప్యాకేజీ కోసం కాపులను చంద్రబాబుకు పవన్ తాకట్టు పెట్టాడన్నారు.

న్యాయమూర్తులపై పోస్టులు.. 26 మందికి హైకోర్టు నోటీసులు

వీరిలో టీడీపీ నేతలు, సస్పెన్షన్‌లో ఉన్న న్యాయాధికారి

- గూగుల్, ట్విటర్, ఫేస్‌బుక్‌కు కూడా నోటీసులు
- ఆ అకౌంట్ల యజమానులను గుర్తించాలని డీజీపీకి ఆదేశం
- తదుపరి విచారణ అక్టోబర్ 25కి వాయిదా
- స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు రిమాండ్ నేపథ్యంలో చెలరేగిన టీడీపీ శ్రేణులు
- న్యాయమూర్తులు లక్ష్యంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు
- కులం పేరుతో దూషణలు • హైకోర్టులో అడ్వొకేట్ జనరల్ పిటిషన్
- దురుద్దేశంతోనే ఇలా చేస్తున్నారు.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి



సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు, అనంతర పరిణామాల నేపథ్యంలో ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారి లక్ష్యంగా టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. పలువురు టీడీపీ నేతలు సహా 26 మందికి నోటీసులు జారీ చేసింది. స్కిల్ స్కామ్‌లో అరెస్టయిన చంద్రబాబుకు రిమాండు విధించడంతోపాటు, కేసు కొట్టేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చినందుకు హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిపై పలువురు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, కామెంట్లు పెట్టారు. వీరిపై క్రిమినల్ కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్వొకేట్ జనరల్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సస్పెన్షన్‌లో ఉన్న న్యాయాధికారి ఎస్.రామకృష్ణతో పాటు ముప్పా తారక్ కృష్ణ యాదవ్, రవి కుమార్ ముదిరాజ్, రుమాల రమేష్, యల్లా రావు, కళ్యాణి, ఎస్.చిరంజీవి, చైతన్య కుమార్ రెడ్డి, ఆనంద్, కిషోర్ కుమార్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. గూగుల్ ఇండియా, ట్విటర్ కమ్యూనికేషన్స్, ఫేస్‌బుక్ ఇండియాలకు కూడా నోటీసులు జారీ చేసింది. అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు పెట్టినందుకు ఎందుకు ధిక్కార చర్యలు తీసుకోరాదో వివరించాలని వీరందరినీ ఆదేశించింది. న్యాయమూర్తులు, న్యాయాధికారిపై పోస్టులు పెట్టిన ప్రతివాదుల ఫేస్‌బుక్ అకౌంట్ల అసలు యజమానులను గుర్తించాలని, వారికి నోటీసులు జారీ చేయాలని డీజీపీని ఆదేశించింది. తమ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 25కి వాయిదా వేసింది.

ఏజీ దృష్టికి దుష్ప్రచారం..

స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి ఆ క్వాష్ పిటిషన్‌ను కొట్టేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ కోర్టు న్యాయాధికారితో పాటు జస్టిస్ శ్రీనివాసరెడ్డి, మరో న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు, ఇతరులు సోషల్ మీడియాలో అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు పెద్ద ఎత్తున పెట్టారు. వారిని కులం పేరుతో దూషించారు. ఈ విషయాన్ని న్యాయవాది డాక్టర్ వసంత్ కుమార్ లిఖితపూర్వకంగా ఏజీ ఎస్.శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. హైకోర్టు న్యాయవాది ఎం.సుజాత సైతం ఇదే విషయంపై ఏజీకి లేఖ రాశారు. నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలను కూడా ఆ లేఖలకు జత చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా పోస్టులు, కామెంట్లు పెట్టిన వారిపై క్రిమినల్ ధిక్కార పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి కోరారు. ఈ లేఖలను పరిశీలించిన ఏజీ శ్రీరామ్ స్వయంగా కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో న్యాయమూర్తులు, న్యాయాధికారిపై కామెంట్లు చేసిన వారినీ ప్రతివాదులుగా చేర్చారు.

న్యాయవ్యవస్థ ప్రతిష్ట దిగజార్చేలా..

ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ రాయ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు అరెస్ట్, రిమాండ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు, న్యాయాధికారి ప్రతిష్టను దిగజార్చేలా పలువురు పోస్టింగ్‌లు, కామెంట్లు పెట్టారని తెలిపారు. టీవీ చర్చల్లో కూడా అడ్డగోలుగా మాట్లాడారని వివరించారు. కోర్టు ప్రతిష్టను దిగజార్చాలన్న దురుద్దేశంతోనే వారంతా అలా చేశారన్నారు. ఆ పోస్టులను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కూడా న్యాయమూర్తులపై ఇలాంటి పోస్టులు వచ్చినప్పుడు రిజిస్ట్రార్ పంపిన లేఖ మేరకు క్రిమినల్ ధిక్కార చర్యలు చేపట్టేందుకు అనుమతినిచ్చారని ఆయన గుర్తు చేశారు. హైకోర్టు సైతం సుమోటోగా విచారణ జరిపిందన్నారు. ఆ తరువాత ఈ వ్యవహారాన్ని హైకోర్టు సీబీఐకి సైతం అప్పగించిందని తెలిపారు. ఏజీ వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది.

టీడీపీ తెలుగు మహిళా కార్యదర్శి అరెస్ట్

- సీఎంను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసిన కోర్టు



పిడికిటి శివ పార్వతి

గుంటూరు లీగల్: సీఎం వైఎస్ జగన్ పరువుకు భంగం కలిగించేలా, కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టిన టీడీపీ గుంటూరు పార్లమెంట్ తెలుగు మహిళ కార్యదర్శి పిడికిటి శివ పార్వతిని బుధవారం పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన శివ పార్వతి నగరంలోని జేకేసీ రోడ్డులోని విజయపురి కాలనీలో ఉంటుంది. ఆమె టీడీపీ గుంటూరు పార్లమెంట్ తెలుగు మహిళా కార్యదర్శిగా పని చేస్తూ ఫేస్‌బుక్‌లో 'లక్ష్మీగణేష్' ఐడీతో పోస్టింగ్‌లు పెడుతుంది. ఈ నెల 25న సీఎం పరువుకు భంగం కలిగించేలా, కించపరిచేలా అసభ్యకర వ్యాఖ్యలతో వీడియో పోస్టు చేసింది. దీనిపై స్తంభాలగరువుకు చెందిన వైఎస్సార్ సీపీ 42వ డివిజన్ ఇన్‌చార్జ్ చల్లా శేషిరెడ్డి, ఏటి అగ్రహారానికి చెందిన వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజవరపు జగదీష్ పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం పరువుకు భంగం కలిగించేలా, కించపరిచేలా ఉండటమే కాకుండా అల్లర్లు జరిగేలా రెచ్చగొట్టడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వీడియో ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు. నిందితురాలు ఇదే తేదీన పోస్టు చేసిన మరో వీడియోపై మారుతీనగర్‌కు చెందిన షేక్ ఉస్మాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో కూడా పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. నిందితురాలు సోషల్ మీడియాలో తరచూ ఇలాంటి పోస్టింగ్స్ పెడుతుందనీ, గతంలో సీసీ నం.1247/2021 లో కూడా ముద్దాయి అని పేర్కొంటూ , ఆమెకు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరుతూ పట్టాభిపురం పోలీసులు రిమాండ్ రిపోర్టును కోర్టులో దాఖలు చేశారు. వాదనలు విన్న ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.స్పందన రిమాండ్‌ను తిరస్కరిస్తూ రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఎందుకు మార్చారు?

- రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన అక్రమాలు ప్రజలందరికీ తెలుసు
- అధికారం కోసం టీడీపీ, జనసేన అనైతిక పొత్తులను ప్రజలు గమనిస్తున్నారు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



మంగళగిరి: 'ఇన్నర్ రింగ్ రోడ్డే లేదు.. దాంతో తనకు సంబంధం ఏమిటి అంటున్న నారా లోకేశ్ ఆ రింగ్ రోడ్డు నిర్మాణానికి షబ్బానా వాళ్లను ఎందుకు కన్సల్టెంట్‌గా నియమించారు' అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నిలదీశారు. బుధవారం ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన టెంపుల్ హిల్ ఎకో పార్కు ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆర్కే మీడియాతో మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ముందుగా ఇచ్చినట్టు కాకుండా లింగమనేని రమేష్, మాజీ మంత్రి నారాయణ, హెరిటేజ్ డైరెక్టర్ లోకేశ్ పేరిట కొన్న భూముల మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. నిజాయితీపరుడైన అప్పటి సీఆర్‌డీఏ కమిషనర్ నాగులాపల్లి శ్రీకాంత్ వారి మాట వినడం లేదని ఆయనను మార్చేసి సీఆర్‌డీఏ కమిషనర్‌గా అర్హత లేని అప్పటి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను నియమించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తాను అన్ని ఆధారాలు, సాక్ష్యాలతో సహా రికార్డులను సేకరించి సీఐడీ అధికారులకు అప్పగించానని చెప్పారు. చంద్రబాబు రాజధాని పేరుతో ప్రతి అంశాన్ని ఆయన స్వార్థానికి, ఆయన మనుషుల స్వార్థానికి ఎంతలా వాడుకున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. లింగమనేని రమేష్, మాజీ మంత్రి నారాయణ, రామకృష్ణ హౌసింగ్ వాళ్లతో పాటు హెరిటేజ్ పేరుతో కొన్న భూములు సుమారు 650 ఎకరాలకు లబ్ధి చేకూరేలా ఇన్నర్ రింగ్ రోడ్డును మార్చిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు.

అనైతిక పొత్తులను ప్రజలు గమనిస్తున్నారు

టీడీపీ అధికారమే పరమావధిగా జనసేనతో అనైతిక పొత్తులు పెట్టుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆర్కే పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కరోనా లాంటి ఇబ్బందులు వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుల మతాలకు అతీతంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా డీబీటీ ద్వారా రూ.లక్షల కోట్లు పంపిణీ చేసి సంక్షేమాన్ని ఇంటికి చేర్చినట్టు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు వైనాట్ 175 జరిగి తీరుతుందనే నమ్మకం ఉందన్నారు.

టీడీపీ ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రాజీనామా

పార్టీ నేత కొత్త నాగేంద్రబాబు డబ్బుల కోసం వేధించడమే కారణం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో కొందరు నేతలు డబ్బుల కోసం వేధిస్తుండటంతో ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కాకు మల్లికార్జున యాదవ్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కి పంపారు. విజయవాడ నగరంలో సుదీర్ఘకాలం నుంచి టీడీపీలో ఉన్న మల్లికార్జున రాజీనామాతో నగర పార్టీలో విభేదాలు బయటపడ్డాయి. రాష్ట్ర పార్టీ కార్యదర్శి, బీసీ సంఘాల కో ఆర్డినేటర్ కొత్త నాగేంద్రబాబు తరచూ డబ్బుల కోసం వేధిస్తుండటం వల్లే రాజీనామా చేస్తున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం నాగేంద్రబాబు తనకు రూ.50 వేలు అడిగాడని, ఇవ్వకపోవడంతో తనపై పార్టీ ముఖ్య నేతలకు ఫిర్యాదులు చేయడం మొదలుపెట్టాడని ఆయన లేఖలో తెలిపారు. తనను ఎలాగైనా పార్టీ నుంచి బయటకు పంపాలని ఆయన కుయుక్తులు పన్నుతుండడంతో తానే రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కొత్త నాగేంద్రబాబును బీసీ విభాగాల సమన్వయకర్తగా నియమించడంతో పార్టీలో విభేదాలు నెలకొన్నాయి. వేరే సామాజికవర్గానికి చెందిన నాగేంద్రబాబుకు బీసీ సంఘాల అజమాయిషీ అప్పగించడం, అతను దాన్ని ఆసరాగా చేసుకుని అందరిపై పెత్తనం చేస్తుండటంతో కొందరు నేతలు కినుక వహించారు.

ఐటీడీపీ కార్యకర్తపై కేసు

బొమ్మలసత్రం (నంద్యాల): స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు రిమాండ్ విధించిన న్యాయమూర్తి హిమబిందుపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన ఖాజా హుస్సేన్‌పై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రబాబుకు రిమాండ్ తర్వాత జడ్జి హిమబిందును కించపరుస్తూ కొందరు టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారు. ఐటీడీపీ కార్యకర్త ఖాజా హుస్సేన్ జడ్జి హిమబిందును కించపరిచేలా స్పందించారు. ఈ క్రమంలో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

చంద్రబాబుకు నో రిలీఫ్..!

▶ మొదటి పేజీ తరువాయి

జస్టిస్ సంజీవ్‌ఖన్నా పేర్కొన్నారు. దీంతో జస్టిస్ భట్టి నిర్ణయంపై తామేమీ చేయలేమని, కేసును త్వరగా జాబితా చేయాలని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోరారు. వచ్చే వారం జాబితా చేస్తామని జస్టిస్ సంజీవ్‌ఖన్నా పేర్కొనడంతో, జస్టిస్ భట్టి విచారణ నుంచి వైదొలిగిన అంశాన్ని సీజేఐ ముందు ప్రస్తావించేందుకు చంద్రబాబు తరఫు మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అనుమతి కోరారు. ఇందుకు అనుమతించిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా కేసును పాస్ ఓవర్ చేయాలా? అని న్యాయవాదుల్ని ప్రశ్నించారు. పాస్ ఓవర్‌తో ఉపయోగం ఉండదని, సోమవారం జాబితా చేయాలని హరీశ్ సాల్వే అభ్యర్థించారు. అది సాధ్యం కాదని, వచ్చే వారం జాబితా చేస్తామని, ప్రాసెస్‌కు కొంత సమయం పడుతుందని జస్టిస్ ఖన్నా స్పష్టం చేశారు. జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి లేని ధర్మాసనంలో అక్టోబరు 3న ప్రారంభమయ్యే వారంలో కేసును జాబితా చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

దర్యాప్తు కొనసాగేలా చూడాలి: రంజిత్‌కుమార్

సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ స్పందిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.కోట్లలో కుంభకోణం జరిగిందని సీజేఐ దృష్టికి తెచ్చారు. రూ.3,330 కోట్ల ప్రాజెక్టులో ప్రభుత్వం పది శాతం మాత్రమే వెచ్చిస్తుందంటూ నిధులు విడుదల చేశారన్నారు. ప్రైవేట్ సంస్థ 90 శాతం నిధులను ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా పది శాతం నిధులు చేతులు మారిపోయాయన్నారు. సొమ్ములు స్వాహా అయినట్లు జీఎస్టీ అధికారులు కూడా గుర్తించారన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ కేసు నమోదు చేయడంతో గత ప్రభుత్వం ఫైళ్లు మాయం చేసిందన్నారు. ముందస్తుగా గవర్నర్ అనుమతి తీసుకోవాలని పిటిషనర్ వాదించడం సరి కాదన్నారు. ఆ చట్ట సవరణ కన్నా ముందుగానే ఈ కుంభకోణం జరిగిందన్నారు. దర్యాప్తు కొనసాగేలా చూడాలని అభ్యర్థించారు.

అలాంటి ఆదేశాలు ఇవ్వలేం.. ట్రయల్ కోర్టు జడ్జిని నియంత్రించలేం: సీజేఐ

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నిరాకరించారని, దీనిపై వెంటనే విచారణ జరిగేలా చూడాలని అనంతరం సీజేఐ ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యర్థించారు. అయితే ఈ అంశంలో లోతైన విచారణ చేయాల్సిన అవసరం ఉందని, వెంటనే విచారణ వద్దని సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ విన్నవించారు. ఈ దశలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ జోక్యం చేసుకుంటూ.. 'అసలు మీకేం కావాలి? సెక్షన్ 17ఏతో బెయిలు కావాలని కోరుతున్నారా?' అని ప్రశ్నించడంతో చంద్రబాబు ఎస్సెల్పీపై విచారణ జరపాలని లూథ్రా కోరారు. అయితే బెయిలు కావాలని దరఖాస్తు చేసుకోవచ్చుగా? అని సీజేఐ సూచించారు. దీనిపై లూథ్రా స్పందిస్తూ ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారని, 17 ఏ సెక్షన్ ప్రకారం గవర్నర్ అనుమతి కూడా తీసుకోలేదని చెప్పారు. దీంతో అక్టోబరు 3న విచారణ జాబితాలో చేర్చుతామని సీజేఐ తెలిపారు. సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు విచారిస్తోందని, చంద్రబాబును వారి కస్టడీకి ఇవ్వకుండా ఆదేశాలు ఇవ్వాలని లూథ్రా కోరారు. ఇప్పటికే పోలీసు కస్టడీ పూర్తయిందని, మరో 15 రోజులు పోలీసు కస్టడీ కోరుతున్నారని ఎన్నికల నేపథ్యంలో పదే పదే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని లూథ్రా ఆరోపించారు. తొలుత జ్యుడీషియల్ కస్టడీ తర్వాత పోలీసు కస్టడీకి ఇచ్చారన్నారు. ఈ క్రమంలో లూథ్రా పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ, ఈ దశలో అలాంటి ఆదేశాలను ఇవ్వలేమని, ట్రయల్ కోర్టు జడ్జిని నియంత్రించలేమని, అక్టోబరు 3నే విచారణ జాబితాలో చేర్చుతామని సీజేఐ తేల్చి చెప్పారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో నారా లోకేశ్ పిటిషన్

సాక్షి, అమరావతి: అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు ముసుగులో సాగించిన భూ దోపిడీపై సీఐడీ నమోదు చేసిన కేసులో 14వ నిందితుడు, అప్పటి సీఎం చంద్రబాబు కుమారుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ముందస్తు బెయిల్ కోరుతూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రధాన ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని లోకేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఐడీని ఆయుధంగా వాడుకుంటూ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకుంటోందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో తన పాత్ర లేకపోయినా సీఐడీ ఏదో రకంగా తనను నిందితునిగా చూపేందుకు ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే ఏసీబీ కోర్టులో తనను నిందితునిగా పేర్కొంటూ మెమో దాఖలు చేసిందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఏపీ దివ్యాంగుల క్రికెట్ జట్టుకు మంచి భవిష్యత్

శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్



క్రీడాకారులతో ఐటీ వింగ్ నేతలు

సాక్షి, అమరావతి: వివిధ టోర్నీలలో మంచి ప్రతిభ కనపరుస్తున్న ఏపీ దివ్యాంగుల క్రికెట్ టీం ఇప్పుడు జాతీయ స్థాయిలో మెరవనుంది. నేటి నుంచి ఉదయపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి దివ్యాంగుల టి–20 క్రికెట్ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనపరిచి విజేతగా నిలవాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటి వింగ్ ప్రెసిడెంట్ సునీల్ పోసింరెడ్డి, స్టేట్ కో ఆర్డినేటర్ వేములకొండ తిరుపతిరావులు బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో ఏపీ దివ్యాంగుల క్రికెట్ టీంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం జగన్ నింపిన స్ఫూర్తితో టోర్నీ విజేతగా నిలవాలని ఆకాంక్షిస్తూ వారికి ఆర్థిక సాయం అందించారు. సీఎం జగన్ ఆశీస్సులు వారికి ఎప్పుడూ వుంటాయని తెలియజేశారు.

'రింగ్' అంతా లోకేశ్‌దే



- అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో లోకేశ్ కుట్ర సుస్పష్టం
- న్యాయస్థానంలో దాఖలు చేసిన మెమోలో సిట్ వెల్లడి
- లోకేశ్ పాత్రను స్పష్టం చేస్తున్న 129 ఆధారాలు
- ఈ ఆధారాలను జప్తు చేసిన సిట్ అధికారులు

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్ ఖరారు పేరిట జరిగిన భూ దోపిడీలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుమారుడు లోకేశ్ కీలక పాత్ర పోషించినట్లు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వెల్లడించింది. ఈమేరకు ఈ కేసులో లోకేశ్‌ను ఏ–14గా చేర్చినట్లు న్యాయస్థానానికి సమర్పించిన మెమోలో పేర్కొంది. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ పేరిట చంద్రబాబు, లోకేశ్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని, తద్వారా తమ కుటుంబానికే చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌కు, లింగమనేని కుటుంబానికి చెందిన భూముల విలువ అమాంతం పెరిగేలా అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించింది.

129 ఆధారాలతో దొరికిన లోకేశ్

ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పుల ద్వారా భారీ అక్రమాలకు పాల్పడిన కేసులో సిట్ అధికారులు లోకేశ్ పాత్రకు సంబంధించి కీలకమైన 129 ఆధారాలను గుర్తించి, జప్తు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వాటిలో సీఆర్‌డీఏ, మున్సిపల్, రెవెన్యూ శాఖలకు చెందిన కీలక పత్రాలు, ఈమెయిల్ సందేశాలు, మ్యాపులతోపాటు మరి కొన్ని కీలక ఆధారాలు ఉన్నాయి. అంతేకాదు.. టీడీపీ ప్రభుత్వంలో పని చేసిన అధికారులు, ప్రైవేటు ఏజెన్సీల ప్రతినిధుల వాంగ్మూలాలను కూడా సిట్ అధికారులు నమోదు చేశారు. వారిలో కొందరు కీలక అధికారులు సంబంధిత నోట్ ఫైళ్లలో తాము లిఖితపూర్వకంగా తెలిపిన అభ్యంతరాలను బేఖాతరు చేసి మరీ ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారని పేర్కొనడం గమనార్హం. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో కీలక పాత్ర పోషించిన ప్రైవేటు ఏజెన్సీలు కూడా ఇదే విషయాన్ని తెలిపాయి. నిబంధనలకు విరుద్ధంగానే ఐఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌ను నిర్ధారించారని సిట్ అధికారులకు ఈమెయిళ్లు పంపాయి. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ కోసం నిర్వహించిన సర్వే నివేదికను కూడా సిట్ అధికారులు జప్తు చేశారు. వీటన్నింటిలో లోకేశ్‌దే కీలక పాత్ర అని సిట్ సేకరించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

లింగమనేనితో క్విడ్ ప్రోకో.. హెరిటేజ్‌కు భూములు

టీడీపీ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న చంద్రబాబు అధికారిక నివాసంలోనే లోకేశ్ కూడా నివసించారు. రాజధాని ఎక్కడ నిర్మిస్తారన్నది ముందుగానే తెలియడంతో తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి మండలాల్లో ముందుగానే భూముల కొనుగోలు పేరిట దక్కించుకున్నారు. ఇక లింగమనేని రమేశ్ కుటుంబంతో క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారు. అందులో భాగంగా అమరావతిలో భూములు పొందారు. 2014 జులై 1న 7.21 ఎకరాలను కొనుగోలు చేస్తూ హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం 2014 జులై 7న ఆ భూములు రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం లింగమనేని రమేశ్ కుటుంబ సభ్యుల నుంచి 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట దక్కించుకున్నారు. ఆ విషయం బయటకు పొక్కడంతో ఆ 4.55 ఎకరాలకు సేల్ అగ్రిమెంట్‌ను రద్దు చేసుకున్నారు. అనంతరం అధికారులపై ఒత్తిడి తెచ్చి లింగమనేని, హెరిటేజ్ ఫుడ్స్ భూములకు దూరంగా వెళుతున్న ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్పించారు. లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్ భూములను ఆనుకొని ఐఆర్ఆర్ వెళ్లేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దాంతోపాటు చంద్రబాబు బినామీల పేరిట భారీగా కొల్లగొట్టిన భూములు, ఆయన ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నారాయణ కుటుంబ సభ్యులు, బినామీల పేరిట కొల్లగొట్టిన 148 ఎకరాల విలువ అమాంతంగా పెరిగేలా కుట్రకు పాల్పడ్డారు. క్విడ్‌ప్రోకో కింద లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. ఈ వివరాలన్నింటినీ పేర్కొంటూ సిట్ అధికారులు సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి పూర్తి ఆధారాలతో న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు. దాంతో ఈ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హెరిటేజ్ అంటేనే నారా కుటుంబం

హెరిటేజ్ ఫుడ్స్ అంటే నారా చంద్రబాబు కుటుంబం.. చంద్రబాబు కుటుంబం అంటే హెరిటేజ్ ఫుడ్స్ అనేది బహిరంగ రహస్యం. అందుకే చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు అనేక ప్రయోజనాలు కలిగించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్‌కు అడ్డగోలుగా కలిగించిన ప్రయోజనం పెద్ద కుంభకోణమే. అందుకే ఈ కేసులో హెరిటేజ్ ఫుడ్స్‌ను ఏ–6గా సీఐడీ పేర్కొంది. ఈ కేసులో ఏ–1 చంద్రబాబు సతీమణి అయిన నారా భువనేశ్వరి హెరిటేజ్ ఫుడ్స్‌కు వైస్ చైర్‌పర్సన్, ఎండీగా ఉండగా, ఏ–14గా ఉన్న లోకేశ్ భార్య బ్రాహ్మణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఉన్నారు. వారి ద్వారా హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ వ్యవహారాలను పూర్తిగా చంద్రబాబు, లోకేశే నిర్వహిస్తున్నారు. 56 శాతానికిపైగా షేర్లు ఉండటంతో ఆ సంస్థ డైరెక్టర్ల బోర్డు అంతా ఆ కుటుంబం ఆధిపత్యంలోనే ఉంది. 23,66,400 షేర్లతో 10.20 శాతం వాటా లోకేశ్ పేరునే ఉంది. ఇక హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి 53,30,826 షేర్లతో 22.98 శాతం వాటా కలిగి ఉన్నారు. లోకేశ్ భార్య బ్రాహ్మణి పేరిట 1,01,00 షేర్లు, నందమూరి బాలకృష్ణ పేరిట 6,820 షేర్లు ఉన్నాయి. వారి సమీప బంధువులు వి.గంగరాజు నాయుడుకు 0.25 శాతం, ఆయన భార్య వి.సుధా శారదకు 5.28 శాతం, మెగాడిడ్ కంపెనీకి 5.28 శాతం, నిర్వాణ హోల్డింగ్స్‌కు 11.09 శాతం వాటా ఉన్నాయి. సంస్థ డైరెక్టర్ల బోర్డులో సభ్యులుగా ఉన్న నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, తుమ్మల వెంకటేశ్వరరావు మెగాడిడ్, నిర్వాణ హోల్డింగ్స్‌లోనూ డైరెక్టర్లుగా ఉండటం గమనార్హం. ఇలా హెరిటేజ్ ఫుడ్స్ మొత్తం చంద్రబాబు కుటుంబం చేతిలోనే ఉంది.



“ రుజువు లేకుండా స్థిరపరిచినదాన్ని, రుజువు లేకుండానే నిరాకరించవచ్చు.

– యూక్లిడ్

సాక్షి

గురువారం, 28 సెప్టెంబర్ 2023

పటిష్ఠతే పరమావధి!

అనుమానం పెనుభూతం! ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ గుర్తింపు కార్యక్రమమైన మన 'ఆధార్' విశ్వసనీయతపై ఏళ్ళు గడిచినా ఇప్పటికీ ఏవో అనుమానాలు వస్తూనే ఉన్నాయి. భారత సర్కార్ ఎప్పటికప్పుడు ఆ అనుమానాల్నీ, ఆరోపణల్నీ కొట్టిపారేస్తున్నా అవి మాత్రం ఆగడం లేదు. ప్రపంచశ్రేణి రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తన తాజా నివేదికలో ఆధార్ భద్రత, వ్యక్తిగత గోప్యతలపై లేవనెత్తిన ప్రశ్నలతో ఈ అంశం మరోసారి తెర మీదకు వచ్చింది. ఎలాంటి సాక్ష్యాధారాలూ పేర్కొనకుండా, అర్థం లేని ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటూ ప్రభుత్వం సహజంగానే ఈ నివేదికను కొట్టిపారేసింది. అయితే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద శ్రామికులకు జరిపే చెల్లింపులు సహా సమస్తం ఇకపై ఆధార్‌తోనే జరపాలని ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తున్న వేళ మూడీస్ నివేదికలోని మాటలు కొంత ఆందోళన రేపుతున్నాయి. సత్వరమే ఆ అనుమానాల్ని నివృత్తి చేసి, ఆధార్ సందేహాతీతమైనదని మరోసారి చాటాల్సిన అవసరం ఏర్పడింది.

న్యూయార్క్ కేంద్రంగా నడిచే రేటింగ్ ఏజెన్సీ మూడీస్ గురువారం విడుదల చేసిన పరిశోధనా నివేదిక ఆ మధ్య కొత్తగా రంగప్రవేశం చేసిన 'వరల్డ్ కాయిన్'తో మన ఆధార్‌ను పోల్చింది. విస్తృత పరిమాణం, సృజనాత్మక ఆలోచన రీత్యా రెండూ ప్రత్యేకంగా నిలిచాయని ప్రశంసించింది. అయితే, భద్రత, గోప్యతలే అసలు సమస్యలంటూ కొన్ని ప్రాథమికమైన ప్రశ్నలు వేసింది. ఉష్ణోగ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండే చోట ఆధార్ లాంటి బయోమెట్రిక్ సాంకేతిక పరిజ్ఞానం ఏ మేరకు సమర్థంగా పనిచేస్తుందన్నది సదరు నివేదిక అనుమానం. ఆధార్ ధ్రువీకరణలో ఇబ్బందుల వల్ల పలుమార్లు సేవలు అందడం లేదనేది దాని వాదన. అన్నిటి కన్నా ముఖ్యంగా, ఆధార్ వ్యవస్థ సురక్షితమేనా, అందులోని వ్యక్తిగత సమాచారం గోప్యమేనా అన్నది మూడీ సంధిస్తున్న ప్రశ్న.

దేశంలో 120 కోట్లమందికి పైగా బయోమెట్రిక్, జనసంఖ్యా సంబంధ వివరాలను ఈ ఆధార్ బృహత్ యజ్ఞంలో నమోదు చేశారు. ఎవరికి వారికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించారు. వేలిముద్రలు, కనుపాపల స్కానింగ్, వన్‌టైమ్ పాస్‌వర్డ్ లాంటి పద్ధతుల్లో వ్యక్తులు తమ గుర్తింపును నిర్ధారించి, ప్రభుత్వ, ప్రైవేట్ సేవలను అందుకొనే వీలు కల్పించారు. మొదట కొంత తటపటాయింపు ఉన్నా, క్రమంగా ఆధార్ నమోదు, దాని వినియోగం విస్తరించింది. బలహీనవర్గాలకు అందించే ప్రభుత్వ సహాయాలకే కాదు... చివరకు బ్యాంకు ఖాతాల ఆరంభం, మొబైల్ కనెక్షన్, పన్నుల చెల్లింపు సహా అనేక రోజువారీ పనులకు సైతం ఆ నంబర్ తప్పనిసరైంది. దళారుల బాధ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల సాయం అందేలా ఆధార్ బాట వేసింది.

ఆధార్ వ్యవహారాలన్నీ చూసే కేంద్ర సంస్థగా 'భారత యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ' (యూఐడీఏఐ) వ్యవహరిస్తోంది. చిత్రం ఏమిటంటే, సదరు సంస్థకు నాలుగేళ్ళుగా నాథుడు లేడు. ఎట్టకేలకు గత నెలలో ప్రభుత్వం ఓ తాత్కాలిక ఛీఫ్‌ను నియమించింది. ఇలాంటి చర్యలు ఆధార్ నిర్వహణ పట్ల పాలకుల చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అలాగే, ఈ సంస్థపై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా' (కాగ్) నిరుడు విడుదల చేసిన నివేదిక సైతం ఆధార్ నమోదు ప్రక్రియలో లోపాలు, తప్పుడు బయోమెట్రిక్ లాంటి అనేక అంశాలను ఎత్తిచూపడం గమనార్హం. ఆధార్‌లో నమోదైన సమాచారపు భద్రత, వ్యక్తిగత గోప్యత గాలికి పోయే ప్రమాదాన్ని హెచ్చరించింది. ఇవాళ్టి మూడీస్ నివేదిక కన్నా చాలా ముందే మన 'కాగ్' వ్యక్తం చేసిన ఈ భయాలపై ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నదీ సమాచారం లేదు.

కేంద్రంలో గడచిన 'ఐక్య ప్రగతిశీల కూటమి' (యూపీఏ) ప్రభుత్వ హయాంలో ఆరంభమైనప్పటి నుంచి ఆధార్‌పై భిన్న వాదనలు వస్తూనే ఉన్నాయి. ఆధార్‌కు అనేక సానుకూలతలు ఉన్నప్పటికీ ఈ ప్రక్రియ, వినియోగం నిర్దుష్టమైనదేమీ కాదని సర్కార్ నుంచి సామాన్యుల దాకా అందరికీ తెలుసు. ఇవాళ్టికీ గ్రామీణ భారతావనిలో డిజిటల్ గుర్తింపు చూపలేనివారికి రేషన్ అందట్లేదనీ, కొన్ని ఆకలి చావులకు అదీ ఒక కారణమనీ వార్తలొచ్చాయి. ఆధార్ లోపానికీ, ఆ చావులకూ కారణం లేదన్న ఖండనలూ విన్నాం. అయితే, అతిగా టెక్నాలజీపై ఆధారపడి, సాయం పొందాల్సినవారిని తృణీకరించడం, అసలు లక్ష్యాన్ని విస్మరించడం అమానవీయతే! రోజూ పనిపాటలతో శ్రమించే వారి చేతిరేఖలు చెరిగిపోతే అది వారి పాపమా? కంటిపాపల స్కానింగ్, వన్‌టైమ్ పాస్‌వర్డ్ లాంటివి కూడా ఉన్నా నెట్ సౌకర్యం లేని సుదూర గ్రామీణ ప్రాంతాల్లో వాటి మీద పూర్తిగా ఆధారపడలేం.

అలాగే, అంచెలంచెల సైబర్ భద్రత ఉందని సర్కారు చెబుతున్నప్పటికీ, అనేక సందర్భాల్లో ఆధార్ సమాచారం గంపగుత్తగా లీకవడం చూశాం. ఈ సమాచార నిధి సైబర్ దొంగల చేతిలో పడితే పర్యవసానాలూ తీవ్రమే! అందుకే, లోపాలను ప్రస్తావించినవారిని నిందించే కన్నా, వాటిని సరిదిద్దడంపై దృష్టి పెట్టడం తక్షణ కర్తవ్యం. ముఖ్యంగా ప్రస్తుతం నడుస్తున్న కేంద్రీకృత విధానం బదులు సమాచార గోప్యత, రక్షణ కోసం మూడీస్ సూచించినట్లుగా ఆధార్‌కు వికేంద్రీకరణ విధానాన్ని అవలంబించడం మంచిదేమో చూడాలి. తద్వారా ఒక అంచెలో ఉల్లంఘన జరిగినప్పటికీ, అక్కడితో నష్టనివారణ చేయగలమని గుర్తించాలి. ఇటీవల జీ–20లోనూ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)లో అద్భుతమంటూ మనం చెప్పుకున్న ఆధార్ వ్యవస్థపై సమగ్ర సమీక్ష జరపాలి. పూర్తి లోపరహితంగా మార్చే పని మొదలుపెట్టాలి. ఓటర్ల జాబితా సహా సమస్తానికీ ఆధారంగా అనుసంధానించాలని అనుకుంటున్న వేళ అది మరింత అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** శు.చతుర్దశి సా.6.26 వరకు, తదుపరి పౌర్ణమి,
నక్షత్రం: పూర్వాభాద్ర రా.2.49 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర,
వర్జ్యం: ఉ.10.24 నుండి 11.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.41 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.26 వరకు,
అమృత ఘడియలు: రా.7.21 నుండి 8.51 వరకు, అనంతపద్మనాభ వ్రతం.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం : 5.51
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఆచితూచి వ్యవహరించాల్సిందే!

విశ్లేషణ



శ్యామ్ శరణ్

కెనడాలోని ఒక సిక్కు నాయకుడి హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలు ఇరుదేశాల సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయి. రాజకీయంగా తన ప్రాచుర్యం క్రమేపీ తగ్గిపోతున్న నేపథ్యంలో, ఖలిస్తాన్ అనుకూలురు ఉన్న 'ఎన్‌డీపీ' తన సంకీర్ణంలో కొనసాగేందుకు ట్రూడో ఈ పని చేసుండాలి. 2018 నాటి భారత పర్యటనలో తనను పట్టించుకోలేదన్న ట్రూడో అసంతృప్తి కూడా మరో కారణం కావొచ్చు. ఏమైనా ఈ వ్యవహార ప్రభావం అమెరికా, ఇతర జీ–7 దేశాల సంబంధాలపై పడకుండా చూసుకోవాలి. ముఖ్యంగా, ఖలిస్తాన్‌కు మద్దతునివ్వని ప్రపంచవ్యాప్త సిక్కుల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలి.

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఈమధ్య పెద్ద దుమారమే లేపారు. ఈ ఏడాది జూన్ 18న కెనడాలోని గురుద్వారా వెలుపల జరిగిన కెనడా సిక్కు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందనేందుకు తమ వద్ద విశ్వసనీయమైన సమాచారం ఉందన్న ట్రూడో ప్రకటన ఇరు దేశాల మధ్య వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. అయితే హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను భారత ప్రభుత్వం చాలా కాలం క్రితమే ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలకు నగదు బహుమతి కూడా ప్రకటించింది. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉండి ఉంటే అది అసాధారణమైన విషయమే అవుతుంది. కాకపోతే పరిస్థితులను గమనించినప్పుడు నిజ్జర్ హత్య పక్కా గ్యాంగ్ వార్‌ను పోలుతుంది. నిజ్జర్ పూర్వాపరాలను గమనించినా హత్యకు గ్యాంగ్ వారే కారణమని అనిపించడం ఖాయం. సత్యం ఏమైనప్పటికీ ట్రూడో ఆరోపణల పుణ్యమా అని ఇప్పుడు భారత్ పరువుకు కొంత భంగం కలిగింది. అది కూడా జీ–20 సమావేశాలను అధ్యక్ష స్థానంలో ఉంటూ విజయవంతంగా పూర్తి చేసిన వెంటనే ఈ ఘటన చోటు చేసుకోవడం మరింత ఇబ్బందికరమైంది. కామన్ వెల్త్ దేశమైన, భారతీయ సంతతివారు ఎక్కువ సంఖ్యలో ఉన్న, ఇండో–పసిఫిక్ వ్యూహంలో కీలకమైన కెనడాతో భారత్ సంబంధాలిప్పుడు అట్టడుగు స్థాయికి చేరాయి.

అయితే ఈ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ కింది అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది:

చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టాలంటే భారత్ సాయం కచ్చితంగా అవసరమని అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, పశ్చిమ యూరప్, జపాన్ భావిస్తున్నాయి. ఈ భాగస్వామ్యానికి కొన్ని పరిమితులు లేకపోలేదు. అదే సమయంలో నాటో, జీ–7 దేశాల సభ్య దేశాలతో వ్యవహరించే సందర్భంలో వ్యవహారం మారిపోయేందుకు అవకాశాలెక్కువ. అమెరికా జాతీయ భద్రత సలహాదారు జేక్ సుల్లివాన్ చేసిన ప్రకటనతో ఈ విషయం స్పష్టమవుతుంది: ''ఇలాంటి చర్యలకు పాల్పడినప్పుడు ప్రత్యేకమైన మినహాయింపులు ఎవరికీ ఉండవు. దేశం ఏదైనా సరే, మా ప్రాథమిక నైతిక సిద్ధాంతాల రక్షణ కోసం నిలబడతాం. అలాగే దగ్గరి భాగస్వామి అయిన కెనడా లాంటి దేశాలతో సంప్రదింపులు జరిపి చట్టాన్ని పరిరక్షించేందుకు వారు చేసే ప్రయత్నాల్లోనూ, దౌత్యపరమైన ప్రక్రియల్లోనూ సహకరించుకుంటాం'' అన్నారు ఆయన.

తిరస్కరించిన భారత్

కెనడాలో ఓ సిక్కు నేత హత్య వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందన్న విషయాన్ని భారత్ నిర్ద్వంద్వంగా ఖండించింది. అర్థం లేని, దురుద్దేశపూరిత ఆరోపణలుగా కొట్టి పారేసింది. అయితే ఇంతటితో కథ ముగిసిపోయిందని అనుకునేందుకు వీల్లేదు. వట్టి తిరస్కారాలతోనో, ఉగ్రవాదంపై చర్యల విషయంలో ట్రూడో నిర్లక్ష్య వైఖరిని తప్పుపట్టడంతోనో సమస్య సమసిపోదు. కెనడాలోని కొంతమంది సిక్కులు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనడం వెనుక చాలా చరిత్రే ఉంది. అయితే ప్రస్తుతం నిజ్జర్ లాంటివాళ్లు చేస్తున్న క్రిమినల్ కార్యకలాపాలపై భారత్ ఎక్కువగా దృష్టి పెట్టాలి. నిజ్జర్ రాజకీయాలు, ఉగ్రవాద, హింసాత్మక కార్యక్రమాల్లో ఆయన ప్రమేయం వంటివి ఎత్తి చూపడం ఆయన హత్యను సమర్థించినట్లు కనిపించవచ్చు. మరీ ముఖ్యంగా మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వర్గాల్లో ఈ రకమైన ఆలోచన బలపడవచ్చు. కానీ నిజ్జర్ కార్యకలాపాలపై ఉన్న సమాచారం మొత్తాన్ని భారతీయ నిఘా సంస్థలు కెనడా, ఇతర పాశ్చాత్య దేశాలతో పంచుకోవడం మేలు.



ట్రూడో ఆరోపణలను గట్టిగా తిరస్కరించడం ద్వారా భారత్ సరైన పనే చేసింది. భారతీయ దౌత్యవేత్తను కెనడా తిప్పి పంపడంతో భారత్ కూడా అదే పని చేయడమూ తగిన ప్రతిచర్యే. కానీ, పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండటం ఇరు దేశాలతోపాటు భారత్‌తో మరింత ఎక్కువ సంబంధాలు కోరుకుంటున్న పాశ్చాత్య మిత్రులకూ అత్యవసరం. కెనడాతో మనకున్న సంబంధాలు కాస్తా అమెరికా, ఇతర పాశ్చాత్యదేశాల మైత్రిపై ప్రభావం చూపరాదు. అదే జరిగితే ఈ అంశాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకునేందుకు చైనా, పాకిస్తాన్ కాచుకు కూర్చున్నాయన్న విషయం మరవరాదు.

కెనడా రాజకీయాలూ చూడాలి...

ప్రస్తుత దౌత్య సమస్యకు కెనడాలోని స్థానిక రాజకీయ పరిస్థితులూ కారణం కావచ్చు. ట్రూడో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం కోసం ఉగ్రవాదులను సమర్థిస్తున్నారన్న నెపంపై కెనడాలోని కొంత మంది సిక్కులపై విమర్శలు చేయడం కూడా తగదు. దీనివల్ల కెనడాలోని మెజారిటీ సిక్కులు, ఇతర దేశాల వారు, మరీ ముఖ్యంగా భారతీయ సిక్కులను దూరం పెట్టినట్టుగా ఉండకూడదు. ఖలిస్తాన్ డిమాండ్‌కు వీరందరూ దూరమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఖలిస్తాన్ భయాన్ని ఎత్తిచూపాలన్న ఉబలాటం ఉండొచ్చు, కానీ ఇది ఉద్దేశించని నష్టం కలిగించే ప్రమాదం ఉంది.

భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ట్రూడో విమర్శలకు దిగడం వెనుక ఆయనకున్న వ్యక్తిగత ఆసక్తి ఏమిటన్నది తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కెనడా రాజకీయాల్లో విదేశాల ప్రమేయంపై ఇప్పటికే విచారణ సాగుతోంది. దేశంలో చైనా కార్యకలాపాలపై చెక్ పెట్టలేకపోయారన్న అంశం ట్రూడోకు ఇబ్బంది కలిగించవచ్చు. కాబట్టి, ఈ అంశం దాన్ని పక్కదోవ పట్టించగలదు. ట్రూడో ప్రభుత్వం మనుగడ కోసం సిక్కు రాజకీయ పార్టీ, ఖలిస్థాన్ ఉద్యమ అనుకూలురు ఎక్కువగా ఉన్న న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) మద్దతు అవసరం. ఇందుకోసమే ట్రూడో భారత్‌పై ఈ రకమైన విమర్శలకు దిగి ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు.

సిక్కుల మనోభావాలు దెబ్బతినకుండా...

2018లో భారత పర్యటన సందర్భంగా తనను అంతగా పట్టించుకోలేదని ట్రూడో భావించడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఒక కారణం కావచ్చు. 'అన్ని పర్యటనలను అంతం చేసే పర్యటన' అని ట్రూడో అప్పట్లోనే ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వ్యక్తిగతమైన భారత వ్యతిరేక భావన ఇప్పుడు ఇలా అనాలోచిత తప్పుడు ఆరోపణలకు దారితీసి ఉండవచ్చు. వ్యక్తిగా ట్రూడోతో ఉన్న సంబంధాలు ఇరు దేశాల మధ్య సంబంధాలను నిర్ణయించే పరిస్థితి ఉండరాదు. రాజకీయంగా, వ్యూహాత్మకంగా, ఆర్థిక అంశాల పరంగానూ ఇరు దేశాల మధ్య సఖ్యత ఎంతో అవసరం.

భారత్ – కెనడా సంబంధాల ప్రభావం అమెరికా, ఇతర జీ–7 దేశాలతో మనకున్న సంబంధాలపై కూడా ఉండవచ్చు. ట్రూడోతో మన గొడవ కాస్తా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కుల మనోభావాలను దెబ్బతీయకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం కూడా ఉంది. పంజాబ్‌లో ఇప్పటికే ఈ అంశంపై అసంతృప్తి రగులుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ట్రూడో ప్రభుత్వంపై భారత్‌కు ఉన్న అసంతృప్తిని వెళ్లగక్కేందుకు సిక్కు కుటుంబాలు తమ స్వస్థలాలకు రావడాన్ని అడ్డుకోవడం మార్గం కాదు. ఏమైనా, ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారకుండా ఉండాలని ఆశిద్దాం.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ధ్యాంక్యూ



హ్యాపీ ట్వంటీ ఫిఫ్త్ బర్త్ డే... గూగుల్! ఎప్పటికప్పుడు కొత్త మార్పులు చేసేలా మాకు సవాలు విసిరే మా ఉత్పత్తుల వినియోగదారులందరికీ, 'గూగులర్స్' అందరికీ ధన్యవాదాలు.

– సుందర్ పిచాయ్, గూగుల్ సీఈఓ

ఇదా మర్యాద?



భారత జెండాను (కెనడాలో) అవమానించినవాళ్లు సిక్కులు కాలేరు. వాళ్ల జెండా అటుండనీ, ఒక నిజమైన సిక్కు మరే జెండా పట్ల కూడా అవమానంగా ప్రవర్తించలేడు, ఆఖరికి అది తన శత్రువు జెండా అయినా!

– ఆర్.ఎస్. రాజేందర్, వ్యాఖ్యాత

కేరళ కోసం



మన గొప్ప కీర్తి ఎప్పుడూ పడిపోకుండా ఉండటంలో లేదు, పడిన ప్రతిసారీ లేవడంలో ఉంది. 2018లో అనూహ్య వరదల వల్ల కేరళ పడింది. కానీ కేరళీయులు ఏమిటో ప్రపంచం చూసింది. నన్ను ఆసియా ఉత్తమ నటుడిగా ఎంపిక చేసినందుకు సెప్టిమస్ అవార్డ్స్‌కు ధన్యవాదాలు. '2018' సినిమాలో నా నటనకు ఇది రావడం ఈ అంతర్జాతీయ గుర్తింపును ప్రత్యేకం చేస్తోంది.

– టొవినో థామస్, మలయాళ నటుడు

రోబో టీ!



గుజరాత్ సైన్స్ సిటీలో భారత ప్రధాని మోదీకి ఒక రోబో ఇవ్వాళ టీ కప్పు అందించింది. రోబోటిక్స్ రంగంలో ఇండియా విశేషమైన ఆసక్తినీ, ప్రగతినీ చూపుతోంది.

– సాద్ హాఫీజ్, సౌదీ జర్నలిస్ట్

కఠిన వాస్తవం



ఇండియాకు సంబంధించి 1980ల నుంచి ఉన్న కొన్ని భద్రతా సమస్యలు... ముఖ్యంగా సిక్కు, తమిళ అతివాదులు, తీవ్రవాదుల ప్రమేయం ఉన్నవి... అట్టావా(కెనడా) ఆ రాడికల్స్‌కు ఆశ్రయం ఇవ్వడం వల్ల మరింత తీవ్రమైనాయి. ఇదే సత్యం. అట్టావా దాన్ని ఎదుర్కోవాలి, పరిష్కరించాలి.

– జాన్ పిండ్లర్, మిలిటరీ హిస్టారియన్

పెళ్లి బట్టలు



వధువుల వస్త్రధారణ గురించి చాలా చర్చ జరుగుతోంది. నేనైతే ఎర్ర కుర్తా, ఆకుపచ్చ పైజామా ధరించాను. నిజానికి అదో ఝోలా అనుకోవచ్చు. ఎందుకంటే సంప్రదాయం ప్రకారం కత్తెర వాడకూడదు (కత్తిరిస్తాం కాబట్టి కత్తెర కలహానికి సంకేతం). చేతులే ఉపయోగించాలి.

– రానా సఫ్వీ, రచయిత్రి

ఎక్కువ కనండి!



జనాభా మితిమీరింది అనడం మిథ్య. న్యూయార్క్ నగరంలోలా సాంద్రతతో ప్రతి ఒక్కరూ నివసిస్తే, ప్రపంచ మొత్తం 8 బిలియన్ల జనాభా ఒక్క టెక్సాస్ నగరంలోనే ఇమిడిపోతుంది. భయాన్నీ, పశ్చాత్తాపాన్నీ, కొరతనూ సాధారణ జనాల్లో వ్యాపించడానికే ఈ మితిమీరిన జనాభా వాదాన్ని తెస్తున్నారు. మరింత మంది పిల్లల్ని కనండి.

– షానన్ మైకేలా, ఆక్రోబాటిక్ ఆర్చర్

ఇన్ బాక్స్

సైబర్ మోసాలతో జాగ్రత్త!

ప్రతిరోజూ ఏదో ఒక చోట సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ క్రైమ్ అంటే కేవలం ఇంటర్నెట్ వేదికగా జరిగే ఆర్థికపరమైన నేరం మాత్రమే కాదు... దేశ భద్రత, వ్యక్తిగత సమాచార దోపిడీ, ఆన్‌లైన్ వేధింపులు వంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇటీవల దుబాయ్, చైనా కేంద్రంగా ఆన్‌లైన్ మోసానికి పాల్పడి రూ. 712 కోట్లు లూటీ చేసిన సైబరాసురులు హైదరాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. 'ఇండియన్ నేషనల్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్' విడుదల చేసిన నివేదికల ప్రకారం 2021లో 1.56 లక్షల కేసులు నమోదవగా, 2022 జూన్ నాటికి ఆ సంఖ్య 2.37 లక్షలకు ఎగబాకింది.

కరోనా కష్టకాలం తర్వాత భారత్ డిజిటల్ లావాదేవీలు దిశగా ముందుకు వెళ్తోంది. దేశంలో ఒక్క 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే 9,192 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. ఈ అవకాశాన్ని వరంగా మార్చుకున్న ఆర్థిక నేరగాళ్లు యూపీఐ, ఓటీపీ మోసాల దిశగా సొమ్మును కాజేస్తున్నారు. అయితే నియంత్రణ చర్యలు మాత్రం కరవవుతున్నాయి. ఇది సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకుని ఉన్న అంశం కావడంతో పోలీసు వ్యవస్థ సైతం కేసులను ఛేదించలేకపోతోంది.

సైబరాసురులకు చెక్ పెట్టాలంటే.. 'పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువ', 'లక్షల రూపాయల విలువచేసే వస్తువులు వేలకే లభిస్తాయి' వంటి మాయమాటలను నమ్మకూడదు. అంతర్జాతీయ నంబర్ల నుంచి ఫోన్లు వచ్చినా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు సమాచారం వంటివి అడిగినా చెప్పకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనుమానాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. వీలున్న ప్రతి చోట రెండు కారకాల ప్రమాణీకరణ (టూ ఫాక్టర్ అథెంటికేషన్)ను క్రియాత్మకం (యాక్టివేట్) చేసుకోవాలి. ముఖ్యంగా ఈ–మెయిల్, బ్యాంకింగ్ వంటి వాటికి ఇది తప్పనిసరిగా ఉండాలి. ఏవైనా లావాదేవీలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోవాలి. అప్పుడే ఈ అదృశ్య నేర శక్తులను అడ్డుకోగలం.

– తాడేపల్లి విజయ్

అసమానతపై అక్షర యుద్ధం

సందర్భం




పి. విజయబాబు

కవిత్వాన్నే ఆయుధంగా చేసుకుని వర్ణ వ్యవస్థ పైన, సంకుచిత భావాల పైన సవ్యసాచిలా అక్షరాస్త్రాలను సంధించిన కవి వీరుడు, విశ్వనరుడు గుర్రం జాషువా. అవమానాలు ఎదురైన చోటే సన్మానాలు అందుకున్నారు. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారు. తెలుగు, సంస్కృత భాషలలో అపార పాండిత్యం సొంతం చేసుకున్న జాషువా ఆదిలో కవిత్రయం బాటలోనే అద్భుత కవిత్వాన్ని వెలయించారు. భావ కవిత్వ రీతులలో లోతులు తెలుసుకున్నారు. కానీ పలుగాకుల వెకిలి మనస్తత్వాన్ని గమనించి, తీవ్రంగా నొచ్చుకొని దాని నుంచి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం కోసమే తను కవిత్వాన్ని రాయవలసిన అవసరం గ్రహించారు.

'జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. ఒకటి పేదరికం, రెండు కుల మత వివక్ష. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కానీ, బానిసగా మాత్రం మార్చలేదు' అని నవ్వుతూ చెప్పేవారు. జాషువాలోని గొప్పతనం ఏమిటంటే తను ఎన్ని అవమానాలకు గురియైనా ఏనాడు దురాగ్రహం ప్రదర్శించలేదు. అక్షరాస్త్రాలతో ధర్మాగ్రహాన్ని ప్రదర్శించి తనకు సాటి వేరెవరూ లేరని నిరూపించుకున్నారు.

సమకాలీన కవిత్వ ఒరవడికి భిన్నంగా సంచలన కవిత్వాన్ని సృష్టించారు.

'**అలయంబున నీవు వ్రేలాడు వేళ/ శివుని చెవి నీకు కొంత చేరువుగ నుండు/మౌని ఖగరాజ్ఞి పూజారి లేని వేళ/విన్న వింపుము నాదు జీవిత చరిత్ర**' అంటూ గబ్బిలంలో తనబోటివారి అవస్థలనే గాక, సమాజ స్థితిగతులనూ సూటిగా చెప్పారు. కాళిదాసు భావనామయ ప్రపంచంలో మేఘముడి కంటే 'గబ్బిలం' కర్తవ్యం ఎంత గొప్పదో చెప్పకనే చెప్పారు. గబ్బిలం జాషువా కవితాశక్తికీ, ఆయన నిలువెత్తు సామాజిక స్పృహకూ అపూర్వ నిదర్శనం.



చిన్నతనం నుంచి జాషువాలో బొమ్మలు గీయటం, పాటలు పాడటంపై ఆసక్తి ఉండేది. ఆయన 36 గ్రంథాలూ, ఎన్నో కవితా ఖండికలనూ రాశారు. 1928 నుండి 1942 వరకు గుంటూరులోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పని చేశారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పని చేశారు. 1957– 59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేశారు. ఆయన ప్రతిభకు ఎన్నో సత్కారాలూ, బిరుదులూ లభించాయి. తిరుపతి వేంకటకవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటకవి ఆయన కాలికి గండపెండేరం తొడిగారు. విజయవాడలో ఏనుగు అంబారీపై ఎక్కించి ఊరేగించారు. 'కవితా విశారద', 'కవి కోకిల', 'కవి దిగ్గజ – నవయుగ కవిచక్రవర్తి', 'మధుర శ్రీనాథ', 'విశ్వకవి సమ్రాట్' వంటి బిరుదులు వరించాయి. పద్మభూషణ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి 'కళా ప్రపూర్ణ' వంటి పురస్కారాలను అందుకున్నారు.

1962 చైనా భారత దేశంపై దాడి చేసిన సమయంలో 'ముసాఫరులు' అన్న కావ్యంలో మాతృ దేశ రక్షణ కోసం చైనాతో పోరాడి అమరుడైన జీవుడు ఊర్ధ్వముఖంగా సూర్యమండలం మీదకి వెడుతూ మార్గమధ్యంలో చంద్రమండలంపై ఆగి సేద తీర్చుకుంటున్నాడంటూ... దేశ భక్తులకు ముక్తి లభిస్తుందంటూ దేశభక్తిని ప్రబోధించారు. జాషువా రచనలపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి వుంది. 1971 జూలై 24న గుంటూరులో జాషువా తనువు చాలించారు.

రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు అన్న జాషువా కవితాక్షరాలకు ఆయనే నిదర్శనం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు
(నేడు మహాకవి గుర్రం జాషువా జయంతి)

జనన మరణాలు

అభిమన్యుని అకాల మరణాన్ని గురించి పరితపిస్తున్న ధర్మరాజు దగ్గరికి ఒక రోజు వ్యాసమహాముని వచ్చి, ఉపశమనంగా మృత్యువుని గురించి వివరిస్తాడు.

మొదట్లో జీవులకు మృత్యువనేది లేదు. దాంతో బ్రహ్మదేవునిచే సృష్టించబడిన ప్రతిదీ అలాగే ఉండిపోవడంతో భూమిపై భారం పెరిగింది. భూమాత బ్రహ్మదేవునికి తన సమస్య విన్నవించింది.. పుట్టినవానిని చంపడ మొక్కటే భూ భారం తగ్గించడానికి మార్గంగా భావిస్తాడు బ్రహ్మ. ఆయన శరీరం నుండి ఒక స్త్రీ ఉద్భవిస్తుంది. ఆమె మృత్యువు. జీవులను మృత్యువు పాల్జేయడం ఆమె పనిగా బ్రహ్మదేవుడు నిర్దేశిస్తాడు. 'ఇదేమి పని నాకు స్వామీ?' అని ఆమె కన్నీరు కార్చగా, ఆ కన్నీటి బిందువులను బ్రహ్మ తన దోసిలిలోకే సేకరించుకుని, ఆమెను సమాధానపరిచే విధంగా, 'అలా చేయడంలో నీవు నా ఆజ్ఞనే నిర్వర్తిస్తున్నందు వలన, అందులో అధర్మము, పాపము అనేవి వుండవు. నీ కన్నీటి చుక్కలన్నీ రోగాలై జననాశనం చేస్తాయి' అని చెప్పడంతో ఆమె అంగీకరించింది. 'అయితే క్రోధ లోభాలు, అసూయలతో దేహాలనూ, అంతరంగాలనూ వికారం చేసి, కలుషితం చేసి అధర్మాన్ని పుట్టించండి. అవే వారి వినాశనానికి కారణం అవుతాయి' అని విన్నవించుకుంటుంది. బ్రహ్మ అంగీకరిస్తాడు. అలా మృత్యువు ప్రాణాలను హరించడం మొదలుపెట్టగా, ప్రాణం శరీరాన్ని విడిచి దైవత్వాన్ని పొందడం, తిరిగి మానవత్వాన్ని చేరుకోవడం ప్రారంభమైంది – అని చెబుతాడు వ్యాసుడు.



తిక్కన ఆంధ్రమహాభారతం, ద్రోణపర్వంలో, 'అకంపనోపాఖ్యానం' పేరుతో ఉన్న కథకు అత్యంత సంక్షిప్త రూపం ఇది. ఈ కథ చెప్పి 'మృత్యువుతో మనుషులు అమరత్వాన్ని పొందుతారు, మళ్ళీ వారే మనుషులుగా జన్మిస్తారు. అందువలన, నీ కుమారుడు అభిమన్యుడు చనిపోయాడని విలపించడం దేనికి? అతని వీరత్వానికి సరిపోయిన సద్గతి సమకూరి ఉంది కదా!' అని అనునయిస్తాడు ధర్మరాజును వ్యాసులవారు. అనంతకోటి జీవరాశిలోని ఏ ఒక్క జీవి అనంత జీవన ప్రయాణంలో ఏ దశలోనూ మరణం కూడా దాని కదే ఒక ముగింపు కాదనీ, మరణాన్ని వగపుకు కారణంగా విధాత తలచలేదనీ, కనుక మరణానికి అతిగా విలపించడం వివేకవంతమైన పని కాదనీ చెప్పడం ఈ ఉపాఖ్యానం ముఖ్యోద్దేశంగా గ్రహించాలి.

– వెంకట్ భట్టు

పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ ద్వారతోరణ ధ్వజకుంభ ఆవాహనం, చక్రాధి మండలపూజ, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ట, పవిత్రప్రతిష్ట చేపట్టారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేశారు. కాగా, గురువారం యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారితో ఆలయ పరివార దేవతలకు పవిత్రాలను సమర్పిస్తారు.

భక్తుల రక్షణకు బహుముఖ వ్యూహం

- అటవీ ప్రాంతంలో జంతువుల సంచారానికి ఆటంకం వద్దు
- వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ రమేష్

తిరుమల: అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో అటవీ జంతువుల నియంత్రణకు, భక్తుల రక్షణకు బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్లాల్సి ఉంటుందని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ కె.రమేష్ అన్నారు. బుధవారం అలిపిరి నుంచి కాలినడక మార్గంలో నరసింహస్వామి ఆలయం వరకు తన బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అటవీ శాఖ, టీటీడీ విజ్ఞాపన మేరకు ఇక్కడకు వచ్చామని తెలిపారు. గతంలో చిరుత దాడిచేసిన ప్రదేశం, చిన్నారి మృతిచెందిన ప్రాంతాలను పరిశీలించామని చెప్పారు. చిరుతలను బంధించిన ప్రదేశాలను తనిఖీ చేశామన్నారు. ఈ దుర్ఘటన చోటుచేసుకోవడానికి కారణాలను విశ్లేషించామన్నారు. గురువారం కూడా ఈ పరిశీలన కొనసాగుతుందని వెల్లడించారు. అటవీ జంతువుల నుంచి భక్తులకు రక్షణ కల్పించేందుకు అటవీ శాఖ, టీటీడీ వైల్డ్ లైఫ్ సంస్థ సంయుక్తంగా బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నడక మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించడంతో పాటు అటవీ మార్గంలో జంతువుల సంచారానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

19 పాములు, పునుగు పిల్లులు పట్టివేత



మైసూరు: మైసూరులోని రాజీవ్ నగరకు చెందిన సందీప్ అనే వ్యక్తి తన ఇంట్లో పాముల్ని పెంచుతుండగా.. అటవీ శాఖ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. సందీప్ పాముల నుంచి విషం సేకరించి విక్రయిస్తున్నాడని అటవీ శాఖ అధికారులకు తెలిసింది. ఈ నేపథ్యంలో అతని కదలికలపై నిఘా పెట్టిన సీఐడీ, అటవీ అధికారులు బుధవారం అతడి ఇంట్లో సోదాలు చేశారు. అక్రమంగా ఉంచిన 19 వివిధ రకాల పాములు, 4 పునుగు పిల్లులు కనిపించాయి. పాముల నుంచి విషం తీసే యంత్రాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై అటవీ చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో 'నిఫ్రూనా స్టీల్స్' నూతన పరిశ్రమ ప్రారంభం

ఏసీ, ఆటోమొబైల్ తయారీ రంగాలకు స్టీల్ ఉపకరణాల ఉత్పత్తి



జపాన్ కాన్సుల్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న ఎండీ రవీంద్ర

సత్యవేడు(తిరుపతి జిల్లా): జపాన్‌లోని టోక్యోకు చెందిన నిప్పాన్ స్టీల్ ట్రేడింగ్ కార్పొరేషన్(ఎన్ఎస్‌టీసీ) అనుబంధ సంస్థ నిఫ్రూనా స్టీల్ సర్వీస్ సెంటర్ ఇండియా(ఎన్ఎస్ఎస్ఐ) తన అత్యాధునిక పరిశ్రమను బుధవారం శ్రీసిటీలో ప్రారంభించింది. ఏసీలు, ఆటోమొబైల్ రంగాలకు అవసరమైన ఉష్ణ నిరోధక స్టీల్ పరికరాలు, కాయిల్స్ ఇందులో ఉత్పత్తి చేస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మసయుకి టాగా, ఎన్ఎస్‌టీసీ ప్రెసిడెంట్ షినిచి నకమురా, డైకిన్ వైస్ మేనేజింగ్ డైరెక్టర్ షోగో ఆండో, జపాన్ విదేశీ వాణిజ్యవిభాగం (జెట్రో) డైరెక్టర్ జనరల్ కొరుషిరైషి, ఎన్ఎస్ఎస్ఐ మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఇటోలను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ సాదరంగా ఆహ్వానించారు. శ్రీసిటీలో పెద్ద ఎత్తున జపాన్ కంపెనీల స్థాపనపై మసయుకి టాగా సంతోషం వ్యక్తం చేశారు. విదేశీ ప్రతినిధులకు ప్రత్యేకించి జపాన్ దేశీయులకు శ్రీసిటీ అత్యంత సురక్షిత ప్రాంతంగా పేర్కొన్నారు. అద్భుత సహకారం అందిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సరఫరా గొలుసును బలోపేతం చేయడం ద్వారా భారత్ మార్కెట్ డిమాండ్‌ను ఎన్ఎస్ఎస్ఐ సమర్థవంతంగా తీరుస్తుందని ఆయన అన్నారు. షినిచి నకమురా మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటు విషయంలో శ్రీసిటీ బృందం సహకారాన్ని ప్రశంసించారు. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేందుకు త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. శ్రీసిటీలోని డీటీజెడ్‌లో 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్ల పెట్టుబడితో తొమ్మిది నెలల వ్యవధిలో ఈ ప్లాంట్ నిర్మాణం జరిగింది.

పర్యాటక రంగానికి ఏపీ స్వర్గధామం



సెర్ప్ సీఈవో ఇంతియాజ్‌తో పురస్కారగ్రహీతలు సాక్షి ఫొటోగ్రాఫర్లు (ఎడమ నుంచి) పి.మనూవిశాల్ (విజయవాడ), పి.విజయకృష్ణ (నెల్లూరు), వి.శ్రీనివాసులు(కర్నూలు), ఎం.ప్రసాద్(ఒంగోలు), వి.రూబెన్ బెసాలియల్ (విజయవాడ), డి.హెస్సేన్(కర్నూలు), రియాజుద్దీన్(ఏలూరు), మహబూబ్ బాషా(అనంతపురం)

సెర్ప్ సీఈవో ఏఎండి ఇంతియాజ్

కృష్ణలంక (విజయవాడ తూర్పు): పర్యాటక రంగానికి ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా మారిందని సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ సౌజన్యంతో బుధవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ.. పర్యాటకుల విహార యాత్రకు రాష్ట్రంలో మనకు తెలియని ఎన్నో ప్రాంతాలు ఉన్నాయని, ఆ ప్రదేశాలు సందర్శించడం ద్వారా రాష్ట్రానికి లాభదాయకమని ఆశాభావం వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ నిపుణుడు అక్కినేని భవానీప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన ఫొటోగ్రాఫర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఫౌండర్, చైర్మన్ టి.శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు జి.నారాయణరావు పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్లకు పురస్కారాలు

రాష్ట్రంలోని 11 మంది సాక్షి ఫొటోగ్రాఫర్లు ప్రతిభ పురస్కారాలు అందుకున్నారు. వారిలో వి.రూబెన్ బెసాలియల్ (విజయవాడ), పి.మనూవిశాల్ (విజయవాడ), డి.హుస్సేన్ (కర్నూలు), వి.శ్రీనివాసులు(కర్నూలు), పీఎల్ మోహన్‌రావు(విశాఖ), ఎండీ నవాజ్ (విశాఖ), ఎం.ప్రసాద్ (ఒంగోలు), పి.విజయకృష్ణ(నెల్లూరు), రియాజ్ (ఏలూరు), కె.మోహనకృష్ణ (తిరుపతి), మెహబూబ్ బాషా (అనంతపురం) ఉన్నారు.

దుర్గమ్మ సేవలో తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి



పళనిస్వామికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్, ఈవో

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి బుధవారం దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని అందజేశారు. పళనిస్వామికి చైర్మన్, ఈవోలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయంలో జరుగుతోన్న దసరా ఉత్సవ ఏర్పాట్లను పళనిస్వామికి అర్చకులు వివరించారు. ఆలయ ప్రాంగణంలో పళనిస్వామిని మాట్లాడించేందుకు మీడియా యత్నించగా ఆయన మాట్లాడేందుకు నిరాకరించారు.

30న విశ్వబ్రాహ్మణుల 'శంఖారావ స్ఫూర్తి దినోత్సవం'



మాట్లాడుతున్న హనుమంతరావు

పటమట(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 30వ తేదీన శంఖారావ స్ఫూర్తి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు తెలిపారు. బుధవారం విజయవాడ పడమటలోని బ్రహ్మంగారి దేవాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రభుత్వం అధికారికంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీల ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు, శ్రీకాళహస్తి బొమ్మలు ఇతర విశ్వకర్మియుల ప్రతిభకు సంబంధించి విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ప్రకాశం పోలీసులకు స్కోచ్ అవార్డు



గుడ్ ట్రయల్ మానిటరింగ్ లో సెమీ ఫైనల్ అవార్డు

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా పోలీసులు జాతీయ స్థాయిలో రెండు స్కోచ్ అవార్డులు దక్కించుకున్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్, క్షేత్ర స్థాయిలో మహిళా పోలీసు పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించడం అనే అంశాల్లో ప్రకాశం జిల్లా పోలీసులకు సెమీ ఫైనల్ స్కోచ్ అవార్డు–2023 దక్కాయి. నిందితులకు శిక్ష పడినప్పుడే నేరాలు అదుపులోకి వస్తాయని భావిస్తున్న ఎస్పీ మలికా గర్గ్ గుడ్ ట్రయల్ మానిటరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారులు, సిబ్బందిని న్యాయ వ్యవస్థతో సమన్వయం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించారు. దీని వలన కేసుల విచారణ వేగవంతమై నిందితులకు త్వరగా శిక్షలు ఖరారవుతాయని, బాధితుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని పెంచగలుగుతామని ఎస్పీ మలికా గర్గ్ చెబుతున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహిళా పోలీసు వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం ద్వారా నేర నియంత్రణకు దోహదపడుతోంది. మహిళా పోలీసులకు 20 అంశాల్లో టాస్క్‌లు కేటాయించి వారి పనితీరు ప్రాతిపదికన పాయింట్లు ఇస్తున్నారు. ప్రతిభను బట్టి ప్రశంసా పత్రాలు అందజేస్తున్నారు. దీంతో మహిళా పోలీసులు మరింత క్రియాశీలకంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ రెండు అంశాల్లో ప్రకాశం జిల్లా పోలీసులు సెమీఫైనల్ వరకు చేరుకుని అవార్డులు దక్కించుకున్నారు.

భవ్యశ్రీ కేసులో నిష్పక్షపాతంగా విచారణ

సాక్షి, అమరావతి: భవ్యశ్రీ కేసు దర్యాప్తుపై చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డితో ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ బుధవారం చర్చించారు. నిష్పక్షపాతంగా విచారణ జరుపుతున్నామని జిల్లా ఎస్పీ వివరించారు. ఈ కేసులో ఎటువంటి ఒత్తిడి లేదని చెప్పారు. ఫోరెన్సిక్ నివేదిక రాగానే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు.

షిప్పింగ్ అధికారులతో ఎంపీ బాలశౌరి భేటీ

చిలకలపూడి (మచిలీపట్నం): షిప్పింగ్ కార్పొరేషన్, పలు శాఖల అధికారులతో లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం సమావేశమయ్యారు. స్వరాజ్ ద్వీపకల్పంలో నిర్వహించిన ఈ సమావేశంలో షిప్పింగ్ కార్పొరేషన్ విధి విధానాలపై చర్చించారు. సమావేశానికి షిప్పింగ్ కార్పొరేషన్ అధికారులు, పోర్టు అథారిటీ ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, సీమెన్స్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ, అండమాన్, లక్షద్వీప్ హార్బర్ ప్రతినిధులు హాజరయ్యారు.

డాక్టర్ శ్రీనివాసులురెడ్డికి ఏఎస్పీడీగా పూర్తి బాధ్యతలు



సాక్షి, అమరావతి: సమగ్ర శిక్షా ఏఎస్పీడీగా, ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఏఎస్పీడీగా పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏఎస్పీడీతో పాటు ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్‌గాను కొనసాగుతున్నారు. అయితే, ఓపెన్ స్కూల్ డైరెక్టర్‌గా కె.నాగేశ్వరరావును నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం ఆ బాధ్యతలను నాగేశ్వర్‌కు అప్పగించారు.

'విశాఖ' పాలన దిశగా అడుగులు శుభపరిణామం

1,095వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : వికేంద్రీకరణలో భాగంగా విశాఖ కేంద్రంగా పాలనకు ప్రభుత్వం అడుగులేయడం శుభ పరిణామమని బహుజన పరిరక్షణ సమితి నేతలు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1095వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం పలువురు మద్దతు తెలిపి ప్రసంగించారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి దిశగా అడుగులేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు సాగడాన్ని అందరూ స్వాగతిస్తున్నారని తెలిపారు. రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన అవినీతిని కాగ్ నివేదికలో స్పష్టం చేసిందన్నారు. చంద్రబాబుకు బెయిల్ దొరికితే వ్యవస్థలో చీడపురుగులా మారి మేనేజ్ చేస్తారని, జైల్లో బంధించి అవినీతి కేసులన్నీ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు బేతపూడి రాజేంద్ర కుమార్, బొలిమేర శ్యామ్యూల్, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం

కేంద్ర పశుసంవర్థక శాఖ కమిషనర్ అభిజిత్ మిత్ర

సాక్షి, విశాఖపట్నం: నాటు కోళ్ల పెంపకానికి కేంద్రం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని కేంద్ర పశు సంవర్థక శాఖ కమిషనర్ అభిజిత్ మిత్ర చెప్పారు. ఈ కోళ్లలో పోషకాలు అధికంగా ఉంటాయని, గ్రామ స్థాయిలో వీటి ఉత్పత్తిని విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం దేశీ పెరటి కోళ్ల పెంపకంపై విశాఖలో జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. పశు సంవర్థక శాఖ ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు అమలు చేసే కార్యక్రమాల్లో ఈ నాటు కోళ్ల పెంపకానికి కూడా ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా రుణాలు పొందవచ్చని, స్వయం సహాయక సంఘాలకు గరిష్టంగా రూ.10 లక్షల వరకు రాయితీ ఇచ్చే వీలుందన్నారు. ట్రైకార్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ, వాసన్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఏపీ, ఒడిశా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నాటు కోళ్ల పెంపకందార్లు హాజరయ్యారు. రాయలసీమకు చెందిన కోళ్ల పెంపకందారు జయప్రకాష్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో పండ్లు, కూరగాయల మొక్కలతో కలిపి చేపట్టిన నాటు కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉందని చెప్పారు. విశాఖకు చెందిన సంజీవని సంస్థ ప్రతినిధి దేవుళ్లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వ్యాక్సినేషన్ కొరత వల్ల కోళ్లు మృత్యువాత పడుతున్నాయన్నారు.

షేర్‌హోల్డర్లుగా 'జయలక్ష్మి' డిపాజిటర్లు

- ఖాతాదారులకు భరోసా
- డిపాజిట్లలో 40 శాతం షేర్‌హోల్డర్‌షిప్
- 60 శాతం సేవింగ్ అకౌంట్లుగా మార్పు



జయలక్ష్మి మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ సొసైటీ ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ బాధిత ఖాతాదారులు త్వరలో జయలక్ష్మి బ్యాంక్‌లో షేర్‌హోల్డర్లు కానున్నారు. ఇందుకోసం వచ్చే నెలతో ముగిసిపోతోన్న పాలకవర్గ పదవీ కాలాన్ని ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు నిర్ణయించారు. యాజమాన్యం మోసం చేయడంతో రోడ్డుపాలైన డిపాజిటర్లను సహకార చట్టానికి లోబడి షేర్‌హోల్డర్లుగా నియమించనున్నారు. ప్రతి ఖాతాదారుని డిపాజిట్‌లో 40% సొమ్ముతో బ్యాంక్‌లో షేర్‌హోల్డర్ చేస్తారు. మిగిలిన 60% సేవింగ్ అకౌంట్ (పొదుపు ఖాతా)లో జమ చేసి డిపాజిట్‌పై వడ్డీ జమ చేయనున్నట్లు పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథ్‌రావు తెలిపారు. ఈ ప్రక్రియను డిసెంబరు నెలాఖరుకి ఒక కొలిక్కి తీసుకురానున్నట్లు చెప్పారు. కాగా, కాకినాడ సర్పవరం కేంద్రంగా దంపతులైన రాయవరపు సీతారామాంజనేయులు, విశాలాక్షి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లుగా జయలక్ష్మి మ్యూచువల్లీ కోపరేటివ్ సొసైటీ ఖాతాదారులను గతేడాది ఏప్రిల్‌లో నిండా ముంచేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 29 బ్రాంచ్‌లతో 21,000 మంది నుంచి రూ.560 కోట్లను డిపాజిట్లుగా సేకరించి వీరు గోల్‌మాల్ చేశారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి బాధితులకు భరోసాగా నిలిచి సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి యాజమాన్య ప్రతినిధులను అరెస్ట్ చేయించింది. సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందాలు రూ.75 కోట్ల విలువైన 64 ఆస్తులను గుర్తించి సీజ్ చేశాయి. మరో రూ.100 కోట్లు విలువైన 66 ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు సీఐడీ ఏర్పాట్లు చేస్తోంది.

ఎస్సీ వర్గీకరణ కోరడం అర్థరహితం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పి.అశోక్



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు పి.అశోక్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ నిబంధనల ప్రకారం సాధ్యం కాదని మాలమహానాడు (పీవీరావు) జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయని, అయినప్పటికీ కొంతమంది ఎస్సీ వర్గీకరణ చేయాలని పట్టుబట్టడం అర్థరహితమని పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు రాజ్యాంగం అనుమతించదని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలను తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను కోరిందని, మెజారిటీ రాష్ట్రాలు వర్గీకరణను వ్యతిరేకించాయని గుర్తు చేశారు. తాము తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రధాని, రాష్ట్రపతి, కేంద్రమంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

'మిస్ అండ్ మిసెస్ ఆంధ్రప్రదేశ్-23' బ్రోచర్ ఆవిష్కరణ

- అక్టోబర్ 18న హోటల్ హయత్‌లో గ్రాండ్ ఫినాలే
- ఆర్గనైజర్ సతీష్ అద్దాల



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ అద్దాల

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఏటా లాగానే ఈ సంవత్సరం కూడా మిస్ అండ్ మిసెస్ ఆంధ్రప్రదేశ్–2023 పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సతీష్ అద్దాల తెలిపారు. విజయవాడ ఎంజీరోడ్డులోని బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఈ పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ అద్దాల మాట్లాడుతూ ఔత్సాహికులు ఇన్‌స్ట్రాగామ్‌లో మిస్ అండ్ మిసెస్ ఆంధ్రప్రదేశ్ పేజీ ఫాలో అయ్యి రిజిస్టర్ చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టిన వెంటనే 200 మంది రిజిస్టర్ అయ్యారని చెప్పారు. అక్టోబర్ 18న హోటల్ హయత్‌లో గ్రాండ్ ఫినాలే జరుగుతుందని, దానిలో టాలీవుడ్ దర్శకుడు శ్రీకాంత్ అద్దాల, ప్రముఖ కెమెరా మెన్ చోటా కె.నాయుడు, నిర్మాత బన్నీ వాసు, హీరో సుహాస్ వంటి ప్రముఖులు హాజరు అవుతారన్నారు. ఈ పోటీల్లో 35 మిస్ కేటగిరి, 25 మిసెస్ కేటగిరిలు ఉంటాయన్నారు. ఎంపికైన వారికి దుస్తులు, జ్యూవెలరీ తామే అందిస్తామన్నారు. ఈ సమావేశంలో బీఎస్ఆర్ జ్యువలర్స్ డైరెక్టర్ సీహెచ్ రమేష్, శ్రావణి, సుభానీ, వరప్రసాద్, మాజీ మిసెస్ ఆంధ్రప్రదేశ్ నిఖితా తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరావుకు జాతీయ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న పశు వైద్యుడు డాక్టర్ ప్రసాదరావు

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ జిల్లా పశు సంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్న డాక్టర్ మాదిన ప్రసాదరావుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాతీయ సమ్మేళనంలో వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటరమణ, భారత ప్రభుత్వ వ్యవసాయ ప్రణాళిక మాజీ సలహాదారుడు విశ్వనాథ్ సదామతే చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు డాక్టర్ ప్రసాదరావు తెలిపారు. తాను పాడి రైతులకు సంక్షేమ పథకాలపై కల్పించే అవగాహన, చేపట్టిన ప్రయోగాలను గుర్తించి ఈ అవార్డును ఇచ్చినట్లు వివరించారు.

సాఫ్ట్‌వేర్ సంస్థలపై ఐటీ దాడులు

బనశంకరి: బెంగళూరు నగరంలోని 10కి పైగా సాఫ్ట్‌వేర్ కంపెనీలపై బుధవారం ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సీవీ రామన్‌నగర, బాగమనె టెక్ పార్క్, హుళిమావు మొదలైన ప్రాంతాల్లో ఐటీ అధికారులు ఆకస్మికంగా సోదాలు ప్రారంభించారు. ఆదాయ పన్ను చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడమే ఇందుకు కారణమని తెలిసింది. కొన్ని కంపెనీలు పన్నుల ఎగవేత కోసం రెండు రకాల రికార్డులను నిర్వహిస్తున్నట్లు సోదాల్లో గుర్తించారు. మరో కేసులో బెంగళూరులో ఈడీ అధికారులు రూ.62 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇందిరా నగర్‌లో రూ.62 కోట్ల విలువ చేసే ఆక్రమిత ప్రభుత్వ ఆస్తిని, రూ.2.63 కోట్ల నగదు డిపాజిట్లను సీజ్ చేశారు. 2002లో చిత్రా పూర్ణిమా, ఇతరులపై నమోదైన బినామీ ఆస్తుల కేసులో ఈ చర్యలు తీసుకున్నారు.

తెలంగాణ

చట్టవిరుద్ధంగా నిర్బంధం సరికాదు: హైకోర్టు

వ్యక్తిని విడుదల చేయాలని ఎన్ఐఏకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చట్టవిరుద్ధంగా ఒక వ్యక్తిని నిర్బంధించడం సరికాదని, బాధితుడిని వెంటనే విడుదల చేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)ను హైకోర్టు ఆదేశించింది. చట్టప్రకారం నిర్దేశించిన విధానాన్ని అనుసరించాలని స్పష్టం చేసింది. సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో పరీక్షలకు హాజరవుతున్న తన భర్త దుబాషి దేవేందర్‌ను ఎన్ఐఏ అక్రమంగా నిర్బంధించిందని, ములుగు పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆరోపిస్తూ అతని భార్య స్వప్న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది. తన భర్తను పోలీసులే హతమార్చే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. తనకు ఆరు నెలల బిడ్డ కూడా ఉందని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన ధర్మాసనం విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయని బస్తర్ జిల్లాలో నమోదైన కేసులో భాగంగా దేవేందర్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ నివేదించింది. మావోయిస్టు కొరియర్‌గా పనిచేసినట్లు పేర్కొంది. కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా అరెస్టు చేశారని, 41ఏ నోటీసులు అందజేసినట్లు ఎలాంటి రుజువులు ఎన్ఐఏ వద్ద లేవని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పరీక్ష హాల్‌లో ఉండగా దేవేందర్‌ను అరెస్టు చేసి తీసుకెళ్లారని వివరించారు. పిటిషనర్ న్యాయవాది వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. బాధితుడిని విడుదల చేయాలని ఆదేశించింది.

ఎన్నికలే లక్ష్యంగా మావోయిస్టుల కుట్ర

- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సమావేశం
- పోలీసులను చూసి తప్పించుకున్న వైనం
- ములుగు ఎస్పీ గౌస్ ఆలం వెల్లడి

ములుగు/వాజేడు: రానున్న ఎన్నికలే లక్ష్యంగా మావోయిస్టులు చేస్తున్న కుట్రను గ్రే హౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు తిప్పికొట్టారని బుధవారం ములుగు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఓఎస్డీ అశోక్‌కుమార్ తెలిపారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు కర్రె గుట్టల్లో 30 నుంచి 40 మంది సాయుధ మావోయిస్టులు పెద్ద నాయకులతో కలసి ఉన్నట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. సాంబయ్య అలియాస్ గోపన్న, కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, ఎగోలపు మల్లయ్య, భద్రు అలియాస్ పాపన్న, ముచ్చకి ఉంగల్ అలియాస్ రఘు, మడకం మంగ అలియాస్ మాసా ఇతర దళ సభ్యులు కర్రె గుట్ట ప్రాంతంలో ఉన్నారని.. తెలంగాణలో భారీ విధ్వంసానికి పాల్పడేందుకు పథకం వేస్తున్నారని సమాచారం రాగా బుధవారం ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. ఆ సమయంలో మావోయిస్టులు పోలీసు పార్టీలను చూసి తమ వస్తువులను అక్కడే వదిలి దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లి తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. వారిని వెంబడించినప్పటికీ దొరకలేదని, అనంతరం ఆ ప్రాంతాన్ని పరిశీలించగా కిట్ బ్యాగుల్లో ఆలివ్‌రంగు డ్రెస్‌లు, ఇతర వస్తువులు, సుతిలి బాంబు, రేడియోలు, సోలార్ ప్లేట్లు, ఇతర ఎల్రక్టానిక్ వస్తువులు, పాత్రలు, కిరాణా వస్తువులు, దోమ తెరలు, మావోయిస్టు సాహిత్యం, మందులు, నీటి డబ్బాలు, సీసాలు, గొడుగులు, కూరగాయలు, తాళ్లు దొరికాయని తెలిపారు. కర్రె గుట్ట ప్రాంతంలో ఇంకా సోదాలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

తెలంగాణ భాష, యాస లేని సినిమాలు లేవు

ప్రపంచ పర్యాటక దినోత్సవ ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మాదాపూర్ (హైదరాబాద్): గతంలో ఏ సినిమాలు చూసినా మనభాషను, యాసను అవమానించే విధంగా ఉండేవని, ఇప్పుడు తెలంగాణ భాష, యాస లేకపోతే సినిమాలే లేవన్నట్టుగా ఉందని పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహిస్తున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం చివరి రోజు ముగింపు కార్యక్రమాల సందర్భంగా టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 14 సంవత్సరాలు నాగార్జునుడు జీవించిన ప్రదేశం తెలంగాణ అని, బౌద్ధమతానికి మూలబిందువు మన దగ్గరనుంచే మొదలైందన్నారు. ఈ సందర్భంగా 36 కేటగిరిలలో హోటల్స్, రెస్టారెంట్స్, రిసార్ట్స్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు తమ ఆటపాటలతో సందర్శకులను అలరించారు.

క్లుప్తంగా...

శుక్రయాన్‌కు పేలోడ్లు సిద్ధం



న్యూఢిల్లీ: చంద్రయాన్ ప్రయోగం విజయవంతం అయింది. ఆదిత్య యానం కొనసాగుతోంది. ఇక శుక్ర గ్రహంపై జెండా పాతేందుకు భారత్ సిద్ధమవుతోంది. శుక్ర యాత్రకు ఏర్పాట్లన్నీ శరవేగంగా పూర్తవుతున్నట్టు ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ తెలిపారు. దానికి సంబంధించిన పేలోడ్లు ఇప్పటికే సిద్ధమైనట్టు ఆయన బుధవారం వివరించారు. శుక్రుని అధ్యయనం భూగోళం భవితవ్యానికి సంబంధించి కీలక సమాచారం అందజేస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈ ప్రయోగానికి ఇంకా ఒకట్రెండేళ్లు పట్టవచ్చు. అమెరికా, యూరోపియన్ యూనియన్ ఇప్పటికే శుక్రయానాలకు తెర తీశాయి.

కబేళాలకు ఇస్కాన్ గోవులు

బీజేపీ నేత మేనకా గాంధీ ఆరోపణలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం గోశాలల్లోని ఆవులు కబేళాలకు తరలిపోతున్నాయని బీజేపీ ఎంపీ మేనకా గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. 'గోశాలలకు భూమి తదితర రూపాల్లో ప్రభుత్వాల నుంచి ఇస్కాన్ ఎంతో లబ్ధి పొందుతోంది. చివరికి గోవులను కోతకు అమ్ముకుంటోంది' అన్నారు. ఈ మేరకు ఆమె చెబుతున్న వీడియో వైరల్‌గా మారింది. అయితే ఈ ఆరోపణలను ఇస్కాన్ తీవ్రంగా ఖండించింది. ''భారత్‌లో ఇస్కాన్ 60కి పైగా గోశాలలు నడుపుతోంది. వదిలేసిన, గాయపడ్డ, కబేళాలకు తరలిస్తున్న వేలాది గోవులు, ఎద్దులను కాపాడుతోంది'' అని వివరించింది.

ఇమేజింగ్ శాటిలైట్ విజయవంతం

దుబాయ్: ఇరాన్ మొట్టమొదటిసారిగా ఛాయా చిత్రాలను తీసే ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినట్టుగా బుధవారం ప్రకటించింది. నూర్-3 అనే ఉపగ్రహాన్ని భూ ఉపరితలం నుంచి 450 కి.మీ. ఎత్తులో అంతరిక్షంలోకి పంపినట్టుగా ఇరాన్ సమాచార శాఖ మంత్రి ఇసా జరేపూర్ వెల్లడించినట్టు ఆ దేశ అధికారిక మీడియా ఐఆర్ఎన్ఏ వెల్లడించింది. అయితే ఆ ఉపగ్రహాన్ని ఎప్పుడు ప్రయోగించిందో ఇరాన్ వెల్లడించలేదు.

బిధూరీకి ఎన్నికల బాధ్యతలు

జైపూర్: ఇటీవల పార్లమెంటులో ముస్లిం ఎంపీ దానిష్ అలీపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన తమ ఎంపీ రమేశ్ బిధూరీకి రాజస్తాన్‌లోని టోంక్ నియోజకవర్గ బాధ్యతలను బీజేపీ అప్పగించింది. అక్కడి నుంచి కాంగ్రెస్ అసమ్మతి నేత సచిన్ పైలట్ పోటీ చేస్తారని సమాచారం.

కనిపించని 8వ ఖండం దొరికిందోచ్!

ఖండాలు ఎన్నీ అంటే ఠక్కున చెప్పే సమాధానం? ఏడు అని. కదా. ఇకనుంచి దాన్ని మార్చి, ఎనిమిది అని చెప్పుకోవాలి! కనిపించని ఆ ఎనిమిదో 'జల ఖండమే'... జిలాండియా.! భూమిపై ఇప్పటిదాకా మన కంటికి కనిపించకుండా దాక్కున్న ఎనిమిదో ఖండాన్ని సైంటిస్టులు తాజాగా కనుగొన్నారు. దీన్ని జిలాండియా, లేదా టిరియూ అమవొయ్ అని పిలుస్తున్నారు. అంటే మావోరీ భాషలో మవొయ్‌కు చెందిన కొండలు, లోయలు, మైదానాలు అని అర్థం! భూ భౌతిక శాస్త్రవేత్తలు, భూకంప నిపుణులతో కూడిన బృందం ఈ విషయమై లోతుగా పరిశోధించింది. అధ్యయన ఫలితాలను ఫిజిక్స్ ఓఆర్‌జీలో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఖండమని ఇలా నిర్ధారణ...

- అపారమైన విస్తీర్ణం. జిలాండియా వైశాల్యం దాదాపు 49 లక్షల చదరపు కిలోమీటర్లు.
- ఇది ఆస్ట్రేలియా దేశం కంటే విస్తీర్ణంలో చాలా చిన్నది. ఇందులో చాలా వరకు నీటి మునిగింది.
- దాని సమీపంలో సముద్రంలో నుంచి సేకరించిన శిలలను లోతుగా పరిశీలించారు.
- అంతేగాక భూ ఉపరితలం (క్రస్ట్) మందం, సాంద్రత వంటి పలు అంశాలను లోతుగా పరిశీలించిన మీదట దేనికి ఒక ఖండానికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్నట్టు సైంటిస్టులు నిర్ధారణకు వచ్చారు.



అన్నీ రికార్డులే...

ఈ కొత్త ఖండం అన్ని రికార్డులూ బద్దలు కొట్టడం మరో విశేషం...

- ప్రపంచంలో అతి చిన్న ఖండం ఇదే.
- అతి సన్ననిదీ, కొత్తగా రూపుదాల్చింది కూడా ఇదే.
- ఇది 94 శాతం మేర మునిగి, దాదాపు న్యూజిలాండ్ మాదిరిగా కొన్ని ద్వీపాల సమూహంగా ఉంది.
- ఇది తొలుత 55 కోట్ల ఏళ్ల కింద ఏర్పడ్డ పాంజియాగా పేర్కొనే అఖండ భూరాశిలో భాగంగానే ఉండేదట. తర్వాత విడిపోయింది.

ఎక్కడుంది?

- దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలో. న్యూ కాలెడోనియాతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలోని పలు భూభాగాలు దీని పరిధిలోకి వస్తాయి. మిగతాదంతా అపర పసిఫిక్ జల రాశే!. పరిమాణంలో ఇది ఆస్ట్రేలియా కంటే చిన్నది.
- దీని వయసు భూ భౌతిక శాస్త్రవేత్తలు తొలుత భావించిన దానికంటే కనీసం రెట్టింపు, అంటే దాదాపు 100 కోట్ల ఏళ్లని తాజాగా నిర్ధారించారు.
- సుమారు 2.3 కోట్ల ఏళ్ల కింద ఈ ఖండం పసిఫిక్ లో దాదాపుగా, అంటే 94 శాతం పూర్తిగా నీట మునిగిందట.
- ఇలాంటి ఒక ఖండం ఉందని బ్రూస్ లుయెండిక్ 1995లో మొదట ప్రతిపాదించాడు. దానికి జిలాండియా అని ఆయనే పేరు పెట్టాడు.



ఫ్లాష్‌లూటీ తర్వాత ఓ షాప్ పరిస్థితి ఇది..

ఫ్లాష్ లూటీ...

ఫ్లాష్ మాబ్ ముసుగులో చోరీలు • అమెరికాలో పలు స్టోర్లలో ఘటన

ఫిలడెల్ఫియా: నిత్యం నిఘా నీడన ఉండే అమెరికాలో దొంగల ముఠా పేట్రేగిపోయింది. చూడ్డానికి.. షాపింగ్‌మాల్స్‌లో ఫ్లాష్‌మాబ్ పేరిట డ్యాన్సులు, అవగాహన కార్యక్రమాలు చేసే బృందంలా కనిపిస్తూ ఒక్కసారిగా దుకాణాలపై తెగబడి అందిన కాడికి దోచేశారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరం ఈ చోరీల ఘటనకు వేదికైంది. ఒక్కటి కాదు చాలా స్టోర్స్‌లో టీనేజర్లు ఇలా ఒకే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారు. మంగళవారం రోజు జరిగిన ఈ చోరీల తాలూకు వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అత్యంత ఖరీదైన ఐఫోన్లుసహా యాపిల్ కంపెనీకి చెందిన పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. మాస్కులు, హుడీలు ధరించిన దాదాపు 100కుపైగా టీనేజర్లు యాపిల్ స్టోర్, ఫుట్‌లాకర్, లూలూలెమెన్ స్టోర్లలో చొరబడి బ్యాగుల నిండా వస్తువులను తీసుకెళ్లారు. విషయం తెల్సుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించి 20 మందికిపైగా టీనేజర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కొన్ని ఆయుధాలనూ స్వాధీనం చేసుకున్నారు. అయితే, వస్తువును దొంగిలించినా వాడుకోలేని(యాంటీ-థెఫ్ట్) ఫీచర్ ఉన్న కొన్ని యాపిల్ సంస్థ వస్తువులను దొంగలు అక్కడే వదిలేసివెళ్లారని ఫాక్స్ న్యూస్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. గత నెలలో డ్రైవర్ ఎడ్డీ ఐరీజెర్రీని ఫిలడెల్ఫియా పోలీస్ అధికారి కాల్చిచంపిన కేసులో రిటెన్‌హౌజ్ స్క్వేర్ వద్ద శాంతియుత ర్యాలీ జరిగిన కొద్దిసేపటికే అక్కడా ఇలా రిటైల్‌స్టోర్‌పై దాడి జరిగింది. అయితే ఆ నిరసనకారులతో ఈ ఘటనకు ఎలాంటి సంబంధం లేదని ఫిలడెల్ఫియా పోలీసులు స్పష్టంచేశారు.

నిజ్జర్ హత్య వెనుక ఐఎస్ఐ!

నిఘా వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ హస్తం ఉందని తెలుస్తోంది. కెనడా, భారత్ మధ్య సంబంధాలను దెబ్బ తీయడానికే ఐఎస్ఐ ఈ ఘాతుకానికి ఒడిగట్టిందని నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నిజ్జర్‌ను హత్య చెయ్యడానికి ఐఎస్ఐ కిరాయి హంతకుల్ని నియమించిందని ఆ వర్గాలు తెలిపాయి. ఖలిస్తాన్ టైగర్స్ ఫోర్స్ చీఫ్ నిజ్జర్ హత్య వెనుకాల భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

నిజ్జర్‌తో పాక్‌కు వైరం

కెనడాలో నిజ్జర్‌కు పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లతో కూడా సంబంధాలు ఉండేవి. కెనడాకు వచ్చే పాక్ గ్యాంగ్‌స్టర్లకు మద్దతునివ్వాలని ఐఎస్ఐ నిజ్జర్‌పై ఒత్తిడి తీసుకువచ్చింది. అయినప్పటికీ నిజ్జర్ ఖలిస్తాన్ సానుభూతిపరులతో కలిసి పని చేసేవాడు. దీంతో అతనిపై ఆగ్రహించిన ఐఎస్ఐ కిరాయి మూకలతో నిజ్జర్‌ను అంతమొందించినట్టుగా నిఘా వర్గాలకు సమాచారం అందింది.

ఆధారాలేవి ? కెనడాకు జైశంకర్ సూటి ప్రశ్న

ఖలిస్తాన్ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ కెనడా చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈ కేసు విషయంలో కచ్చితమైన సమాచారం ఉంటే ఇవ్వాలని కెనడాకు ఇప్పటికే చెప్పామన్నారు. న్యూయార్క్‌లోని ఫారెన్ రిలేషన్స్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం జై శంకర్ మాట్లాడారు. ''ఇలా హత్యలు చేయించడం మా విధానం కాదు. ఈ విషయాన్ని కెనడాకి కచ్చితంగా చెప్పాం. భారత్ ప్రమేయం ఉందనడానికి ఆధారాలుంటే ఇవ్వాలని అడిగాం. అప్పుడే ఆ అంశాన్ని పరిశీలిస్తాం'' అని జైశంకర్ వెల్లడించారు.

ఖలిస్తానీ గ్యాంగ్‌స్టర్లపై ఎన్ఐఏ దాడులు

భారత్, కెనడా మధ్య చిచ్చు రగిల్చిన ఖలిస్తాన్ నెట్‌వర్క్‌పై భారత జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దృష్టి సారించింది. ఖలిస్తాన్ సానుభూతిపరులు, గ్యాంగ్‌స్టర్ల మధ్య సంబంధాలను బట్టబయలు చేయడానికి ఆరు రాష్ట్రాల్లోని 53 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరిపింది. భారత్‌లోని ఖలిస్తానీ వేర్పాటువాదులకు హవాలా మార్గాల ద్వారా డబ్బు చేరుతుంటే వారు డ్రగ్స్, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నారని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. పంజాబ్, రాజస్తాన్, హరియాణా, ఉత్తరాఖండ్, ఢిల్లీ, యూపీలో ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. పంజాబ్‌లో ఫిరోజ్‌పూర్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ అర్షదల్లాకు అనుచరులు, మరి కొందరు గ్యాంగ్‌స్టర్‌లపై పెట్టిన కేసులకు సంబంధించి ఈ దాడుల్ని నిర్వహించింది. ఈ దాడుల్లో భారీ సంఖ్యలో పిస్టల్స్, మారణాయుధాలు, డిజిటల్ డివైజెస్, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకుంది. పాకిస్తాన్, యూఏఈ, కెనడా, పోర్చుగల్ దేశాల నుంచి ఉగ్రవాద సంస్థలు, డ్రగ్ స్మగ్లర్లతో సంబంధాలు నెరుపుతూ కలిసి పని చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిగాయని ఎన్ఐఏ అధికారులు చెప్పారు.

మణిపూర్‌లో సాయుధ చట్టం... మరో ఆర్నెల్లు

ఇంఫాల్: మణిపూర్‌లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ)ను మరో ఆర్నెల్ల పాటు పొడిగించారు. ప్రస్తుత కల్లోల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ఏఎఫ్ఎస్‌పీఏను అక్టోబర్ 1 నుంచి ఆరు నెలల పాటు పొడిగిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొంటూ అధికారిక ప్రకటన వెలువడింది. ఇంఫాల్ లోయ, అసోం సరిహద్దు ప్రాంతాల్లోని 19 పోలీస్ స్టేషన్లను మాత్రం దీని పరిధి నుంచి మినహాయించారు. అక్కడ చట్టాన్ని అమలు చేయాలంటే సంబంధిత పోలీస్ స్టేషన్ అనుమతి తప్పనిసరి. లేదంటే సైన్యం, అస్సాం రైఫిల్స్‌ను అక్కడ నియోగించడానికి వీల్లేదు. దీనిపై భద్రతా దళాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని నిషేధిత ఉగ్ర గ్రూపులు లోయలో తలదాచుకుని సవకు విసురుతున్నట్టు చెబుతున్నాయి. మణిపూర్ పోలీసు ఆయుధాగారం నుంచి దోచుకెళ్లిన మొత్తం 4,537 ఆయుధాలు, 6.32 లక్షల రౌండ్ల మందుగుండు వాటి చేతిలో పడ్డాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలో ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా భారత్

- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయం
- ఇండియాను గ్లోబల్ గ్రోత్ ఇంజన్‌గా మార్చడమే లక్ష్యం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 'వైబ్రంట్ గుజరాత్' తొలి సదస్సుకు 20 ఏళ్లు

అహ్మదాబాద్/బొడేలీ: భారత్‌ను ప్రపంచ గ్రోత్ ఇంజన్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మన దేశం త్వరలోనే ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'వైబ్రంట్ గుజరాత్' తొలి శిఖరాగ్ర సదస్సుకు 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 20 సంవత్సరాల క్రితం వైబ్రంట్ గుజరాత్ అనే చిన్న విత్తనం నాటామని, ఇప్పుడు అది మహా వృక్షంగా ఎదిగిందని ఆనందం వ్యకం చేశారు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం గుజరాత్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదని, అలాంటి సమయంలోనూ వైబ్రంట్ గుజరాత్ సదస్సు విజయవంతమైందని చెప్పారు. గుజరాత్‌ను భారత్ గ్రోత్ ఇంజన్‌గా తీర్చిదిద్దడానికి ఈ సదస్సు నిర్వహించామని తెలియజేశారు. ఆనాటి కల వాస్తవ రూపం దాల్చిందన్నారు. 2014లో తనకు దేశసేవ చేసే అవకాశం వచ్చినప్పుడు భారత్‌ను గ్లోబల్ గ్రోత్ ఇంజన్‌గా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నానని వెల్లడించారు. భారత్ త్వరలో గ్లోబల్ ఎకనామిక్ పవర్‌హౌజ్‌గా మారే దశలో ప్రస్తుతం మనం ఉన్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థలతోపాటు నిపుణులు ఇదే మాట చెబుతున్నారని గుర్తుచేశారు. మరికొన్ని సంవత్సరాల్లో మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు.

గుజరాత్‌ను అప్రతిష్టపాలు చేసే కుట్రలు

వైబ్రంట్ గుజరాత్ మొదటి సదస్సు జరిగాక ఇలాంటి కార్యక్రమాలు దేశంలో సంస్థాగతం మారిపోయాయని, చాలా రాష్ట్రాలు పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహించాయని, ఇప్పటికీ నిర్వహిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. వైబ్రంట్ గుజరాత్ సదస్సులో వచ్చిన సత్ఫలితాలను ఇప్పుడు కళ్లారా చూస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ సదస్సుకు ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు ఎదురయ్యాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం లభించలేదని చెప్పారు. విదేశీ పెట్టుబడిదారులకు అనాటి కేంద్ర మంత్రుల నుంచి బెదిరింపులు వచ్చాయన్నారు. అయినప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు ధైర్యంగా సదస్సులో పాల్గొన్నారని ప్రశంసించారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయని, ప్రకృతి విపత్తులు సంభవించామని, గోద్రా ఉదంతం, ఆ తర్వాత అల్లర్లు జరిగాయని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ పరిణామాలతో గుజరాత్ కుప్పకూలుతుందని, దేశానికి పెద్ద భారంగా మారిపోతోందని చాలా మంది అంచనా వేశారని తెలిపారు. అంతర్జాతీయంగా గుజరాత్‌ను అప్రతిష్టపాలు చేసే కుట్రలు సైతం జరిగాయన్నారు. అన్నింటినీ తట్టుకొని గుజరాత్ అద్భుతమైన అభివృద్ధి సాధించిందని వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దంలో గుజరాత్ రాష్ట్రం వ్యవసాయ ఆర్థిక శక్తిగా, ఆర్థిక హబ్‌గా మారిందని ప్రధానమంత్రి కితాబిచ్చారు. తన పేరిట ఒక్క ఇల్లు కూడా లేదని, కానీ, తమ ప్రభుత్వం లక్షలాది మంది ఆడబిడ్డలను ఇంటి యజమానులుగా మార్చిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రభుత్వ పథకాల కింద సొంత ఇళ్లు నిర్మించి ఇచ్చామని, వాటితో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆడబిడ్డలు లక్షాధికారులు అయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. గుజరాత్ రాష్ట్రం చోటాదేపూర్ జిల్లా బొడేలీ పట్టణంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.



అహ్మదాబాద్ సైన్స్‌సిటీలోని రోబోటిక్స్ గ్యాలరీలో రోబో అందించిన టీ సేవిస్తున్న మోదీ

బ్యాంకులకు డొనాల్డ్ ట్రంప్ టోకరా



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కష్టాలు వెంటాడుతున్నాయి. ఆయన మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ట్రంప్ ఆర్థిక సంస్థలను, బ్యాంకులను మోసగించారని, తప్పుడు మార్గాల్లో భారీ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్మించుకున్నారని న్యూయార్క్ కోర్టు న్యాయమూర్తి ఆర్థర్ ఎంగోరాన్ తేల్చిచెప్పారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటీటియా జేమ్స్ దాఖలు చేసిన సివిల్ వ్యాజ్యంపై న్యాయమూర్తి విచారణ జరిపారు. మంగళవారం తీర్పు వెలువరించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు, తద్వారా రుణాల కోసం ట్రంప్, ఆయన కంపెనీ అవకతవకలకు పాల్పడ్డారని తీర్పులో ప్రస్తావించారు. ఆస్తుల విలువను కాగితాలపై ఎక్కువ చేసి చూపించారని, లేని ఆస్తులు ఉన్నట్లు నమ్మించారని పేర్కొన్నారు. ఆయా నేరాలకు గాను శిక్ష కింద ట్రంప్‌నకు చెందిన కొన్ని బిజినెస్ లైసెన్స్‌లను రద్దు చేయాలని జడ్జి ఎంగోరాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆండ్రాయిడ్ ఫోన్లలో భూకంప హెచ్చరికలు!

న్యూఢిల్లీ: తమ వినియోగదారులకు వారు ఉంటున్న ప్రాంతంలో సంభవించబోయే భూకంపానికి సంబంధించిన తక్షణ సమాచారాన్ని అలర్ట్‌ల రూపంలో గూగుల్ అందించనుంది. ఇందుకోసం ఆండ్రాయిడ్ ఫోన్లలో త్వరలో 'ఎర్త్‌క్వేక్ అలర్ట్' సందేశ సేవలను ప్రారంభించనుంది. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ), జాతీయ భూకంప కేంద్రాల సమన్వయంతో కొత్తగా 'ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్స్ సిస్టమ్'ను భారత్‌లో మొదలుపెట్టనుంది. 'యూజర్లు ఉంటున్న ప్రాంతంలో ఒకచోట భూకంపం వస్తే దానికి పసిగట్టి వెంటనే ఆ ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు అందరికీ అలర్ట్‌లు మెరుపువేగంతో వెళతాయి' అని గూగుల్ బుధవారం ఒక బ్లాగ్‌లో పేర్కొంది. ఆండ్రాయిడ్ 5, ఆపై అప్‌డేటెడ్ వెర్షన్ ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఇన్‌స్టాల్ అయిన ఫోన్లలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది.

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసం నిర్మాణంలో అవకతవకలు..

సీబీఐ ప్రాథమిక దర్యాప్తు ప్రారంభం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కోసం చేపట్టిన నూతన అధికారిక నివాసం నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సీబీఐ ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన గుర్తుతెలియని అధికారులపై ఈ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని సీబీఐ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆరోపణలకు తగిన ఆధారాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలితే పూర్తిస్థాయి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. సీఎం కొత్త ఇంటి నిర్మాణానికి సంబంధించిన రికార్డులన్నీ తమకు అందజేయాలని సీబీఐ సోమవారం ఢిల్లీ ప్రజా పనుల విభాగానికి లేఖ రాసింది. కేజ్రీవాల్ కొత్త ఇంటి నిర్మాణం కోసం ఢిల్లీ ప్రభుత్వం రూ.43.70 కోట్లు కేటాయించింది. కానీ, రూ.44.78 కోట్లు ఖర్చు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.. 2020 సెప్టెంబర్ 9 నుంచి 2022 జూన్ దాకా ఈ సొమ్ము ఖర్చు చేశారు.

ఆ ఐఏఎస్ అధికారితో నిర్బంధ పదవీ విరమణ

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని ప్రభుత్వ స్టేడియంలో తన కుక్కతో కలిసి వాకింగ్ చేయడం కోసం క్రీడాకారుల్ని ముందస్తుగా ఖాళీ చేసిన ఘటనకు సంబంధించి ఐఏఎస్ అధికారిపై వేటు పడింది. 1994 అరుణాచల్‌ప్రదేశ్-గోవా-మిజోరం కేడర్ ఆఫీసర్ అయిన రింకు దుగ్గాను కేంద్ర ప్రభుత్వం నిర్బంధంగా పదవీ విరమణ చేయించినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రింకు దుగ్గా, ఆమె భర్త, ఐఏఎస్ అధికారి అయిన సంజీవ్ ఖిర్వార్‌లు ఢిల్లీలో త్యాగరాజ్ స్టేడియానికి తమ కుక్కని తీసుకొని తీరిగ్గా వాకింగ్‌కు వెళ్లేవారు. ఆ స్టేడియంలో అథ్లెట్లకు రాత్రి 7 గంటలవరకు ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి ఉన్నప్పటికీ నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చి సాయంత్రమే ఖాళీ చేయించేవారు. ఇది వెలుగులోకి వచ్చాక తొలుత ఆ అధికారుల్ని అరుణాచల్ ప్రదేశ్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం సంజీవ్ ఖిర్వార్ లద్దాఖ్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

పెళ్లి వేడుకలో అగ్ని ప్రమాదం

- ఇరాక్‌లో 114 మంది మృతి, 150 మందికి పైగా గాయాలు
- బాణాసంచా కాల్చడంతో జరిగిన దారుణం
- వధూవరులకు తీవ్ర గాయాలు



అగ్నిప్రమాదం జరిగిన ఫంక్షన్ హాల్ (ఇన్‌సెట్‌లో) కాలి బూడిదైన వేదిక, కుర్చీలు

మోసల్ (ఇరాక్): ఇరాక్‌లోని ఒక పెళ్లి వేడుకల్లో అగ్ని ప్రమాదం సంభవించడంతో తీవ్ర విషాదం నెలకొంది. అతిథులతో కిక్కిరిసిపోయిన హాలులో వధూవరులు డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి 114 మంది మరణించారు. మరో 150 మంది వరకు గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇరాక్‌లోని నినెవెహ్ ప్రావిన్స్ ఖరకోష్ పట్టణంలో పెళ్లి వేడుకలో హాలులో బాణాసంచా కాల్చడంతో ఒక్కసారి డెకరేషన్‌కు మంటలు అంటుకొని వ్యాపించాయి. ఆ హాలు నిర్మాణంలో ఉపయోగించిన సామాగ్రి, పెళ్లి కోసం చేసిన డెకరేషన్ కూడా మండించే స్వభావాన్ని కలిగి ఉండడంతో అగ్ని కీలలు త్వరితగతిన విస్తరించాయి. కళ్ల ముందే షాండ్లియర్లు, సీలింగ్ నుంచి పెచ్చులు కింద పడడంతో పెళ్లికి హాజరైన అతిథులు అటూ ఇటూ వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో వధూవరులు తీవ్రంగా గాయపడినా వారి ప్రాణాలకు ప్రమాదం లేదని స్థానిక మీడియా వెల్లడించింది. పెళ్లి వేడుకలు అంబరాన్నంటుతున్న సమయంలో ఆనందంతో కేరింతలు కొడుతున్న అతిథులు ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టడంతో హాహాకారాలు చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పెళ్లి వేడుకలు జరిగే మండపం అంతా ప్లాస్టిక్‌తో డెకరేషన్ చేశారు. వధూవరులు డ్యాన్స్ చేస్తుండగా హాలులోనే బాణాసంచా కాల్చారు. అవి నేరుగా రూఫ్‌కి తాకాయి. సీలింగ్‌కి మంటలు అంటుకోవడంతో అవి విస్తృతంగా వ్యాపించాయి. ఆ ఫంక్షన్ హాలుని శాండ్‌విచ్ ప్యానెల్స్, వినిల్ షీట్స్, ఫ్యాబ్రిక్‌తో నిర్మించడంతో మంటలు ఎగిసెగిసి పడ్డాయి. దీంతో పై నుంచి డెకరేషన్ సామాగ్రి కింద పడి ఎవరూ కదలడానికి వీల్లేకుండా పోయింది. అతిథుల సంఖ్య భారీ స్థాయిలో 1,000 నుంచి 1100 మంది ఉండడంతో అటూ ఇటూ వెళ్లడానికి దారి లేక అందరూ అక్కడే చిక్కుకుపోయి మంటలకి ఆహుతైపోయారు.

అర్ధనగ్నంగా రక్తమోడుతూ

ఉజ్జయిని వీధుల్లో అత్యాచారానికి గురై సాయం కోరిన 12 ఏళ్ల బాలిక

మధ్యప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చిన దారుణం

ఉజ్జయిని: మానవత్వానికే మాయని మచ్చగా నిలిచిన ఘటన ఇది. ఒక చిన్నతల్లికి పెద్ద కష్టం వచ్చి వీధుల్లో తిరుగుతూ సాయం కోరినా ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితి ఇది. మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురైన పన్నెండేళ్ల బాలిక అర్ధనగ్నంగా, రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో సాయం కోరుతూ తిరిగిన వీడియో అందరినీ కంటతడి పెట్టిస్తోంది. చిన్నారికి వచ్చిన ఆ కష్టాన్ని చూసిన వారు దిగ్భ్రాంతికి లోనయ్యారే తప్ప సాయం చెయ్యడానికి ముందుకు రాలేదు. కొందరు పొమ్మంటూ సంజ్ఞలు కూడా చేయడం కూడా కనిపించింది. చివరికి ఆ బాలిక ఒక ఆశ్రమం ఎదుట స్పృహ తప్పి పడిపోగా ఆశ్రమవాసులు ఆమెను ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ బయటకు రావడంతో అందరికీ ఈ దారుణం గురించి తెలిసింది. ఆ బాలికపై అత్యాచారం జరిగిందని వైద్య పరీక్షల్లో తేలడంతో వెంటనే ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ప్రస్తుతం ఆ బాలికకు ఇండోర్ ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నామని, ఆమె ప్రాణానికి ప్రమాదం లేదని మధ్యప్రదేశ్ హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా చెప్పారు. ఆ బాలిక ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చినట్టుగా పోలీసులు చెబుతున్నారు. అత్యాచారానికి గురి కావడంతో తీవ్రమైన షాక్‌లో ఉన్న ఆ బాలిక తను ఎక్కడ నుంచి వచ్చిందో, తల్లిదండ్రులు ఎవరో ఇంకా చెప్పలేకపోతోందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు సచిన్ శర్మ చెప్పారు. ఆ బాలికను నిరంతరం వైద్యులు, మానసిక నిపుణులు పరీక్షిస్తున్నారని కౌన్సెలింగ్ ఇస్తున్నారని చెప్పారు. మరోవైపు ఈ ఘటన మానవత్వానికే మచ్చగా మిగిలిందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ అన్నారు. ఆ బాలిక అలా ఉజ్జయిని రోడ్లపై సాయం కోసం తిరిగిన వీడియో చూసి సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. ఆమె భవిష్యత్ కోసం కోటి రూపాయలు ఆర్థిక సాయం చేయాలని, రేపిస్టుకి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం • 28 • సెప్టెంబర్ • 2023

హోటళ్లలో విధ్వంసం.. 4 కేసుల నమోదు

బనశంకరి: బెంగళూరు బంద్ సందర్భంగా తెరిచి ఉంచారని మంగళవారం జయనగరలో హోటల్‌పై దాడికి పాల్పడిన ఘటనలో అల్లరిమూకలపై పోలీసులు నమోదు చేశారు. జయనగర ఉడుపి హబ్ హోటల్‌లోకి చొరబడిన అల్లరిమూకలు కుర్చీలు, బల్లలు ఇతర వస్తువులను ధ్వంసం చేశారు, విశ్వ, శివ అనే ఇద్దరిపై కేసు నమోదైంది. అలాగే మోర్ సూపర్ మార్కెట్, కాఫీ డే, ఫిల్టర్ కాఫీ హోటల్ లోకి చొరబడి దాడులకు పాల్పడ్డారు. మొత్తం 4 కేసులు నమోదు చేశారు. దాడులకు పాల్పడిన వ్యక్తులు స్థానిక ఎమ్మెల్యే సీకే రామమూర్తి తరపు వారని ఆరోపణలు వచ్చాయి. దాడిలో జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే రామమూర్తి భరించారని ఉడుపి హోటల్ యజమాని తెలిపారు.

న్యూస్‌రీల్

ఐకమత్యంగా గణేశోత్సవం



వేడుకలో పాల్గొన్న ముస్లింలు

తుమకూరు: ఘనంగా జరుగుతున్న గౌరి గణేశ్ పండుగ కుల, మతాలకు అతీతంగా సమైక్యతకు ప్రతీకగా మారింది. తుమకూరు సదాశివ నగరలో గణేశ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హిందూ–ముస్లింలు కలిసి గణేశోత్సవంలో పాల్గొన్నారు. నజరాబాద్ ముస్లిం నేత షబ్బీర్ అభిమానుల బృందం గణేశోత్సవంలో ఉన్న హిందూ సోదరులకు నీరు, జ్యూస్ ఇచ్చి, పువ్వులను అందించి స్వాగతం పలికింది.

ఫ్యాక్టరీ ఆవరణలో చిరుత బందీ



బంధించిన చిరుత


శివమొగ్గ: భద్రావతిలోని వీఐఎస్ఎల్ (ఇనుము– ఉక్కు) కర్మాగారం ఆవరణలో గత కొన్ని రోజులుగా కనిపిస్తూ భయాందోళనలు కలిగించిన చిరుతపులిని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కర్మాగారం ఆవరణలో ఏర్పాటు చేసిన బోనులో వచ్చి చిక్కుకుంది. గత కొన్ని నెలలుగా వీఐఎస్ఎల్ కర్మాగారం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ చిరుత కనిపిస్తూ అందరికీ భయానికి గురిచేసింది.

జేడీఎస్ అవకాశవాద పార్టీ కాదు: దేవెగౌడ

యశవంతపుర: మేం ఎక్కడున్నా మా లౌకిక విలువలను, మైనారిటీలను కాపాడుకుంటూ వచ్చామని జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ అన్నారు. ఆయన బుధవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో మైనారిటీ నాయకులు అసంతృప్తితో ఉన్నారని, పార్టీకి రాజీనామాలు చేస్తున్నారనే తరుణంలో ఈయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించిన తరువాతే బీజేపీతో పొత్తుకు వెళ్లామన్నారు. జేడీఎస్– బీజేపీ పొత్తు విషయంపై ఒక రౌండు చర్చలు ముగిశాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాము, ఇక ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడాలి. లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసే సీట్ల గురించి ఇంకా చర్చించలేదని దేవెగౌడ అన్నారు. రెండు పార్టీల పార్లమెంటరీ కమిటీలు చర్చించి సీట్ల పంపకాలను ఖరారు చేస్తాయన్నారు. తమది అవకాశవాద పార్టీ కాదని, జేడీఎస్‌ను నాశనం చేయడానికి కాంగ్రెస్ పార్టీ అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. కప్పిపుచ్చుకొని మాట్లాడవలసిన అవసరం తమకు లేదన్నారు. కాంగ్రెస్–జేడీఎస్ పొత్తు ప్రభుత్వంలో 17 మంది ఎమ్మెల్యేలను ముంబైకి పంపి ప్రభుత్వ పతనానికి కారణమైంది ఎవరని దేవెగౌడ ప్రశ్నించారు. కుమారస్వామి సీఎం కావాలని కాంగ్రెస్ నాయకులే డిమాండ్ చేశారు, తరువాత వాళ్లే ప్రభుత్వాన్ని కూల్చివేశారన్నారు.

ఎయిర్‌పోర్టు రన్ వే వద్ద డ్రోన్ సంచారం

- అధికారుల విచారణ



దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులోని రన్ వేపై అపరిచిత డ్రోన్ ఎగరడం కలకలం రేపింది. టేకాఫ్ స్థలం నుండి కొంత దూరంలో డ్రోన్ ఎగరడం చూసిన ఒక పైలట్ ఏటీసీ కంట్రోల్ రూం కి సమాచారం అందించారు. బెంగళూరు నుంచి ఢిల్లీ, ముంబై వెళ్తున్న ఇండిగో విమానాలు టేకాఫ్ తీసుకునే స్థలంలో డ్రోన్ ఎగిరింది. ఇది నిషేధిత ప్రాంతం కావడంతో విమానాశ్రయ భద్రతా సిబ్బంది, ఏటీసీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా మామూలుగా డ్రోన్ ఎగురవేశారా, లేదా ఎయిర్‌పోర్టుపై నిఘా కోసం పంపించారా అనేది తేలాల్సి ఉంది.

ప్రయాణికురాలి వద్ద రూ.15 లక్షల సీజ్

ఎయిర్‌పోర్టులో విదేశీ ప్రయాణికురాలి వద్ద రూ.15 లక్షలు నగదు పట్టుబడింది. బెంగళూరు నుంచి ముంబైకి వెళ్తున్న విదేశీ మహిళ వద్ద లగేజీ చెక్ చేస్తుండగా రూ.15 లక్షల భారత్ కరెన్సీ లభించింది. ఆ డబ్బుకు ఆమె వద్ద దాఖలాలు లేకపోవడంతో నగదుతో పాటు ఆమెను ఐటీ అధికారులకు అప్పగించారు.

చల్లారని జల వేడి

- ముమ్మరంగా కావేరి ఆందోళనలు
- మైసూరులో పలు సంఘాల ధర్నాలు
- బెంగళూరులో బీజేపీ– జేడీఎస్ ఐక్య ప్రదర్శన



కావేరి జలాల విడుదలకు వ్యతిరేకంగా బుధవారం మైసూరులో జరిగిన ఓ నిరసన

మైసూరు: కావేరి నదీ జలాల కోసం ఆ ప్రాంత జిల్లాల్లో చేస్తున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. మంగళవారం రాజధాని బంద్ కాగా, బుధవారం వివిధ సంఘాలు, సంస్థలు ఆందోళనలతో రాచనగరిని హోరెత్తించాయి. ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని, లేదంటే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రికి పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో నీరు లేకపోయినా పదేపదే తమిళనాడుకు నీటి విడుదల చేయాలని ఆదేశిస్తుండడంతో మా రైతాంగానికి సాగు నీరు ఉండడం లేదని ఆ లేఖల్లో ఆవేదన వ్యక్తం చేశారు. మైసూరులోని కోర్టుల సముదాయం వద్ద ధర్నా జరిపి నినాదాలు చేశారు.

ఖాళీ బిందెలతో ధర్నా

మైసూరు జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు ఆందోళన చేశారు. కావేరి నీటి యాజమాన్య బోర్డు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించరాదన్నారు. ఎక్కడో కూర్చొని ఆదేశాలివ్వడం కాదని, క్షేత్రస్థాయిలో పర్యటించి చూడాలన్నారు. తమిళనాడుకు ప్రవహిస్తున్న నీటిని తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. మైసూరు గాంధీ సర్కిల్‌లో జేడీఎస్ పార్టీ నేతలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. తలలపై ఖాళీ బిందెలను పెట్టుకుని నినాదాలు చేశారు. కొందరు రక్తం చిందించి ప్రతిజ్ఞలు చేశారు.

నగరంలోని కోటె ఆంజనేయ స్వామి దేవస్థానం ఎదుట నాల్వడి కృష్ణరాజ ఒడెయార్ చిత్రపటాన్ని పెట్టుకుని ఆందోళన సాగించారు. కావేరి నది నీరు తమదని, కావేరిపై తమకు హక్కు ఉందని, తమిళనాడుకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని వదలకూడదని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల ఉమ్మడి ధర్నా

- సర్కారుకు తమిళనాడే ముఖ్యమని యడ్డి, కుమార ధ్వజం



గాంధీ విగ్రహం వద్ద ఇరుపార్టీల ఆందోళన

బనశంకరి: బెంగళూరులో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నాయకులు బహిరంగంగా చేతులు కలిపి కావేరి అంశంపై ధర్నా చేశారు. పొత్తు ప్రకటించిన తరువాత ఒకే వేదికపై కనబడటం విశేషం. బుధవారం విధానసౌధ–వికాససౌధ మధ్యనున్న గాంధీ విగ్రహం వద్ద ఇరుపార్టీల నాయకులు కావేరి జలాల విషయంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప మాట్లాడుతూ.. ఇది అద్భుత పోరాటమని, రైతుల క్షేమాన్ని పక్కనపెట్టి తమిళనాడుకు నీటిని విడుదల చేయడం నేరమని ఆరోపించారు. కన్నడ ప్రజల శ్రేయస్సు కంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి తమిళనాడులో సీఎం స్టాలిన్‌తో పొత్తు కుదుర్చుకోవడం ముఖ్యమైందన్నారు. కావేరినీరు విడుదల చేయకపోతే ఇండియా కూటమి నుంచి వైదొలుగుతామని సీఎం ఎంకే స్టాలిన్ బెదిరించారని, దీంతో కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలతో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్‌లు నీటిని వదలుతున్నారని యడ్డి దుయ్యబట్టారు. వీరికి అధికారంలో ఉండే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు.

ఇండియా కూటమే ప్రధానమా

జేడీఎస్ మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇక్కడ రైతులు శ్రేయస్సు కంటే ఇండియా కూటమిని కాపాడడమే ప్రధానమైందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశించడానికంటే ముందే తమిళనాడుకు కావేరి నీటిని ఎందుకు విడుదల చేశారని ప్రశ్నించారు. కోర్టుకు నిజాన్ని చెప్పడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైందన్నారు. ఈ ధర్నాలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్‌కుమార్‌కటీల్, మాజీ సీఎం డీవీ.సదానందగౌడ, పెద్దసంఖ్యలో మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

అప్పులు చేసి ఆడంబర వివాహాలొద్దు

- చామరాజనగరలో సీఎం హితవు



నూతన దంపతులతో సీఎం సిద్ధరామయ్య

మైసూరు: వ్యవసాయం పేరిట అప్పులు చేసి ఆ సొమ్ముతో ఘనంగా పెళ్లిళ్లు చేసుకోవడం నిలిపేయాలని సీఎం సిద్ధరామయ్య సూచించారు. పేదలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకోకూడదని, ఎంత మంచం ఉంటే అంతలోనే కాళ్లు చాపుకోవాలని హితవు పలికారు. బుధవారం చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలోని శ్రీ మలై మహదేశ్వరబెట్ట దేవస్థానంలో ఏర్పాటు చేసిన సామూహిక వివాహోత్సవంలో సిద్ధరామయ్య పాల్గొని మాట్లాడారు. పేదలు, మధ్యతరగతి వారు అప్పులు చేసి ఘనంగా పెళ్లిళ్లు చేసుకుని జీవితాంతం ఆ అప్పులు తీర్చుకుంటూ ఉంటున్నారని, ఇది సరి కాదని సూచించారు. నూతన దంపతులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. మలై మహదేశ్వర బెట్టలో ఉన్న రాష్ట్రపతి భవన్‌ను ఇకనుంచి తపోభవనం అని పిలవాలని సూచించారు.

మాదప్పకు సీఎం పూజలు

మలె మహదేశ్వర స్వామిని సీఎం దర్శనం చేసుకున్నారు. దండిగా వర్షాలు కురిపించి కరువు, కావేరి వివాదం నుంచి గట్టెక్కించాలని పూజలు చేసినట్లు తెలిపారు. సుమారు 20 నిమిషాల పాటు వీరు స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

కావేరిపై సుప్రీంను ఆశ్రయిస్తాం

తమిళనాడుకు మరో 15 రోజుల పాటు రోజూ 3 వేల క్యూసెక్కుల కావేరి నీటిని విడుదల చేయాల్సి ఉందని, దీన్ని ప్రశ్నిస్తు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నాయని, ఇలాంటప్పుడు నీటిని వదలాలనే నిర్ణయం సరికాదని అన్నారు. చామరాజనగరకు వచ్చిన సీఎం కొన్నినెలల్లోనే పదవిని పోగొట్టుకుంటారనే ప్రచారాన్ని ప్రస్తావించగా, గతంలో చామరాజనగరకు వచ్చి ఐదేళ్ల పాటు పాలన సాగించామని, ఈ అపవాదును తొలగించామని సీఎం తెలిపారు.

775 గ్రాముల బంగారం పట్టివేత

దొడ్డబళ్లాపురం: అక్రమంగా తరలిస్తున్న 775 గ్రాముల బంగారాన్ని మంగళూరు విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. ఈనెల 23, 24 తేదీల్లో వేర్వేరు విమానాల్లో దుబై నుంచి మంగళూరుకు వచ్చిన 5 మంది ప్రయాణికులను సోదా చేశారు. లోదుస్తుల్లో, బ్యాగ్‌లలో దాచి తరలిస్తున్న 775 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.46,52,270గా అధికారులు తెలిపారు.

ఉద్యమించిన ఒక్కూట

యశవంతపుర: కావేరి నది నీటిని తమిళనాడుకు విడుదల చేయడాన్ని ఖండిస్తూ కన్నడపర ఒక్కూట నాయకుడు వాటాళ్ నాగరాజు నేతృత్వంలో ఆందోళనకారులు ఉద్యమించారు. బుధవారం బెంగళూరులోని సీఎం నివాసం వద్ద సత్యాగ్రహం చేసేందుకు వెళ్తుండగా శివానంద సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మత్తు చాకెట్లు ఇచ్చి రైళ్లలో చోరీలు

- బిహార్ ముఠా అరెస్ట్

యశవంతపుర: రైళ్లలో ప్రయాణికులకు మత్తు కలిపిన బిస్కెట్లు, చాకెట్లు ఇచ్చి చోరీలకు పాల్పడుతున్న ముఠా పట్టుబడింది. బిహార్‌కు చెందిన సర్దాజ్ (29), చంచనకుమార్ (23), ధారాకుమార్ (29)అనే దొంగలను గోవా ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు గోవా–బెళగావి మార్గంలో తిరిగే రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికులను మాటల్లోకి దింపేవారు. మత్తు కలిపిన చాక్లెట్లను తినడానికి ఇచ్చేవారు. అవి తినగానే కొంతసేపటికే బాధితులు మత్తులోకి జారుకునేవారు. ఆపై వారిని సర్వం దోచుకునేవారు. 20 రోజుల క్రితం మధ్యప్రదేశ్‌కు చెందిన 8 మందికి చాకెట్లు ఇచ్చి ఇలాగే డబ్బు, బంగారం తదితరాలను దోపిడీ చేశారు. పోలీసులు గాలింపు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

కుమార్తె పెళ్లి కోసం తెస్తే..

- 3.50 కేజీల బంగారం, రూ.10 లక్షల చోరీ



బనశంకరి: గుజరీ వ్యాపారి ఇంట్లో దొంగలు పడి 3.50 కిలోల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు దోచుకుని ఉడాయించారు. ఈ ఘటన బెంగళూరు తిలక్‌నగర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఆర్‌కె గార్డెన్ 2వ క్రాస్, రెండో మెయిన్ రోడ్డులో గుజరీ వ్యాపారి షానవాజ్ ఉంటున్నాడు, కుమార్తె పెళ్లి కోసం నగదు, బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రపరిచాడు. ఈ నెల 23న ఇంటికి తాళం వేసుకుని కుటుంబసమేతంగా రామనగర, మండ్యలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు.

బెడ్‌రూం తలుపు స్క్రూ తీసి..

ఈ సమయంలో దుండగులు మొదటి అంతస్తు బెడ్‌రూమ్ తలుపు స్క్రూలు తొలగించి చొరబడ్డారు. బీరువాలో ఉన్న సుమారు 3.5 కిలోల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు దోచుకుని ఉడాయించారు. 25 తేదీ అర్ధరాత్రి షానవాజ్ కుటుంబంతో సహా తిరిగి వచ్చాడు. బీరువా తెరిచి ఉండడం చూసి గాభరాపడి వెతగ్గా డబ్బు, బంగారం కనిపించలేదు. ఫిర్యాదు మేరకు తిలక్‌నగర పోలీసులు చేరుకుని డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఒక్కడే దొంగ వచ్చినట్లు సీసీ కెమెరా చిత్రాల్లో రికార్డయింది.



బుధవారం బెళగావిలో జరిగిన భద్రతా దళాల కవాతులో భాష్పవాయు తుపాకీతో జవాన్



ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సిలికాన్ సిటీలో నిర్వహించిన ర్యాలీ





బుధవారం ఉదయం మైసూరు నగర వీధుల్లో గజరాజుల సంచారం

తిరుగులేని అర్జున

- తరువాత కెప్టెన్ అభిమన్యు
- మైసూరు దసరా ఏనుగులకు తూకం పరీక్షలు



5.6 టన్నులతో ఎక్కువ బరువు తూగిన అర్జున ఏనుగు

మైసూరు: మైసూరు దసరా గజరాజులకు బరువు పరీక్షలను బుధవారం చేపట్టారు. దేవరాజ మొహల్లా సాయిరామ్ తూనికల కేంద్రానికి మొత్తం 14 ఏనుగులు నడుచుకుంటూ వచ్చాయి. ఒక్కో ఏనుగును బరువు తూచారు. తూకంలో మాజీ కెప్టెన్ అర్జున అత్యధిక బరువు ఉన్న ఏనుగుగా నిలిచింది. వయసు కారణంతో దసరాలో బంగారు అంబారీని మోసే బాధ్యత అర్జునకు బదులుగా కెప్టెన్ అభిమన్యుకు అప్పగించారు. అభిమన్యు రెండవ స్థానంలో నిలిచింది. ఏనుగులు ప్యాలెస్ నుంచి ఎంతో క్రమశిక్షణతో వరుసగా వస్తుంటే నగరవాసులు, పర్యాటకులు ఉత్సాహంగా వీక్షించారు. ఇందులో మొదటి విడతగా 9 ఏనుగులు సుమారు 3 వారాల కిందటే మైసూరుకు వచ్చాయి. వాటి బరువు అప్పటితో పోలిస్తే కొంచెం పెరిగింది.

ఏనుగుల బరువు వివరాలు

- కెప్టెన్ అభిమన్యు– 5,300 కేజీలు
- అర్జున– 5,680 • గోపి–5,145
- సుగ్రీవ– 5,035
- ప్రశాంత్– 4,970
- ధనుంజయ– 4,990 • భీమ– 4,685
- మహేంద్ర– 4,660 • కంజన్–4,395
- రోహిత్–3,360 • హిరణ్య –2,915
- ఆడ ఏనుగులు విజయ– 2,885
- వరలక్ష్మి –3,170
- లక్ష్మి–3,235 కేజీలు

అతి వేగానికి నలుగురు మృత్యువాత

- ఆగి ఉన్న బస్సును ఢీకొన్న కారు
- ఒక మహిళ సహా నలుగురు మృతి
- మండ్య జిల్లాలో దుర్ఘటన
- మృతుల్లో బెంగళూరువాసులు



భీతావహంగా ఘటనాస్థలి



ఆర్టీసీ బస్సులోకి దూసుకెళ్లిన కారు

మండ్య: ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన మండ్య జిల్లా నాగమంగల తాలూకా ఆదిచుంచనగిరి ఆస్పత్రి ఎదురుగా బెంగళూరు–మంగళూరు జాతీయ రహదారి–75పై బుధవారం ఉదయం జరిగింది. తాలూకాలోని బెళ్లూరు క్రాస్ సమీపంలోని రోడ్డుపై ఆదిచుంచనగిరి ఆస్పత్రి ఎదురుగా ఆగి ఉన్న కేఎస్ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బెంగళూరు నివాసులైన బెండిగానహళ్లి సమిత, ఇన్ఫోసిస్ ఉద్యోగి, రాజస్తాన్‌వాసి పంకజ్‌శర్మ, హోసకోటకు చెందిన వంశీకృష్ణ, ధారవాడకు చెందిన రఘునాథ్ భజంత్రి మరణించారు. వీరందరూ 30–35 ఏళ్ల మధ్యవారు.

బస్సులోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికుల కోసం బస్సు నిలిచి ఉండగా హాసన్ వైపు నుంచి వచ్చిన ఈ స్విఫ్ట్ కారు ఢీ కొట్టింది. కారు డ్రైవర్ అదుపు తప్పడం కారణం. వేగం ధాటికి కారు ముందు సగ భాగం బస్సు లోపలికి చొచ్చుకుని పోయింది. కారులో ఉన్న ఒక మహిళ, ముగ్గురు పురుషులు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఎవరికీ గాయాలు కాలేదు. బెళ్లూరు పోలీసులు చేరుకుని పరిశీలించారు. కారును వెలికితీసి మృతదేహాలను బయటకు తీయడానికి శ్రమించాల్సి వచ్చింది.



కారులో మృతదేహాలు

అక్రమ కంచె యమపాశమైంది

కరెంటు షాక్‌తో ఇద్దరు రైతుల మృత్యువాత



ఘటనాస్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గౌరిబిదనూరు: తాలూకా లోని కురూడి గ్రామంలో ఒక రైతు అక్రమంగా వేసి విద్యుత్ కంచె తగిలి ఇద్దరు యువ రైతులు మృత్యువాత పడ్డారు. ఇందులో కంచె వేసిన రైతు కూడా ఉండడం గమనార్హం. వివరాలు.. కురూడిలో పొలంలోకి అడవి పందులు, జింకలు వచ్చి పంటను ధ్వంసం చేయకుండా రైతు అంబరీశ్ (28) కంచె వేసుకుని దానికి అక్రమంగా కరెంటు కనెక్షన్ ఇచ్చాడు. మంగళవారం రాత్రి వర్షం పడడంతో పక్క పొలం రైతు తిప్పేస్వామి (28) బుధవారం ఉదయం పొలం దున్నడానికి వచ్చాడు. పొలం దున్నుతూ అనుకోకుండా కంచెను తాకడంతో కరెంటు షాక్ కొట్టి విలవిలలాడుతుండగా పొలంలో ఉన్న రైతు అంబరీశ్ చూసి కాపాడడానికి వెళ్లాడు. కానీ ఇద్దరూ షాక్ కొట్టి ప్రాణాలు కోల్పోయారు.

విషయం తెలుసుకుని మృతుల కుటుంబీకులు సంఘటనాస్థలికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. మృతులు వివాహితులు కాగా, ఇద్దరు చొప్పున కూతుళ్లు ఉన్నారు. బంధువులు విలపిస్తుంటే ఏం జరిగిందో అర్థం కాక చిన్నారులు చూస్తుండడం అందరినీ కలచివేసింది. బెస్కాం అధికారులు, పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, ఈ ఘటనతో తమకు సంబంధం లేదని, రైతు అంబరీశ్ అక్రమంగా కరెంటు కనెక్షన్ ఇచ్చుకున్నాడని బెస్కాం అధికారి పరమేశి చెప్పాడు.



అంబరీశ్



తిప్పేస్వామి (ఫైల్)

వినూత్న సేద్యం.. అద్భుత ఫలసాయం

- వ్యవసాయంలో దిట్ట శేకమ్మ, హుచ్చప్ప దంపతులు
- రాళ్లభూమిలో బంగారు పంటలు పండిస్తున్న వైనం


తమ పొలంలో పండించిన సపోటా పంటను చూపుతున్న షేకమ్మ


వ్యవసాయ పనుల్లో పాలుపంచుకున్న హుచ్చప్ప, షేకమ్మ దంపతులు

సాక్షి బళ్లారి: శిలలపై శిల్పాలు చెక్కినారు. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు అని ఓ మహా కవి తన పాటను సృష్టించారు. శిలలపై శిల్పాలు చెక్కడం, విగ్రహాలు తయారు చేయడం చూస్తుంటాం. బండ రాళ్లతో భవంతులను నిర్మిస్తుంటారు. అయితే బండ రాళ్లు ఉన్న భూమిలో అద్భుతమైన వ్యవసాయాన్ని చేస్తున్న ఓ వీర దంపతుల విజయగాథ ఇది. వ్యవసాయం మాకు వద్దు ప్రతి ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని మంచి వ్యవసాయ యోగ్యమైన భూమి వదిలి ఎందరో నగరాలు, పట్టణాలకు వెళ్లి ఫ్యాక్టరీల్లో, కూలీ పనులు చేసుకుంటున్న రైతుల జీవితాల గురించి వింటుంటాం. వ్యవసాయమే తమ జీవనాధారమని పది మందికి అన్నం పెట్టి ఉపాధి కల్పించే వ్యవసాయాన్ని వదులుకోలేమని బండరాళ్ల భూమిలో వ్యవసాయం చేసి అద్భుత ఫలితాలను సాధించి ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ దంపతులు. కొప్పళ జిల్లా కల్లుతావరగెరె గ్రామంలో ఎటుచూసిన దాదాపు బండరాళ్లతో కూడిన భూములే కనిపిస్తాయి. 25 ఏళ్ల క్రితం అన్నదమ్ముల భూ పరిష్కారంలో భాగంగా షేకమ్మ, హుచ్చప్ప అనే దంపతులకు 16 ఎకరాల భూమి వాటాగా వచ్చింది. అందులో సగానికిపైగా పూర్తి బండలతో నిండి ఉంది.

బండలపై మట్టి వేసి పంటల సాగు

ఇలాంటి భూములో వ్యవసాయం ఏవిధంగా చేసుకొని జీవితం సాగించాలని ఆ దంపతులు ప్రారంభంలో కొంత ఇబ్బంది పడినా బండరాళ్లలోనే వ్యవసాయాన్ని చేసేందుకు నిర్ణయం తీసుకొని చుట్టు పక్కల ఉన్న మట్టిని బండలపై వేసి వ్యవసాయాన్ని చేసేందుకు ప్రారంభించారు. ప్రారంభంలో కూరగాయలు, ఆకు కూరలు, రాగి, జొన్న, తదితర పంటలను వేస్తూ అద్భుతమైన ఫలితాలను తీసుకురావడంలో విజయం సాధించారు. ప్రతి ఏటా ఈ బండ రాళ్ల మీదనే వేసిన మట్టి భూమిలో వివిధ పంటలను సాగు చేస్తూ లక్షలాది రూపాయల ఆదాయం పొందుతున్నారు. కూరగాయలు, ఆకు కూరలతో పాటు పూలు, పండ్ల తోటలను కూడా సాగు చేస్తున్నారు. మామిడి, సపోటా చెట్లు ఏపుగా పెరగడంతో మంచి దిగుబడితో పాటు పచ్చదనంతో కనిపిస్తున్నాయి. టమాటా, వంకాయ, నిమ్మ, సీతాఫలం, జామ, సజ్జ, బీట్‌రూట్ పంటలను ఈ భూమిలో ఈ దంపతులు అద్భుతంగా పండిస్తున్నారు. ఎత్తైన కొండలు, బండరాళ్లు ఉన్న ఈ భూమిలో అంతే స్థాయిలో పలు రకాల పచ్చని చెట్లు కూడా కనిపిస్తుండటంతో బండరాయి మీద వ్యవసాయం చేస్తున్న ఈ దంపతుల కృషి పలు రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది.

వ్యవసాయం తప్ప వేరే పని తెలియదు

ఈసందర్భంగా శేకమ్మ దంపతులు మాట్లాడుతూ తమ కుటుంబం వ్యవసాయ ఆధారిత కుటుంబమని చిన్నప్పటి నుంచి తమకు వ్యవసాయం తప్ప వేరే పని తెలియదన్నారు. తమ గ్రామం పేరే కల్లుతావరగెరె అని, తమకు 25 ఏళ్ల క్రితం తమ వాటాగా 16 ఎకరాల భూమి వచ్చిందన్నారు. అందులో 80 శాతం పైగా బండరాళ్లు ఉన్నాయని, దీంతో వ్యవసాయం ఎలా చేసుకొని జీవించాలా అని మధనపడ్డామన్నారు. అయితే దేవుడి ఆశీస్సులతో నిరాశ చెందకుండా రాతి బండలనే కరిగించినట్లుగా తాము వ్యవసాయాన్ని చేసేందుకు నిర్ణయించుకొని ప్రతి రోజు ఇంటి వద్ద సద్ది కట్టుకొని భార్యభర్తలం ఇద్దరు పొలానికి వెళ్లి వ్యవసాయం చేయడాన్ని ప్రారంభించి చుట్టుపక్కల ఎత్తైన భూమి, చెరువులో ఉన్న మట్టిని రాతి బండల మీద వేసి వివిధ రకాల పంటలను పండించడం ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి తాము వ్యవసాయంలో వెనుదిరిగి చూడలేదని తమ పొలం ప్రస్తుతం రాళ్లతో నిండిపోకుండా పచ్చదనం, వివిధ పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే ఎన్నటికి నష్టాలు రావని, వచ్చినా తాత్కాలికమేనని ఖచ్చితంగా భగవంతుని కృప రైతులపై ఉంటుందని నిరూపితమైందన్నారు.

నకిలీ ఉద్యోగాల కేటుగాడు అరెస్టు!

- న్యాయం చేయాలని బాధితుల మొర


ఉద్యోగాల పేరిట టోకరా వేసిన రాయచోటి శశి(ఫైల్) మరో కిలాడీ లేడీ


బెంగళూరుకు చెందిన ఓ లేడీ ఖాతాలోకి డబ్బు మళ్లించిన బాధితులు

అనంతపురం క్రైం: బీటెక్ విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని బెంగళూరులో ఐటీ ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు దండుకున్న మోసగాడు శశిని చిత్తూరు జిల్లా కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 150 మందిని ఇలా మోసగించినట్లు తెలుస్తోంది. కుప్పంలోనూ అనేకమంది బాధితులు ఉన్నారు. వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం ఉదయం రాయచోటిలోని స్వగృహంలో శశిని తీసుకున్నారు. అనంతపురంవాసులు కూడా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తాము కట్టిన డబ్బు తిరిగి రాదేమోనని వాపోతున్నారు. స్థానిక ఏజెంట్లు శశితో భాగస్వామ్యంతో ఈ పనులు చేశారని చెబుతున్నారు. తీరా డబ్బు కోసం నిలదీస్తుండటంతో టీడీపీలోని బలమైన నేతల పేర్లను సాకుగా చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. అతని చేతిలో మంది అల్లరి మూకలు, రౌడీషీటర్లు అండగా ఉండటంతో గట్టిగా నిలదీయలేక పోతున్నామంటున్నారు.

బెంగళూరుకు చెందిన ఒక మహిళ కూడా ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి రూ.లక్షలాది డబ్బు తీసుకుందని బాధిత విద్యార్థులు తెలిపారు. ఏడాది దాటినా ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బుకోసం ఒత్తిడి పెంచడంతో వైఎస్సార్ జిల్లాకు చెందిన కొందరు పోలీసుల ద్వారా బాధితులను బెదిరిస్తోంది. మహిళకు ఎందుకు మీరు ఫోన్ చేస్తున్నారంటూ పోలీసులు తమను గద్దిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

బాలుర మధ్య ఘర్షణ..ఒకరి హత్య

హుబ్లీ: ఇన్‌స్టాగ్రామ్‌లో బాలుర మధ్య జరిగిన వివాదం ఓ బాలుడి హత్యకు దారి తీసిన ఘటన బెళగావిలో జరిగింది. భవన నిర్మాణ కార్మికుడిని దారుణంగా మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తుండగా ఒకే ఊరికి చెందిన బాలుర మధ్య కిత్తూరు తాలూకా మల్లాపుర గ్రామానికి చెందిన ప్రజ్వల్ సుంకద(16) హతుడు. మల్లప్ప, మల్లవ్వ దంపతుల రెండో కుమారుడు ప్రజ్వల్ ఇటీవలే కాలేజీ మెట్లు ఎక్కారు. ఇటీవల తమ ఊరికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ గ్రూప్‌లో ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో మాటమాటా పెరిగి వికోపానికి దారి తీయడంతో హత్యతో అంతమైంది. హతుడు తన ఇంటి వద్ద ఉండగా ఐదుగురు బాలుర బృందం అకస్మాత్తుగా దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ప్రజ్వల్‌ను బెళగావి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం దక్కలేదు. మంగళవారం అర్ధరాత్రి చికిత్స ఫలించక ప్రాణాలు వదిలాడు. ఘటనపై హతుడి బంధువు బసప్ప మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల మహాప్రసాదం పంపిణీ వేళ ఈ ఘటన జరిగిందన్నారు. వీరి మధ్య ఏం జరిగిందో తనకు తెలియదని, సమస్య ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవడం మంచిదన్నారు. అయితే హత్యకు దారి తీయడం, ఇంత చిన్నవయస్సులోనే బాలురు దారుణ హత్యకు పాల్పడటం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యువకుడి దారుణ హత్య

అలాగే పట్టపగలే ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన హుబ్లీ స్లివర్‌టౌన్‌లో జరిగింది. మృత యువకుడిని ఉత్తర కన్నడ జిల్లా ముండగోడ తాలూకా మరగడి గ్రామ నివాసి మౌలాలి(24)గా గుర్తించారు. ఇతడు కూడా హుబ్లీకి కట్టడ నిర్మాణ కార్మికుడిగా వచ్చారు. నిర్మాణ దశలోని ఇంట్లోనే మంగళవారం రాత్రి దుండగులు హత్య చేసి పరారయ్యారు. గోకుల్ రోడ్డు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఆనెగుందిని అభివృద్ధి చేస్తా


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: తాలూకాలోని ఆనెగుందిలో యాత్రి నివాసాలు, రోప్‌వే, యాత్రికులకు కావాల్సిన ఇతర సౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆయన తాలూకాలోని ఆనెగుంది గ్రామంలోని హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని మొక్కకు నీరు పోసి ప్రారంభించి మాట్లాడారు. రామాయణ కాలం నాటి అవశేషాలు, శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి చారిత్రక నిర్మాణాలు, పవిత్రమైన రాజశ్రీ దుర్గాదేవి దేవస్థానం, ప్రపంచంలోనే నాలుగు సరోవరాల్లో ఒకటైన పంపా సరోవర్, ఆంజనేయ స్వామి జన్మస్థలం అంజనాద్రి బెట్ట, రుష్యమూక, ఇతర శ్రీకృష్ణదేవరాయల 64 స్తంభాల సమాధి, నవబృందావనం కలిగిన చారిత్రక పవిత్ర పుణ్యభూమి ఆనెగుంది అన్నారు. ఈ ప్రాంతానికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వీటిని చూసేందుకు విచ్చేస్తుంటారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం తన అధికార అవధిలో కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ డైరెక్టర్ డీ.నాగరాజ్. డాక్టర్ వెంకటేష్, జీపీ అధ్యక్షులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించరూ

రాయచూరు రూరల్: నగరంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు పునరావాసం కల్పించాలని ఫుట్‌పాత్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు యేసుమిత్ర డిమాండ్ చేశారు. ఆయన బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను ద్దేశించి మాట్లాడారు. స్టేషన్ రహదారిలో రంగ మందిరం వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులను నెల రోజుల క్రితం నగరసభ, పోలీస్ యంత్రాంగం తొలగించారని, తమకు పునరావాసం కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ప్యాలెస్‌లో సందడిగా పర్యావరణ దినోత్సవం


పర్యాటకులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మైసూరు: రాచనగరి మైసూరు అంబావిలాసం ప్యాలెస్ ఆవరణలో బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. పర్యాటక శాఖ, ప్యాలెస్ మండలి, మైసూరు ట్రావెల్స్ అసోసియేషన్, మైసూరు హోటల్స్ అసోసియేషన్ భాగస్వామ్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్యాలెస్ దక్షిణద్వారంలో జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర, నగర పోలీసు కమిషనర్ బి.బానోత్, వివిధ కళాబృందాలు విదేశీయులు, ఇతర పర్యాటకులకు గులాబీ పూలను, మైసూరు పాక్, టూర్ గైడ్‌ను ఇచ్చి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

పౌర కార్మికుల సంక్షేమానికి చర్యలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పౌర కార్మికుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో నిర్వహించిన పౌర కార్మికుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు నీరు తదితర సౌకర్యాలను అందిస్తామన్నారు. పట్టణంలో స్వచ్ఛతను కాపాడడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామన్నారు. నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడానికి కృషి చేస్తున్న పౌర కార్మికులు తమ వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యతనివ్వాలన్నారు. పౌర కార్మికులు తమ పిల్లలకు ఉత్తమ విద్యాభ్యాసం అందించాలన్నారు. రూ.25 కోట్లతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు అమాని చెరువును అభివృద్ధి చేసి బోటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ, జెడ్పీ సభ్యుడు తూపల్లి ఆర్.నారాయణస్వామి, పురసభ మాజీ ఉపాధ్యక్షురాలు ఆయిషా నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూగజీవాలను రక్షించిన పోలీసులు


స్వాధీనం చేసుకున్న వాహనాలు,పశువులు

మైసూరు: కేరళకు అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న వందకు పైగా పశువులను పోలీసులు రక్షించారు. ఈ ఘటన హెచ్‌డీ కోటె తాలూకా అంతరసంతెలో జరిగింది. రెండు కంటైనర్లు, ఐదు బొలేరో వాహనాల్లో పశువులను తరలిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో అంతరసంతె పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను నిలువరించారు. అయితే నిందితులు బారికేడ్లను తోసుకుంటూ వాహనాలను పరుగెత్తించారు. పోలీసులు వెంటాడి వాహనాలను అడ్డుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పశువులను మైసూరు పింజరాపూల్ సంస్థకు అప్పగించారు.

ఆధార్ సీడింగ్‌ను వ్యతిరేకిస్తూ ర్యాలీ

కంప్లి: తమ పంపుసెట్లకు ఆధార్ జోడించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు రైతు సంఘం తాలూకా అధ్యక్షులు శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగప్ప పేర్కొన్నారు. బుధవారం కొట్టూరు పట్టణంలో రైతాంగం ప్రముఖ వీధుల్లో ర్యాలీ నిర్వహించి తాలూకా కార్యాలయం శిరస్తెదార్‌కు వినతిపత్రాన్ని అందించారు. కరువు వచ్చి వర్షాలు లేక రైతాంగం పరిస్థితి అయోమయంలో ఉండగా మూలిగే నక్కపై తాటికాయ పడినట్టుగా పంపుసెట్ మీటర్లకు ఆధార్ తప్పనిసరి అని ప్రకటించడం రైతు వ్యతిరేక విధానమని, దీనిని తాము అంగీకరించబోమని రాష్ట్ర రైతు సంఘం హసిరు సేన హెచ్చరించింది. ఈసందర్భంగా రైతు ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


టీకా వేస్తున్న దృశ్యం

చింతామణి: పశువులకు కాలుబాయి తదితర వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని కోచిముల్ డైరెక్టర్ అశ్వర్థనారాయణబాబు రైతులకు సూచించారు. తాలుకాలోని కైవార హోబళి జంగమశీగేహళ్లి పాలు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు బుధవారం పశువులకు టీకాలు వేశారు. వైద్యులు చెన్నకేశవరెడ్డి, వీరరాజు, మస్తేనహళ్లి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు రోజా పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవ పూజలు


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మాలూరు: తాలూకాలోని చిక్కతిరుపతి శ్రీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవంలో భాగంగా బుధవారం వివిధ పూజలను నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు. ప్రధాన అర్చకులు రవి, గోపాలకృష్ణ భారద్వాజ్, ఎన్.శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. లోకకళ్యాణం కోసం హోమ హవనాలను చేశారు. పూర్ణాహుతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

కొట్టూరులో ఫార్మసీ కళాశాల

కంప్లి: ఈ ప్రాంతంలో ఫార్మసీ కళాశాల లేనందున విద్యార్థులు ఇతర తాలూకాలు, జిల్లాలకు వెళ్తున్న నేపథ్యంలో సంఘం పరంగా తమ తాలూకాలోనే ఫార్మసీ కళాశాల నిర్మించనున్నట్టు కొట్టూరు తాలూకా కురుబ విద్యావర్ధక సంఘం అధ్యక్షులు డీ.మూగప్ప వెల్లడించారు. కొట్టూరు పట్టణంలో తాలూకా కురుబ సంఘం తరపున ఏర్పాటు చేసిన తాలూకా హాలుమత సమాజ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ తాలూకా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి సమాజానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.

ఇద్దరు సైనికుల మధ్య రగడ

- గాలిలోకి కాల్పులు, ఒకరికి గాయాలు

సాక్షి,బళ్లారి: ఆర్థిక లావాదేవీల్లో ఇద్దరు సైనికుల మధ్య గొడవ జరగడంతో ఒకరిపై మరొకరు కాల్పులు జరుపుకున్న ఘటన బెళగావి జిల్లాలో జరిగింది. గోకాక్ తాలూకా రాజనకట్టె గ్రామంలో నంజుండి లక్ష్మణ అనే వ్యక్తి బసవరాజ్‌పై కాల్పులు జరపడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ భారత సైన్యంలో సైనికులుగా గుర్తించారు. ఈ ఘటనపై జిల్లా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతులకు భూములు తిరిగివ్వాలి

సాక్షి, బెంగళూరు: నైస్ ప్రాజెక్టు పేరిట అక్రమంగా కబళించిన 11 వేల ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి రైతులకు ఇచ్చేయాలని లేదంటే పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సింగూరు తరహా పోరాటం చేపడుతామని జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే భవన్‌లో నైస్ బాధిత రైతుల పోరాట సమితి, కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఏర్పాటుచేసిన సమావేశంలో కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. నైస్ భూములను కోల్పోయిన రైతుల పోరాటానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీనిచ్చారు.

కార్వారకు చేరిన విమానం

బనశంకరి: గత కొద్ది ఏళ్లుగా నిరీక్షిస్తున్న టుపలోవ్-142 యుద్ధ విమానం ఎట్టకేలకు కార్వారకు చేరుకుంది. 9 భారీ ట్రక్కుల ద్వారా విమానాన్ని విడిభాగాలుగా మార్చి చెన్నై నుంచి తీసుకొచ్చారు. దానిని మళ్లీ విమానంగా కూర్చుచేస్తారు. భారత సైన్యానికి చెందిన ఈ పాతతరం విమానాన్ని కార్వారలోని నౌకాదళ స్థావరం కదంబలోని యుద్ధనౌకల మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచుతారు. నిజానికి 2020 డిసెంబరులో ఈ విమానాన్ని తరలించాల్సి ఉండగా కరోనా వల్ల ఆలస్యం అయ్యింది.

ముందు నా గురించి తెలుసుకో ?

సీటీ రవిపై రేణుకాచార్య మండిపాటు

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి అనంతరం స్వంత పార్టీ నాయకులపై ఆరోపణలు చేస్తూ వచ్చిన మాజీ మంత్రి రేణుకాచార్య తాజాగా మాజీ ఎమ్మెల్యే సీటీ రవిపై నిప్పులు కక్కారు. రేణుకాచార్య నాట్ రీచ్‌బుల్ అంటూ ఇటీవల సీటీ రవి వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన రేణుకాచార్య...'నేను చిన్న బిడ్డకాదు. సంఘటన, పోరాటం ద్వారా రాజకీయాల్లోకి వచ్చాను. నన్ను విమర్శించే ముందు నా గురించి తెలుసుకోవాలి' అని సీటీ రవిపై ఎదురుదాడి చేశారు. ఆయన బుధవారం దావణగెరెలో విలేకర్లతో మాట్లాడారు. మాజీ సీఎం యడ్యూరప్ప ప్రోత్సాహంతో తాను రాజకీయంగా ఎదిగానని, నిన్నమొన్న వచ్చిన వ్యక్తిలా మాట్లాడటం సరికాదన్నారు. ఎవరో దావణగెరెకి వచ్చి ఆరోపణలు చేస్తే సరిపోదు. దావణగెరె ఎంపీ టికెట్ ఆకాంక్షి తానేనని అని స్పష్టం చేశారు.

గాంధీ గ్రామ పురస్కారానికి మురగమల్ల ఎంపిక


గ్రామ పంచాయితీ అధ్యక్షుడు అన్సర్‌ఖాన్‌ను పూలదండలతో సత్కరించిన దృశ్యం

చింతామణి: వివిధ అభివృద్ధి పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజలకు సదుపాయాలు కల్పించిన గ్రామాలకు అందించే గాంధీ పురస్కారానికి చింతామణి తాలూకాలోని మురగమల్ల గ్రామ పంచాయతీ ఎంపికైంది. ఎంపిక చేసిన పంచాయతీకి రూ.5లక్షల నిధులు విడుదల చేస్తారు. పంచాయతీ గాంధీ పురస్కారానికి ఎంపిక కావడంతో అధ్యక్షుడు అన్సర్‌ఖాన్‌ను అధికారులు బుధవారం ఘనంగా సత్కరించారు.

కోలారు వార్తలు...

ఎస్పీ, ఎమ్మెల్యేపై చర్యలకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోలారు: జనతా దర్శన్‌లో ఎంపీ ఎస్.మునిస్వామిపై దౌర్జన్యానికి పాల్పడిన ఎస్పీ ఎం.నారాయణ, ఎమ్మెల్యే ఎస్.నారాయణస్వామిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు బుధవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జిల్లాధికారికి వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన ఎంపీపై ఎమ్మెల్యే, ఎస్పీలు ఇద్దరు అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమంలో అధికారులు సరిగా ప్రోటోకాల్‌ను పాటించలేదని ఆరోపించారు. ఎస్పీ తానొక అధికారిని అనే విషయాన్ని కూడా మరచిపోయారన్నారు. ఎస్పీ, ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ నాయకులు నారాయణస్వామి, కెంబోడి నారాయణస్వామి, హనుమంతప్ప, తిమ్మరాయప్ప, గాంధీ నగర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న శివలింగ గణపతి


మంగళగౌరికి పూజలు నిర్వహించిన దృశ్యం

కోలారు: తాలూకాలోని వక్కలేరి శ్రీశక్తి వినాయక భక్త మండలి ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతిష్ఠించిన హిమాలయ పర్వతంలో శివలింగాన్ని మోస్తున్న వినాయకుడిని ప్రతిష్ఠించి నిత్యం ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వినాయకుడిని చూడడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు వినాయక భక్త మండలి వారు ప్రసాదం పంచుతున్నారు. బుధవారం మంగళగౌరి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం కోసం వచ్చిన భక్తులకు గాజులు, పసుపు కుంకుమ ఇచ్చి పంపారు.

రుణాలు తిరిగి చెల్లిస్తే సంఘం బలోపేతం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: సహకార రంగంలో రైతులు తీసుకున్న రుణాలు తిరిగి సకాలంలో చెల్లిస్తే సహకార సంఘం మరింత బలపడడానికి సాధ్యమవుతుందని క్యాసంబళ్లి ప్రాథమిక వ్యవసాయ సేవా సహకార సంఘం అధ్యక్షుడు విజయరాఘవరెడ్డి తెలిపారు. బుధవారం కెంపాపుర ప్రాథమిక వ్యవసాయ పరపతి సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. సహకార రంగం రైతుల వెన్నెముక అంటే ఎలాంటి అతిశయోక్తి కాదన్నారు. ప్రతి సంవత్సరం రైతులు పంటలు పండించడానికి అవసరమైన ఎరువులు, మందుల సహాయానికి సహకార సంఘాల నుంచి వడ్డీ లేని రుణాలు అందిస్తోందన్నారు. రుణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తే మరింత మందికి రుణాలు అందించడానికి వీలవుతుందన్నారు. సహకార రంగం మరింత సదృఢమవుతుందన్నారు. ఈ సొసైటీ నుంచి వందల సంఖ్యలో రైతులకు వడ్డీలేని రుణాలు అందించారన్నారు. భవిష్యత్తులో మరింత మంది రైతులకు రుణాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, ఘట్టమాదమంగల జీపీ ఉపాధ్యక్షుడు జయరామరెడ్డి, ఎన్‌టీఆర్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ మునివెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

జలసంరక్షణపై వీధి నాటకంతో అవగాహన


వీధి నాటకం ప్రదర్శిస్తున్న దృశ్యం

కోలారు: నగరంలోని హారోహళ్లిలో యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రం, ఈ నెల, ఈ జల, సంస్కృతి ఆధ్వర్యంలో మూడో దశ జల సంరక్షణపై వీధి నాటకం ద్వారా అవగాహన కలిగించారు. వీధి నాటకంలో కళాకారులు ఈ నెల ఈ జల వెంకటాచలపతి, కుడుపనహళ్లి ఎన్.గణేశప్ప, గమన సంధ్య, సునీత, వెంకటరాం, అంజలి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న విద్యార్థులు, మహిళలు


విచ్చలవిడిగా తిరుగుతున్న వీధికుక్కలు

కేజీఎఫ్: నగరంలో వీధి కుక్కల ఆగడాలు రోజురోజుకు అధికమవుతూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. నగరంలోని 35 వార్డుల్లోను ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వీధి కుక్కల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో నగరసభ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని నగరవాసులు ఆరోపిస్తున్నారు. గత జనవరి నెల నుంచి ఆగస్టు చివరి వారం వరకు నగరంలో 140 మందికి పైగా కుక్కల దాడిలో గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ప్రముఖంగా పాఠశాలలకు వచ్చి వెళ్లే విద్యార్థులు, చిన్నారులపై దాడులు చేస్తూ తల్లిదండ్రులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లిన తమ పిల్లలు తిరిగి ఇంటికి ఎలా వస్తారోనని వారు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నగరంలో నెలకొంది. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న గ్రామ సింహాలు అకస్మాత్తుగా దారిన పోయే వారిపైన దాడులకు దిగుతున్నాయి. దీంతో పాదచారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. మాంసం దుకాణాల వద్ద మాంసం తిని మరిగిన కుక్కలు దారిన వెళ్లే వారిపై దాడి జరిపి గాయపరచడం పరిపాటిగా మారిపోయింది. వీధి కుక్కల బెడదకు అడ్డుకట్టపై స్పందించిన నగరసభ ఏఈఈ మంజునాథ్ కుక్కలకు సంతానహరణ చికిత్సలు చేయడానికి గ్లోబల్ రెస్క్యూ టీంకు టెండర్ ఇచ్చామన్నారు. నగరంలోని వేయికి పైగా కుక్కలకు సంతానహరణ చికిత్సలు చేయిస్తామన్నారు.

క్లుప్తంగా

ధార్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతి



వరమహాలక్ష్మి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: ధార్మిక కార్యాచరణలో గ్రామ ప్రజల భాగస్వామ్యం ప్రజల ఐక్యతకు నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవినారాయణరెడ్డి తెలిపారు. విదురాశ్వత్థంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక వరమహాలక్ష్మి పూజలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వరమహాలక్ష్మీ పూజలతో ప్రతి కుటుంబంలోనూ శాంతి నెలకొంటుందని, తద్వారా సమాజంలో సుఖశాంతులు నెలకొంటాయని తెలిపారు. జెడీఎస్ మాజీ అధ్యక్షుడు ఆదిమూర్తి, ప్రకాశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ధూమపానం వద్దు

కృష్ణరాజపురం: చట్ట వ్యతిరేకంగా పాన్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణదారులను ఆరోగ్యాధికారులు హెచ్చరించారు. హొసకోటె తాలూకా సౌఖ్య రోడ్డులోని దుకాణాలు, హోటళ్లలో సోదాలు చేశారు. ధూమపానం నిషేధం అనే బోర్డును ఏర్పాటు చేయని యజమానులపై, అలాగే ఆరుబయట పొగ తాగుతున్నవారిని తాలూకా ఆరోగ్య పర్యవేక్షణాధికారి గురురాజ్, అధికారులు మందలించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను అందించి అవగాహన కల్పించింది.

భూస్వాధీన ప్రక్రియ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న మంత్రి పరమేశ్వర్

తుమకూరు: అభివృద్ధి పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర సూచించారు. జిల్లాధికారి కార్యాలయంలో వివిధ ప్రాజెక్టులు, పథకాలకు సంబంధించి భూస్వాధీన ప్రక్రియపై మంత్రి సమీక్షించారు. హేమావతి కాలువ, ఎత్తిపోతల ప్రాజెక్టు, కేఐఏడీబీ, జాతీయ రహదారి -206 , తుమకూరు-దావణగెరె రైల్వే, తుమకూరు-రాయదుర్గ రైల్వే నిర్మాణ పనులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. భూ యజమానులకు పరిహారాన్ని త్వరగా ఇచ్చి ప్రాజెక్టు పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు.

విదురాశ్వత్థాన్ని సందర్శించిన విద్యార్థులు



పిల్లలతో ఉపాధ్యాయులు

గౌరిబిదనూరు: పర్యాటక దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు బుధవారం విదురాశ్వత్థాన్ని సందర్శించారు. ఈ ప్రాంత విశిష్టతను ఇక్కడి గ్రంథాలయ అధికారి రామకృష్ణ వివరించారు. దేశస్వాతంత్ర కోసం జరిగిన పోరాటంలో 1938 ఏప్రిల్ 25న ఆంగ్లేయుల తుపాకీ తూటాలకు ఇక్కడ వందలాదిమంది బలైన ఉదంతాన్ని వివరించారు. అదేవిధంగా ఇక్కడ విదురుడు నాటిన అశ్వత్థవృక్షం ఉన్నందున ఈ ప్రాంతానికి విదురాశ్వత్థంగా పేరు వచ్చిందని తెలిపారు. ఉపాధ్యాయుడు కృష్ణప్ప పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



బారులు తీరిన రైతులు

దొడ్డబళ్లాపురం: గత పది రోజులుగా తాలూకాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో యూరియాకు ఎక్కడా లేనంతగా డిమాండ్ పెరిగింది. అయితే ప్రస్తుతం దొడ్డబళ్లాపురం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తగినంత యూరియా లభించడం లేదు. పట్టణంలోని ఏపీఎంసీలో 29 టన్నుల స్టాక్ ఉండగా రైతులు తెల్లవారుజామునే అక్కడకు చేరుకుని గంటలకొద్దీ బారులుతీరి నిలబడుతున్నారు. స్టాకు తక్కువగా ఉండడంతో ఒకరికి ఒక మూట యూరియా మాత్రమే ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సమాచారం ప్రకారం మంగళూరు నుంచి గూడ్స్ రైలులో 150 టన్నుల యూరియా వస్తోందని తెలిసింది.

రమణీయం పడుబిద్రి బీచ్ సౌందర్యం



సుందరమైన పడుబిద్రి బీచ్



బీచ్‌లో ఇసుకతిన్నెల మధ్య పర్యాటకుల సందడి

బనశంకరి: పడుబిద్రి బీచ్ కర్ణాటకలోని దక్షిణ కన్నడ ఉడుపి జిల్లాలో ఉంది. ఈ బీచ్ పడుబిద్రి అనే చిన్న పట్టణంలో ఉంది. ఇది రెండేళ్లకు ఒకసారి నిర్వహించే డక్కేబలి ఆచారానికి ప్రసిద్ధి. ఇక్కడ అధికభాగం తుళువ జాతికి చెందినవారు. జాతీయ రహదారి 17 ఈ చిన్నపట్టణం గూండా వెళుతుంది. ఉడుపి-మంగళూరు మార్గంలో ఉంది. నిశ్శబ్ద సముద్రతీరంలో వినోదం, సాహసం చేసేవారికి పడుబిద్రి బీచ్ సరైన ప్రదేశం. కర్ణాటక తీరం వెంబడి ఉన్న ప్రసిద్ధ బీచ్‌లు తరహాలో రద్దీగా లేకున్నప్పటికీ పడుబిద్రి బీచ్ వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ రైడ్లకు ప్రసిద్ధి. పడుబిద్రిబీచ్ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. సూర్యాస్తమయాన్ని చూస్తూ ఆహ్లాదకరమైన సాయంత్రం కోసం ఎదురుచూసే వారికి ఇది సరికొత్త ప్రదేశం. ఈ బీచ్ పడుబిద్రి పట్టణానికి కిలోమీటరు దూరంలో కలదు. బీచ్ చాలా పొడవుగా ఇసుకతో నిండి ఉంటుంది. తాటిచెట్లు పుష్కలంగా కలిగి ఉంటాయి. ఈ బీచ్ ప్రధాన భాగం ఇంటర్‌లాక్‌టైల్స్‌తో సుగమం చేయబడింది. పర్యాటకుల కోసం పార్కులో బెంచీలు ఏర్పాటు చేశారు. సూర్యాస్తమయం సమీపిస్తున్న కొద్దీ సురత్కల్ కాప్‌లోని లైట్‌హౌస్‌లు నుంచి వెలుగుతున్న లైట్లు చూడవచ్చు. ఇది చూడటానికి సుందరమైన దృశ్యం. జాతరలు, టోర్నమెంట్లు, పోటీలు, సంగీత కార్యక్రమాలతో పాటు పెద్దలు, పిల్లలు కలిసి ఈ బీచ్‌లో అనేక ఆటలు నీటి క్రీడలైన బీచ్ వాలీబాల్, స్పీడ్‌బోట్‌రైడ్, అరటి పడవ ప్రయాణం, వాటర్ స్కూటర్ రైడ్ ఆస్వాదించవచ్చు. పడుబిద్రి బీచ్‌లో ఏడాదిలో కొన్నిరోజుల్లో పడమర దిశలో సూర్యుడు అస్తమించడం తూర్పు నుంచి చంద్రుడు ఒకేసారి ఉదయించడం చూడవచ్చు. కసర్కోడ్ బీచ్‌తో పాటు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన కర్ణాటకలోని రెండవ బీచ్ పడుబిద్రి. డెన్మార్క్ ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ద్వారా సర్టిఫికేషన్ ఇవ్వబడింది. పడుబిద్రి బీచ్ గ్లోబల్ మ్యాప్‌లో పర్యాటక ప్రాంతాల్లో స్థానం దక్కించుకుంది. అంతర్జాతీయ ఫౌండేషన్ తనిఖీ చేసిన తరువాత పడుబిద్రి బీచ్ ఈ ఎకో-లేబుల్‌ని పొందింది.



పర్యాటకులకు ఏర్పాటు చేసిన కుర్చీలు



బీచ్ వద్ద సూర్యాస్తమయం

బీచ్ సమీపంలో ఆకర్షణలు

ఉడుపిలోని చిన్న పట్టణం పడుబిద్రి బీచ్, దేవాలయాలకు ప్రసిద్ధి చెందింది. సెలవులు, వీకెండ్ విరామం, ప్రసిద్ధ ఆలయ ఉత్సవాలకు హాజరయ్యేందుకు వేల సంఖ్యలో ప్రజలు ఏడాది పొడవునా ఈ పట్టణానికి వస్తారు. మహాలింగేశ్వర, మహాగణపతి ఆలయాలు ఇక్కడ ప్రసిద్ధి. పడుబిద్రి పట్టణంలో అన్ని ప్రదేశాల్లో అత్యంత పవిత్రమైనదిగా పరిగణించే పడుబిద్రి బ్రహ్మస్థానం ఒక చిన్న అడవి మధ్య ఉంది. ఈ ప్రదేశం ఖడ్గేశ్వరి అని పిలువబడే వనదుర్గా దేవతకు అంకితం చేయబడింది. ఈ ప్రాంతం బీచ్ నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే డక్కేబలి బ్రహ్మస్థానం పవిత్ర కార్యక్రమం. ఇది జనవరి నుంచి మార్చి మధ్య వరకు నిర్దిష్ట రాత్రుల్లో జరుగుతుంది.



బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు



ఇసుకలో సరదాగా ఆటలు

పౌష్టికాహారంపై అవగాహన



హృదయం ఆకారంలో ఆకు కూరలు, కూరగాయలు

మైసూరు: ప్రధాన మంత్రి పోషణ్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాలూకాలోని మెల్లహళ్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పౌష్టికాహారం విశిష్టత, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పప్పుదినుసులు, చేపలు, విత్తనాలు తదితర ఆహార పదార్థాలను వివిధ రంగుల్లో ముగ్గుల ద్వారా, వివిధ ఆకారాల్లో తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు.

సాలుమరద తిమ్మక్క డిశ్చార్జ్

యశవంతపుర: అనారోగ్యంతో బాధపడుతూ హాసన జిల్లా బేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మశ్రీ సాలుమరద తిమ్మక్క డిశ్చార్జ్ అయ్యారు. జ్వరం, ఒంటి నొప్పులతో ఆమె ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్సలు తీసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడటంతో వైద్యులు బుధవారం ఆమెను డిశ్చార్జ్ చేశారు. అయితే ఆమె ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పాలన యంత్రం ఇద్దరు నర్సులను ఇంటివద్దనే నియమించింది.

బంద్‌కు వాణిజ్యమండలి మద్దతు

యశవంతపుర: తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన కర్ణాటక బంద్‌కు చలనచిత్ర వాణిజ్య మండలి సంపూర్ణంగా సహకరిస్తున్నట్లు అధ్యక్షుడు ఎస్ఎం సురేశ్ తెలిపారు. బంద్‌కు సంబంధించి జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. వానలు లేని కారణంగా రాష్ట్రంలో జలాశయాలు అడుగంటాయని, ఈ పరిస్థితిని తమిళనాడు రాష్ట్రం అర్థం చేసుకొని కర్ణాటకకు సహకరించాలని సా.రా. గోవిందు డిమాండ్ చేశారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



శారదా పాటిల్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కేంద్రమంత్రి భగవంత ఖూబా

యశవంతపుర: మాజీ ముఖ్యమంత్రి, దివంగత వీరేంద్రపాటిల్ సతీమణి శారద పాటిల్ అంత్యక్రియలు బుధవారం బంధుమిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య జరిగాయి. చించోళి పట్టణంలోని పబ్లిక్ పాఠశాలలో ఆమె భౌతికకాయాన్ని ప్రజల దర్శనార్థం ఉంచారు. కేంద్రమంత్రి భగవంత ఖూబా, ఎమ్మెల్యే అల్లమప్రభు పాటిల్, మాజీ మంత్రి బాబురావ్ చవ్హాణ్ హాజరై శారదా పాటిల్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం భర్త సమాధి పక్కనే లింగాయత సముదాయ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



చిన్నారి కింద పడకుండా పట్టుకున్న యువకుడు

దొడ్డబళ్లాపురం: యువకుడి సమయస్ఫూర్తితో 6నెలల చిన్నారి ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఒక కారులో ఇద్దరు దంపతులు తమ 6నెలల చిన్నారితో రామనగర బస్టాండ్‌కు వచ్చారు. భర్త కారు పార్క్ చేసి చిన్నారిని ఎత్తుకుని కారు దిగాడు. తర్వాత భార్య కూడా కారు దిగే క్రమంలో అనుకోకుండా హ్యాండ్ బ్రేక్‌పై చేయివేయడంతో కారు ముందుకు కదిలింది. కారు నిలిపే ప్రయత్నంలో భర్త చేతిలోని చిన్నారి కిందకు పడుతుండగా అక్కడే ఉన్న యువకుడు పట్టుకుని కాపాడాడు.

సైబర్ భద్రతకు సాంకేతికతను అందించాలి

- ఐటీ సంస్థలకు హోం మంత్రి పిలుపు

బనశంకరి: అంతరిక్షభద్రత, పరిశోధన కోసం సిలికాన్ సిటీలో ఆధునిక సైబర్ స్పేర్ సెంటర్‌ఆఫ్ ఎక్సలెన్సీ కేంద్రం ఏర్పాటుచేస్తామని హోంమంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ తెలిపారు. ఐటీ సంస్థలతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన టెక్‌ఫ్యూశన్ సన్‌రైస్‌సమ్మిట్-2023లో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఐటీబీటీ కంపెనీల సాంకేతికపరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రైవేటు భాగస్వామ్యంలో సైబర్‌నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు తో పాటు అనేక అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామన్నారు. ప్రజల భద్రతకు, సైబర్‌సురక్షతకు, సోషల్ మీడియాపై నిఘాకు సైబర్ స్పేర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కేంద్రం పనిచేస్తుందన్నారు. భారత్ ప్రపంచంలోనే 3 వ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని, దీనికి దోహదమైన బెటర్ బెంగళూరు, బెటర్ కర్ణాటక, బెటర్ ఇండియా అనే ధ్యేయంతో పనిచేయాలన్నారు. మంగళూరు, బెళగావి, హుబ్లీ, ధారవాడ, మైసూరు ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేవారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీపీ అలోక్‌మోహన్, నగర పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు కమల్‌పంత్, ప్రతాప్‌రెడ్డి, వివిధ ఐటీబీటీ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

ప్రైవేటు సంస్థలు చేయూతనివ్వాలి

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టే పనులకు పెద్ద పరిశ్రమలతో పాటు చిన్న, సన్నకారు పరిశ్రమలు, ప్రైవేట్ ఆస్పత్రులు చేయూతనివ్వాలని మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆహార భద్రతాశాఖ మంత్రి చక్రపాణి సూచించారు. జిల్లా కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ డెంకణీకోట, అంచెట్టి అటవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో గిరిజన ప్రజలకు ఇళ్ల నిర్మాణం, తాగునీటి వసతులు, పాఠశాల భవనాల నిర్మాణం, మరుగుదొడ్ల ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైయ్యే ఉపకరణాల పంపిణీ వంటి మౌళిక వసతులు కల్పించేందుకు చేదోడుగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్.ఏ. సత్య, కమిషనర్ స్నేహ, జిల్లా అటవీ శాఖాధికారిణి కార్తికేయిని పాల్గొన్నారు.

మహిళపై సుత్తితో దాడి

హోసూరు: వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకొందని ఆవేశానికి గురైన ప్రియుడు మహిళపై సుత్తితో దాడి చేసిన ఘటనపై హడ్కో పోలీసులు విచారణ చేపట్టారు. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లి ప్రాంతానికి చెందిన జ్యోతి (26)కి అదే ప్రాంతానికి చెందిన సోమశేఖర్ (53)తో గత రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉండేది. జ్యోతి మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని తెలిసి సోమశేఖర్ కోపం పట్టలేక మంగళవారం సాయంత్రం సుత్తితో జ్యోతిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలేర్పడిన ఆమెను స్థానికులు చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు.

ఈ రోడ్డులో వెళ్తే ప్రమాదమే



గుంతలమయంగా మారిన తారురోడ్డు

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా సప్పడి జాతీయ రహదారి నుంచి కురుబసప్పడి మీదుగా ఉద్దనపల్లి వైపు వెళ్లే తారు రోడ్డు గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా మారిందని, ఈ విషయంపై సంబంధిత శాఖాధికార్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు తెలిపారు. హోసూరు-క్రిష్ణగిరి జాతీయ రహదారి సప్పడి నుంచి కురుబసప్పడి, దిన్నూరు, సామనపల్లి కూడలి రోడ్డు మీదుగా ఉద్దనపల్లికి వెళ్లే రోడ్డు గోతులు తేలింది. వాహనాలు వెళ్లలేకుండా ఉంది. ఎక్కువ సంఖ్యలో టిప్పర్ లారీలు సంచరించడం వల్ల తారురోడ్డు పూర్తిగా దెబ్బతినిందని, రాత్రి వేళల్లో గ్రామస్తులు ద్విచక్ర వాహనాల్లో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. రోడ్డును వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేశారు.

హోసూరు నిండా సమస్యలే

- కార్పొరేటర్ల మండిపాటు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 45 వార్డులలో మౌలిక వసతులు లేవని, అధికారులకు ఫిర్యాదు చేస్తే సరైన సమాధానాలు ఇవ్వడంలేదని కార్పొరేటర్లు ఆరోపించారు. మేయర్ ఎస్.ఏ.సత్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కమిషనర్ స్నేహ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ హోసూరు పట్టణం కార్పొరేషన్ స్థాయికి పెరిగినా అభివృద్ధిలో మున్సిపాలిటి కన్నా అధ్వానంగా తయారైందని, వార్డుల్లోని మురికి కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు పెరిగి ప్రజలు డెంగీ వ్యాధికి గురవుతున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో గత కొద్ది నెలలుగా వీధిదీపాలు లేవని, జూజువాడి పారిశ్రామిక ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని కోరినా అధికార్లు స్పందించలేదని మండిపడ్డారు. రైల్వే రోడ్డు విస్తరణలో భాగంగా డెంకణీకోట ప్రధాన రోడ్డులో వాహన రాకపోకలు ఆపివేయడంతో తళి రోడ్డులో గంటల తరబడి ట్రాఫిక్ సమస్య వస్తోందన్నారు. రైల్వే స్టేషన్, సిప్కాట్, తదితర జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికార్లు పాల్గొన్నారు.

భూకబ్జాలను అరికట్టాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

హోసూరు: నకిలీ పత్రాలతో భూములను కబ్జా చేయడాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ పార్టీ ఆందోళన చేపట్టింది. హోసూరు పట్టణ కార్యదర్శి జయరామన్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఢిల్లీబాబు పాల్గొని మాట్లాడుతూ హోసూరు, సూళగిరి, బాగలూరు ప్రాంతాల్లో పారంపర్యంగా వ్యవసాయం చేస్తున్న రైతు భూములకు కొంత మంది దుండగులు నకిలీ పత్రాలు తయారు చేసి విక్రయించారని ఆరోపించారు. బెంగళూరుకు చెందిన ఓ మహిళ హోసూరుకు చెందిన వ్యక్తికి కౌలుకు ఇస్తే, అతడు భూమిని కబ్జా చేసి గొడవ చేస్తున్నాడని, ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయని చెప్పారు. అసలైన యజమానులకు న్యాయం చేయాలని, నకిలీ పత్రాల తయారీదారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నంజుండన్, శేఖర్, రాజారెడ్డి, బి.జి.మూర్తి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా గిరిజా కళ్యాణం



గిరిజా కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం పట్టణ పంచాయతీలోని సత్యసాయిబాబా ఆలయంలో గిరిజా కళ్యాణోత్సవం వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి సుప్రభాతం, వేద పారాయణం, గణపతి, గాయత్రి, షిరిడీ సాయి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్చారణలతో భాజాభజంత్రీల మధ్య గిరిజా శివ కళ్యాణోత్సవం సాగింది. కెలమంగలం, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

బస్టాండ్‌లో బంగారు గొలుసు చోరీ

శివమొగ్గ: ప్రయాణికురాలి బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన శివమొగ్గ నగర బస్టాండ్‌లో జరిగింది. రత్నా ఆర్.భట్ అనే మహిళ తన భర్తతో కలిసి కుందాపురకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు ఎక్కే సమయంలో ఆమె వ్యానిటీ బ్యాగ్‌లోని రూ.2.29లక్షల విలువైన 74 గ్రాముల బంగారు గొలుసును దొంగలు చోరీ చేశారు. బస్సు ఎక్కిన తర్వాత చూసుకోగా నగలు కనిపించలేదు. దీంతో బాధితురాలు దొడ్డపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎన్నికల అధికారులను అడ్డుకున్న దుండగులు



దుండగులతో జరిగిన పెనుగులాటలో కిందపడిపోయిన ఎన్నికల అధికారిణి

దొడ్డబళ్లాపురం: పాలు ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికలు నిర్వహించడానికి కారులో వస్తున్న అధికారులను దుండుగులు అడ్డుకున్నారు. ఈ సంఘటన రామనగర తాలూకా కెంచనహళ్లిలో చోటుచేసుకుంది. మాగడి తాలూకా హుళ్లేనహళ్లిలోని పాలు ఉత్పత్తిదారుల సంఘానికి బుధవారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు కారులో వస్తుండగా రామనగర తాలూకా కెంచనహళ్లి వద్ద దుండగులు అడ్డగించారు. ముఖ్యమైన డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్ దోచుకుని మరో కారులో పరారయ్యారు .ఈక్రమంలో జరిగిన పెనుగులాటలో ఓ అధికారిణి కిందపడిపోయారు. మాగడి పోలీసులు వచ్చి ఎన్నికల అధికారులను గ్రామానికి తీసుకెళ్లారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

తుమకూరు: మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా తుమకూరు నగరంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నేతృత్వంలో బీజీ పాళ్య, పురస్ కాలనీ, నజరబాద్ తదితర సున్నిత ప్రాంతాల్లో పోలీసులు కవాతు చేపట్టారు. ఎస్పీ అశోక్, అదనపు ఎస్పీ మరియప్ప పురుషోత్తమ్ పాల్గొన్నారు.

రేబీస్‌కు అడ్డుకట్ట వేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: శునకాలకు టీకాలు వేయడం ద్వారా ప్రాణాంతకమైన రేబీస్‌కు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్ పీఎస్ రవీంద్ర ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ రేబీస్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఆరోగ్య, కుటుంబ కల్యాణ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. కుక్కలు, పెంపుడు జంతువుల ద్వారా రేబీస్ వ్యాపిస్తుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డీహెచ్ఓ మహేశ్‌కుమార్, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

ప్రతిపక్షం పలాయనం



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు

చంద్రబాబు అరెస్ట్‌పై అధికార పక్షాన్ని నిలదీస్తామన్న ప్రతిపక్షం

- అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే ఆత్మరక్షణలో పడిన వైనం
- స్కిల్ స్కామ్‌తోపాటు ఫైబర్ గ్రిడ్, ఇన్నర్ రింగ్ రోడ్ స్కామ్‌లు చర్చకు వస్తాయని ఆందోళన
- కుంభకోణాలు చర్చకు రాకుండా అడ్డుకుని, సస్పెన్షన్ వేటు వేయించుకోవాలని ఎత్తు
- అధికారపక్షం గొంతు నొక్కుతోందని రాద్ధాంతం చేసి సానుభూతి పొందవచ్చని వ్యూహం
- అభాసుపాలై సమావేశాలను బహిష్కరించి పలాయనం చిత్తగించిన ప్రతిపక్షం
- శాసనసభ ఐదు రోజుల సమావేశాలు ముగిసిన తీరిది

సాక్షి, అమరావతి: తాము చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు కళ్లకు కట్టినట్టు వివరించడానికి అధికార పక్షానికి.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రతిపక్షానికి శాసనసభ సమావేశాలు సరైన వేదిక. అధికార పక్షం నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ శాసనసభ సమావేశాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే.. చంద్రబాబు చేసిన అక్రమాలతో ఆత్మరక్షణలో పడ్డ ప్రతిపక్షం పలాయనం చిత్తగించి అభాసుపాలైంది. గత 52 నెలల్లో సంక్షేమ, అభివృద్ధి, పథకాల ద్వారా ప్రజలకు చేసిన మంచిని వివరించడంతోపాటు టీడీపీ సర్కార్ హయాంలో జరిగిన కుంభకోణాలను సాక్ష్యాధారాలతో బయటపెట్టడంలో అధికార పక్షం విజయవంతమైంది. స్కిల్ స్కామ్‌లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును అరెస్టు చేయడంపై శాసనసభ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజలకు వాస్తవాలు తెలిసేలా గళమెత్తుతామని బీరాలు పలికిన ప్రతిపక్ష సభ్యులు చిల్లర చేష్టలు, వెకిలి వేషాలు, అసభ్య సైగలు చేస్తూ లేకి ప్రవర్తనతో ఆత్మరక్షణలో పడి రెండ్రోజుల్లోనే పలాయనం చిత్తగించారు. ఇదీ శాసనసభ సమావేశాలు జరిగిన తీరు. ఈనెల 21న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు బుధవారం ముగిశాయి. ఐదు రోజులపాటు సమావేశాలు జరిగాయి.

ఆత్మరక్షణలో ప్రతిపక్షం

స్కిల్ స్కామ్‌లో ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసి, సీఐడీ పోలీసులకు దొరికిపోయిన చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపింది. ఈ ఉదంతంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని.. ప్రజలకు వాస్తవాలను వివరించేలా గళమెత్తి అధికార పక్షం కక్ష సాధింపు చర్యలను జనంలోకి తీసుకెళ్తామని టీడీపీ శాసనసభా పక్షం ప్రకటించింది. తీరా శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాక ఆత్మరక్షణలో పడిపోయింది. స్కిల్ స్కామ్‌తోపాటు ఫైబర్ నెట్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ సహా టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు చర్చకు వస్తే చంద్రబాబు అక్రమాల బాగోతం సాక్ష్యాధారాలతో సహా అధికారపక్షం గుట్టురట్టు చేయడం ఖాయమని.. అప్పుడు ప్రజల్లో మరింత చులకనవుతామని భావించిన ప్రతిపక్షం వ్యూహం మార్చింది. ఎలాగైనా సరే సస్పెన్షన్ వేటు వేయించుకుంటే చర్చ నుంచి తప్పించుకోవడంతోపాటు సభ నుంచి బయటకు వచ్చాక అధికార పక్షం తమ గొంతు నొక్కుతోందంటూ రాద్ధాంతం చేసి చంద్రబాబు కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించవచ్చని ఎత్తు వేసింది. ఆ వ్యూహంలో భాగంగా తొలి రోజు, రెండో రోజూ స్కిల్ స్కామ్‌పై చర్చకు సిద్ధమని అధికార పక్షం స్పష్టం చేసినా వినకుండా స్పీకర్ పోడియంను చుట్టుముట్టి.. పేపర్లు చింపి విసిరేస్తూ వీధి రౌడీల్లా అరుపులు, కేకలు వేస్తూ.. బూతులు తిడుతూ ప్రతిపక్ష సభ్యులు వీరంగం చేశారు. బాలకృష్ణ అయితే మీసం మెలేసి.. అసభ్య సైగలు చేస్తూ లేకిగా ప్రవర్తించి చట్టసభల ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించి సస్పెన్షన్ వేటు వేయించుకున్నారు. శాసనసభలో మొదటి రోజు, రెండో రోజు ప్రతిపక్షం లేకి ప్రవర్తనను ప్రజలు అసహ్యించుకోవడంతో.. అకారణంగా తమను సస్పెండ్ చేస్తూ అధికార పక్షం తమ గొంతు నొక్కుతోందని.. అందుకే తాము శాసనసభ సమావేశాలను బహిష్కరిస్తున్నామంటూ ప్రతిపక్షం పలాయన మంత్రం జపించింది.

ప్రజాపక్షమై ప్రతిధ్వనిస్తూ..

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా చేసిన మేలును శాసనసభ సాక్షిగా అధికార పక్షం ప్రజలకు వివరించింది. టీడీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానం మేరకు స్కిల్ స్కామ్‌పై చర్చను చేపట్టి.. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లను అప్పటి సీఎం చంద్రబాబు ఎలా దోచుకున్నారన్నది సాక్ష్యాధారాలతో ప్రజలకు వివరించడంలో సక్సెస్ అయ్యింది. ఇదే క్రమంలో ఫైబర్ గ్రిడ్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పు స్కామ్‌లతో చంద్రబాబు, లోకేశ్ అధికార దుర్వినియోగానికి పాల్పడి.. ప్రభుత్వ ఖజానాను దోచేయడంతోపాటు తమ వందిమాగధులకు ఎలా లబ్ధి చేకూర్చారన్నది సాక్ష్యాధారాలతోసహా ప్రజల ముందు పెట్టింది. ప్రజాధనానికి ధర్మకర్తగా వ్యవహరించాల్సిన బాధ్యతను నిర్వర్తించే క్రమంలోనే దర్యాప్తు సంస్థ సీఐడీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చామని.. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన చంద్రబాబును ఆ సంస్థ అరెస్టు చేసిందని వివరించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి కక్ష సాధింపులు లేవని.. ప్రజాధనానికి ధర్మకర్తగా వ్యవహరించాల్సిన బాధ్యతను త్రికరణ శుద్ధితో నిర్వర్తిస్తున్నామనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో అధికార పక్షం గ్రాండ్ సక్సెస్ అయ్యింది.

ఆధారాలతోనే అరెస్టు

స్కిల్ స్కాంపై మండలిలో చర్చ

దాన్ని ఒప్పందం అంటారా?



స్కిల్ స్కాంలో చంద్రబాబు పక్కా ఆధారాలతో అడ్డంగా దొరికిపోవడంతోనే సీఐడీ అరెస్టు చేసింది. ఈ కుంభకోణంలో చంద్రబాబుకు అత్యంత ఆప్తులైన లక్ష్మీనారాయణ, గంటా సుబ్బారావులు కీలకపాత్ర పోషించారు. స్కిల్ ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 4కు సీమెన్స్‌తో కుదుర్చుకున్నట్లు చెపుతున్న ఒప్పందానికి పొంతనే లేదు. 100 రూపాయల స్టాంప్ పేపర్ మీద ఊరు, తేదీ లేకుండా సంతకాలు చేస్తే దాన్ని ఒప్పందం అంటారా? దానికి ఏమైనా విలువ ఉంటుందా?. డొల్ల కంపెనీల ద్వారా నగదు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల్ శ్రీనివాసుకు అందించామని నిందితులు ఈడీకి ఇచ్చిన వాగ్మూలంలో అంగీకరించారు. ఈడీ ఇప్పటికే ఈ విచారణలో నలుగురుని అరెస్టు చేసింది. 40 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందన్న ఆయన ఇప్పుడు సీఐడీ విచారణలో ప్రశ్నలు అడుగుతుంటే నాకు తెలియదు, గుర్తులేదు అంటూ తప్పించుకుంటున్నారు. ఈ కుంభకోణం నుంచి చంద్రబాబు తప్పించుకోలేడు.

\- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

అమరావతి రాజధానీ కుంభకోణమే



విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టినప్పటి నుంచి చంద్రబాబు ప్రతీ అంశంలోనూ కుంభకోణాలు చేశాడు. చివరికి అమరావతి రాజధానే అతిపెద్ద కుంభకోణం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతి ముద్దని, వైజాగ్ రాజధాని వద్దని బాబు అంటున్నారు. న్యూఢిల్లీలో కొత్త పార్లమెంటు భవనాన్ని రూ. 1,000 కోట్లతో, తెలంగాణలో కొత్త సచివాలయం రూ. 600 కోట్లతో కట్టారు. అమరావతి రాజధానికి కేంద్రం రూ. 3,000 కోట్లకు పైగా ఇచ్చినా తాత్కాలిక భవనాలు నిర్మించి ప్రజల డబ్బులను పూర్తిగా దుర్వినియోగం చేశాడు. స్కిల్ స్కాంలో కేవలం రెండు నెలల్లో రూ. 371 కోట్లు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు తరలించేశాడు.

\- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు.

సీమెన్స్‌కు తెలియకుండా జరిగిన కుంభకోణమిది



అమరావతి రాజధానికి ఓటుకు కోట్లు కుంభకోణంతోనే బీజం పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ పేరుతో చంద్రబాబు బృందం కుట్రకు తెరతీశారు. పెద్ద కంపెనీల పేరును వాటికి తెలియకుండా వాడుకుంటూ చేసే కుంభకోణాలను ఆర్థిక నేర భాషలో ఫిషింగ్ కుంభకోణాలుగా వ్యవహరిస్తారు. దీనికి స్కిల్ కుంభకోణం చక్కటి ఉదాహరణ. 2014లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచే చంద్రబాబు అవినీతికి తెరతీశారు. దేశద్రోహానికి పాల్పడిన ఆర్థిక నేరగాడు చంద్రబాబు. డిజైన్ టెక్ అనే కంపెనీ జీఎస్టీ చెల్లించకుండా కక్కుర్తి పడటంతో చంద్రబాబు కుట్ర బయట పడింది. లేకపోతే ఎప్పటిలాగే బాబు ఈ కుంభకోణం నుంచి తప్పించుకునేవాడు. చంద్రబాబు అవినీతిలో ఇది సముద్రంలో చిన్న ఐస్ ముక్కలాంటిది. పూర్తి దర్యాప్తు చేసి అన్ని కుంభకోణాలను వెలికి తీయాలి.

\- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు

\- సాక్షి, అమరావతి

ఉభయ సభలు నిరవధిక వాయిదా

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఉభయ సభలను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. 5 రోజుల పనిదినాల్లో శాసనసభ 25:15 గంటలు, మండలి 17.12 గంటలు జరిగినట్లు వెల్లడించారు. 18 బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. శాసనసభలో సభ్యులు అడిగిన 50 స్టార్ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలిచ్చింది. 3 తీర్మానాలు చేసి 6 లఘు చర్చలు నిర్వహించింది. మండలిలో 50 ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలిచ్చి ఒక తీర్మానం చేసింది.

జీఎస్టీ సవరణ బిల్లుకు సభల ఆమోదం

సాక్షి, అమరావతి: గూడ్స్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ) కౌన్సిల్ నిర్ణయం ప్రకారం ఏపీ జీఎస్టీ (రెండో సవరణ) బిల్లు–2023కు బుధవారం రాష్ట్ర ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఆన్‌లైన్ జూదంపై పన్ను విధింపునకు స్పష్టత నిచ్చేలా 50, 51వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సిఫార్సులు చేస్తూ చట్ట సవరణకు సిఫార్సు చేశారు. రాష్ట్రంలో ఆన్‌లైన్ జూదంపై నిషేధం ఉన్నప్పటికీ కేంద్ర చట్టాన్ని అంగీకరించడం కోసం మాత్రమే ఏపీ జీఎస్టీ సవరణ బిల్లును రాష్ట్ర చట్ట సభల్లో ఆమోదించారు. అదే విధంగా ప్రభుత్వ సెక్యూరిటీస్ చట్టం–2006ను సవరించాలని కోరుతూ సభలో ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు.

మూడు బిల్లులకు ఆమోదం

సాక్షి, అమరావతి: శాసనసభ సమావేశాల్లో భాగంగా బుధవారం అసెంబ్లీ మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది.ఆంధ్రప్రదేశ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ బిల్లు, ఆంధ్రప్రదేశ్ గ్యారంటీడ్ పెన్షన్ సిస్టమ్ (జీపీఎస్)బిల్లుతో పాటు ఏపీ అప్రాప్రియేషన్ నంబర్ 3–బిల్లు 2023ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టగా, సభ ఆమోదించింది.

మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం

సాక్షి, అమరావతి: మండలిలో బుధవారం నాలుగు బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ తెచ్చిన బిల్లును సభ్యులు ఆమోదం తెలిపారు. కల్పలత, వరుదు కళ్యాణి, పర్వత చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల తరఫున సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కౌలు రైతులకు అండగా ప్రభుత్వం

సాక్షి, అమరావతి : వాస్తవ సాగుదారులకు అన్ని రకాల లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో పంట సాగుదారుల హక్కు చట్టాన్ని తెచ్చామని వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రశ్నోత్తరాల్లో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ.. భూ యజమానులకు ఇబ్బంది లేకుండా కౌలుదారులకు సీసీఆర్సీలు జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్డుల ద్వారా రూ.1.60 లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాలిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 8.05లక్షల మందికి సీసీఆర్సీలు జారీ చేయగా, 4 ఏళ్లలో 25.65లక్షల సీసీఆర్సీలు అందించినట్టు తెలిపారు. రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ ద్వారా 5.38 లక్షల కుటుంబాలకు రూ.638 కోట్లు ఇచ్చామన్నారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని కొనియాడారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రైతుల్లో నాలుగో వంతు కౌలు రైతులున్నారని, వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం మనదేనన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తిని భావి తరాలకు అందించాలనే..

విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం

- 54 వేల చ.అ. విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్, మ్యూజియం, లైబ్రరీ
- ప్రశ్నోత్తరాలలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి : ప్రపంచం గర్వించదగ్గ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని భావి తరాలకు అందించాలన్న సంకల్పంతో విజయవాడ నడిబొడ్డున స్వరాజ్యమైదాన్‌లో చేపట్టిన 125 అడుగుల కాంస్య విగ్రహ నిర్మాణం తుది దశకు చేరిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.400 కోట్లు ఖర్చుచేశామన్నారు. అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ.. అమరావతిలో 125 అడుగుల కాంక్రీట్ విగ్రహ నిర్మాణం కోసం 2016లో జీవో ఇచ్చిన చంద్రబాబు, ఆ తర్వాత దాన్ని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఆనాడు అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టాలని ఎవరూ కోరకున్నా.. నాడు అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే రోజాను అవమానించిన ఘటనతో పాటు, కాల్‌మనీ సెక్స్ రాకెట్ నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంపై చర్చకు తెరతీశారని చెప్పారు. అమరావతిలో ఓ మూల కేవలం 20 సెంట్ల స్థలంలో విగ్రహం ఏర్పాటు పేరిట 2019లో ఎన్నికలకు ముందు హడావుడి చేశారని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే సీఎం జగన్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం మంత్రుల కమిటీని నియమించారని, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాననగరాల్లో ఎంత గాలించినా అనువైన స్థలం దొరకలేదన్నారు. ఓ రోజు సీఎం తనను పిలిచి స్థలాన్వేషణపై ఆరా తీశారని, ఎక్కడా స్థలాలు అందుబాటులో లేవని చెప్పగా.. విజయవాడ నడిబొడ్డున ఉన్న స్వరాజ్య మైదానంలో 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామన్నా.. అని సీఎం చెప్పగానే తనకు నోట మాట రాలేదని చెప్పారు. విగ్రహం ఏర్పాటుతో పాటు 54 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్, మ్యూజియం, అత్యాధునిక లైబ్రరీ, యాంఫీ థియేటర్‌తో భవిష్యత్ తరాలకు ఒక మాన్యుమెంట్‌గా తయారు చేయాలని సంకల్పించిన విషయాన్ని గుర్తుచేశారు.

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేస్తున్న లైబ్రరీని స్టేట్ లైబ్రరీగా తీర్చిదిద్దాలని, పరిశోధనలు చేసేందుకు వీలుగా అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా అంబేడ్కర్ జీవితంపై అధ్యయనం చేసిన పుస్తకాలన్నీ ఈ లైబ్రరీలో ఉండేలా చూడాలన్నారు.
- అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠశాల విద్యలో ఉపవాచకంగా తేవాలని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు.
- అంబేడ్కర్ ఆలోచనలకు నిజమైన వారసుడు ఎవరైనా ఉన్నారంటే ఈ దేశంలో సీఎం వైఎస్ జగనేనని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.
- ఇకపై అంబేడ్కర్ గేట్ వేలా విజయవాడ నగరం విరాజిల్లుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి చెప్పారు.
- ఎన్నికల్లో ఎలాంటి హామీ ఇవ్వకుండానే 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కొనియాడారు.
- అంబేడ్కర్ అందరి వాడని, సీఎం జగన్ కూడా ఆయన మాదిరి అందరి ప్రేమను చూరగొన్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాస్ అన్నారు.
- కరెన్సీ నోటుపై మహాత్మా గాంధీతో పాటు అంబేడ్కర్ చిత్రాన్ని కూడా ముద్రించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు.
- నందిగామ, గూడూరు ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, వి.వరప్రసాద్‌లు మాట్లాడుతూ అంబేడ్కర్ వల్లే తాము చట్టసభల్లోకి అడుగుపెట్టగలిగామని వివరించారు.

మీడియా పాయింట్

పెద్ద దొంగ కోసం చిన్న దొంగ ఢిల్లీ పర్యటన



సాక్షి, అమరావతి: పెద్ద దొంగ చంద్రబాబు కోసం చిన్న దొంగ లోకేశ్ ఢిల్లీ పర్యటన చేస్తున్నారని మంత్రి ఆర్కే రోజా అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రం కోసం కానీ, ప్రజల ప్రయోజనాల కోసం కానీ లోకేశ్ రాష్ట్రపతిని కలిసిన దాఖలాలు ఉన్నాయా? మేము చట్టాలకు అతీతులం అన్నట్టుగా లోకేశ్, అతని తల్లి, టీడీపీ నేతల ప్రవర్తన ఉంది. ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ, అమిత్‌షా కాళ్లు పట్టుకోవడానికి లోకేశ్ పడరాని పాట్లు పడుతున్నాడు. ఇప్పటికి నాలుగు కుంభకోణాల్లో చంద్రబాబు ముద్దాయి. వీటన్నింటిలో చంద్రబాబు ఎలా కోట్ల రూపాయలు కొట్టేశాడనేది ఆధారాలతో సహా ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో తేలింది' అని పేర్కొన్నారు. కాగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బుధవారం ఒక కార్యక్రమానికి హాజరైన మంత్రి రోజా అనంతరం మీడియాతో మాట్లాడుతూ నారా భువనేశ్వరి చెప్పిన హెరిటేజ్ లెక్కలు, ఆదాయాలపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

ప్రజాప్రయోజనాలకే ప్రాధాన్యం: మంత్రి చెల్లుబోయిన



అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. ఈ సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు వరమిచ్చారు. కులగణన ఈ సమావేశాల్లో ప్రధాన అంశం. 1931 తర్వాత జరిగిన ఏ జనగణనలోనూ కులగణన జరగలేదు. అనేక మంది పోరాటాలతో సాధించలేనిది ఒక్క సంతకంతో జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు. చంద్రబాబు మోసానికి, వంచనకు గురైనది బీసీ వర్గాలే. వారికి ఎటువంటి మేలు చేయని చంద్రబాబు బీసీలు తనవెంటే ఉన్నారని ఎలా చెప్పుకుంటాడు? సుదీర్ఘ అధ్యయనం తర్వాతే జీపీఎస్ బిల్లు తెచ్చాం. జీపీఎస్‌తో ఉద్యోగులకు అన్ని విధాలా మేలు జరుగుతుంది. పేదలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందాలనే సీఎం జగన్ డీబీటీ విధానాన్ని తీసుకువచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ వెతికి పట్టుకుని మరీ పథకాలు అందిస్తున్నారు.

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు శాసనసభ మీడియా పాయింట్ వద్ద చంద్రబాబు అరెస్ట్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాలపై విలేకరులతో మాట్లాడారు. ఎవరెవరు ఏమన్నారంటే...

చట్టపరంగానే బాబు అరెస్ట్

స్కిల్ స్కామ్ లో చంద్రబాబు తప్పు లేదని, ఇన్నర్ రింగ్ రోడ్డుకు వారు చేసిన అలైన్‌మెంట్లు సరైనవేనని టీడీపీ నేతలు ఎందుకు చెప్పలేక పోతున్నారు? లోకేశ్ మంత్రిగా నిబంధనలకు విరుద్ధంగా అలైన్‌మెంట్ చేశారు. దొరికిపోతామనే భయంతోనే లోకేశ్ ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చంద్రబాబును ఆధారాలతో స్కిల్ స్కామ్‌లో అరెస్ట్ చేశారు.

–సామినేని ఉదయభాను, ప్రభుత్వ విప్

ఇది శుభదినం



పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఉద్యోగులందరికీ ఇది శుభదినం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

–కల్పలతా రెడ్డి, ఎమ్మెల్సీ

కోర్టుల నుంచి తప్పించుకోలేరు



చంద్రబాబు స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికి జైల్లో ఉన్నారు. లోకేశ్ ఢిల్లీకి పారిపోయాడు. 2014–19 దాకా తండ్రి,కొడుకులు అనేక స్కామ్ లకు పాల్పడ్డారు. లోకేశ్ కూడా త్వరలో జైలుకెళతాడు. తప్పు చేసిన వారెవరూ కోర్టుల నుంచి తప్పించుకోలేరు.

–పోతుల సునీత, ఎమ్మెల్సీ

ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు

ఉద్యోగులకు సంబంధించి నేడు సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పే ధైర్యం గతంలో ఎవరూ చేయలేకపోయారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

–చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ

10 వేల కుటుంబాల్లో వెలుగులు

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించినందుకు సీఎంకు కృతజ్ఞతలు. గతంలో పాలకుల చుట్టూ తిరిగి అలసిపోయాం. ఇప్పుడు 10 వేల మందికి పైగా ఉద్యోగుల కుటుంబాల్లో సీఎం వెలుగులు నింపారు.

–రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ

విలేజ్ క్లినిక్ భేష్

విలేజ్ క్లినిక్ తో అందరికీ వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజి వచ్చింది. విద్య, వైద్యానికి సీఎం జగన్ పెద్దపీట వేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం సీఎం జగన్‌కే సాధ్యమైంది.

–సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ

ఉద్యోగుల పక్షపాతి సీఎం జగన్

ఇచ్చిన మాటను నెరవేర్చి కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో సీఎం వెలుగులు నింపారు. 30 ఏళ్లలో ఎవరూ చేయలేని పనిని సీఎం జగన్ చేసి చూపించారు. మిగిలిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులెవ్వరూ ఆందోళన చెందవద్దు. సీఎం జగన్ ఎల్లప్పుడూ ఉద్యోగుల పక్షపాతే.

–వెంకటరామిరెడ్డి, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు

అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు

అల్ప సంఖ్యాకులకు అగ్రపీఠం



రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా మైనార్టీలకు అండగా నిలుస్తోంది. 2019 నుంచి ఇప్పటివరకు 50,07,259 మంది మైనార్టీలకు రూ. 23,167.93 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో డీబీటీ ద్వారా రూ. 12,366.91 కోట్లు, నాన్‌డీబీటీ ద్వారా రూ. 10,801.02 కోట్లు అందించింది. స్వతంత్ర భారతదేశంలో మైనార్టీలను ఓటు బ్యాంకు కోసమే వినియోగించుకున్నారు. కానీ మైనార్టీ సంక్షేమం కోసం గతంలో వైఎస్సార్, ఇప్పుడు జగన్ మాత్రమే కృషి చేశారు. మైనార్టీ సంక్షేమమంటే గుర్తొచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేరే. సీఎం వైఎస్ జగన్ కూడా మైనార్టీల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మైనార్టీల కోసం రూ. 2,665 కోట్లు ఖర్చు చేస్తే, జగన్ ప్రభుత్వం 50 నెలల్లో రూ. 23,167.93 కోట్లు ఖర్చు చేసి, గత ప్రభుత్వం కంటే 10 రెట్లు అధికంగా నిధులు వెచ్చించింది.

\- డిప్యూటీ సీఎం అంజద్ బాషా

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయండి



ప్రభుత్వం మైనార్టీల కోసం 38 పథకాలు అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలో ఇమామ్‌లు, మౌజమ్‌లకు, పాస్టర్లకు ఎలాంటి గుర్తింపుగాని, గౌరవ వేతనంగాని ఇవ్వలేదు. ఇప్పుడు వైఎస్ జగన్ అందరితోపాటు మైనార్టీ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా చేశారు. పీలేరు చుట్టుపక్కల మైనార్టీ బాలికలు చదువుకునేందుకు దూరంలో ఉన్న కర్నూలుకు వెళ్లాల్సి వస్తోంది. దాంతో చాలామంది చదువును మధ్యలోనే మానేస్తున్నారు. పీలేరులో మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ప్రారంభిస్తే వారికి మేలు జరుగుతుంది.

\- చింతల రామచంద్రారెడ్డి, పీలేరు ఎమ్మెల్యే

విద్యా సంస్కరణల్లో మనమే మేటి



ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యమంత్రి ప్రాధాన్య అంశాల్లో విద్య మొదటి స్థానంలో ఉంది. విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నాం, విద్యార్థులకు టోఫెల్ బోధనకు కూడా టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. గతంలో అక్షరాస్యతపై అంటే కేరళ గుర్తుకువచ్చేది. ఇప్పుడు కేంద్ర విద్యాశాఖ మంత్రి సైతం ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణలను చూసి నేర్చుకోవాలని సూచిస్తున్నారంటే మనం ఎంత ప్రగతి సాధించామో తెలుస్తుంది. మూడో విడత నాడు–నేడులో రూ. 8 వేల కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం. డిసెంబర్ 21న 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ ఇవ్వనున్నాం. ప్రభుత్వ బడుల్లో సీబీఎస్సీ అమలుతో ఆ బోర్డు మన రాష్ట్రంలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసింది. ఉన్నత విద్యలో రూ. 15,600 కోట్ల నిధులను విద్యాదీవెన, వసతి దీవెన కింద ఖర్చు చేశాం. ఇంజినీరింగ్ చదువుతున్న 1.69 లక్షల మందికి మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ కోర్సులు ఉచితంగా అందిస్తున్నాం. వర్సిటీల్లో 15 ఏళ్లుగా ఖాళీగా ఉన్న 3,268 పోస్టులను భర్తీ చేసేందుకు సీఎం నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు విదేశీ వర్సిటీలతో జాయింట్ సర్టిఫికేషన్ కూడా అందించనున్నాం. దీనివల్ల మన విద్యార్థులకు అంతర్జాతీయంగా అవకాశాలు వేగంగా పొందుతారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యం పరిశీలించేందుకు కొందరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం.

\- మంత్రి బొత్స సత్యనారాయణ

ఏజెన్సీ పాఠశాలలకు అధిక నిధులివ్వండి



పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ వంటివి మన విద్యారంగం గతిని మార్చాయి. నాడు–నేడు కింద 56 వేల స్కూల్స్‌ను బాగుచేస్తున్నారు. ఇందులో గిరిజన నియోజకవర్గాల్లో 1,400 స్కూళ్లు కూడా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1,000 సింగిల్ టీచర్ పాఠశాలలకు భవనాలు లేవు. నాడు–నేడు కింద భవనాలు నిర్మిస్తే గిరిజన పిల్లలకు మేలు జరుగుతుంది. అదనపు గ్రాంట్ మంజూరు చేసి భవనాలు నిర్మించాలి. గతంలో ఆశ్రమ స్కూల్స్‌లో హెల్త్ వలంటీర్లు ఉండేవారు. రాత్రివేళ ఆయా పిల్లలకు ఆరోగ్య సమస్యలను తీర్చేందుకు హెల్త్ వలంటీర్లను నియమించాలి.

\- నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే

విద్యలో విప్లవాత్మక మార్పులు



విద్యారంగంలో ఇటు తల్లిదండ్రులకు, అటు విద్యార్థులకు మేలు జరిగేలా అనేక పథకాలను సీఎం ప్రవేశపెట్టారు. ప్రతి మండలానికి రెండు జూనియర్ కాలేజీలు కూడా మంజూరు చేశారు. మా నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ కాలేజీలు వచ్చాయి. పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో ఎంపీపీ స్కూల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి. నిడదవోలు టౌన్‌లో అంతర్భాగమైన లింగంపల్లి గ్రామం.. టౌన్‌కు దూరంగా ఉంది. ఇక్కడి స్కూల్‌ను మెర్జింగ్ చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కూల్‌ను డీమెర్జింగ్ చేయాలి.

\- జి.శ్రీనివాసనాయుడు, నిడదవోలు ఎమ్మెల్యే

మన విద్యార్థుల అంతర్జాతీయ ఖ్యాతి



నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ నిర్ణయాలతో విద్యారంగం మెరుగుపడింది. మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయంగా రాణిస్తున్నారు. ఫౌండేషన్ స్కూల్స్‌ను తీసుకువచ్చాం. అయితే ఉత్తమ ఫలితాలు రావాలంటే వాటిలో బోధకులకు శిక్షణ ఇవ్వాలి. సీఎం లక్ష్యం నెరవేరాలంటే శిక్షణ, బోధనపై పూర్తి అజమాయిషీ అవసరం. దీనికోసం సరైన కార్యాచరణ రూపొందించాలి.

\- డాక్టర్ ఎం.జగన్మోహన్‌రావు, నందిగామ ఎమ్మెల్యే

పాఠశాలల్లో పిల్లలకు డైనింగ్ ఏర్పాటు చేయండి



గత ప్రభుత్వం విద్యను వ్యాపారం చేయడంతో పేద కుటుంబాలు అక్షరానికి దూరమయ్యాయి. ఇప్పుడు సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అనేక పథకాల ద్వారా 42 లక్షల మంది పిల్లలను బడిబాట పట్టించారు. నాడు–నేడు కింద 56 వేల స్కూల్స్‌ను బాగుచేస్తున్నారు. సీబీఎస్సీ సిలబస్, బైలింగువల్ బుక్స్, పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసేందుకు పిల్లలకు డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలి. దీనికి స్కూల్లో ఓ గదిని కేటాయిస్తే మంచిది. విద్యారంగంలో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి.

\- కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే


ఏపీలో బెస్ట్ విద్యా వ్యవస్థ ఉంది



రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు విధానాలు పరిశీలించేందుకు తెలంగాణ అధికారులు ఇక్కడకు వస్తున్నారు. చాలా స్కూల్స్‌లో ప్లస్ 2 అందుబాటులోకి తెచ్చాం. అయితే, టీచర్లకు సరైన శిక్షణ లేదని తల్లిదండ్రుల్లో నిరుత్సాహం కనిపిస్తోంది. దీనిపై అధికారులు, మంత్రులు దృష్టిపెట్టి, ఇంటర్ బోధించేవారికి శిక్షణ ఇవ్వాలి. నైపుణ్యం ఉన్నవారికే ఆ స్కూల్స్‌లో బోధనా అవకాశం ఇవ్వాలి. దీంతో పాటు ప్రభుత్వ స్కూళ్లలో విశాలమైన మైదానాలు ఉన్నాయి. స్పోర్ట్స్‌ను కూడా ప్రోత్సహించాలి. అన్ని స్కూళ్లలోను పీఈటీలను నియమించాలి.

\- సామినేని ఉదయభాను, జగ్గయ్యపేట ఎమ్మెల్యే

విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్ పెంచండి



స్వతంత్ర భారత చరిత్రలో విద్యలో ఇన్ని సంస్కరణలు తీసుకువచ్చిన రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమే. అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయి. అయితే, ఆరు, ఏడు తరగతులకు రీడింగ్ స్కిల్స్ తక్కువగా ఉన్నాయి. ఉపాధ్యాయులు సిలబస్ పూర్తిచేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు తప్ప నైపుణ్యం పెంపుపై దృష్టి పెట్టలేదు. ఆరు నుంచి 8 తరగతులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తే రెండేళ్లలో అద్భుతంగా రాణిస్తారు. దీంతోపాటు అన్ని స్కూళ్లకు వాచ్‌మెన్లను నియమించాలి.

\- కేపీ నాగార్జునరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

\- సాక్షి, అమరావతి

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
గురువారం ॥ 28-9-2023

నేడు ముహమ్మద్ ప్రవక్త జయంతి
మిలాద్ ఉన్ నబీ

చేయూత

మనసుకు చూపు ఉంటే
ఎదుటి వారి కష్టం కనపడుతుంది.
మనసుకు స్పందన ఉంటే
ఎదుటివారి సాయం కోసం మార్గం వేస్తుంది.
జహారా బేగంకు అలాంటి మనసు ఉంది.
అందుకే ఆమె అంధుల కోసం పని చేస్తూ ఉంది.
అంధుల క్రికెట్‌కు ప్రోత్సాహం అందిస్తోంది.
వారి మేచ్‌లు నిర్వహిస్తోంది.
ఆ సేవకు 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'కు
చైర్ పర్సన్‌గా నియమితురాలైంది.
జహారా పరిచయం.


అంధ క్రికెటర్లతో జహారా బేగం

చూపున్న మనసు



'మనలో ఎవరైనా ఎప్పుడైనా అంధులు కావచ్చు. దృష్టి పోతే జీవితం ఎంత కష్టమో మనందరికీ తెలుసు. అందుకే దృష్టి లేని వారి గురించి ఎవరికి తోచినంత వారు పని చేయాలి' అంటుంది జహారా బేగం. తెనాలికి చెందిన జహారా తన తల్లి తాహెరా పేరున 'తాహెరా ఫౌండేషన్' స్థాపించి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అలాగే బెంగళూరు, హైదరాబాద్‌లలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోంది. 'నేను నాలుగో క్లాస్‌లో ఉండగా నా క్లాస్‌మేట్ ఒకమ్మాయి మధ్యాహ్నం పూట ప్రసాదం తెచ్చుకుని తినేది. అన్నం ఉండేది కాదు. ఆ అమ్మాయి కోసం నేను మా అమ్మతో చెప్పి బాక్స్ తీసుకెళ్లేదాన్ని. చిన్నప్పటి నుంచి ఎందుకో ఎదుటివారికి సాయం చేయాలనే గుణం నాలో ఉంది. ఆ గుణాన్ని వయసు పెరిగే కొద్దీ కాపాడుకున్నాను' అంటుంది జహారా.

ఆటలంటే ఇష్టం

'మాది గుంటూరు. చిన్నతనం నుంచి ఆటలంటే ఇష్టం. బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి ప్లేయర్‌గా ఆడాను. గుంటూరు మహిళా బాస్కెట్‌బాల్ జట్టు మాతోనే మొదలైంది. అయితే చదువులో కూడా చురుగ్గా ఉండి బాపట్లలో అగ్రికల్చర్ బీఎస్సీ చేశాను. ఆ తర్వాత అగ్రికల్చర్ ఎంఎస్సీ చేసి పీహెచ్‌డీ కోసం జర్మనీలో కొంత రీసెర్చి చేశాను. అక్కడి నుంచి తిరిగొచ్చాక నా మాతృమూర్తి పేరుతో తాహెరా ట్రస్ట్ ప్రారంభించి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవల్లో మమేకమయ్యాను. ఆ సమయంలోనే బెంగళూరులోని 'సమర్థనం ట్రస్ట్ ఫర్ బ్లైండ్' చేస్తున్న పని నాకు నచ్చింది. వారితో కలిసి అంధుల కోసం పని చేయసాగాను. బెంగళూరులో విమెన్ బ్లైండ్ క్రికెట్ వర్క్ షాపును నిర్వహించాను' అని తెలిపిందామె.

అంధుల కోసం

'అంధుల క్రీడలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చేవారు చాలా తక్కువ. అంధుల క్రికెట్‌కు ప్రోత్సాహం అందించేవారూ తక్కువే. వారికోసం నేనెందుకు ఏదైనా చేయకూడదు అనుకున్నాను. అప్పటినుంచి నా చేయూత నిరవధికంగా సాగింది. అంతేకాదు, 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా' (సీఏబీఐ)లోనూ, 'టి20 వరల్డ్ కప్ క్రికెట్ ఫర్ బ్లైండ్–2017' పోటీల సమయంలోనూ చురుగ్గా పని చేసే అవకాశం కలిగింది. దాంతో ఇప్పుడు క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీబీబీఏపీ) చైర్‌పర్సన్‌గా నియమితురాలినయ్యాను. ఇది నాకు సంతోషంగా ఉంది' అని తెలిపిందామె.

అంధుల టి20

'2017లో దేశంలోని మెట్రో నగరాల్లో 2వ అంధుల టి20 వరల్డ్ కప్ క్రికెట్ పోటీలను సీఏబీఐ నిర్వహించింది. పది దేశాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ కమిటీ ఇన్‌చార్జ్‌గా నేను రెండు మ్యాచ్‌లను ఆంధ్ర, తెలంగాణలో నిర్వహించేందుకు చొరవ చూపాను. అలాగే 'తొలి విమెన్స్ నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ ఫర్ బ్లైండ్ – 2019' న్యూఢిల్లీలో జరిగింది. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ (సీఏబీఏపీ)కి నిధుల కొరత, స్పాన్సర్లు లేకపోవటం, క్రీడాకారిణుల లేమి గమనించాను. దాంతో ఆంధ్రప్రదేశ్ అంధ మహిళల క్రికెట్ జట్టు రూపకల్పనకు పూనుకున్నా. అనంతపురంలో రాష్ట్రస్థాయి అంధ మహిళల క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంధ మహిళల క్రికెట్ జట్టు ఎంపికకు సహకారం అందించాను.. ఇటీవల యూకేలో జరిగిన ఐబీఎస్ఏ టోర్నమెంటులో విజేతగా నిలిచిన ఇండియా జట్టులో మా శిక్షణలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు ఉండటం నాకు చాలా సంతోషంగా ఉంది' అని తెలిపిందామె.

అంధుల క్రికెట్ గురించి....

'అంధుల క్రికెట్ డిఫరెంట్‌గా ఉంటుంది. బ్యాట్, వికెట్లు అన్నీ ఒకలాగే ఉంటాయి. బంతి మాత్రం వైవిధ్యంగా తయారు చేస్తారు. ఇందులో ఉండే బేరింగ్స్ చేసే శబ్దాన్ని ఆధారంగా బాట్స్‌మెన్ ఆడతారు. బౌలింగ్ సాధారణ క్రికెట్‌లోలా భుజంపైనుంచి కాకుండా దిగువ నుంచి వేస్తారు. క్రికెట్ జట్టులో బీ1, బీ2, బీ3 అనే మూడు కేటగిరీల వారుంటారు. బౌలరు, బ్యాట్స్‌మెన్ పూర్తిగా అంధులై ఉంటారు. మిగిలినవారు పాక్షికంగా అంధులు. వీరు ఆడే మైదానం 50 గజాలు మాత్రమే. నిబంధనలన్నీ మామూలే. సీఏబీఐలో 25 వేల మంది సభ్యులున్నారు' అని తెలిపిందామె.

తన సేవా కార్యక్రమాలను అమెరికాకు కూడా విస్తరించిన జహారా అక్కడ చిన జీయర్ నేత్రాలయం కోసం నిధులు సేకరించడంతో తనవంతు సహకారం అందించారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

మానవాళికి దారి దీపం



మానవుల మార్గదర్శనం కోసం అల్లాహ్ అన్ని కాలాల్లో, అన్నిజాతుల్లో తన ప్రవక్తలను ప్రభవింప జేశాడు. గ్రంథాలనూ అవతరింప జేశాడు. హజ్రత్ ఆదం (అ) మొదలు, ముహమ్మద్ ప్రవక్త (స) వరకు అనేక మంది సందేశహరులు భూమండలంపై జన్మించారు. వారిలో చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్ (స). ఆయనపై అవతరించిన చివరి గ్రంథం పవిత్ర ఖురాన్ . ఇక ప్రళయకాలం వరకూ ప్రవక్తలూ రారు, గ్రంథాలూ అవతరించవు. కనుక మానవులు ప్రళయకాలం వరకు ఆయనను అనుసరించవలసిందే. ముహమ్మద్ ప్రవక్త తనంత తాను ఏమీ బోధించలేదు. మానవుల సంక్షేమం కోసం, సాఫల్యం కోసం దైవం అవతరింపజేసిన హితోపదేశాలనే ఆయన మానవాళికి అందజేశారు. మనిషి పుట్టింది మొదలు మరణించే వరకు వివిధ దశల్లో, వివిధ రంగాల్లో ఎలా నడుచుకోవాలో, ఏది హితమో, ఏది హితం కాదో ఆచరణాత్మకంగా ఆయన విశద పరిచారు. అందుకే ఆయన ప్రపంచ మానవాళికి సంపూర్ణ మార్గదర్శిగా పరిచయమయ్యారు. ఈ నేపథ్యంలో ఆ మహనీయుని పవిత్ర జీవనానికి సంబంధించిన కొంత సమాచారాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. దాదాపు 1450 సంవత్సరాల క్రితం అరేబియా దేశంలోని మక్కానగరంలో ముహమ్మద్ ప్రవక్త (స) జన్మించారు. ఆమినా, అబ్దుల్లాహ్ తల్లిదండ్రులు. పుట్టక ముందే తండ్రినీ, ఆరేళ్ళ ప్రాయంలో అమ్మనూ కోల్పోయారు. తాతయ్య ఆయన్ని పెంచారు. చిన్నతనం నుంచే అనేక సుగుణాలను పుణికి పుచ్చుకున్న ముహమ్మద్ ప్రవక్త, 'అమీన్'గా, 'సాదిఖ్'గా వినుతికెక్కారు. ఆయన గొప్ప మానవతావాది. సంస్కరణశీలి. ఉద్యమనేత. అతి సాధారణ జీవితం గడిపిన సామ్రాజ్యాధినేత. జ్ఞానకిరణాలు ప్రసరింపజేసిన విప్లవ జ్యోతి. ప్రాణశత్రువును సైతం క్షమించిన కారుణ్య కెరటం. సుమారు వెయ్యిన్నర సంవత్సరాలంటే.. ఆ సమాజం ఎంత అనాగరికంగా ఉండేదో నేటి ఆధునికులకు తెలియనిదేం కాదు. ప్రవక్త జననానికి ముందు నాటి సమాజంలో 'కర్రగలవాడిదే బర్రె' అన్నట్లుగా బలవంతుడు బలహీనుణ్ణి పీక్కుతినేవాడు. స్త్రీల హక్కుల విషయం కాదుగదా అసలు వారికంటూ ఓ వ్యక్తిత్వం ఉన్న విషయాన్నే వారు అంగీకరించే వారు కాదు. స్త్రీని విలాస వస్తువుగా, అంగడి సరుకుగా భావించేవారు. అలాంటి జాతిని అన్ని విధాలా సంస్కరించి, వారిని మంచి మనుషులుగా తీర్చిదిద్దిన ఘనత ముహమ్మద్ ప్రవక్తకే దక్కింది. నాటి సమాజంలో లేని దుర్మార్గమంటూ లేదు. అలాంటి ఆటవిక సమాజాన్ని నిరక్షరాస్యులు అయిన ముహమ్మద్ ప్రవక్త సమూలంగా సంస్కరించి, ఒక సత్సమాజంగా ఆవిష్కరించారు.

వ్యాపార లావాదేవీల్లో, ఇచ్చి పుచ్చుకోవడాల్లో లెక్కాపత్రాలు, కొలతలు, తూనికలు చాలా ఖచ్చితంగా, నికార్సుగా ఉండాలి. స్వార్థాన్ని, అహాన్ని త్యజించాలి. తోటి మానవ సోదరులను తమకన్నా తక్కువగా చూడకూడదు. స్త్రీ జాతిని గౌరవించాలి. ఆమె మీకు జన్మనిచ్చిన తల్లి. ఆత్మీయత కురిపించే చెల్లి. ప్రేమించే ఇల్లాలు. అమ్మ పాదాల చెంత స్వర్గం ఉంది. వితంతువుల్ని చిన్నచూపు చూడకూడదు. సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం దక్కాలి. శుభకార్యాల్లో వారినీ ఆహ్వానించాలి. వితంతువుల పునర్వివాహం వారి హక్కు. అజ్ఞానకాలపు దురాచారాలు, దుర్మార్గాలన్నింటినీ నేను అంతం చేస్తున్నాను. ఒక మనిషికి మరో మనిషిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. మానవులంతా ఒక్కటే. విద్యార్జన స్త్రీలు, పురుషులు అందరి విధి. జ్ఞానం జీవితం.. అజ్ఞానం మరణం. కళ్ళున్న వాళ్ళు, గుడ్డివాళ్ళు సమానం కానట్లే, జ్ఞాన సంపన్నులు, జ్ఞాన విహీనులు సమానం కాలేరు. ప్రతి తల్లీదండ్రీ తమ సంతానానికి విద్య నేర్పాలి. భావితరాల సంక్షేమానికి ఇది చాలా అవసరం. అధికార దుర్వినియోగం చేయకూడదు. పరిపాలన అంటే కేవలం ప్రజాసేవ మాత్రమే... పాలకుడు అంటే ప్రజలకు సేవకుడు అని భావించాలి. ప్రతినిత్యం ప్రజలకు జవాబుదారుగా దైవానికి భయపడుతూ జీవించాలి. ఇక్కడ మనం పలికే ప్రతి మాటకు, చేసే ప్రతిపనికీ రేపు దైవం ముందు సమాధానం చెప్పుకోవాలన్న భావన కలిగి ఉండాలి. ఇలాంటి భావనలే మానవులను మంచివారుగా, నిజాయితీ పరులుగా, సౌశీల్యవంతులుగా తీర్చిదిద్దుతాయి. ఇటువంటి బాధ్యతాభావాన్ని, జవాబుదారీ తనాన్ని ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం ప్రజల మనసుల్లో నూరిపోసి, మానవీయ విలువలతో తులతూగే ఓ చక్కని సత్సమాజాన్ని ఆవిష్కరించారు. అందుకే ఆయన మానవాళికి ఆదర్శమయ్యారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ప్రవక్త బోధనల ప్రకారం...

మానవులు తమ సృష్టికర్తను మాత్రమే ఆరాధించాలి. ఆయనకు మాత్రమే భయపడాలి. తోటిమానవుల్ని, సమాజాన్ని ప్రేమించాలి. స్త్రీలను గౌరవించాలి. ఎలాంటి స్థితిలోనూ నీతినీ, న్యాయాన్ని విస్మరించకూడదు. అనాథలను, వృద్ధులను ఆదరించాలి. తల్లిదండ్రులను సేవించాలి. వారిపట్ల విధేయత కలిగి ఉండాలి. బంధువులు, బాటసారులు, వితంతువులు, నిస్సహాయుల పట్ల తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి. సంఘంలో ఒక మనిషికి మరో మనిషిపై పడే విధ్యుక్త ధర్మాల పట్ల ఉపేక్ష వహించకూడదు. అన్యాయం, అధర్మ సంపాదనకు ఒడికట్టవద్దు. ధనాన్ని దుబారా చేయవద్దు. వ్యభిచారం దరిదాపులకు పోవద్దు. దానికై పురిగొలిపే అన్నిరకాల ప్రసార ప్రచార సాధనాలను రూపుమాపాలి. నిష్కారణంగా ఏ ప్రాణినీ చంపవద్దు. ప్రజల ధన, మాన, ప్రాణాలు సురక్షితంగా లేని సమాజం ప్రగతిని సాధించలేదు. సదా సత్యమే మాట్లాడాలి. చేసిన వాగ్దానాలు నెరవేర్చాలి. వాగ్దాన భంగానికి పాల్పడకూడదు. పలికే ప్రతి మాటకూ, చేసే ప్రతి పనికీ సమాధానం చెప్పకోవలసి ఉంటుంది.

సినిమా

ఆస్కార్ నామినేషన్ వరదలో తేలిన 2018

- 96వ ఆస్కార్ అవార్డ్స్ నామినేషన్‌కు '2018' సినిమా




జూడ్ ఆంథోనీ జోసెఫ్

విపత్కర పరిస్థితుల్లో అందరి కులం, మతం ఏదీ అంటే అది మానవత్వమే అనే సందేశంతో 2018 కేరళ వరదల ఆధారంగా తెరకెక్కిన మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో'. ఈ చిత్రం ఆస్కార్ నామినేషన్ బరిలో నిలిచింది. 2024 మార్చిలో జరగనున్న 96వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో భారత దేశం తరఫున '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో'ను నామినేషన్‌కు పంపిస్తున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. పలు భాషల్లో 22 చిత్రాలను పరిశీలించిన 16 సభ్యులతో కూడిన జ్యూరీ '2018...'ని ఎంపిక చేసినట్లు జ్యూరీ చైర్మన్ గిరీష్ కాసరవల్లి వెల్లడించారు.

2018లో కేరళలో సంభవించిన భయంకరమైన వరదల నేపథ్యంలో జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహించిన '2018' గత ఏడాది మే 5న కేరళలో విడుదలైంది. టొవినో థామస్, అసిఫ్ అలీ, కుంచకో బోబన్, నరేన్, లాల్, వినీత్ శ్రీనివాసన్, అజు వర్గీస్, అపర్ణా బాలమురళి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మలయాళ చిత్రం తెలుగు అనువాదం మే 26న విడుదలైంది. దాదాపు రూ. 30 కోట్ల బడ్జెట్‌తో వేణు కున్నపిళ్లై, సీకే పద్మకుమార్, జూడ్ ఆంథోనీ నిర్మించిన ఈ చిత్రం రూ. 200 కోట్ల గ్రాస్ వసూళ్లతో మలయాళంలో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. తెలుగులోనూ సూపర్ హిట్.

2018 కథేంటి?

కేరళలోని అరువిక్కుళం గ్రామానికి చెందిన అనూప్ (టొవినో థామస్) ఇండియన్ ఆర్మీలో చేరి, అక్కడి పోరాటాల్లో చనిపోతున్న తోటి జవాన్లను చూసి భయపడి తిరిగొచ్చేస్తాడు. దుబాయ్ వెళ్లేందుకు వీసా కోసం ట్రై చేస్తుంటాడు. ఈలోపు ఆ ఊరికి చెందిన టీచర్ మంజు (తన్వీ రామ్)తో అతని వివాహం కుదురుతుంది. మరోవైపు కేరళలోని సముద్ర తీర ప్రాంతంలో జీవిస్తుంటాడు నిక్సన్ (అసిఫ్ అలీ). అతని తండ్రి (లాల్), అన్నయ్య (నరేన్) మత్స్యకారులుగా జీవనం సాగిస్తుంటారు. పెద్ద మోడల్ కావాలనేది నిక్సన్ లక్ష్యం. షాజీ (కుంచకో బోబన్) ప్రభుత్వ అధికారి. రమేశన్ (వినీత్ శ్రీనివాసన్) ఐటీ ఉద్యోగి. కేరళ సరిహద్దులోని తమిళనాడు గ్రామవాసి సేతుపతి (కలైయరసన్) లారీ డ్రైవర్. ఓ ప్రముఖ విదేశీ యూ ట్యూబర్‌కు కేరళ తిప్పి చూపించే టాక్సీ డ్రైవర్ కోషి (అజు వర్గీస్). ఇలా ఎవరి జీవితాలు వారివి. కానీ భారీ వరదలు వీరందరి జీవితాలను కష్టాలపాలు చేస్తాయి. అసలు జీవిస్తామో లేదో అనే విపత్కర పరిస్థితుల్లో ఒకరికొకరు ఏ విధంగా సాయం చేసుకుంటారు? జీవించడం కోసం ఎలాంటి పోరాటాలు చేస్తారు? అనేది కథ.

ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో (ప్రతి ఒక్కరూ హీరోనే).. '2018' క్యాప్షన్ ఇది. ఆపత్కాలంలో మానవత్వంతో ప్రతి ఒక్కరూ హీరోగా మారితే ఎలా ఉంటుందనే అంశాన్నే ఈ సినిమా ద్వారా దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ చూపించారు. గర్భవతిని హెలీకాప్టర్ ఎక్కించే సీన్, దివ్యాంగుడైన కొడుకును కాపాడుకునేందుకు తల్లిదండ్రులు పడే ఆరాటం, సర్టిఫికెట్ల కోసం నిక్సన్ చేసే సాహసం, వరద సీన్స్.. ఇలాంటివి ప్రేక్షకుల హృదయాలను తాకుతాయి. నటీనటులు తమ పాత్రల్లో జీవించారు. నోబిన్ పాల్ సంగీతం, అఖిల్ జార్జ్ ఛాయాగ్రహణం, చమన్ చాకో ఎడిటింగ్, గ్రాఫిక్ వర్క్స్.. ఇలా అన్నీ బాగా కుదిరాయి.

'2018..'ని చాలా కష్టపడి చేశాం. ఈ సినిమా షూటింగ్ నా లైఫ్‌లో బెస్ట్ మూమెంట్స్‌గా చెబుతాను. ఈ సినిమాకు ప్రజలు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. కొంత మంది ఏడ్చారు. సహకరించిన టీమ్‌కి, ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్.
– జూడ్ ఆంథోనీ జోసెఫ్

హిందీ చిత్రాలు 'కేరళ స్టోరీ, రాఖీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ, మిస్టర్ చటర్జీ వర్సెస్ నార్వే, గదర్ 2, అబ్ తో సబ్ భగవాన్ బరోసే, స్టోరీ టెల్లర్, మ్యూజిక్ స్కూల్, ట్వల్త్ ఫెయిల్, ఘూమర్, తెలుగు చిత్రాలు 'దసరా, బలగం', మరాఠీ చిత్రాలు 'వాల వి, బాపా ల్యాక్', తమిళ చిత్రాలు 'విడుదలై: పార్ట్ 1, 1947, ఆగస్టు 16' వంటివి దేశం తరఫున ఆస్కార్ నామినేషన్ ఎంట్రీ పోటీలో నిలిచినట్లుగా తెలుస్తోంది. ఆ చిత్రాలను దాటుకుని ఆస్కార్ నామినేషన్ వరదలో '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' నామినేషన్ బరిలో నిలిచింది. మరి.. ఈ చిత్రం నామినేషన్ దక్కించుకుంటుందా? అనేది తెలియాలంటే భారతీయ కాలమానం ప్రకారం జనవరి 24 వరకూ వెయిట్ చేయాలి. ఆ రోజే నామినేషన్స్ ప్రకటిస్తారు.

డేట్ ఫిక్స్


రవితేజ

రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఈగల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'ఈగల్' చిత్రాన్ని 2024 జనవరి 13న సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటించి, రవితేజ పోస్టర్ రిలీజ్ చేశారు. ''ఈ సినిమాలో రవితేజ మల్టీ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దవ్‌జాండ్, కెమెరా–ఎడిటింగ్–దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

సగం సినిమా పూర్తి


విజయ్ దేవరకొండ

'గీత గోవిందం' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్). మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 54వ సినిమా ఇది. ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయింది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. త్వరలో టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తాం. 2024 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసూ వర్మ.

యాక్షన్ సినిమాలపై మరింత గౌరవం పెరిగింది

– శ్రీ లీల



''యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా 'స్కంద'. ఇందులో నా పాత్రలో సరదా, భావోద్వేగ సన్నివేశాలు ఉంటాయి. కాలేజ్ డ్రామా కూడా ఉంది. మాస్ ఎలిమెంట్స్, ఫైట్స్‌ని అద్భుతంగా చూపించడంలో బోయపాటిగారి మార్క్ కనిపిస్తుంది. 'స్కంద' చేస్తున్నప్పుడు యాక్షన్ సినిమాలపై మరింత గౌరవం పెరిగింది'' అని శ్రీ లీల అన్నారు. రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన చిత్రం 'స్కంద'. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక శ్రీ లీల చెప్పిన విశేషాలు.

- 'స్కంద'లో నా పాత్రలో మాస్, క్లాస్ రెండూ మిక్స్ అయ్యుంటాయి. ఇందులో కొన్ని సీన్స్ నా రియల్ లైఫ్‌కి దగ్గరగా ఉంటాయి. ముఖ్యంగా మాస్ సీన్స్.
- ధమాకా'లో నా డ్యాన్స్‌లకు అంత పేరు వస్తుందనుకోలేదు. 'స్కంద' పాటల్లో మాస్, వెస్ట్రన్ డ్యాన్సులు అలరిస్తాయి. రామ్‌గారి డ్యాన్స్‌ని మ్యాచ్ చేయడం కష్టం. శ్రీనివాసా చిట్టూరిగారు ఈ సినిమాని గ్రాండ్‌గా నిర్మించారు. 'స్కంద' బోయపాటిగారి మార్క్‌లో గ్రాండ్‌గా ఉంటుంది. ఇంత మాస్ యాక్షన్ సినిమా చేయడం నాకిదే తొలిసారి. అలాగే పవర్‌ఫుల్ డైలాగ్స్ చెప్పడం కూడా మొదటిసారే.
- 'పెళ్లి సందడి' తర్వాత 'స్కంద'తో పాటు మరో రెండు మూడు సినిమాలు ఒప్పుకున్నాను. ఇప్పుడు దాదాపు ఎనిమిది సినిమాలు ఉన్నాయి. ఇన్ని అవకాశాలు రావడానికి కారణం ఇండస్ట్రీ, ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానమే. ఆ ప్రేమను మంచి సినిమాలు చేయడం ద్వారా తిరిగి ఇవ్వాలన్నదే నా తపన.

ఆ ఫీల్ వేరే లెవల్!

– విరాట్ కర్ణ



విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'పెదకాపు'. ఈ చిత్రం తొలి భాగం 'పెదకాపు 1' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో విరాట్ కర్ణ చెప్పిన విశేషాలు.

- చిన్నతనంలో క్రికెటర్ కావాలనుకున్నాను. కానీ కాలేజ్ పూర్తయ్యాక 'జయ జానకి నాయక' సినిమా ప్రొడక్షన్‌లోకి వచ్చాను. నాలో నటించే ప్రతిభ కూడా ఉందని నిరూపించేందుకు ఓ యాక్షన్ షార్ట్ ఫిల్మ్‌ను తీసుకువచ్చి మా బావ (మిర్యాల రవీందర్ రెడ్డి)గారికి చూపించాను. అది దర్శకులు శ్రీకాంత్‌గారికి కూడా నచ్చడం, 'పెదకాపు' సినిమాకు ఓ కొత్త కుర్రాడిగా నేను నప్పుతానని ఆయన అనడంతో ఈ సినిమా మొదలైంది.
- ఈ సినిమాలో పెదకాపుగా నటించాను. 1980 బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథ జరుగుతుంది. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ బలవంతుడితో పోరాడి ఓ సామాన్యుడు ఎలా ఎదిగాడు? అన్నదే 'పెదకాపు' కథ.
- ఈ సినిమాకు నిర్మాత రవీందర్‌రెడ్డిగారు కాకపోయినట్లయితే ఇంత కాన్వాస్ దొరికేది కాదేమో. ఈ సినిమాలోని ఓ యాక్షన్ ఎమోషనల్ సీన్‌ని నేను బాగా చేశానని, నన్ను గ్రేడ్ ఏ యాక్టర్‌గా సర్టిఫై చేస్తున్నట్లుగా పీటర్ హెయిన్స్‌గారు అన్నారు. అక్కడే ఉన్న రెడ్డిగారి కళ్లలో నీళ్ల తిరిగాయి.
- నేను ప్రభాస్‌గారికి ఫ్యాన్‌ని. ఈ సినిమా రిలీజ్ తర్వాత ఈ చిత్రంపై ప్రభాస్‌గారు స్పందిస్తే నా ఫీల్ వేరే లెవల్‌లో ఉంటుంది. త్వరలో 'పెదకాపు 2' స్టార్ట్ షూటింగ్ ఆరంభమవుతుంది.

నా జీవితమే సినిమాలా ఉంటుంది

– ముత్తయ్య మురళీధరన్



''నా బయోపిక్‌గా '800' అనుకున్నప్పుడు స్క్రిప్ట్ నాలుగైదుసార్లు చదివా. ఇందులో ఎటువంటి మసాలా ఉండకూడదనే విషయాన్ని దర్శక-నిర్మాతలకు ముందుగానే చెప్పాను. నిజమైన కథ లేకపోతే అది బయోపిక్ కాదు. నా జీవితమే సినిమాలా ఉంటుంది. నా జీవితంలో ఎత్తుపల్లాలు ఎలా అయితే ఉన్నాయో.. '800' విడుదల వెనక అలాగే ఎత్తుపల్లాలు ఉన్నాయి'' అని శ్రీలంక ప్రముఖ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ అన్నారు. ఆయన జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ముత్తయ్యగా మధుర్ మిట్టల్ నటించారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో మూవీ ట్రైన్ మోషన్ పిక్చర్స్ నిర్మించింది. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో అక్టోబర్ 6న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ముత్తయ్య మురళీధరన్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.

మీ బయోపిక్ గురించి చెప్పినప్పుడు ఏమనిపించింది?

నా జీవితాన్ని సినిమాగా తీయాలని ఎప్పుడూ అనుకోలేదు. శ్రీలంక ప్రజలకు సహాయం చేయడం కోసం 20 ఏళ్ల క్రితం ఓ ఫౌండేషన్ స్థాపించి, ఎంతో మందికి సాయం అందించాం. శ్రీలంకలోని తమిళ ప్రజలకు సాయం చేయడానికి దర్శకుడు వెంకట్ ప్రభు 2008లో వచ్చారు. ఆయనతో పాటు '800' చిత్రదర్శకుడు శ్రీపతి, ఇంకో ఇద్దరు ఉన్నారు. నా వైఫ్ మదిమలర్, వెంకట్ ప్రభు చిన్ననాటి స్నేహితులు కావడంతో మమ్మల్ని కలిశారు. నా ట్రోఫీలు, సాధించిన ఘనతలు చూసి నా బయోపిక్ తీద్దామంటే ముందు వద్దన్నాను.. ఆ తర్వాత సరే అన్నాను. అప్పుడు శ్రీపతిని కథ రాయమని వెంకట్ ప్రభు చెప్పారు.

బయోపిక్ అంటే ఫిక్షన్ జోడిస్తారు కదా..

నో ఫిక్షన్. ఈ సినిమాలో క్రికెట్ 20 శాతమే ఉంటుంది. మిగతా 80 శాతం నా జీవితం ఉంటుంది. నా జర్నీ, నేను ఇన్ని ఘనతలు సాధించిన క్రమంలో నా కుటుంబం, దేశం ఎదుర్కొన్న పరిస్థితులు '800'లో చూపించాం. నా బాల్యం, సెలెక్టర్లు నన్ను ఎందుకు ఎంపిక చేశారు వంటివి ఎవరికీ తెలియవు. ఆ విషయాలు సినిమాలో ఉంటాయి.

'800' సినిమా రషెస్ చూశారా? మీ పాత్రకు మధుర్ మిట్టల్ ఎంత వరకు న్యాయం చేశారు?

రషెస్ కంటే మూవీ చూడాలనుకున్నాను. అందుకే చూడలేదు. నేను పెద్ద సినిమా అభిమానిని. ఇండియన్ సినిమాలను మిస్ కాను. మధుర్ మిట్టల్‌ని రెండుసార్లు కలిశా. '800' టీజర్, ట్రైలర్ చూశాను. నాలాగా, లుక్స్ పరంగా 70 శాతం మ్యాచ్ అయ్యాడు.

'800' షూటింగ్‌కి వెళ్లలేదా?

ఒక్కసారి మాత్రమే వెళ్లాను. సినిమా నిర్మాణం గురించి నాకేమీ తెలియదు. అది కష్టమైన కళ. కొన్నిసార్లు నిర్మాతలను చూస్తే బాధగా ఉంటుంది. నటీనటులతో పాటు అందరికీ డబ్బులు ఇస్తారు. ఒకవేళ సినిమా ఆడకపోతే నిర్మాతల డబ్బులే పోతాయి కదా.

సినిమా హిట్ కావచ్చు, ఫ్లాప్ అవ్వొచ్చు. అందుకే చాలా మంది క్రికెటర్లు తమ బయోపిక్ తీయాలని కోరుకోరు..

సినిమా విజయంలో చాలా అంశాలు ఉంటాయి. సినిమా ఫ్లాప్ అయితే నా లెగసీ ఏమీ పడిపోదు. నా లెగసీ క్రికెట్. నిజంగా జరిగిన కథను ప్రజలకు చెప్పాలని మేం చేసిన ప్రయత్నం '800'. అది కొందరికి నచ్చవచ్చు.. మరికొందరికి నచ్చకపోవచ్చు. ఇదొక మంచి సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.

శ్రీలంకలోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారా?

ప్రపంచవ్యాప్తంగా తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. శ్రీలంకన్ సింహళ భాషలోనూ రిలీజ్ చేస్తున్నాం.

తెలుగు సినిమాలు చూస్తారా?

శ్రీలంకలో తమిళ, హిందీ చిత్రాలు రిలీజవుతాయి. ఆ భాషల్లో డబ్బింగ్ చేసిన తెలుగు సినిమాలు చూస్తా. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్ప' సినిమాలను హిందీ, తమిళ భాషల్లో కూడా విడుదల చేయడంతో చూశా. శ్రీలంకలో బాలీవుడ్ మూవీస్ ఫేమస్. ఇప్పుడు తెలుగు సినిమా టాప్ పొజిషన్‌కు చేరుకుంది.

మీకు ఇష్టమైన తెలుగు నటుడు ఎవరు?

ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో సూపర్ హీరోస్, స్టార్ హీరోస్ ఎక్కువ మంది ఉన్నారు. నేను నాని సినిమాలు ఎక్కువ చూశా. 'ఈగ', 'జెర్సీ', 'శ్యామ్ సింగరాయ్' చిత్రాలు బాగున్నాయి.

మీ బయోపిక్ విడుదలవుతోంది. టెన్షన్ ఏమైనా?

ఎందుకు టెన్షన్ పడాలి? నేను వరల్డ్ కప్ ఫైనల్ ఆడుతుంటే టెన్షన్ పడాలి (నవ్వుతూ).

త్వరలో వరల్డ్ కప్ మొదలవుతోంది. మీ ఫేవరేట్ టీమ్?

శ్రీలంక మాత్రమే నా ఫేవరెట్. అయితే ఎవరు గెలుస్తారనేది ఇప్పుడే చెప్పలేం.



చెస్‌లో త్రుటిలో చేజారిన పతకం

ఆసియా క్రీడల చెస్ ఈవెంట్ వ్యక్తిగత విభాగాల్లో భారత్ ఒక్క పతకం కూడా గెలవలేకపోయింది. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక ఆరు పాయింట్లతో నాలుగో స్థానంలో, కోనేరు హంపి 5.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచారు. ఎనిమిదో రౌండ్‌లో హంపితో జరిగిన గేమ్‌ను హారిక 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో హారిక 30 ఎత్తుల్లో జినెర్ జు (చైనా)పై గెలిచింది. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత జినెర్ జు ఏడు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. ఉమిదా ఒమనోవా (ఉజ్బెకిస్తాన్), హా ఇఫాన్ (చైనా) 6.5 పాయింట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు విదిత్ సంతోష్ గుజరాతి, ఇరిగేశి అర్జున్ 5.5 పాయింట్లతో వరుసగా ఐదు, ఆరు స్థానాలతో సరిపెట్టుకున్నారు. వె యి (చైనా: 7.5 పాయింట్లు) స్వర్ణం, నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్: 7 పాయింట్లు) రజతం, సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్: 7 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు.



ఓటమితో ముగింపు

ఆస్ట్రేలియాతో చివరి వన్డేలో భారత్ విజయలక్ష్యం 353 పరుగులు... టీమ్ తాజా ఫామ్, పిచ్‌ను బట్టి చూస్తే అసాధ్యమేమీ అనిపించలేదు. అయితే చివరకు భారత్‌కు ప్రతికూల ఫలితమే వచ్చింది. రోహిత్, కోహ్లిలు బరిలోకి దిగి సత్తా చాటినా గెలుపు దక్కలేదు. వరుస విజయాల ఊపులో మరో మ్యాచ్ గెలిచి ఆస్ట్రేలియాపై తొలిసారి వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న టీమిండియా కోరిక నెరవేరలేదు. ఆస్ట్రేలియా సమష్టి ప్రదర్శనతో విజయాన్ని అందుకొని తమ వరుస ఐదు పరాజయాలకు బ్రేక్ వేసింది. అయితే ఇప్పుడు ఈ వామప్ తరహా మ్యాచ్‌కంటే మరో పది రోజుల తర్వాత జరిగే అసలు పోరుపైనే అందరి దృష్టి నిలిచింది. అక్టోబర్ 8న భారత్, ఆస్ట్రేలియా వరల్డ్ మ్యాచ్ కోసం ఇక ఎదురు చూడండి.

- చివరి వన్డేలో భారత్ పరాజయం
- 66 పరుగులతో గెలిచిన ఆస్ట్రేలియా
- సిరీస్ 2-1తో భారత్ సొంతం

రాజ్‌కోట్: ప్రపంచకప్‌కు ముందు సన్నాహకంగా ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2-1తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 66 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. టాప్-4 బ్యాటర్లు అర్ధసెంచరీలు సాధించారు. మిచెల్ మార్ష్ (84 బంతుల్లో 96; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్టీవ్ స్మిత్ (61 బంతుల్లో 74; 8 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (58 బంతుల్లో 72; 9 ఫోర్లు),




డేవిడ్ వార్నర్ (34 బంతుల్లో 56; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక పరుగులు చేశారు. మార్ష్, స్మిత్ రెండో వికెట్‌కు 137 పరుగులు జోడించారు. 353 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 49.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ శర్మ (57 బంతుల్లో 81; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (61 బంతుల్లో 56; 5 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (43 బంతుల్లో 48; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ 4 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. ఓవరాల్‌గా 178 పరుగులు చేసిన శుబ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 56; మార్ష్ (సి) ప్రసిధ్ (బి) కుల్దీప్ 96; స్మిత్ (ఎల్బీ) (బి) సిరాజ్ 74; లబుషేన్ (సి) శ్రేయస్ (బి) బుమ్రా 72; క్యారీ (సి) కోహ్లి (బి) బుమ్రా 11; మ్యాక్స్‌వెల్ (బి) బుమ్రా 5; గ్రీన్ (సి) శ్రేయస్ (బి) కుల్దీప్ 9; కమిన్స్ (నాటౌట్) 19; స్టార్క్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 352. వికెట్ల పతనం:** 1-78, 2-215, 3-242, 4-267, 5-281, 6-299, 7-345. **బౌలింగ్:** బుమ్రా 10-0-81-3, సిరాజ్ 9-0-68-1, ప్రసిధ్ కృష్ణ 5-0-45-1, జడేజా 10-0-61-0, వాషింగ్టన్ సుందర్ 10-0-48-0, కుల్దీప్ యాదవ్ 6-0-48-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి అండ్ బి) మ్యాక్స్‌వెల్ 81; సుందర్ (సి) లబుషేన్ (బి) మ్యాక్స్‌వెల్ 18; కోహ్లి (సి) స్మిత్ (బి) మ్యాక్స్‌వెల్ 56; శ్రేయస్ (బి) మ్యాక్స్‌వెల్ 48; కేఎల్ రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 26; సూర్యకుమార్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) హాజల్‌వుడ్ 8; జడేజా (ఎల్బీ) (బి) సంఘా 35; కుల్దీప్ (బి) హాజల్‌వుడ్ 2; బుమ్రా (సి) లబుషేన్ (బి) కమిన్స్ 5; సిరాజ్ (సి) కమిన్స్ (బి) గ్రీన్ 1; ప్రసిధ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 286. వికెట్ల పతనం:** 1-74, 2-144, 3-171, 4-223, 5-233, 6-249, 7-257, 8-270, 9-286, 10-286. **బౌలింగ్:** స్టార్క్ 7-0-53-1, హాజల్‌వుడ్ 8-0-42-2, కమిన్స్ 8-0-59-1, గ్రీన్ 6.4-0-30-1, మ్యాక్స్‌వెల్ 10-0-40-4, తన్వీర్ సంఘా 10-0-61-1.


సిఫ్ట్ కౌర్

బుల్లెట్ దిగింది...

చైనా గడ్డపై భారత తుపాకీ గర్జించింది. ఒకే రోజు మన షూటర్లు ఏకంగా ఏడు పతకాలతో అదరహో అనిపించారు. స్టెతస్కోప్‌ను వదిలేసి రైఫిల్ ఎత్తిన సిఫ్ట్ కౌర్ సామ్రా కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి పసిడి పతకం సొంతం చేసుకుంది. తెలంగాణ టీనేజ్ షూటర్ ఇషా సింగ్ డబుల్ ధమాకా సృష్టించింది. పిస్టల్ ఈవెంట్‌లో ఇషా సభ్యురాలిగా ఉన్న భారత జట్టు స్వర్ణ పతకంతో మెరిపించగా... వ్యక్తిగత విభాగంలో ఇషా రజత పతకంతో మురిపించింది. స్కీట్ ఈవెంట్‌లో అనంత్ జీత్ సింగ్ రెండు పతకాలతో భారత బృందంలో ఆనందాన్ని రెట్టింపు చేశాడు. సెయిలింగ్‌లో విష్ణు శరవణన్ కాంస్య పతకం గెలిచాడు. మహిళల వుషు సాండా ఈవెంట్‌లో రోషిబినా దేవి ఫైనల్ చేరి... పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ జోడీ సెమీఫైనల్ చేరి పతకాలను ఖాయం చేసుకున్నారు. వెరసి ఆసియా క్రీడల్లో నాలుగో రోజు భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి ఎనిమిది పతకాలు చేరాయి. ఓవరాల్‌గా 22 పతకాలతో భారత్ ఏడో స్థానంలో ఉంది.

ఒకే రోజు ఏడు పతకాలతో అదరగొట్టిన భారత షూటర్లు

- ప్రపంచ రికార్డుతో పసిడి పతకం నెగ్గిన సిఫ్ట్ కౌర్
- తెలంగాణ షూటర్ ఇషా సింగ్ డబుల్ ధమాకా
- 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో రజతం నెగ్గిన ఇషా

హాంగ్జౌ: గురి తప్పని లక్ష్యంతో భారత షూటర్లు ఆసియా క్రీడల్లో పతకాల మోత మోగించారు. బుధవారం ఏకంగా ఏడు పతకాలతో తమ సత్తా చాటుకున్నారు. ఈ ఏడు పతకాల్లో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉండటం విశేషం. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతో పాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 469.6 పాయింట్లు స్కోరు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 467 పాయింట్లతో బ్రిటన్ షూటర్ సియోనైడ్ మెకింటోష్ పేరిట ఉన్న వరల్డ్ రికార్డును 22 ఏళ్ల సిఫ్ట్ కౌర్ బద్దలు కొట్టింది. ఇదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన ఆశి చౌక్సీ 451.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ప్రపంచ చాంపియన్ కియోంగ్‌యు జాంగ్ (చైనా; 462.3 పాయింట్లు) రజతం కైవసం చేసుకుంది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో సిఫ్ట్ కౌర్, ఆశి చౌక్సీ, మానిని కౌశిక్‌లతో కూడిన భారత జట్టు 1764 పాయింట్లు సాధించి రజత పతకాన్ని సాధించింది. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ ప్రాంతానికి చెందిన సిఫ్ట్ కౌర్ ఒకవైపు వైద్య విద్యను అభ్యసిస్తూ రైఫిల్ షూటింగ్‌లో కొనసాగింది. అయితే షూటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో సిఫ్ట్ కౌర్‌కు మంచి ఫలితాలు వస్తుండటంతో ఏడాది తర్వాత ఆమె వైద్య విద్యకు బ్రేక్ ఇచ్చి పూర్తిస్థాయిలో ఈ క్రీడపై దృష్టి సారించింది. ఆమె సరైన నిర్ణయమే తీసుకుందని తాజా ఫలితం నిరూపించింది.


25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో నెగ్గిన స్వర్ణ పతకంతో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్

అంతకుముందు మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ భారత షూటర్లు ఇషా సింగ్, రిథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ త్రయం మెరిసింది. క్వాలిఫయింగ్‌లో ఇషా, రిథమ్, మనూ 1759 పాయింట్లు స్కోరు చేసి టీమ్ విభాగంలో పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఇషా, మనూ భాకర్ వ్యక్తిగత విభాగం ఫైనల్‌కూ అర్హత సాధించారు. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 34 పాయింట్లు సాధించి రజత పతకాన్ని గెలిచింది. మనూ భాకర్ 21 పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.


అనంత్ జీత్

పురుషుల స్కీట్ ఈవెంట్‌లో భారత్‌కు టీమ్ విభాగంలో కాంస్యం, వ్యక్తిగత విభాగంలో రజతం లభించాయి. అనంత్ జీత్ సింగ్, గురుజోత్ సింగ్, అంగద్ వీర్‌సింగ్ బాజ్వాలతో కూడిన భారత జట్టు క్వాలిఫయింగ్‌లో 355 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఆరుగురు పోటీపడ్డ వ్యక్తిగత విభాగం ఫైనల్లో అనంత్ జీత్ 58 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని హస్తగతం చేసుకున్నాడు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	76	43	21	140
దక్షిణ కొరియా	19	18	33	70
జపాన్	15	27	24	66
ఉజ్బెకిస్తాన్	6	10	12	28
థాయ్‌లాండ్	6	3	8	17
హాంకాంగ్	5	8	14	27
భారత్	5	7	10	22
ఇండోనేసియా	3	2	7	12
చైనీస్ తైపీ	2	3	4	9
సింగపూర్	2	3	4	9

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

విష్ణు శరవణన్‌కు కాంస్యం



ఆసియా క్రీడల్లో మంగళవారం సెయిలింగ్‌లో భారత్‌కు రెండు పతకాలు రాగా... బుధవారం మరో పతకం చేరింది. పురుషుల డింగీ ఐఎల్‌సీఏ-7 ఈవెంట్‌లో విష్ణు శరవణన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 11 రేసులు జరిగిన ఈ ఈవెంట్‌లో విష్ణు శరవణన్ 34 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు.

ఫైనల్లో రోషిబినా దేవి



ఆసియా క్రీడల మహిళల వుషు క్రీడాంశంలో భారత్‌కు కనీసం రజత పతకం ఖాయమైంది. సాండా ఈవెంట్ 60 కేజీల విభాగంలో భారత క్రీడాకారిణి రోషిబినా దేవి ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో రోషిబినా 2-0తో థి థు ఎన్గుయెన్ (వియత్నాం)పై నెగ్గింది.

సాకేత్ జోడీకి పతకం ఖాయం



ఆసియా క్రీడల టెన్నిస్‌లో బుధవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ జోడీ సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో సుమిత్ నగాల్, మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. క్వార్టర్ ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 6-1, 7-6 (10/8)తో జిజెన్ జాంగ్-యిబింగ్ వు (చైనా) జంటను ఓడించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్‌కిది ఆసియా క్రీడల్లో మూడో పతకం కానుంది. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సాకేత్ పురుషుల డబుల్స్‌లో రజతం, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం సాధించాడు. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ నగాల్ 7-6 (7/3), 1-6, 2-6తో టాప్ సీడ్ జిజెన్ జాంగ్ (చైనా) చేతిలో, అంకిత రైనా 6-3, 4-6, 4-6తో హరూకా కాజి (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయారు.

క్వార్టర్ ఫైనల్లో నిఖత్

తొలిసారి ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న 'డబుల్ వరల్డ్ చాంపియన్' నిఖత్ జరీన్ పతకానికి విజయం దూరంలో నిలిచింది. మహిళల 50 కేజీల విభాగంలో భారత స్టార్ బాక్సర్ నిఖత్ బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 5-0తో చోరోంగ్ బాక్ (దక్షిణ కొరియా)ను చిత్తుగా ఓడించింది.

భారీ విజయంతో భారత్ బోణీ

ఆసియా క్రీడల మహిళల హాకీ ఈవెంట్‌లో సింగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 13-0తో గోల్స్‌తో నెగ్గింది. భారత్ తరఫున సంగీత మూడు గోల్స్ చేయగా... నవ్‌నీత్ కౌర్ రెండు గోల్స్ సాధించింది. ఉదిత, సుశీల దీపిక, దీప్ గ్రేస్ ఎక్కా, నేహా, సలీమా, మోనిక, వందన ఒక్కో గోల్ చేశారు.

కొడితే బంతి ఎవరెస్ట్‌కు...

- టి20 మ్యాచ్‌లో నేపాల్ జట్టు కమాల్
- ఐదు కొత్త ప్రపంచ రికార్డులు నమోదు
- 34 బంతుల్లో కుశాల్ మల్లా ఫాస్టెస్ట్ సెంచరీ
- 9 బంతుల్లో దీపేంద్ర సింగ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ
- 273 పరుగులతో మంగోలియా చిత్తు




కుశాల్


దీపేంద్ర

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో నేపాల్ క్రికెట్ జట్టు అద్భుతం చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో పనికూనలాంటి ఆ జట్టు ఆటలో ఇప్పుడే నడక మొదలుపెట్టిన టీమ్‌పై తమ ప్రతాపాన్ని ప్రదర్శించింది. పరుగుల వాన, పరుగుల వరద అనే విశేషణాలు ఈ మ్యాచ్‌కు సరిపోవు... విధ్వంసం, దూకుడు అనేవి కూడా చిన్న పదాలు... ఒకదాని తర్వాత మరో కొత్త మరో రికార్డు... పరుగులు, బంతులు, బౌండరీలు... ఇలా అన్నింటిలోనూ కొత్త ఘనతలే. ఆసియా క్రీడల్లో భాగంగా బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో నేపాల్ ఏకంగా 273 పరుగుల తేడాతో మంగోలియాను చిత్తుచిత్తుగా ఓడించింది. ఈ క్రమంలో టి20ల్లో పలు రికార్డులు తమ ఖాతాలో వేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. కుశాల్ మల్లా (50 బంతుల్లో 137 నాటౌట్; 8 ఫోర్లు, 12 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగాడు. రోహిత్ పౌడెల్ (27 బంతుల్లో 61; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), దీపేంద్ర సింగ్ ఐరీ (10 బంతుల్లో 52 నాటౌట్; 8 సిక్స్‌లు) అతనికి అండగా నిలిచారు. అనంతరం మంగోలియా 13.1 ఓవర్లలో 41 పరుగులకే కుప్పకూలింది. దవాసురెన్ (10) ఒక్కటే రెండంకెల స్కోరు చేయగా, ఎక్స్‌ట్రాలదే (23) అత్యధిక స్కోరు. మంగోలియా జట్టుకు ఇది తొలి అంతర్జాతీయ మ్యాచ్ మాత్రమే కాదు, ఓవరాల్‌గా కూడా ఆ జట్టుకు ఇదే తొలి టి20 మ్యాచ్. తుది జట్టులోని 11 మందీ తొలిసారి టి20 మ్యాచ్ బరిలోకి దిగినవారే. దాంతో కాస్త అనుభవం ఉన్న నేపాల్ ముందు ఈ జట్టు కనీసం నిలవలేకపోయింది.

మ్యాచ్‌లో నమోదైన రికార్డులు...

314 అంతర్జాతీయ టి20ల్లో ఇదే అత్యధిక స్కోరు. గతంలో ఏ జట్టూ 300 పరుగులు చేయలేదు. 278 పరుగులతో ఉన్న రికార్డును (2019లో ఐర్లాండ్ జట్టుపై అఫ్గానిస్తాన్, 2019లో తుర్కియే జట్టుపై చెక్ రిపబ్లిక్) నేపాల్ బద్దలు కొట్టింది.

273 టి20ల్లో అతి పెద్ద విజయం. గతంలో చెక్ రిపబ్లిక్ 257 పరుగులతో తుర్కియేని ఓడించింది.

34 అంతర్జాతీయ టి20ల్లో కుశాల్ మల్లా 34 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీని నమోదు చేశాడు. గతంలో 35 బంతుల్లో రోహిత్ శర్మ (భారత్: 2017లో శ్రీలంకపై), డేవిడ్ మిల్లర్ (దక్షిణాఫ్రికా: 2017లో బంగ్లాదేశ్‌పై), విక్రమశేఖర (చెక్ రిపబ్లిక్: 2019లో తుర్కియేపై) నెలకొల్పిన సెంచరీ రికార్డు తెరమరుగైంది.

9 అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీని దీపేంద్ర సింగ్ నమోదు చేశాడు. గతంలో 12 బంతులతో ఈ రికార్డు భారత స్టార్ యువరాజ్ సింగ్ (2007లో ఇంగ్లండ్‌పై) పేరిట ఉంది.

26 ఇన్నింగ్స్‌లో నేపాల్ అత్యధిక సిక్సర్ల రికార్డు నమోదు చేసింది. గతంలో అఫ్గానిస్తాన్ జట్టు ఐర్లాండ్‌పై (2019లో), వెస్టిండీస్ జట్టు దక్షిణాఫ్రికాపై (2023లో) 22 సిక్స్‌లు చొప్పున కొట్టింది.

ఏడేళ్ల తర్వాత భారత గడ్డపై...

హైదరాబాద్ చేరిన పాకిస్తాన్ జట్టు ● రేపు న్యూజిలాండ్‌తో వామప్ మ్యాచ్

సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్ క్రికెట్ జట్టు సభ్యులు రెండు వారాల పాటు హైదరాబాద్ నగరంలో అతిథులుగా ఉండబోతున్నారు. వన్డే వరల్డ్ కప్‌లో రెండు వామప్ మ్యాచ్‌లతో పాటు రెండు ప్రధాన మ్యాచ్‌లను కూడా పాకిస్తాన్ ఇక్కడి ఉప్పల్ స్టేడియంలో ఆడనుంది. మెగా టోర్నీలో పాల్గొనేందుకు బాబర్ ఆజమ్ నాయకత్వంలోని 15 మంది సభ్యుల బృందం బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో హెచ్‌సీఏ ప్రతినిధులు పాక్ జట్టుకు స్వాగతం పలికారు. విమానాశ్రయంలో జట్టుకు నగర పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పాక్ క్రికెట్ టీమ్ ఏడేళ్ల తర్వాత భారత గడ్డపై అడుగు పెట్టడం విశేషం. 2016లో ఇక్కడే టి20 ప్రపంచకప్ ఆడిన ఆ టీమ్ మళ్లీ ఇప్పుడే మరో వరల్డ్ కప్ కోసం ఇక్కడకు వచ్చింది. టీమ్‌లోని మొహమ్మద్ నవాజ్, సల్మాన్ ఆగాలకు మాత్రమే గతంలో భారత్‌లో ఆడిన అనుభవం (జూనియర్ స్థాయిలో) ఉండగా... టీమ్ కెప్టెన్, ఇప్పటి అగ్రశ్రేణి బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన బాబర్ ఆజమ్ తొలిసారి భారత్‌లో ఆడబోతున్నాడు. భారత్ బయల్దేరే ముందు లాహోర్‌లో మీడియాతో మాట్లాడిన బాబర్ ఆజమ్ తమ జట్టు మెరుగైన ప్రదర్శన ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. భారత్‌తో మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పాడు. 'గతంలో భారత్‌లో ఆడకపోయినా మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. దాదాపు ఆసియా ఖండంలోనే ఇతర దేశాల్లాగే ఉండే ఇక్కడి పరిస్థితులపై మాకు అవగాహన ఉంది. అందుకే మేం తగిన విధంగా సన్నద్ధమై వచ్చాం. హౌస్‌ఫుల్‌గా ఉండబోయే అహ్మదాబాద్‌లో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. నా సొంత రికార్డుల గురించి ఆలోచన లేదు. ఎంత స్కోరు చేసినా జట్టు విజయానికి ఉపయోగపడటం ముఖ్యం' అని బాబర్ అన్నాడు. ఉప్పల్ స్టేడియంలో రేపు న్యూజిలాండ్‌తో, అక్టోబర్ 3న ఆస్ట్రేలియాతో పాకిస్తాన్ రెండు వామప్ మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం ప్రధాన టోర్నీలో అక్టోబర్ 6న నెదర్లాండ్స్‌తో, అక్టోబర్ 10న శ్రీలంకతో ఆ జట్టు తలపడుతుంది. మరోవైపు కేన్ విలియమ్సన్ నేతృత్వంలో క్రైస్ట్‌చర్చ్ నుంచి వచ్చిన న్యూజిలాండ్ టీమ్ రెండో బృందం కూడా బుధవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకుంది.

వన్డే ప్రపంచకప్ మరో 7 రోజుల్లో


శంషాబాద్ విమానాశ్రయంలో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజమ్, పేస్ బౌలర్ షాహీన్ అఫ్రిది

సాక్షి బిజినెస్
గురువారం
28-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	173	66,119
నిఫ్టీ ▲	52	19,716

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,988	▼	75
డోజోన్స్	33,357	▼	253
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,593	▼	32
డాక్స్	15,217	▼	38
హాంగ్‌సెంగ్	3,107	▲	5
నికాయ్	32,371	▲	57

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,454
బంగారం (99.5 స్వచ్ఛత)	58,220
వెండి (కేజీ)	70,930

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.56	83.09
£	బ్రిటన్ పౌండ్		100.83	103.56
€	యూరో		85.31	90.63
¥	జపాన్ ఎన్ (100)		54.85	55.18
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.84	55.69
S$	సింగపూర్ డాలర్		60.93	62.48
SAR	సౌదీ రియాల్		21.24	22.86
UAE D	యూఏఈ దిర్హామ్		21.76	23.55
¥	చైనా యువాన్		10.27	12.34

మళ్లీ జీఆర్‌టీ జ్యువెలర్స్ బ్యాంగిల్ మేళా

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జీఆర్‌టీ జ్యువెలర్స్ మళ్లీ బ్యాంగిల్ మేళా నిర్వహిస్తుంది. విస్తృత శ్రేణిలో వివిధ రకాల మోడల్ గాజులను ఆకర్షణీయమైన ఆఫర్లతో సంస్థ అందుబాటులోకి తెచ్చింది. బంగారు ఆభరణాల తరుగుపై 20%, వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10% డిస్కౌంట్ ఇస్తుంది. 'ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాదీ బ్యాంగిల్ మేళా తీసుకొచ్చాము. కస్టమర్లు తమకు నచ్చిన డిజైన్లు, గాజులను తక్కువ ధరలో కొనుగోలు చేయొచ్చు' అని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

ఎస్‌హెచ్‌జీలకు ఇండియన్ బ్యాంక్ రుణాలు



హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలకు మరింత చేరువయ్యేందుకు ఇండియన్ బ్యాంక్ బుధవారం 'మెగా ఎస్‌హెచ్‌జీ అవుట్‌రీచ్ క్యాంప్' నిర్వహించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.870 కోట్లు, తెలంగాణాకు రూ.140 కోట్ల ఎస్‌హెచ్‌జీ రుణాలు పంపిణీ చేసింది. అలాగే చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహించేందుకు అదనంగా రూ.47.28 కోట్ల రుణాలు కేటాయించింది. స్వయం సేవా సంఘాల ఆర్థిక సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఇండియన్ బ్యాంక్ గణనీయమైన కృషి చేస్తుందని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇమ్రాన్ అమిన్ సిద్ధిఖీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా సెర్ప్ డైరెక్టర్ వై నరసింహా రెడ్డితో పాటు ఇతర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-9-2023	
విశాఖ	533-00
చిత్తూరు	533-00
విజయవాడ	533-00
రిటైల్ ధర (డజను)	72.00
27-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	516-00
వరంగల్	518-00
రిటైల్ ధర	5.75

ఉద్యోగుల చాయిస్ 'జెప్టో'

లింక్డ్‌ఇన్ రేటింగ్స్‌లో టాప్ ర్యాంకు

న్యూఢిల్లీ: దేశీయంగా ఉద్యోగులు పని చేసేందుకు అత్యధికంగా ఇష్టపడుతున్న టాప్ 20 స్టార్టప్‌ల జాబితాలో ఈ–కామర్స్ దిగ్గజం జెప్టో అగ్రస్థానం దక్కించుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల క్యాబ్ అగ్రిగేటర్ బ్లూస్మార్ట్, ఫిన్‌టెక్ సంస్థ డిట్టో ఇన్సూరెన్స్, ఆడియో ఓటీటీ ప్లాట్‌ఫాం పాకెట్ ఎఫ్‌ఎం, స్కైరూట్ ఏరోస్పేస్ తదుపరి స్థానాల్లో ఉన్నాయి. రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫాం లింక్డ్‌ఇన్ బుధవారం విడుదల చేసిన 'టాప్ 20 భారత స్టార్టప్స్' వార్షిక జాబితాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. లింక్డ్‌ఇన్‌లో దాదాపు 1 కోటి మంది సభ్యులు ఉన్నారు. వారి డేటా ఆధారంగా, ఉద్యోగం చేసేందుకు ప్రొఫెషనల్స్ ఇష్టపడుతున్న వర్ధమాన కంపెనీలను విశ్లేషించి లింక్డ్‌ఇన్ ఈ ర్యాంకులు ఇచ్చింది. ఉద్యోగుల వృద్ధి, ఉద్యోగార్థుల ఆసక్తి తదితర అంశాల ప్రాతిపదికన జెప్టో తాజాగా మూడు స్థానాలు ఎగబాకి అగ్రస్థానం దక్కించుకుంది. జెప్టో ఇటీవలే యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ గల స్టార్టప్) హోదాను దక్కించుకుంది. ఈ ఏడాది లిస్టులో చోటు దక్కించుకున్న 20 స్టార్టప్‌లలో 14 సంస్థలు కొత్తవేనని లింక్డ్‌ఇన్ ఇండియా హెడ్ (ఎడిటోరియల్) నిరాజితా బెనర్జీ తెలిపారు. స్టార్టప్‌ల విభాగంలో అసాధారణ వేగంతో ఆవిష్కరణల రూపకల్పన జరుగుతుండటం, పుష్కలమైన వృద్ధి అవకాశాలకు ఇది నిదర్శనమని ఆమె చెప్పారు.



సాగర రవాణాకు ఐజీఎస్‌టీ మినహాయింపు

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: సాగర రవాణాకు అనుకూల నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. సాగర రవాణా ద్వారా దిగుమతులకు చేసే చెల్లింపులపై ఇప్పటి వరకు 5% ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) అమలవుతుండగా, దీన్ని పూర్తిగా మినహాయించింది. ఇందుకు సంబంధించి ఐజీఎస్‌టీ చట్టానికి చేసిన సవరణలను ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. మోహిత్ మినరల్స్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఐజీఎస్‌టీకి కేంద్రం ఈ సవరణలు చేసినట్టు కేపీఎంజీ పరోక్ష పన్నుల విభాగం చీఫ్ అభిషేక్ జైన్ తెలిపారు.



వేదాంతా రిసోర్సెస్‌కు రేటింగ్ షాక్

డౌన్‌గ్రేడ్ చేసిన మూడీస్ ఇన్వెస్టర్స్



న్యూఢిల్లీ: గ్లోబల్ రేటింగ్ దిగ్గజం మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తాజాగా మైనింగ్ దిగ్గజం వేదాంతా రిసోర్సెస్ లిమిటెడ్(వీఆర్ఎల్) రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసింది. రుణ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో రానున్న కొద్ది నెలల్లో పెరగనున్న రిస్కుల కారణంగా సీఏఏ1 నుంచి సీఏఏ2కు రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేస్తున్నట్లు మూడీస్ పేర్కొంది. రానున్న కాలంలోని రుణ చెల్లింపుల కోసం ఎలాంటి రీఫైనాన్సింగ్ సౌకర్యాలకూ తెరతీయకపోవడం కార్పొరేట్ ఫ్యామిలీ రేటింగ్(సీఎఫ్ఆర్)పై ప్రభావం చూపినట్లు వెల్లడించింది. అంతేకాకుండా కంపెనీ ప్రతికూల ఔట్‌లుక్‌ను కొనసాగించేందుకు నిర్ణయించింది. ప్రధానంగా 2024 జనవరి, ఆగస్టులలో కాలావధి తీరనున్న మొత్తం రెండు బిలియన్ డాలర్ల విలువైన బాండ్లకోసం తగిన రీఫైనాన్సింగ్‌ను చేపట్టకపోవడాన్ని మూడీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కౌస్తుభ్ చౌబాల్ పేర్కొన్నారు. బలహీన లిక్విడిటీ నేపథ్యంలో సంస్థ రుణ(క్రెడిట్) నాణ్యత దెబ్బతిన్నట్లు తెలియజేశారు. ఇందుకు భారీ ఫైనాన్సింగ్ అవసరాలు, వడ్డీ వ్యయాలు కారణమని వివరించారు. గ్లోబల్ క్యాపిటల్ మార్కెట్లలో ఫైనాన్సింగ్ పరిస్థితులు కఠినమవుతున్న సమయాన కంపెనీ రుణ రీఫైనాన్సింగ్‌కు సవాళ్లు ఎదురుకావచ్చని అభిప్రాయపడింది. నిలకడలేని మూలధన నిర్మాణం, పెరుగుతున్న రిస్కులు, బలహీన ఆర్థిక నిర్వహణ సంస్థ సీఎఫ్ఆర్ సీఏఏ విభాగానికి కారణమని చౌబాల్ తెలియజేశారు.

వాటా విక్రయం

ఈ ఏడాది(2023) ఆగస్టులో ప్రధాన అనుబంధ కంపెనీ వేదాంతా లిమిటెడ్(వీడీఎల్)లో 4.3 శాతం వాటాను విక్రయించింది. 50 కోట్ల డాలర్లు సమకూర్చుకుంది. తద్వారా హోల్డింగ్ కంపెనీకి పెరుగుతున్న నగదు అవసరాల ఒత్తిడినుంచి తప్పించుకుంది. మరోవైపు గ్రూప్ ఏకీకృత నగదులో ముప్పావువంతుకు సమానమైన వేదాంతాలోని పూర్తి వాటా, హిందుస్తాన్ జింక్‌లో వీడీఎల్‌కుగల 64.9 శాతం వాటా ఇప్పటికే తనఖాలో ఉంది. దీంతో రుణ సమీకరణకు పరిమిత అవకాశాలు మాత్రమే ఉన్నట్లు మూడీస్ పేర్కొంది. కమోడిటీల ధరలు నీరసిస్తున్న వాతావరణానికితోడు.. వీఆర్ఎల్ అనుబంధ కంపెనీల క్యాష్ ఫ్లోను దెబ్బతీయవచ్చు. దీంతో హోల్డింగ్ కంపెనీ రుణ రిస్కులు అనుబంధ కంపెనీల నిధుల సమీకరణ, డివిడెండ్ల పంపిణీపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చునంటూ మూడీస్ అభిప్రాయపడింది.

మూడీస్ డౌన్‌గ్రేడ్‌తో వేదాంతా షేరు 7% పతనమై 52 వారాల కనిష్టం రూ. 209 వద్ద ముగిసింది.

కనిష్ట స్థాయిల నుంచి రికవరీ

- సూచీలకు అధిక వెయిటేజీ షేర్ల అండ
- కలిసొచ్చిన ఆసియా, యూరప్ మార్కెట్ల సానుకూలత



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ షేర్లు 2% వరకు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ట్రేడింగ్‌లో 395 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 173 పాయింట్ల లాభంతో 66,119 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 52 పాయింట్లు బలపడి 19,716 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 111 పాయింట్లు పతనమైన 19,554 వద్ద కనిష్టాన్ని తాకింది. ఉదయం నష్టాలతో ట్రేడైన సూచీలు ప్రథమార్ధం మొత్తం అదే ధోరణి కదలాడాయి. మిడ్ సెషన్‌లో యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభం ఇన్వెస్టర్లను కొనుగోళ్లకు ప్రేరేపించింది. క్యాపిటల్ గూడ్స్, ఫార్మా, పారిశ్రామిక, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఐటీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.354 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.386 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ 22 ఏళ్ల గరిష్టాన్ని తాకిన తర్వాత దిగిరావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి.

- సెన్సెక్స్ కనిష్టం(65,550) నుంచి మొత్తం 569 పాయింట్లు ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టింగ్ కంపెనీల మొత్తం విలువ రూ.1.53 లక్షల కోట్లు పెరిగి రూ.319.68 లక్షల కోట్లకు చేరింది. ఈ సూచీలో మొత్తం 30 షేర్లకు గానూ 20 షేర్లు లాభపడ్డాయి.
- రూ.2800 కోట్ల లక్ష్యంగా ఐపీఓకు వచ్చిన జేఎస్ డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ చివరి రోజు నాటికి 37.37 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 13.62 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 509 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- అప్‌డేటర్ సర్వీసెస్ ఐపీవోకు 2.90 రెట్ల అధిక స్పందన లభించింది. 1.19 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 3.47 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- గత రెండు ట్రేడింగ్ సెషన్లలో డీలా పడిన రూపాయి బుధవారం రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో బుధవారం 6 పైసలు బలపడి 83.22 స్థాయి వద్ద స్థిరపడింది.

మెప్పించిన సాయి సిల్క్స్ లిస్టింగ్



హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి సిల్క్స్ (కళా మందిర్) షేరు లిస్టింగ్‌లో మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.222)తో పోలిస్తే 3.50% ప్రీమియంతో రూ.230 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ 11% ర్యాలీ చేసి రూ.247 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 10% లాభంతో రూ.245 వద్ద నిలిచింది. మార్కెట్ విలువ రూ.3,755 కోట్లుగా నమోదైంది.

- రియల్ ఎస్టేట్ డెవలపర్ సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) తొలిరోజు 19% లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.385)తో పోలిస్తే 15.58% ప్రీమియంతో రూ.445 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ 23% ర్యాలీ చేసి రూ.473 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 19% లాభంతో రూ.457 వద్ద నిలిచింది.

అపోలో హాస్పిటల్స్ చేతికి 'కోల్‌కతా' ఆస్పత్రి

రూ. 102 కోట్లకు పాక్షికంగా నిర్మించిన అసెట్ కొనుగోలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ తూర్పు రాష్ట్రాల్లో మరింతగా కార్యకలాపాలను విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా కోల్‌కతాలో పాక్షికంగా నిర్మించిన ఓ ఆస్పత్రిని కొనుగోలు చేసింది. ఫ్యూచర్ ఆంకాలజీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నుంచి తమ అనుబంధ సంస్థ అపోలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ రూ. 102 కోట్లకు ఈ హాస్పిటల్‌ను కొనుగోలు చేసినట్లు సంస్థ వెల్లడించింది. కోల్‌కతా ప్రాంతంలో అపోలో హాస్పిటల్‌కు ఇది రెండో ఆస్పత్రి కాగా, తూర్పు ప్రాంతంలో అయిదోది. దీనితో కోల్‌కతా, భువనేశ్వర్, గువాహటివ్యాప్తంగా 1,800 పైచిలుకు పడకలతో అతిపెద్ద హెల్త్‌కేర్ ప్రొవైడర్‌గా తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగలమని తెలిపింది. తూర్పు రాష్ట్రాల్లో వచ్చే 3 ఏళ్ల వ్యవధిలో పడకల సంఖ్యను మరో 700 మేరకు పెంచుకోనున్నామని, తద్వారా సదరు ప్రాంతంలో మొత్తం పడకల సంఖ్య 2,500కి చేరగలదని వివరించింది. తాజాగా కొనుగోలు చేసిన సోనార్‌పూర్‌లో ఆస్పత్రిని 325 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఇందులో తొలి దశ కింద 1.75 లక్షల చ. అ. విస్తీర్ణంలోని 225 పడకలు వచ్చే 12 నెలల్లో అందుబాటులోకి రాగలవని సంస్థ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. అధునాతన సాంకేతికతతో అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న అపోలో హాస్పిటల్స్‌ను రెండు దశాబ్దాలపైగా కోల్‌కతా, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని ఆమె చెప్పారు.

కాంట్రాక్టు ఉద్యోగుల మనసు గెలుచుకున్న సీఎం

- ఏపీ ఎన్జీవోల సంఘం

సాక్షి, అమరావతి: ఇచ్చిన మాటకు కట్టుబడి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై అసెంబ్లీలో చట్టం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జగనన్న కాంట్రాక్టు ఉద్యోగుల మనస్సును గెలుచుకున్నారని చెప్పారు. 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే క్రమబద్ధీకరించేందుకు కేబినెట్‌లో తీర్మానం చేసినా, తమ విజ్ఞప్తితో 2014 జూన్ 2 నాటికి సర్వీస్‌లో ఉన్న ప్రతి కాంట్రాక్టు ఉద్యోగిని క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించి చరిత్రలో నిలిచిపోయే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఉద్యోగులకు రావలసిన డీఏ, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన మహిళా ఉద్యోగినులకు ఐదు రోజుల ప్రత్యేక సాధారణ సెలవులను మంజూరు చేస్తూ ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దసరాకు ముందే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు

- కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ

సాక్షి, అమరావతి: పదివేల మందికి మేలు చేసిన దేవుడు సీఎం వైఎస్ జగన్ అని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్ అన్నారు. గత పాలకులు రెగ్యులరైజ్ చేస్తామని మోసం చేశారని, సీఎం జగన్ పెద్ద మనసుతో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు చట్ట సభల్లో బిల్లు పెట్టి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. వైఎస్ జగన్ కుటుంబం రాజకీయాల్లో ఉన్నంత వరకు తమ మద్దతు వారికే ఉంటుందని చెప్పారు.

ఇది చరిత్రాత్మకం

అసెంబ్లీ, శాసన మండలిలో ఆమోదం పొందిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లు చరిత్రాత్మకమైందని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ... సీఎం జగన్ పాదయాత్రలో సమస్యను ఆలకించి, అర్హతలు, అనుభవం ప్రాతిపదికన ఎంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేయగలమో అంత మందిని చేస్తామని హామీ ఇచ్చారని, హామీ అమలు దిశగా కేబినెట్ సబ్ కమిటీ, అధికారుల కమిటీ వేసి రెగ్యులరైజ్ చేసేందుకు నిర్ణయించారని తెలిపారు. 2 జూన్ 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేయాలన్న నిబంధనను సైతం సడలించి, 10,117 మంది కుటుంబాలకు లబ్ధి చేకూర్చారని ప్రశంసించారు.

మా కుటుంబాల్లో వెలుగులు

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా వేలాది కుటుంబాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారని రాష్ట్ర కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్‌బాబు, ప్రధాన కార్యదర్శి కిషోర్, కోశాధికారి జైనాబీ తదితరులు శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

రాజధాని పేరుతో ఇన్ని ఘోరాలా?

- ఇన్నర్ రింగు రోడ్డు స్కామ్‌పై అసెంబ్లీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు
- అసైన్డ్ రైతులను బెదిరించి బలవంతంగా భూములు లాక్కున్నారు
- ఆ భూములకు వచ్చే ప్లాట్లను చంద్రబాబు మనుషులు కాజేశారు
- అసైన్డ్ కౌలు, వన్‌టైమ్ సెటిల్మెంట్ డబ్బులు నారాయణ ఖాతాలో
- అసైన్డ్ రైతులను బెదిరించి 3 మండలాల్లో రికార్డుల్ని మాయం చేశారు
- రెవెన్యూ శాఖ ఇవ్వాల్సిన జీవోను చట్ట వ్యతిరేకంగా మున్సిపల్ శాఖ ఇచ్చేసింది
- హైదరాబాద్‌లో దోచేసినట్లు ఇక్కడా చేయాలని చంద్రబాబు ప్రయత్నించారు
- సొంత ప్రయోజనాల కోసం పేదలను నిలువునా మోసం చేశారు
- ఆ తప్పుల్ని సరిదిద్ది వ్యవస్థలపై విశ్వాసాన్ని కలిగించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారు
- పేదలు మోసపోయిన రాజధానిలోనే 50 వేల మందికి సీఎం జగన్ ఇళ్ల స్థలాలిచ్చారు



సాక్షి, అమరావతి: రాజధాని ముసుగులో చంద్రబాబు సర్కారు పాల్పడిన ఘోరాలు విస్తుగొల్పుతున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. అధికార రహస్యాలను బయట పెట్టబోమని ప్రమాణం చేసిన నాటి మంత్రులు ప్రజలకు ఇంత అన్యాయం చేయడం దారుణమన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు కుంభకోణంపై అసెంబ్లీలో బుధవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి ధర్మాన మాట్లాడారు. టీడీపీ సర్కారు రాజధానిపై ఏనాడూ ఒక పద్ధతిగా వ్యవహరించలేదని విమర్శించారు. ఉమ్మడి రాజధానిగా పదేళ్లు వినియోగించుకునే అవకాశం ఉన్నా చంద్రబాబు తప్పు చేసి దొరికిపోవడంతో మూటాముల్లె సర్దుకుని రాత్రికి రాత్రే హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో చేసినట్లుగానే అమరావతిలోనూ భూముల దోపిడీకి పాల్పడ్డారన్నారు. రాజధానిపై కేంద్రం నియమించిన నిపుణుల కమిటీని పక్కనపెట్టి నారాయణ కమిటీని ఏర్పాటు చేసి రాజ్యాంగబద్ధమైన కమిటీ సిఫారసులకు వ్యతిరేకంగా వ్యవహరించారని మండిపడ్డారు. 2013 చట్టంలోనే భూసమీకరణకు అవకాశం ఉన్నా దాన్ని పక్కన పెట్టారని, ప్రభుత్వాలు ఇంత అధర్మంగా వ్యవహరించవచ్చా? అని ప్రశ్నించారు. మిగతావారిని దారి మళ్లించి తాము ముందుగానే నిర్ణయించుకున్న ప్రాంతంలో భూములు కొన్నారని తెలిపారు. తొలుత అతి చౌకగా జిరాయితీ భూములు కొన్నారని, ఆ తర్వాత జీవో 1 విడుదల చేసి అన్ని కేటగిరీల భూములకు భూ సమీకరణ ప్యాకేజీని పేర్కొంటూ అసైన్డ్ భూముల దగ్గర మాత్రం ఖాళీగా వదిలేశారని తెలిపారు. వాటికి రిజిస్ట్రేషన్ జరగదని తెలిసి కూడా వారిని కార్యాలయాలకు రప్పించి రిజిస్ట్రేషన్లను తిరస్కరించేలా చేశారని చెప్పారు. అసైన్డ్ భూములకు ఎలాంటి ప్యాకేజీ రాదంటూ మూడు మండలాల్లోని అసైన్డ్ రైతులను భయపెట్టి బాబు బృందం దక్కించుకుందన్నారు. ఆ భూములకు లభించే కౌలు, వన్‌టైమ్ బెనిఫిట్‌ను తమకు అందేలా చంద్రబాబు మనుషులు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. మాజీ మంత్రి నారాయణ కాలేజీకి సైతం డబ్బులు జమ అయ్యాయని, పేద రైతులను మాయచేసి దోపిడీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములు తమ చేతికి వచ్చిన తర్వాత వాటికి జీవో 1 వర్తించదు కాబట్టి ఏడాది తరువాత తాపీగా జీఓ 41 తీసుకువచ్చారని చెప్పారు. అసైన్డ్ రైతులను భయపెట్టేందుకే ఆ జీఓను ఒక సంవత్సరం పాటు ఆపారని తెలిపారు.

రెవెన్యూ శాఖ ఇవ్వాల్సిన జీవోను మున్సిపల్ శాఖ ఇచ్చేసింది

అసైన్డ్ భూములకు సంబంధించిన జీవోను రెవెన్యూ శాఖ ఇవ్వాల్సి ఉండగా మున్సిపల్ పరిపాలన శాఖ ఇచ్చిందని మంత్రి ధర్మాన తెలిపారు. పేదల భూములను బోగస్ వ్యక్తుల పరం చేయటాన్ని అధికారులంతా వ్యతిరేకించినా గత సర్కారు లెక్కచేయలేదన్నారు. మూడు మండలాల్లో అసైన్డ్ రికార్డులను సైతం మాయం చేశారని తెలిపారు. ప్రస్తుతం భూములు ఎవరి వద్ద ఉన్నాయో వారికే హక్కులు ఇద్దామంటూ తహశీల్దార్ల ద్వారా ప్రతిపాదించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చంద్రబాబు తమ మనుషులను ప్రవేశపెట్టారని చెప్పారు. పీఓటీ చట్టానికి వ్యతిరేకంగా, రెవెన్యూ శాఖకు తెలియకుండా మాజీ మంత్రి నారాయణ ఇవన్నీ చేశారన్నారు. జీవో వచ్చిన 22 రోజుల తర్వాత నాటి సీఎం దీన్ని అంగీకరించారని, చట్టానికి వ్యతిరేకంగా ఈ జీవో జారీ అయిందన్నారు. ప్రజల క్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఇంత పెద్దఎత్తున దోపిడీ చేస్తుంటే దాని పట్ల విశ్వాసం ఏముంటుందని ప్రశ్నించారు. అడ్వకేట్ జనరల్ అభిప్రాయం అనుకూలంగా ఇవ్వలేదని ఆయన్ను తీసేశారని, న్యాయ శాఖ కార్యదర్శి, కలెక్టర్, సీఆర్‌డీఏ కమిషనర్ అందరూ వ్యతిరేకించినా దోపిడీని కొనసాగించారని తెలిపారు. ఇంత అడ్డగోలుగా వచ్చిన భూమి ప్లాట్లను కోర్ క్యాపిటల్‌లోని సచివాలయం, గవర్నర్ బంగ్లా, అసెంబ్లీ ఉన్నచోట ఇచ్చారని, ఇది ఎంత ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజధాని రైతుల పొట్టగొట్టి గొడవలా?

అదృష్టవశాత్తూ ఈ ప్రభుత్వం వచ్చింది కాబట్టి ఇవన్నీ బయటకు తెలిశాయని, ఇన్ని ఘోరాలు చేసిన మాజీ సీఎం చంద్రబాబు తాను అవినీతిపరుడిని కాదని ఎలా చెప్పుకుంటారని ధర్మాన ప్రశ్నించారు. ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం పోయేలా ఇవన్నీ చేశారన్నారు. పోయిన విశ్వాసాన్ని మళ్లీ కల్పించేందుకు ఇప్పుడు సీఎం జగన్ 50 వేల మందికి అక్కడే ఇళ్ల స్థలాలిచ్చారని తెలిపారు. రాజధాని రైతుల పొట్ట గొట్టి ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వాళ్లు తాము రైతులమంటూ గొడవలు చేస్తున్నారని మండిపడ్డారు. వీటన్నింటినీ సరి చేయడానికి సీఎం జగన్ ఎంతో కృషి చేశారని, ఒక ప్రభుత్వం తప్పు చేసి వ్యవస్థపై విశ్వాసాన్ని పోగొడితే మళ్లీ ఆ విశ్వాసాన్ని నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

హెరిటేజ్, నారాయణ కోసం ఇన్నర్ ప్లాన్ మార్చారు: ఎమ్మెల్యే పేర్ని నాని



రాజధాని అమరావతి పేరుతో చంద్రబాబు రోజుకో డ్రామా నడిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంతో తనకు సంబంధం లేదన్న వ్యక్తి ఇప్పుడు హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. చంద్రబాబు సర్కారు అవినీతి చిట్టాలో ఇన్నర్ రింగు రోడ్డు ఒకటి. దోపిడీ దొంగలు రెక్కీ చేసినట్టుగా రింగ్ రోడ్డు స్కామ్ జరిగింది. మొదట ఇది మంత్రివర్గ నిర్ణయమని చంద్రబాబు కబుర్లు చెప్పారు. మాస్టర్ ప్లాన్ పేరుతో స్కామ్ నడిపించారు. లింగమనేని రమేష్ పొలం మధ్యలో నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వచ్చేలా, హెరిటేజ్ సంస్థ, నారాయణ కాలేజీల కోసం అలైన్‌మెంట్ ప్లాన్ మార్చారు. ఐఆర్ఆర్‌తో తనకేం సంబంధం అంటున్న ఏ–14 నారా లోకేశ్ 2008 నుంచి 2017 వరకు హెరిటేజ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన డైరెక్టర్‌గా ఉన్నప్పుడే అమరావతిలో భూములు కొనాలని నిర్ణయించారు. ఆ తీర్మానంపై లోకేష్ సంతకం చేశారు. దళితులు, పేదల నుంచి చంద్రబాబు, నారాయణ అసైన్డ్ భూములను లాక్కున్నారు. కేసులు ఎక్కువ నమోదైన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామన్న లోకేష్ ఇప్పుడు ఎక్కడున్నారు? యువతను రెచ్చగొట్టి ఢిల్లీలో తిరుగుతున్నారు. రూ.371 కోట్లకు ఇంత రాద్ధాంతం దేనికని నారా భువనేశ్వరి సూక్తులు చెబుతున్నారు. రూ. 371 కోట్లు టిప్ అని అనుకుంటే అమరావతిలో 10 ఎకరాలు ఎందుకు కొన్నారు? ఇన్నర్ రింగ్ రోడ్డును అటూ ఇటూ తిప్పి పాల కంపెనీకి 5 ఎకరాలు ఇచ్చారు. దేశభక్తితోనే తన కరకట్ట ఇల్లును చంద్రబాబుకు ఇచ్చినట్లు లింగమనేని హైకోర్టులో చెప్పారు. బాబుకు సీఎం పదవి పోయిన వెంటనే లింగమనేనికి అద్దె కింద రూ.27 లక్షలు ఇచ్చామని భువనేశ్వరి చెబుతున్నారు. నిజంగానే అధికారికంగా ఇచ్చి ఉంటే అద్దె ఎందుకు చెల్లించారు? ఐటీ రిటర్న్స్‌లో ఈ వివరాలను వెల్లడించారా? రూ.27 లక్షల లావాదేవీలపై నారా, లింగమనేని కుటుంబాలు ఎందుకు మాట్లాడడం లేదు? రాజధానిపై నిపుణుల కమిటీ నివేదికను చంద్రబాబు తుంగలో తొక్కి, తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో ఏర్పాటుకు జీవో ఇచ్చారు. భూసమీకరణకు ఒప్పుకోని వారిని ఏ–2 నారాయణ, ఏ–14 లోకేష్ బెదిరించారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వం లాక్కుంటుందని భయపెట్టారు. ఎకరం భూమిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే రాయించుకున్నారు. అసైన్డ్ రైతులను దగా చేసిన ఇలాంటి వారికి కచ్చితంగా శిక్ష పడాల్సిందే.

సమగ్ర విచారణ జరగాలి: వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే



ఇన్నర్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ కుంభకోణాలపై సమగ్ర విచారణ జరగాలి. రాజధానిని ప్రకటించకముందే లింగమనేని రమేష్ 355 ఎకరాలను కొనేశారు. పేదలను మోసం చేసి కంతేరు వద్ద భూముల్ని హెరిటేజ్ కొనడం ఏమిటి? ఢిల్లీ కోటను ఢీకొన్న జగన్ కళ్లల్లో భయం చూపిస్తానని లోకేశ్ అంటున్నారు. ఢిల్లీ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన జగన్ ఎక్కడ? ఆయనకు ఉన్న 175 మంది సైనికుల్లో ఒకరి చేతుల్లో ఓడిపోయిన లోకేశ్‌ఎక్కడ?

మోసగాళ్లకు మోసగాడు చంద్రబాబు: ఆదిమూలపు సురేష్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి



రాజధాని పేరుతో ప్రజలను మోసం చేసిన మోసగాళ్లకు మోసగాడు చంద్రబాబు. ఇన్నర్ రింగు రోడ్డు అనకొండలా మలుపులు తిరుగుతూ కొందరు వ్యక్తుల పొలాల దగ్గరకు వచ్చి ఆగింది. ఇందులో చేయని మోసం అంటూ ఏదీ లేదు. టెండర్లు పిలవకుండా నచ్చిన వాళ్లకు నామినేషన్ల విధానంలో పనులు అప్పగించారు. ముగ్గురు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్‌ను మార్చారు. గ్రాఫిక్స్‌తో అమరావతిని అంతర్జాతీయ నగరం అని నమ్మించడానికి ప్రయత్నిస్తే అది అంతర్జాతీయ స్కామ్ అయింది. ఈ స్కామ్‌కి డైరెక్షన్ చంద్రబాబుది అయితే పర్యవేక్షణ లోకేశ్, నాటి మంత్రులు, ఇతరులది. అమరావతిలో దళిత, పేద రైతుల్ని నిలువునా ముంచారు. నవ నగరాలు, ఐకానిక్ బ్రిడ్జి లాంటివన్నీ బూటకం. ఇన్నర్ రింగురోడ్డు గురించి కాగ్ రిపోర్టులో స్పష్టంగా చెప్పారు. టెండర్లు పిలవకుండా నామినేషన్ల విధానంలో సుర్బానా, జురాంగ్ కంపెనీలకు ప్లాన్ తయారీ బాధ్యతను అప్పగించి రూ. 28 కోట్లు రూల్స్‌కి విరుద్ధంగా చెల్లించినట్లు కాగ్ తన నివేదికలో స్పష్టంగా చెప్పింది. ఇన్నర్ రింగు రోడ్డులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదంటున్న వారు ఈ డబ్బు గురించి సమాధానం చెప్పాలి. ఎస్‌టీయూపీ అనే కంపెనీకి మాస్టర్‌ప్లాన్ తయారీకి రూ.5 కోట్లు ఇచ్చారు. ఇవి డబ్బులు కాదా? రింగురోడ్డు తుది అలైన్‌మెంట్‌ను లింగమనేని, హెరిటేజ్ భూముల గుండా మార్చారు. హెరిటేజ్ భూములు కాజ, కంతేరు, చినకాకాని వద్ద ఉండడంతో రింగురోడ్డు అటు వెళ్లింది. అలైన్‌మెంట్ మార్పు చేసి తనకు సహాయం చేసినందుకే లింగమనేని రమేష్ ప్రతిఫలంగా చంద్రబాబుకి కరకట్ట నివాసాన్ని ఇచ్చారు. క్విడ్‌ప్రోకు ఇది తిరుగులేని ఉదాహరణ. నారాయణ తన వద్ద పనిచేసిన ఉద్యోగి పేరు మీద భూమిని కొని తర్వాత తన పేరిట మార్చుకున్నారు. అడ్డంగా దొరికిన అవినీతిపరులను వదిలిపెట్టేది లేదు. ఆధారాలతో చట్టం ముందు నిలబెడుతున్నాం. చంద్రబాబు, లోకేశ్‌ను చట్ట ప్రకారం శిక్షించాలి.

క్లుప్తంగా...

ఏఎన్‌యూకి టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకు


ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం

ఏఎన్‌యూ: లండన్‌కు చెందిన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ 2024వ సంవత్సరానికి వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకులను విడుదల చేసింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జాతీయ స్థాయిలో 58వ ర్యాంకు, అంతర్జాతీయ స్థాయిలో ఓవరాల్ కేటగిరీలో 1201–1500 విభాగంలో ర్యాంకును, బోధనలో 207వ ర్యాంకును సొంతం చేసుకుంది. యూనివర్సిటీలలో ఉన్న బోధన, పరిశోధన, అంతర్జాతీయ సంబంధాలు, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాల ప్రాతిపదికన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ ఈ ర్యాంకులను జారీ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 1904 యూనివర్సిటీలు ఈ ర్యాంకులు పొందాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ఏఎన్‌యూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ర్యాంకును సొంతం చేసుకోవడం అభినందనీయమన్నారు.

లేపాక్షికి పర్యాటక సిల్వర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న లేపాక్షి సర్పంచ్ ఆదినారాయణ

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షికి మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఉత్తమ గ్రామీణ పర్యాటకం విభాగంలో 'లేపాక్షి'కి దక్కిన సిల్వర్ అవార్డును ఏపీ పర్యాటక అభివృద్ధిసంస్థ ఈడీ మల్‌రెడ్డి, లేపాక్షి గ్రామ సర్పంచ్ ఆదినారాయణ అందుకొన్నారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర పర్యాటక కార్యదర్శి వి.విద్యావతి ఈ అవార్డు అందజేశారు.

సాలూరులో స్వల్ప భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 3.4గా నమోదు


భూ ప్రకంపనలు ప్రారంభమైన ప్రాంతం

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు పట్టణం, పాచిపెంట, విజయనగరం జిల్లాలోని రామభద్రపురం, బొబ్బిలి మండలాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. ప్రజలందరూ ఉలిక్కిపడ్డారు. విద్యార్థులు తరగతి గదుల నుంచి బయటకు పరుగు తీశారు. పాచిపెంట మండలం ఆలూరు జలపాతం సమీపంలో భూ ప్రకంపనలు ప్రారంభమైనట్టు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు గుర్తించారని సాలూరు తహసీల్దార్ బాల మురళీకృష్ణ తెలిపారు. రిక్టర్ స్కేల్‌పై 3.4గా నమోదైనట్టు వెల్లడించారు.

ఆర్థిక భరోసా 'గ్యారెంటీ'

గ్యారంటీడ్ పెన్షన్ సిస్టమ్‌పై అసెంబ్లీలో మంత్రి బుగ్గన ● సీపీఎస్ కంటే జీపీఎస్ ఎంతో మేలు ● రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగులకు పెన్షన్ భద్రత

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పబ్లిక్ సర్వెంట్స్ తమ అభిమతం కంటే ప్రజా సేవకే ప్రాధాన్యమిస్తారన్నారు. అలాంటి ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన తమ ప్రభుత్వం వారి ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తోందన్నారు. ప్రధానంగా ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచామన్నారు. తమ ప్రభుత్వం 11వ పే రివిజన్ కమిషన్ సిఫారసులను అమలు చేసిందని, అంతకంటే ముందు ఉద్యోగులు నష్టపోకుండా మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. బుధవారం శాసనసభలో ఏపీ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ బిల్లు–2023, ఏపీ గ్యారంటీడ్ పెన్షన్ సిస్టమ్ (జీపీఎస్) బిల్లు–2023ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్ ద్వారా ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.311 కోట్ల మేర అదనపు భారం పడుతుంది. జీపీఎస్ అమలుతో 2040 నాటికి రూ.2,500 కోట్లు అదనంగా ఆర్థిక భారం పడుతుందని అంచనా. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను (ఓపీఎస్) అమలు చేస్తే భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వం గ్యారంటీడ్ పెన్షన్ సిస్టమ్‌ను(జీపీఎస్) తెచ్చిందన్నారు. ఒక సర్వే ప్రకారం ఓపీఎస్ కొనసాగితే రాష్ట్రంలో ఉద్యోగుల పెన్షన్ల ఖర్చు ప్రస్తుతం ఉన్నదాని కంటే నాలుగున్నర రెట్లు పెరుగుతుందన్నారు. ఓపీఎస్ ప్రకారం పెన్షన్ 1991–92లో సున్నా నుంచి ప్రారంభమై 2022–23 నాటికి దేశవ్యాప్తంగా రూ.1.7 లక్షల కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగి పెన్షన్లే కాకుండా జీతాలకూ ఇబ్బందులొస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న న్యూ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్/సీపీఎస్) ప్రకారం దేశవ్యాప్తంగా 2023 నుంచి 2050కి నాటికి పెన్షన్ల చెల్లింపులు రూ.4 లక్షల కోట్లకు చేరుకుంటే అదే ఓపీఎస్ ప్రకారం అయితే రూ.18 లక్షల కోట్లవుతుందన్నారు. 'దీనివల్ల అసలు ఓపీఎస్‌ను ఎవరైనా చేయగలరా? తాత్కాలికంగా ఒక వ్యక్తిని తృప్తి పరిచేందుకు ఎన్నైనా చెప్పొచ్చు. కానీ దీర్ఘకాలంలో ఇది సాధ్యమైనా? పాలన చేసేటప్పుడు ఈరోజు పరిస్థితిని, భావి తరాల పరిస్థితిని కూడా చూసుకోవాలి. కొంతమంది మాదిరిగా ఏదో ఒకటి చేసుకోండని చెప్పి అమల్లోకి వెళ్తే ఐదేళ్లకో, పదేళ్లకో కుప్పకూలిపోతుంది. అందుకే మధ్యేమార్గాన్ని అనుసరిస్తున్నాం' అన్నారు. ఇంకా బుగ్గన ఏమన్నారంటే..

రాబడి కంటే ఎక్కువ

ఏపీ ఓన్ రెవెన్యూ 2014–15లో రూ.38,038 కోట్లుగా ఉంది. ఇది 2015–16 నాటికి రూ.44,842 కోట్లు, 2016–17లో రూ.44,374 కోట్లు, 2017–18కి రూ.53 వేల కోట్లు, 2020–21 నాటికి రూ.60,823 కోట్లకు చేరింది. ఇందులో మానవ వనరులపై ఖర్చు 2014–15లో రూ.25,094 కోట్లు కాగా ప్రస్తుతం రూ.83,604 కోట్లకు పెరిగింది. రాష్ట్రం మొత్తం రాబడిలో హెచ్‌ఆర్ ఖర్చులే 66 శాతంగా ఉన్నాయి. జీతాలు, పెన్షన్లకు 2014–15లో 70 శాతం ఉంటే.. 2019–20లో వంద శాతం, 2020–21 నాటికి 110 శాతం అయ్యింది. అంటే 2020–21 నాటికి మన రాష్ట్రానికి వచ్చే రాబడి కంటే ఎక్కువగా పెన్షన్లు, జీతాలకు ఖర్చు చేయాల్సి వచ్చింది.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే ఎక్కువ

సొంత రాబడిలో మిగతా రాష్ట్రాలతో పోల్చి చూస్తే 2020–21లో ఏపీలోనే పెన్షన్ల ఖర్చు ఎక్కువ. 2015–16లో ఏపీలో 91 శాతం ఖర్చు అవుతుంటే తెలంగాణలో 53 శాతమే ఉంది. 2020–21లో ఏపీలో 110 శాతంగా ఉంటే తెలంగాణలో 53 శాతమే ఉంది. తెలంగాణ కంటే ఏపీలో రెట్టింపు వ్యయం అవుతోంది. కర్నాటక, తమిళనాడులోనూ మనకంటే తక్కువగానే ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ఓపీఎస్‌ను అమలు చేయడం సాధ్యంకాదు. 2014–15లో హెచ్‌ఆర్ ఖర్చు రూ.25,094 కోట్లు అయితే పెన్షన్లకు రూ.6,147 కోట్లు అయ్యింది. 2022–23లో హెచ్‌ఆర్ వ్యయం రూ.83,406 కోట్లుండగా పెన్షన్లు రూ.22,602 కోట్లకు చేరాయి. ఇది మరింత పెరగడం ఖాయం. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓపీఎస్‌లోకి వెళ్లమని కొందరు సలహా ఇస్తున్నారు. కానీ రాష్ట్ర భవితకోసం ఆలోచిస్తున్నాం.

ఓపీఎస్‌తో ఆర్థిక పరిస్థితి చేయిదాటి పోతుంది

సీపీఎస్‌లో ప్రస్తుతం ప్రభుత్వం రూ.1,510 కోట్లు ఏటా చెల్లిస్తోంది. అదే ఓపీఎస్‌లోకి వెళ్తే ఇప్పటికిప్పుడు కట్టాల్సింది రూ.23 కోట్లే. అయినప్పటికీ ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మధ్యేమార్గంగా జీపీఎస్‌పై ఆలోచనలు చేశాం. ఓపీఎస్‌కు వెళ్తే పెన్షన్లకు 2023లో రూ.20 వేల కోట్లకు పైగా, 2025 వచ్చేసరికి రూ.22,037 కోట్లు, 2030–35 నాటికి రూ.33,546 కోట్లు, ఆ తరువాత నుంచి ఇక చేయి దాటి పోతుంది. 2004లో నియమితులైన ఉద్యోగులు 2045 నాటికి రిటైరవుతారు. అప్పుడు ఒకేసారి పెన్షన్ల భారం పెరుగుతుంది. దీన్ని ఆలోచించి జీపీఎస్‌పై కసరత్తు చేశాం. ప్రఖ్యాత కేపీ పండిట్ సంస్థతో సంప్రదించి ఈ విధానాన్ని తెచ్చాం.

పెన్షన్‌కు ప్రభుత్వానిదే బాధ్యత

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు 5.70 లక్షల మంది ఉన్నారు. వీరిలో ఓపీఎస్ ఉద్యోగులు 2.02 లక్షల మంది, సీపీఎస్ ఉద్యోగులు 3.04 లక్షలు, పెన్షనర్లు ఓపీఎస్‌లో 3,73,770, రెగ్యులర్ పెన్షనర్లు 24,663, ఫ్యామిలీ పెన్షనర్లు 1,69,107 మంది ఉన్నారు. సీపీఎస్‌లో ఉద్యోగులకు 20 శాతం కంటే పెన్షన్ రాదు. దానికీ గ్యారంటీ లేదు. రిటైరయ్యాక చివరి మూలవేతనంలో సగం మొత్తం పెన్షన్‌గా ఉండేలా జీపీఎస్‌ను రూపొందించాం. సీపీఎస్‌లో వడ్డీ రేట్లు తగ్గినా, షేర్‌మార్కెట్లో రాబడి లేకున్నా వారికి పెన్షన్ భద్రత ఉండదు. అదే జీపీఎస్‌లో ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్‌కు ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. జీవిత భాగస్వామికి 60 శాతం పెన్షన్ ఉంటుంది. దాంతోపాటు డీఆర్, ఈహెచ్‌ఎస్ స్కీమ్‌ను అమలు చేస్తాం. ఉదాహరణకు ఆఫీసు సబార్డినేట్ చివరి జీతంలో మూల వేతనం రూ.45,966 అయితే సీపీఎస్‌లో 20 శాతం అంటే రూ.9579 మాత్రమే పెన్షన్ వస్తుంది. దానికి గ్యారంటీ లేదు. కానీ జీపీఎస్‌లో 50 శాతం కింద రూ.23,923 వస్తుంది. పోలీసు కానిస్టేబుల్‌కు రూ.60,485 చివరి జీతం మూల వేతనం ఉంటే సీపీఎస్‌లో రూ.12,079 పెన్షన్, జీపీఎస్‌లో రూ.30,243 వస్తుంది. ఎస్జీటీ టీచర్లు చివరి జీతంలో మూల వేతనం రూ.78,352 అయితే వారికి సీపీఎస్‌లో రూ.15,647 పెన్షన్, అదే జీపీఎస్‌లో రూ.39,175 ఇస్తారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లకు చివరి జీతంలో మూల వేతనం రూ.1,48,597 ఉంటే సీపీఎస్ కింద రూ.29,675, అదే జీపీఎస్ కింద రూ.74,299 వస్తుంది. దీనితో పాటు వారి ఫ్యామిలీ పెన్షన్ కింద 60 శాతం, హెల్త్ స్కీం సైతం వర్తిస్తుంది. ఏ లెక్కన చూసినా జీపీఎస్‌లో ఉద్యోగికి మేలు జరుగుతుంది. ఉద్యోగుల భద్రత కోసం ఆలోచించి భవిష్యత్తులో ఏ ఒక్కరికీ నష్టం రాకూడదని తీసుకున్న నిర్ణయమిది.

భారీగా ఉద్యోగాల భర్తీ

53 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా రెగ్యులర్ గవర్నమెంట్ ఉద్యోగుల మాదిరిగా భద్రత కల్పిస్తున్నాం. వైద్య విధాన పరిషత్‌ను సైతం డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్పు చేసి 15 వేల మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చాం. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 1.35 లక్షల మందికి గ్రామ, వార్డు సచివాలయాలను తెచ్చి ఉద్యోగాలిచ్చాం. మరో 2.50 లక్షల మందిపైగా వలంటీర్లుగా పని చేస్తున్నారు. ఒక్క వైద్య ఆరోగ్య రంగంలోనే 53,126 ఉద్యోగాలను భర్తీ చేశాం. రెగ్యులర్ క్యాలెండర్ ప్రకారం వివిధ శాఖల్లో మరో 10,143 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాం. గ్రూప్1, 2లతో పాటు ఎస్ఐ, ఆర్ఎస్ఐ నియామకాలు, 6,100 పోలీసు కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశాం.

ఉద్యోగులపై చంద్రబాబు విషం

గతంలోనే ఉద్యోగులపై విషాన్ని తన మనసులో మాట పుస్తకం ద్వారా చంద్రబాబు బయటపెట్టారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లతో రాష్ట్రం అప్పుల వలలో చిక్కుకుపోతోందని విద్వేషాలను ప్రచురించారు. ఇదంతా ఉమ్మడి రాష్ట్రంలో సర్‌ప్లస్ రెవెన్యూ ఉన్నప్పుడు రాసిన మాట. సీఎం జగన్ కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమాన్ని ఆపకుండా ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని నడిపిస్తూ ఉద్యోగులకు చేయాల్సినంత మేలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాలను ఆలోచించుకోవాలి.

ఊహించని రీతిలో జీతాల పెంపు

చిన్న స్థాయి ఉద్యోగుల జీవన ప్రమాణాలను పెంచేందుకు భారీగా జీతాలు పెంచాం. ఆశా వర్కర్ల జీతాలను రూ.3 వేల నుంచి ఏకంగా రూ.10 వేలకు పెంచడంతో 43 వేల మందికి లబ్ధి చేకూరింది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై భారం రూ.155 కోట్లు నుంచి రూ.517 కోట్లకు చేరుకుంది. గిరిజన, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ వర్కర్ల జీతాలను రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెంచడంతో ప్రభుత్వంపై రూ.415 కోట్ల భారం కాస్తా రూ.622 కోట్లకు వెళ్లింది. మెప్మా రిసోర్స్ పర్సన్లకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, సెర్ప్ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్‌కు రూ.2 వేల నుంచి రూ.10 వేలకు పెంచి వారి ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేశాం. 16 వేల మంది హోంగార్డులకు రూ.18 వేల నుంచి రూ.21,300కి జీతం పెంచడం ద్వారా భారం రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్లకు పెరిగింది. 88 వేల మంది మిడ్ డే మీల్స్ సహాయకులకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేలు చేయడంతో రూ.200 కోట్లు అదనపు భారం పడింది. 48,770 మంది అంగన్‌వాడీలకు రూ.7 వేల నుంచి రూ.11,500కి, ఇందులో 55,607 మంది అంగన్‌వాడీ హెల్పర్స్‌కు రూ.4 వేల నుంచి రూ.7 వేలకు పెంచాం. సెర్ప్‌లో పని చేసే హెచ్‌ఆర్ ఉద్యోగులకు 23 శాతం జీతాల పెంపుతో 4,569 మందికి లబ్ధి చేకూరింది. సూక్ష్మస్థాయిలో ఆలోచించి 108 డ్రైవర్లకు రూ.13 వేలు ఉండే జీతాన్ని రూ.28 వేలు చేశాం. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్‌కు రూ.15,500 నుంచి రూ.20 వేలు, 104 డ్రైవర్లకు రూ.26 వేలకు, ఆస్పత్రుల్లోని శానిటేషన్ వర్కర్లకు రూ.8 వేల నుంచి రూ.18 వేలకు పెంచాం. దాదాపు 3 లక్షల మందికి పైగా ఉద్యోగులకు జీతాల పెంపు ద్వారా ఆర్థిక భారం రూ.2 వేల కోట్లు నుంచి రూ.3500 కోట్లుకు చేరింది. రూ.1,500 కోట్లు అదనపు భారాన్ని ప్రభుత్వం మోస్తోంది. వీటికి తోడు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు తమ కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు వీక్లీ ఆఫ్‌లు తీసుకొచ్చాం. ఏజెన్సీల చేతుల్లో శ్రమ దోపిడీకి గురైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోకి తీసుకొచ్చి చట్టం చేసి ఒకటో తేదీన జీతంతో పాటు ఈపీఎస్, ఈఎస్ఐను కూడా కల్పిస్తున్నాం. ఉద్యోగులకు ప్రత్యేక లీవ్ బెనిఫిట్స్, కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ తీసుకొచ్చాం.

శాఖ	ఉద్యోగి	గత జీతం	పెంచిన జీతం	జీవో	ఉద్యోగుల సంఖ్య
మహిళా శిశు సంక్షేమం	అంగన్‌వాడీ వర్కర్స్	7,000	11,500	జీవో ఎంఎస్ నం.13	47,476
	మిని అంగన్‌వాడీ సెంటర్	4,000	7,000	తేదీ 26-06-2019	6,526
	అంగన్‌వాడీ హెల్పర్స్	4,000	7,000		45,175
పంచాయతీరాజ్	విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్/ సంఘమిత్రలు/యానిమేటర్స్	2,000	10,000	జీవో ఆర్‌టీ నం.699 తేదీ 11-11-2019	28,152
పట్టణాభివృద్ధి	శానిటరీ వర్కర్స్(15/08/20202)	8,000	18,000	జీవో ఎంఎస్ నం. 233	
	సూపర్‌వైజర్స్	12,000	18,000	తేదీ 26-08-2019	29,800
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	ఆశా వర్కర్స్	4,000-	10,000	జీవో ఎంఎస్‌నం87 (తేదీ 17-08-2019)	41,416
కార్మిక, ఉపాధి కల్పన	ఎంఎన్‌వో	6,700	17,746	జీవో ఎంఎస్ నం. 6	2
	ఏఎన్ఎం	10,200	28,000	తేదీ 26-04-2021	1
	దోభీ	6,700	13,000		2
	క్షురకుడు	6,700	13,000		2
గిరిజన సంక్షేమం	కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్	400	4,000	జీవో ఎంఎస్ నం. 117 తేదీ 03-12-2019	2,652
హోం	హోంగార్డ్స్ డైలీ డ్యూటీ అలవెన్స్	600	710	జీవో ఎంఎస్‌నం. 876 తేదీ 12-10-2019	14,984
పాఠశాల విద్య	వంటవాళ్లు, సహాయకులు	1,000	3,000	జీవో ఎంఎస్‌నం. 61 తేదీ 15-09-2019	84,833
మొత్తం చిరుద్యోగులు					3,01,020

Illustrative pension benefits for sample employee categories

Post	Last Drawn Basic Pay	CPS Monthly Pension (20% contribution)	AP GPS Monthly Pension (50% of basic pay) (who have completed 33 years)	Add on benefits under AP GPS: Family Pension (60% of guaranteed pension)	Cost of Living Adjustment	Health Care Scheme post retirement	Minimum Pension
Office Sub-ordinate	47,966	9,579	23,983				
Police Constable	60,485	12,079	30,243				
Secondary Grade Teacher	78,352	15,647	39,176				
Civil Assistant Surgeon	1,48,597	29,675	74,299				

సీపీఎస్‌లో అయితే ఎంత.. జీపీఎస్‌లో అయితే ఎంత.. అన్న వివరాలతో అసెంబ్లీలో ప్రదర్శించిన స్లైడ్

10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

కాంట్రాక్టు ఉద్యోగుల చిరకాల వాంఛను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారు. వివిధ శాఖల్లో సుమారు 10,117 మంది ఫుల్‌టైం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నాం. వీలైనంత ఎక్కువ మందికి మేలు చేసేలా 2-6-2014కు ముందు ఐదేళ్లు సర్వీసు ఉండాలనే నిబంధనలను సీఎం జగన్ సడలించారు. రాష్ట్రం విడిపోయిన నాటికి పర్మినెంట్ శాంక్షన్ పోస్టులో ఫుల్ టైం కాంట్రాక్టు విభాగంలో నియమితులైన వారిని క్రమబద్ధీకరిస్తాం. శాంక్షన్ పోస్టుకు ఆర్థిక శాఖ అనుమతి ఉండి నోటిఫై అయిన ఖాళీలను నిర్దిష్ట నిబంధనల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ పారదర్శకంగా భర్తీ చేసి ఉండాలి.

వివిధ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇలా..

ఇంటర్ విద్య	3,549
ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం	3,396
కళాశాల విద్య	663
గిరిజన సంక్షేమం	638
సాంకేతిక విద్య	440
స్త్రీ, శిశు సంక్షేమం	140
వైద్య విద్య	196
ఉద్యోగ, ఉపాధి శిక్షణ	300
ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు	251
జల వనరులు	210
ఇతరులు	334

గ్లోబల్ టీచర్ ప్రైజ్ రేసులో ఐలవరం ఉపాధ్యాయుడు

- ప్రపంచవ్యాప్తంగా టాప్ 50 షార్ట్‌లిస్ట్‌లో చోటు
- ఏపీ నుంచి ఒక్కరికే అవకాశం


పచ్చారు హరికృష్ణ

తెనాలి: ప్రతిష్టాత్మక గ్లోబల్ టీచర్ ప్రైజ్ రేసులో రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణకు టాప్ 50లో స్థానం లభించింది. యునెస్కోతో కలిపి వార్కే ఫౌండేషన్ ప్రపంచవ్యాప్తంగా మారుమూల గ్రామాలు/ పట్టణాల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందిస్తూ మార్పుకోసం కృషిచేస్తోన్న ఛాంపియన్లయిన టీచర్లను గ్లోబల్ టీచర్ ప్రైజ్‌కు ఎంపిక చేస్తుంది. తొలుత 50 మందిని షార్ట్‌లిస్టు చేస్తుంది. తర్వాత వీరిలో 10 మందిని, చివరగా ఒకరిని ఎంపికచేసి ప్రైజ్ మనీగా రూ.7.35 కోట్లు అందజేస్తారు. ఈ రేసులో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన వేలాది దరఖాస్తుల్లో ఎంపిక ప్రక్రియ అనంతరం టాప్ 50లో ఏపీలోని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు హరికృష్ణ ఒక్కరే ఉండటం విశేషం. 2005 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న హరికృష్ణ స్వగ్రామం మంగళగిరి. 2017లో ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. స్వతహాగా ఇంగ్లిష్ టీచర్ అయినందున తన నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ఇతర దేశాల ఉపాధ్యాయులతో సామాజిక మాధ్యమంలో ఒక గ్రూపును ప్రారంభించారు. అందులో విద్యార్థులను భాగస్వాములను చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆశించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో ఆచరణలోకి తెచ్చారు. 2018 నుంచి దాదాపు 70 పైగా దేశాల్లోని వందలాది పాఠశాలల టీచర్లు, విద్యార్థులతో సంభాషించేలా చేయగలిగారు. ఆ అలవాటు ఇంగ్లిష్‌పై భయాన్ని పోగొట్టి, సులువుగా మాట్లాడేలా చేసింది. కలం స్నేహితులతో రాతప్రత్యుత్తరాలు చేస్తున్నారు. ఆసక్తికర అంశాలను పరస్పర మార్పిడి చేసుకుంటున్నారు. విదేశాల్లోని కొందరు ఇక్కడి పేద విద్యార్థుల్ని దత్తత తీసుకున్నారు కూడా. తన కృషికి గుర్తింపుగా హరికృష్ణ, 2020లో అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అఫైర్స్ పర్యవేక్షించే, 'ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అండ్ ఎచీవ్‌మెంట్' ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. అమెరికాలోని ఆర్కాన్సా వర్సిటీలో 45 రోజుల ఫెలోషిప్‌ను పూర్తిచేశారు. ఈ ఫెలోషిప్‌కు భారత్ నుంచి ఆరుగురు ఎంపిక కాగా, ఏపీ నుంచి హరికృష్ణ ఒక్కరికే అవకాశం లభించింది.

మత్స్య జాతుల మనోహరం

- 250 రకాలతో అలరారుతున్న మెరైన్ మ్యూజియం
- జనం ఎరుగని సముద్ర జాతులకు ఆలవాలం
- వాటిని పదిల పరిచే బాధ్యతను తీసుకున్న ఎఫ్ఎస్ఐ
- భావితరాలు, విద్యార్థులు, పరిశోధకులకు ఉపయుక్తం

సాక్షి, విశాఖపట్నం: ఆవులను చూశాం. గుర్రాలనూ చూశాం.. పాములనూ చూస్తున్నాం. కానీ సముద్రపు ఆవు.. సముద్రపు గుర్రం, సముద్ర పాములను ఎప్పుడైనా చూశారా? అయితే వాటి కోసం మీరు సముద్రంలోకి వెళ్లక్కర్లేదు. మన విశాఖ బీచ్ రోడ్డులో ఇలాంటి వాటిని చూడొచ్చు. ఫిషింగ్ హార్బర్ వద్ద ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంలో వీటితోపాటు జనం కంటపడని అత్యంత అరుదైన 250 మత్స్యజాతులు దర్శనమిస్తున్నాయి. అక్కడ గతంలో ఏర్పాటు చేసిన మెరైన్ మ్యూజియంను ఇటీవల ఆధునీకరించారు. ఈ మ్యూజియంను భావి తరాలు, విద్యార్థులు, పరిశోధకులతో పాటు సాధారణ ప్రజలు సందర్శించడానికి అనుమతించనున్నారు. ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలు పరిశోధనల్లో భాగంగా తమ నౌకల్లో సముద్రంలోకి వెళ్లినప్పుడు అరుదైన మత్స్య జాతులను తీసుకొస్తారు. వాటిలో ముఖ్యమైన వాటిని ఫార్మాలిన్, నీరు (1:4 నిష్పత్తి) కలిగిన మిశ్రమంలో గాజు సీసాల్లో భద్రపరుస్తారు. మరికొన్నింటిని లోపలున్న మాంసాన్ని తొలగించి దూదిని ఉంచి, పైన రసాయనంతో కూడిన పాలిష్‌ను పూస్తారు. ఇలాంటి వాటిని ఈ మెరైన్ మ్యూజియంలో ఉంచారు. వాటిలో కొన్ని అరుదైన మత్స్యజాతుల గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. వాటి తీరుతెన్నులను పరికిస్తే వింత గొలుపుతుంది! వాటిలో కొన్ని..



సముద్రపు ఆవు (సీ కౌ)

ఇవి తమిళనాడులోని గల్ఫ్ ఆఫ్ మన్నార్, గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కచ్, అండమాన్ నికోబార్ దీవుల సముద్ర జలాల్లోనే ఉన్నాయి. ఇవి శాకాహారులు. సముద్రపు గడ్డిని, ఆల్గేను తింటాయి. క్షీరద జాతికి చెందిన ఇవి 2–7 ఏడేళ్లకోసారి సంతానోత్పత్తి చేస్తాయి. 2.5 మీటర్ల పొడవు, 230 నుంచి 400 కిలోల వరకు బరువు పెరుగుతాయి. వీటి జీవితకాలం 70 ఏళ్లు. ఇలాంటి భారత సముద్ర జలాల్లో 200 వరకు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం విశాఖ మెరైన్ మ్యూజియంలో ఉన్న ఈ సీ కౌ తమిళనాడులోని ట్యుటికోరిన్ మ్యూజియంలో ఉండేది. ఆ మ్యూజియాన్ని మూసివేయడంతో దానిని 1985లో అక్కడ నుంచి ఇక్కడకు తెచ్చారు.

సముద్రపు గుర్రం (సీ హార్స్)

సీ హార్స్. దీనినే సముద్రపు గుర్రంగా పిలుస్తారు. చూడటానికి గుర్రపు ఆకారంలో ఉంటూ సముద్రంలోనే జీవిస్తుంది. రొయ్య సైజులో ఉంటుంది. వీటిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. ఇవి తూర్పు తీరంలోను, అండమాన్ సముద్రంలోనూ ఉంటాయి. వీటికంటే ఆస్ట్రేలియా సముద్ర జలాల్లో పెరిగేవి ఇంకా తెలుపు రంగులో ఉంటాయి. వీటిని అంతరించిపోతున్న జాతుల్లో ఒకటిగా గుర్తించారు.





సముద్రపు పాము (సీ స్నేక్)

సీ స్నేక్‌లు తూర్పు, పశ్చిమ తీరాల్లోనూ ఉనికిలో ఉన్నాయి. ఇవి సముద్రం అడుగున 40–60 మీటర్ల లోతులో ఉంటాయి. మామూలు సర్పాలకంటే పదిరెట్ల అధిక విషాన్ని కలిగి ఉంటాయి. ఇవి మనుషుల్ని కాటేస్తే బతికి బట్టకట్టడం అసాధ్యం. రెండు మీటర్ల పొడవుంటాయి. ప్రస్తుతం ఈ మ్యూజియంలో ఉంచిన ఈ సీ స్నేక్ భీమిలి తీరంలో 2018లో ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలకు పట్టుబడింది.

త్వరలో సందర్శకులకు అనుమతి

ఈ మెరైన్ మ్యూజియంలోకి త్వరలో సందర్శకులను అనుమతించనున్నారు. విద్యార్థులు, స్కాలర్లతో పాటు సాధారణ ప్రజానీకానికి ముందుస్తు అనుమతితో ప్రవేశానికి వీలు కల్పిస్తారు. అరుదైన, అంతరించి పోతున్న సముద్ర జాతుల విశిష్టతను తెలుసుకునేందుకు ఈ మ్యూజియం దోహదపడుతుందని ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త గుమ్మడి వెంకట అంకినీడు ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.



సీ యాపిల్

ఇవి చూడటానికి యాపిల్ పండ్లను పోలి ఉంటాయి. అందుకే వీటిని సీ యాపిల్‌గా పిలుస్తారు. వీటి ఉనికి కళింగపట్నం, ఒడిశా తీరంలోని సముద్రంలో రాత్రి ప్రదేశాల్లో సంచరిస్తాయి.. వీటిలో ఔషధ గుణాలుండడం వల్ల డిమాండ్ అధికం.



కింగ్ క్రాబ్

కింగ్ క్రాబ్.. పీత జాతికి చెందిన ఇవి పీత ఆకారంలోనే భిన్నంగా ఉంటాయి. వీటి ప్రత్యేకత ఏమిటంటే.. నాలుగు వేల సంవత్సరాలుగా ఇవి రూపురేఖలు మార్చుకోకుండా జీవిస్తున్నాయి. వీటి రక్తం నీలం రంగులో ఉంటుంది. ఈ రక్తాన్ని ఔషధాల్లో వినియోగిస్తుంటారు. ఈ కింగ్ క్రాబ్ ఒడిశా, పశ్చిమబెంగాల్ సముద్ర జల్లాలో అరుదుగా కనిపిస్తుంటాయి. ఈ మ్యూజియంలో ఉంచిన కింగ్ క్రాబ్ ఒడిశాలోని పారాదీప్ తీరంలో ఎఫ్ఎస్ఐ వెసల్ శాస్త్రవేత్తలకు చిక్కింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఆధార్ సీడింగ్‌ను వ్యతిరేకిస్తూ ర్యాలీ


వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నేతలు

కంప్లి: తమ పంపుసెట్లకు ఆధార్ జోడించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు రైతు సంఘం తాలూకా అధ్యక్షులు శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగప్ప పేర్కొన్నారు. బుధవారం కొట్టూరు పట్టణంలో రైతాంగం ప్రముఖ వీధుల్లో ర్యాలీ నిర్వహించి తాలూకా కార్యాలయం శిరస్తెదార్‌కు వినతిపత్రాన్ని అందించారు. కరువు వచ్చి వర్షాలు లేక రైతాంగం పరిస్థితి అయోమయంలో ఉండగా మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా పంపుసెట్ మీటర్లకు ఆధార్ తప్పనిసరి అని ప్రకటించడం రైతు వ్యతిరేక విధానమని, దీనిని తాము అంగీకరించబోమని రాష్ట్ర రైతు సంఘం హసిరు సేన హెచ్చరించింది. ఈసందర్భంగా రైతు ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొట్టూరులో ఫార్మసీ కళాశాల


సమావేశంలో మాట్లాడుతున్న మూగప్ప

కంప్లి: ఈ ప్రాంతంలో ఫార్మసీ కళాశాల లేనందున విద్యార్థులు ఇతర తాలూకాలు, జిల్లాలకు వెళ్తున్న నేపథ్యంలో సంఘం పరంగా తమ తాలూకాలోనే ఫార్మసీ కళాశాల నిర్మించనున్నట్లు కొట్టూరు తాలూకా కురబ విద్యావర్ధక సంఘం అధ్యక్షులు డీ.మూగప్ప వెల్లడించారు. కొట్టూరు పట్టణంలో తాలూకా కురుబ సంఘం తరపున ఏర్పాటు చేసిన తాలూకా హాలుమత సమాజ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ తాలూకా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి సమాజానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.

వైద్య శిబిరాల లబ్ధి పొందండి


మాట్లాడుతున్న ఎస్పీ నిఖిల్

రాయచూరు రూరల్: వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నిఖిల్ సూచించారు. బుధవారం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో కెంఫినో బెంగళూరు, రాయచూరు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్నుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఉద్యోగులు బీపీ, షుగర్, డయాబెటిస్ ఇతర వ్యాధుల నుంచి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. శిబిరంలో 250 మంది ప్రయోజనం పొందడాన్ని ప్రశంసించారు. అదనపు ఎస్పీ శివకుమార్, డీఎస్పీ ప్రదీప్, భీమరాయ, రామణ్ణలున్నారు.

పునరావాసం కల్పించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న వ్యాపారులు

రాయచూరు రూరల్: నగరంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు పునరావాసం కల్పించాలని ఫుట్‌పాత్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు యేసుమిత్ర డిమాండ్ చేశారు. ఆయన బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి మాట్లాడారు. స్టేషన్ రహదారిలో రంగ మందిరం వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులను నెల రోజుల క్రితం నగరసభ, పోలీస్ యంత్రాంగం తొలగించారని, తమకు పునరావాసం కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఇద్దరు సైనికుల మధ్య రగడ

- గాలిలోకి కాల్పులు, ఒకరికి గాయాలు

సాక్షి,బళ్లారి: ఆర్థిక లావాదేవీల్లో ఇద్దరు సైనికుల మధ్య గొడవ జరగడంతో ఒకరిపై మరొకరు కాల్పులు జరుపుకున్న ఘటన బెళగావి జిల్లాలో జరిగింది. గోకాక్ తాలూకా రాజనకట్టె గ్రామంలో నంజుండి లక్ష్మణ అనే వ్యక్తి బసవరాజ్‌పై కాల్పులు జరపడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ భారత సైన్యంలో సైనికులుగా గుర్తించారు. ఈ ఘటనపై జిల్లా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలోని పూర్వ ప్రజ్ఞ పాఠశాలలో పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రం హిందూ జనజాగృతి సమితి ఆధ్వర్యంలో 300 మందికి నోట్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా సమితి సంచాలకులు కృష్ణవేణి, రూప ఫడ్నిస్, జయశ్రీ మస్కిలున్నారు.

వినూత్న సేద్యం.. అద్భుత ఫలసాయం

- వ్యవసాయంలో దిట్ట శేకమ్మ, హుచ్చప్ప దంపతులు
- రాళ్లభూమిలో బంగారు పంటలు పండిస్తున్న వైనం


తమ పొలంలో పండించిన సపోటా పంటను చూపుతున్న శేకమ్మ


వ్యవసాయ పనుల్లో పాలుపంచుకున్న హుచ్చప్ప, శేకమ్మ దంపతులు

సాక్షి బళ్లారి: శిలలపై శిల్పాలు చెక్కినారు. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు అని ఓ మహా కవి తన పాటను సృష్టించారు. శిలలపై శిల్పాలు చెక్కడం, విగ్రహాలు తయారు చేయడం చూస్తుంటాం. బండరాళ్లతో భవంతులను నిర్మిస్తుంటారు. అయితే బండరాళ్లు ఉన్న భూమిలో అద్భుతమైన వ్యవసాయాన్ని చేస్తున్న ఓ వీర దంపతుల విజయగాథ ఇది. వ్యవసాయం మాకు వద్దు ప్రతి ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని మంచి వ్యవసాయ యోగ్యమైన భూమి వదిలి ఎందరో నగరాలు, పట్టణాలకు వెళ్లి ఫ్యాక్టరీల్లో, కూలీ పనులు చేసుకుంటున్న రైతుల జీవితాల గురించి వింటుంటాం. వ్యవసాయమే తమ జీవనాధారమని పది మందికి అన్నం పెట్టి ఉపాధి కల్పించే వ్యవసాయాన్ని వదులుకోలేమని బండరాళ్ల భూమిలో వ్యవసాయం చేసి అద్భుత ఫలితాలను సాధించి ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ దంపతులు. కొప్పళ జిల్లా కల్లుతావరగెరె గ్రామంలో ఎటుచూసిన దాదాపు బండరాళ్లతో కూడిన భూములే కనిపిస్తాయి. 25 ఏళ్ల క్రితం అన్నదమ్ముల భూ పరిష్కారంలో భాగంగా షేకమ్మ, హుచ్చప్ప అనే దంపతులకు 16 ఎకరాల భూమి వాటాగా వచ్చింది. అందులో సగానికిపైగా పూర్తి బండలతో నిండి ఉంది.

బండలపై మట్టి వేసి పంటల సాగు

ఇలాంటి భూములో వ్యవసాయం ఏవిధంగా చేసుకొని జీవితం సాగించాలని ఆ దంపతులు ప్రారంభంలో కొంత ఇబ్బంది పడినా బండరాళ్లలోనే వ్యవసాయాన్ని చేసేందుకు నిర్ణయం తీసుకొని చుట్టుపక్కల ఉన్న మట్టిని బండలపై వేసి వ్యవసాయాన్ని చేసేందుకు ప్రారంభించారు. ప్రారంభంలో కూరగాయలు, ఆకు కూరలు, రాగి, జొన్న, తదితర పంటలను వేస్తూ అద్భుతమైన ఫలితాలను తీసుకురావడంలో విజయం సాధించారు. ప్రతి ఏటా ఈ బండరాళ్ల మీదనే వేసిన మట్టి భూమిలో వివిధ పంటలను సాగు చేస్తూ లక్షలాది రూపాయల ఆదాయం పొందుతున్నారు. కూరగాయలు, ఆకు కూరలతో పాటు పూలు, పండ్ల తోటలను కూడా సాగు చేస్తున్నారు. మామిడి, సపోటా చెట్లు ఏపుగా పెరగడంతో మంచి దిగుబడితో పాటు పచ్చదనంతో కనిపిస్తున్నాయి. టమాటా, వంకాయ, నిమ్మ, సీతాఫలం, జామ, సజ్జ, బీట్‌రూట్ పంటలను ఈ భూమిలో ఈ దంపతులు అద్భుతంగా పండిస్తున్నారు. ఎత్తైన కొండలు, బండరాళ్లు ఉన్న ఈ భూమిలో అంతే స్థాయిలో పలు రకాల పచ్చని చెట్లు కూడా కనిపిస్తుండటంతో బండరాయి మీద వ్యవసాయం చేస్తున్న ఈ దంపతుల కృషి పలు రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది.

వ్యవసాయం తప్ప వేరే పని తెలియదు

ఈసందర్భంగా శేకమ్మ దంపతులు మాట్లాడుతూ తమ కుటుంబం వ్యవసాయ ఆధారిత కుటుంబమని చిన్నప్పటి నుంచి తమకు వ్యవసాయం తప్ప వేరే పని తెలియదన్నారు. తమ గ్రామం పేరే కల్లుతావరగెరె అని, తమకు 25 ఏళ్ల క్రితం తమ వాటాగా 16 ఎకరాల భూమి వచ్చిందన్నారు. అందులో 80 శాతం పైగా బండరాళ్లు ఉన్నాయని, దీంతో వ్యవసాయం ఎలా చేసుకొని జీవించాలా అని మధనపడ్డామన్నారు. అయితే దేవుడి ఆశీస్సులతో నిరాశ చెందకుండా రాతి బండలనే కరిగించినట్లుగా తాము వ్యవసాయాన్ని చేసేందుకు నిర్ణయించుకొని ప్రతి రోజు ఇంటి వద్ద సద్ది కట్టుకొని భార్యభర్తలం ఇద్దరు పొలానికి వెళ్లి వ్యవసాయం చేయడాన్ని ప్రారంభించి చుట్టుపక్కల ఎత్తైన భూమి, చెరువులో ఉన్న మట్టిని రాతి బండల మీద వేసి వివిధ రకాల పంటలను పండించడం ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి తాము వ్యవసాయంలో వెనుదిరిగి చూడలేదని తమ పొలం ప్రస్తుతం రాళ్లతో నిండిపోకుండా పచ్చదనం, వివిధ పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే ఎన్నటికి నష్టాలు రావని, వచ్చినా తాత్కాలికమేనని ఖచ్చితంగా భగవంతుని కృప రైతులపై ఉంటుందని నిరూపితమైందన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వండి


మాట్లాడుతున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు


సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

హొసపేటె: జిల్లాలోని ఆరు తాలూకాల్లో సుమారు 2.23 లక్షల హెక్టార్లలో పంటలను నష్టపోయిన రైతులకు పారదర్శకంగా పరిహారం అందించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సభాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సారి తొలకరి వర్షాలు సరిగా కురవక పోవడంతో రైతులు తీవ్ర కష్టాలకు గురయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మంచి నీటి వ్యవస్థ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అదే విధంగా రోడ్ల నిర్మాణ పనులను చేపడతామన్నారు. అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేబోనన్నారు. అనంతరం ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ టీబీ డ్యాం నగరానికి సమీపంలోనే ఉన్నా ఇంకా అనేక వార్డుల్లో ప్రజలకు సరిగ్గా మంచినీటి సరఫరా లేకపోవడం దురదృష్టకరమన్నారు. నగరంలో హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీల్లోకి నేరుగా డ్రైనేజీ నీరు చేరుతున్న విషయంపై అధికారులకు వెంటనే స్పందించి సత్వరం ఈ సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. వివిధ తాలూకాల్లోని సమస్యలు, అభివృద్ధి పనులపై కూలంకుశంగా అధికారులతో చర్చించారు.

చక్కెర కర్మాగార స్థల పరిశీలన

విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ బుధవారం నాగేనహళ్లి గ్రామ సమీపంలోని కలఘట్ట మైదానంలో షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భాగంలోని రైతులు వందలాది ఎకరాల్లో అధికంగా చెరుకు పంటను పండిస్తున్నారన్నారు. కానీ నగరంలో ప్రస్తుతం ఉన్న ఐఎస్ఆర్ చక్కెర కర్మాగారం మూత పడటంతో రైతుల పండించిన చెరుకును ఇతర దూర ప్రాంతాల్లో ఉన్న కర్మాగారాలకు తరలిస్తున్నారన్నారు. త్వరలో తగిన స్థలంలో నూతన చక్కెర కర్మాగారం ఏర్పాటుకు తగిన చర్యలు చేపడతామన్నారు.

హంపీలో మంత్రి పర్యటన

జిల్లా ఇన్‌చార్జ్, గృహ నిర్మాణ, వక్ఫ్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ బుధవారం హంపీని సందర్శించారు. హంపీలోని జనతా ప్లాట్లను సందర్శించి ఆక్రమణలకు గురైన భూమిని పరిశీలించారు. అనంతరం మీడియాతో స్పందిస్తూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అనధికార హోంస్టేపై ఆంక్షలు ఉన్నాయని, చిన్నపాటి వాణిజ్య లావాదేవీలు జరపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ వై.దేవేంద్రప్ప, ఎమ్మెల్యేలు శ్రీనివాస్, లతా మల్లికార్జున, నేమిరాజ్‌నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి కేపీ మోహన్‌రాజ్, జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, ఎస్పీ శ్రీహరిబాబు, తహసీల్దార్ విశ్వజిత్ మెహత తదితరులు పాల్గొన్నారు.

ఆనెగుందిని అభివృద్ధి చేస్తా


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: తాలూకాలోని ఆనెగుందిలో యాత్రి నివాసాలు, రోప్‌వే, యాత్రికులకు కావాల్సిన ఇతర సౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆయన తాలూకాలోని ఆనెగుంది గ్రామంలోని హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని మొక్కకు నీరు పోసి ప్రారంభించి మాట్లాడారు. రామాయణ కాలం నాటి అవశేషాలు, శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి చారిత్రక నిర్మాణాలు, పవిత్రమైన రాజశ్రీ దుర్గాదేవి దేవస్థానం, ప్రపంచంలోనే నాలుగు సరోవరాల్లో ఒకటైన పంపా సరోవర్, ఆంజనేయ స్వామి జన్మస్థలం అంజనాద్రి బెట్ట, రుష్యమూక, ఇతర శ్రీకృష్ణదేవరాయల 64 స్తంభాల సమాధి, నవబృందావనం కలిగిన చారిత్రక పవిత్ర పుణ్యభూమి ఆనెగుంది అన్నారు. ఈ ప్రాంతానికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వీటిని చూసేందుకు విచ్చేస్తుంటారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం తన అధికార అవధిలో కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ డైరెక్టర్ డీ.నాగరాజ్. డాక్టర్ వెంకటేష్, జీపీ అధ్యక్షులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

బాలుర మధ్య ఘర్షణ..ఒకరి హత్య

హుబ్లీ: ఇన్‌స్టాగ్రామ్‌లో బాలుర మధ్య జరిగిన వివాదం ఓ బాలుడి హత్యకు దారి తీసిన ఘటన బెళగావిలో జరిగింది. భవన నిర్మాణ కార్మికుడిని దారుణంగా మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తుండగా ఒకే ఊరికి చెందిన బాలుర మధ్య కిత్తూరు తాలూకా మల్లాపుర గ్రామానికి చెందిన ప్రజ్వల్ సుంకద(16) హతుడు. మల్లప్ప, మల్లవ్వ దంపతుల రెండో కుమారుడు ప్రజ్వల్ ఇటీవలే కాలేజీ మెట్లు ఎక్కారు. ఇటీవల తమ ఊరికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ గ్రూప్‌లో ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో మాటమాటా పెరిగి వికోపానికి దారి తీయడంతో హత్యతో అంతమైంది. హతుడు తన ఇంటి వద్ద ఉండగా ఐదుగురు బాలుర బృందం అకస్మాత్తుగా దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ప్రజ్వల్‌ను బెళగావి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం దక్కలేదు. మంగళవారం అర్ధరాత్రి చికిత్స ఫలించక ప్రాణాలు వదిలాడు. ఘటనపై హతుడి బంధువు బసప్ప మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల మహాప్రసాదం పంపిణీ వేళ ఈ ఘటన జరిగిందన్నారు. వీరి మధ్య ఏం జరిగిందో తనకు తెలియదని, సమస్య ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవడం మంచిదన్నారు. అయితే హత్యకు దారి తీయడం, ఇంత చిన్నవయస్సులోనే బాలురు దారుణ హత్యకు పాల్పడటం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యువకుడి దారుణ హత్య

అలాగే పట్టపగలే ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన హుబ్లీ స్లివర్‌టౌన్‌లో జరిగింది. మృత యువకుడిని ఉత్తర కన్నడ జిల్లా ముండగోడ తాలూకా మరగడి గ్రామ నివాసి మౌలాలి(24)గా గుర్తించారు. ఇతడు కూడా హుబ్లీకి కట్టడ నిర్మాణ కార్మికుడిగా వచ్చారు. నిర్మాణ దశలోని ఇంట్లోనే మంగళవారం రాత్రి దుండగులు హత్య చేసి పరారయ్యారు. గోకుల్ రోడ్డు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా పవిత్రోత్సవ పూజలు



మాలూరు: తాలూకాలోని చిక్కతిరుపతి శ్రీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవంలో భాగంగా బుధవారం వివిధ పూజలను నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు. ప్రధాన అర్చకులు రవి, గోపాలకృష్ణ భారద్వాజ్, ఎస్.శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. లోకకళ్యాణం కోసం హోమ హవనాలను చేశారు. పూర్ణాహుతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

అలరిస్తున్న శివలింగ గణపతి


మంగళగౌరికి పూజలు నిర్వహించిన దృశ్యం

కోలారు: తాలూకాలోని వక్కలేరి శ్రీశక్తి వినాయక భక్త మండలి ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతిష్ఠించిన హిమాలయ పర్వతంలో శివలింగాన్ని మోస్తున్న వినాయకుడిని ప్రతిష్ఠించి నిత్యం ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం మంగళగౌరి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం కోసం వచ్చిన భక్తులకు గాజులు, పసుపు కుంకుమ ఇచ్చి పంపించారు.


బళ్లారిలో పడుతున్న వర్షంలో వెళుతున్న కార్లు


వర్షంతో చిత్తడిగా మారిన హగరి వంతెన

బళ్లారిలో భారీ వర్షం

బళ్లారిఅర్బన్: బళ్లారి నగరంలో బుధవారం సాయంత్రం సుమారు 2 గంటల పాటు భారీగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలావృతమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుకొని స్థానికులకు, ప్రయాణికులకు కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల వర్షాల జాడ కానరాక సతమతమవుతున్న నగరవాసులకు ఈ వర్షం హాయిని కలిగించింది. ఇక సాయంత్రం వేళలో పాఠశాలలు వదిలిన తర్వాత నడుచుకుంటూ లేదా ద్విచక్రవాహనాలపై ఇళ్లకు వెళ్లాల్సిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాదచారులు యాతన పడ్డారు. ఫుట్‌పాత్, తోపుడుబండ్ల వ్యాపారులు కూడా వర్షం రాకతో నానా పాట్లు పడ్డారు. ఇక నగరంతో పాటు తాలూకాలో రైతన్నలకు ఈ వర్షం ఎంతో ఊరటను ఇచ్చింది. ఈ ఏడాది తొలకరి వర్షాలు సకాలంలో కురువక రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టి నష్టపోయే దశలో ఉన్న సమయంలో వర్షం పడి ఉపశమనం కల్గించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షంతో మళ్లీ తమ పంట పొలాలకు ఊపిరి వచ్చినట్లయిందని వారు సంతోషపడ్డారు. ఇలా అడపాదడపా వానలు కురుస్తుంటే తాము ఇక నష్టాల బారి నుంచి బయటపడేందుకు వీలవుతుందని అన్నారు.

నకిలీ ఉద్యోగాల కేటుగాడు అరెస్టు!

- న్యాయం చేయాలని బాధితుల మొర


ఉద్యోగాల పేరిట టోకరా వేసిన రాయచోటి శశి(ఫైల్)


బెంగళూరుకు చెందిన ఓ లేడీ ఖాతాలోకి డబ్బు మళ్లించిన బాధితులు

అనంతపురం క్రైం: బీటెక్ విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని బెంగళూరులో ఐటీ ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు దండుకున్న మోసగాడు శశిని చిత్తూరు జిల్లా కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 150 మందిని ఇలా మోసగించినట్లు తెలుస్తోంది. కుప్పంలోనూ అనేకమంది బాధితులు ఉన్నారు. వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం ఉదయం రాయచోటిలోని స్వగృహంలో శశిని తీసుకున్నారు. అనంతపురంవాసులు కూడా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తాము కట్టిన డబ్బు తిరిగి రాదేమోనని వాపోతున్నారు. స్థానిక ఏజెంట్లు శశితో భాగస్వామ్యంతో ఈ పనులు చేశారని చెబుతున్నారు. తీరా డబ్బు కోసం నిలదీస్తుండటంతో టీడీపీలోని బలమైన నేతల పేర్లను సాకుగా చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. అతని చేతిలో మంది అల్లరి మూకలు, రౌడీషీటర్లు అండగా ఉండటంతో గట్టిగా నిలదీయలేక పోతున్నామంటున్నారు.

మరో కిలాడీ లేడీ

బెంగళూరుకు చెందిన ఒక మహిళ కూడా ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి రూ.లక్షలాది డబ్బు తీసుకుందని బాధిత విద్యార్థులు తెలిపారు. ఏడాది దాటినా ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బుకోసం ఒత్తిడి పెంచడంతో వైఎస్సార్ జిల్లాకు చెందిన కొందరు పోలీసుల ద్వారా బాధితులను బెదిరిస్తోంది. మహిళకు ఎందుకు మీరు ఫోన్ చేస్తున్నారంటూ పోలీసులు తమను గద్దిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

సత్పౌరుల శిల్పులు ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: కారటగి తాలూకా కుంటోజి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభాకారంజిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ అధ్యక్షులు బాబన్న ప్రారంభించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే ప్రముఖ పాత్రను పోషిస్తున్నారన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు ఉన్నతమైన గౌరవం ఉందన్నారు. వారు తమ కర్తవ్యాలను లోపాలు లేకుండా నెరవేర్చి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోము, ఉపాధ్యాయ వర్గం పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడి సర్కిల్ అభివృద్ధికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారిఅర్బన్: నగరంలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానం వద్దగల ప్రధాన సర్కిల్, రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి బుధవారం భూమిపూజ నిర్వహించారు. నగరాభివృద్ధి శాఖ నుంచి రూ.1.50 కోట్ల ఖర్చుతో ఈ సర్కిల్ అభివృద్ధిని నమూనా డిజైన్ ప్రకారం త్వరగా పనులు చేపట్టి వేగవంతంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉపమేయర్ బి.జానకి, కార్పొరేటర్లు గాదెప్ప, గుడిగంటి హనుమంతు, హనుమంతు, కమిషనర్ ఖలీల్ సాబ్, చానాళ్ శేఖర్ పాల్గొన్నారు.

రాయల్ సర్కిల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి ఇందిరా సర్కిల్ వరకు రోడ్డు వెడల్పు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి సూచించారు. ఆయన బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గడిగి చెన్నప్ప సర్కిల్, రాజ్‌కుమార్ రోడ్డులో ఇరువైపుల ఉన్న బిల్డింగ్‌లను త్వరగా తొలగించి పనులు వేగవంతం చేయాలన్నారు. భవన యజమానులతో చర్చించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

వరుణుడి కృప కోసం పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో వరుణ దేవుడు కరుణించక పోవడంతో మహిళలు జోకుమారను ఊరేగిస్తారు. బుధవారం జిల్లా అంతటా గ్రామీణ ప్రాంత నారీమణులు గుంపులు కట్టుకొని జోకుమారుడిని ఊరేగిస్తు పూజలు జరిపారు. ఇంటింటికెళ్లి భిక్షాటన చేస్తారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో మహిళలు జోకుమారుడిని తలపై పెట్టుకొని పాటలు పాడుతూ వరుణుడు కరుణించాలని ప్రార్థించారు. శుక్రవారం పౌర్ణమి రోజు జోకుమారుడికి వివాహం జరిపిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు జోకుమారుడి పాటలు పాడుతూ అందరినీ కవ్విస్తూ వాన దేవుడిని మొరపెట్టుకుంటారు.

పాల ప్యాకెట్ల అక్రమ నిల్వ స్వాధీనం


ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయచూరు రూరల్: నగరంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన క్షీర భాగ్య పాల ప్యాకెట్లను అక్రమంగా నిల్వ ఉంచిన గోదాములపై అంబేడ్కర్ సేన అధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి, పోలీస్ అధికారులు దాడి జరిపి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నవోదయ ఆస్పత్రి వద్ద అనుషానగర్‌లో కేఎంఎఫ్ గోదాముల నుంచి పాఠశాలలకు వెళ్లాల్సిన ప్యాకెట్లు హనుమేష్ ప్రైవేట్ గోదాములో ఉంచిన నిల్వను నేతాజీ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ టెండర్ నియమాలను ఉల్లంఘించి వీటిని నల్లబజారుకు తరలించి ఆంధ్రప్రదేశ్‌లో విక్రయించడానికి వెళుతున్న వారిపై, కాంట్రాక్టర్ నవీన్, హనుమంతలపై కేసు నమోదు చేశారు.

జొన్నల బస్తాల నిల్వలు సీజ్


జొన్నల బస్తాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకాలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.60 లక్షల విలువ చేసే జొన్నల బస్తాలను గోదాములపై అధికారులు దాడి జరిపి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం రాయచూరు అసిస్టెంట్ కమిషనర్ మెహబూబి, ఆహార పౌరసరఫరాల శాఖ అధికారి కృష్ణ, తహసీల్దార్ రాజు, ఇన్‌స్పెక్టర్ యంకన్న దాడి జరిపారు. అదే విధంగా మాన్వి తాలూకా పోత్నాల్ సమీపంలోని ముద్దంగుడ్డి గోదాములపై దాడి చేసి అన్నభాగ్య పథకంలో పంపిణీ చేయకుండా ఉన్న రూ.14 లక్షలు విలువ చేసే జొన్నలకు రసాయనిక పదార్థాలు కలిపి నిల్వ ఉంచిన వాటిని సీజ్ చేశారు.

శ్రమదానంతో స్వచ్ఛభారత్


శ్రమదానం చేస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: నగరంలో బుధవారం జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు నేతృత్వంలో అధికారులు స్వచ్ఛత కోసం శ్రమదానం చేశారు. స్వచ్ఛతకు అధికారులు ఎల్లవేళలా ముందంజలో ఉండాలన్నారు. జిల్లాలోని తాలూకా ఆరోగ్య కేంద్రాలు, 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుభ్రత కోసం శ్రమదానం చేపట్టి పిచ్చిమొక్కలను తొలగించి ఆస్పత్రి పరిసరాలను సంరక్షించాలన్నారు. శ్రమదానంలో వైద్యాధికారులు గణేష్, జయంతి, యశోద, వెంకటేష్ నాయక్‌లున్నారు.

అన్నసంతర్పణ


భోజనాలను వడ్డిస్తున్న దృశ్యం

కంప్లి: ఏటా చారిత్రక సోమేశ్వర దేవస్థానం ఆవరణలో గణేష్ చవితి సందర్భంగా వీర కంపలిరాయ వినాయక మండలి యువత అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం షరామామూలే. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రతిష్ఠించిన గణేష్‌మూర్తి, సోమేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మండలి పదాధికారులు మాట్లాడుతూ గణేష్ చవితి సందర్భంగా పట్టణంలో ప్రజలకు అన్నసంతర్పణ జరపడం తమ సౌభాగ్యమన్నారు. ఆ గణేష్ పట్టణ ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించాలని కోరుకుంటున్నామన్నారు.